www.visalaandhra.com
స్థాపితం : 1952
విశాలాంధ్ర
VISALAANDHRA Regd No.VJ/042/2018-20
అక్షరాక్షరం అభ్యుదయం

సంపుటి : 68 సంచిక : 224 | బుధవారం 06-02-2019 | Simultaneously published from Vijayawada, Hyderabad, Visakapatnam, Kurnool, Tirupathi, Karimnagar, Khammam | వెల: రూ.4.00 | పేజీలు: 12+ టాబ్లాయిడ్ | విజయవాడ ప్రచురణ

ఓట్ల కోసం

అంకెల గారడీ

రూ.2,26,177.53 కోట్లతో భారీ బడ్జెట్





బడ్జెట్ వార్తలు 3లో

సార్వత్రిక ఎన్నికలు శరవేగంగా దూసుకు వస్తున్న తరుణంలో.. ఏపీ సర్కారు రూ.2.26 లక్షల కోట్ల ఊరింతల బడ్జెట్‌ను వండి వార్చింది. అందరికీ అన్నీ అనే రీతిలో కులాల కార్పొరేషన్లకు కోట్లకు కోట్లు పందేరం చేసింది. విద్య, వైద్యం, వ్యవసాయం, నీటిపారుదల శాఖ, మౌలిక సదుపాయాలను పక్కన పెట్టి.. వ్యక్తిగత ప్రయోజన పథకాలకు పెద్దపీట వేసి... సంక్షేమ బడ్జెట్ అనే ముసుగును తగిలించింది. ఆర్థిక శాఖ మంత్రి యనమల రామకృష్ణుడు పదకొండవ బడ్జెట్‌ను ప్రవేశపెట్టి.. అడుగడుగునా తన ప్రసంగంలో నారా నామార్చనలో తరించిపోయారు. రూపాయి ఎలా వస్తుందో చెప్పలేదు. బారెడు ఖర్చుకు గొప్పలు పోయారు. ఓ వైపు ప్రతి ఏటా పెరుగుతున్న అప్పలను ఏకరవు పెడుతూనే... అంకెల గారడీతో జనాన్ని మభ్యపెట్టే ప్రయత్నం చేశారు.



- రైతుల కోసం 'అన్నదాత సుఖీభవ'
- రూ.1000 కోట్లతో ధరల స్థిరీకరణ నిధి
- రూ.650 కోట్లతో కర్నూలులో మెగా సీడ్ పార్కు
- నిరుద్యోగ భృతి రూ.2 వేలకు పెంపు
- బీసీలకు సబ్‌ప్లాన్.. కొత్తగా 11 కార్పొరేషన్లు
- బడ్జెట్ ప్రవేశపెట్టిన యనమల

11లో

ప్రజారంజక బడ్జెట్ : సీఎం చంద్రబాబు



పూర్తి స్థాయి బడ్జెట్ ప్రవేశపెట్టడం అర్థరహితం. ఊహాజనిత గణాంకాలతో గారడీ. రైతులు ఇప్పుడు గుర్తుకు వచ్చారా?
- రామకృష్ణ, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి



నిధులు ఖర్చు చేయకుండా కోత విధించడం దారుణం. అసంఘటిత కార్మికులను పూర్తిగా విస్మరించారు.
- మధు, సీపీఎం రాష్ట్ర కార్యదర్శి



ఏపీ, తెలంగాణకు

పవర్ కట్..?

- బకాయిలు చెల్లించనందున ఎన్టీపీసీ నిర్ణయం
- 9 నుంచి నిలిచిపోనున్న విద్యుత్ సరఫరా
- తరువాతి జాబితాలో ఉత్తరప్రదేశ్

న్యూఢిల్లీ : ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాలకు ఫిబ్రవరి 9 నుంచి విద్యుత్ సరఫరాను నిలిపి వేయాలని ఎన్‌టీపీసీ భావిస్తోంది. దీనికి సంబంధించి 'విద్యుత్ సరఫరా నియంత్రణ' నోటీసులను ఎన్‌టీపీసీ ఆయా రాష్ట్రాలకు జారీ చేసింది. గత రెండు నెలల పైబడి బకాయిలు చెల్లించకపోవటం వల్లే ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఎన్‌టీపీసీ తెలిపింది. దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాల నుంచి రూ.7,859 కోట్ల బకాయిలు పెండింగ్‌లు ఉన్నాయని వివరించింది. ఇందులో అగ్ర భాగం రూ.4,890 కోట్లు బకాయిలు కేవలం ఈ మూడు రాష్ట్రాల నుంచే రావాల్సి ఉందని కంపెనీ ఎగ్జిక్యూటివ్‌లు తెలిపారు. ఈ జాబితాలో ఉత్తరప్రదేశ్ తర్వాతి స్థానంలో ఉందన్నారు. కేంద్ర విద్యుత్ శాఖ పోర్టల్‌లో పేర్కొన్న సమాచారం మేరకు.. ఎన్‌టీపీసీకే కాకుండా ఇతర విద్యుత్ సరఫరా కంపెనీలకు ఉత్తరప్రదేశ్ రూ.6,127 కోట్లు బకాయి పడింది. రాజస్థాన్ రూ.2,404 కోట్లు, పంజాబ్ రూ.1,041 కోట్లు బకాయిలు చెల్లించాల్సి ఉంది.

తెలంగాణ బడ్జెట్‌కు

రంగం సిద్ధం



విశాలాంధ్ర బ్యూరో– హైదరాబాద్ : తెలంగాణ బడ్జెట్ కూర్పుపై కసరత్తు వేగం పుంజుకోనుంది. కేంద్రం ఓట్ ఆన్ అకౌంట్ బడ్జెట్ ప్రవేశ పెట్టడంతో.. రాష్ట్రంలో కూడా ఓట్ ఆన్ అకౌంట్ బడ్జెట్‌నే ప్రవేశపెట్టాలని ముఖ్యమంత్రి కేసీఆర్ నిర్ణయించారు. కేంద్ర బడ్జెట్ ద్వారా రాష్ట్రాలకు అందే నిధుల వాటాపై కొంత స్పష్టత రావడంతో, అందుకు అనుగుణంగా బడ్జెట్ కూర్పు జరుగుతోంది. ఆర్థిక వృద్ధి రేటు బాగానే ఉండటంతో ఈసారి రాష్ట్ర బడ్జెట్ రూ.2 లక్షల కోట్లు దాటవచ్చని అధికారులు అంచనా వేస్తున్నారు. పూర్తిస్థాయి బడ్జెట్ సిద్ధం చేసి అసెంబ్లీలో 3 లేదా 6 నెలలకు ఓట్ ఆన్ అకౌంట్ అనుమతి తీసుకునే అవకాశం కనిపిస్తోంది. మరోవైపు 15వ ఆర్థిక సంఘం ఈ నెల 18 నుంచి 3 రోజుల పాటు

- మిగతా 2 లో

ఎవరినీ నొప్పించక...

- సీబీఐ ఎదుట హాజరుకండి
- కోల్‌కతా పోలీస్ చీఫ్‌కు సుప్రీం కోర్టు ఆదేశం
- తక్షణ చర్యలు, అరెస్టు వద్దు : సీబీఐకి స్పష్టీకరణ
- దర్యాప్తు సంస్థ ఆరోపణలపై 18లోగా వివరణ ఇవ్వాలి
- బెంగాల్ సీఎస్, డీజీపీ, పోలీసు కమిషనర్‌కు నోటీసులు

న్యూఢిల్లీ / కోల్‌కతా : శారదా కుంభకోణం కేసు దర్యాప్తునకు నిజాయితీగా సహకరించాలంటూ కోల్‌కతా పోలీసు కమిషనర్ రాజీవ్ కుమార్‌కు సర్వోన్నత న్యాయ స్థానం స్పష్టం చేసింది. మేఘాలయ, షిల్లాంగ్‌లోని కేంద్ర దర్యాప్తు సంస్థ (సీబీఐ) ఎదుట హాజరు కావాలని సూచించింది. ఈక్రమంలో సత్వర చర్యలొద్దని, రాజీవ్‌కుమార్‌ను అరెస్టు చేయరాదని సీబీఐకి స్పష్టం చేసింది. సీబీఐ పిటిషన్లపై ఈనెల 20లోగా వివరణ ఇవ్వాలంటూ రాజీవ్‌కుమార్‌కు నోటీసు జారీ చేసింది. రాజీవ్ కుమార్ తమ విచారణకు సహకరించడం లేదని, ఎలక్ట్రానిక్ సాక్ష్యాధారాలను తారుమారు చేస్తున్నారని, ఆయన నేతృత్వంలోని సిట్ పూర్తి వివరాలను అందజేయలేదని ఆరోపిస్తూ సీబీఐ దాఖలు చేసిన పిటిషన్‌ను సీజేఐ రంజన్ గొగోయ్ ధర్మాసనం విచారించింది. ఈ



క్రమంలో కోర్టులో వాదోపవాదనలు జరిగాయి. ఇరుపక్షాల వాదనలు విన్న సర్వోన్నత ధర్మాసనం తదుపరి విచారణను ఈనెల 20వ తేదీకి వాయిదా వేసింది. సీబీఐ ఫిర్యాదులపై ఈనెల 18లోగా సమాధానమివ్వాలంటూ పశ్చిమ బెంగాల్ ప్రధాన కార్యదర్శి, డీజీపీ, కోల్‌కతా పోలీసు కమిషనర్‌లను

- మిగతా 2 లో

కేంద్రాన్ని సమష్టిగా

ఎదుర్కొంటాం

- మోడీ ప్రభుత్వ చర్యల వల్ల దేశ సమగ్రతకు భంగం : చంద్రబాబు
- కోల్‌కతాలో మమతతో దీక్ష విరమింపజేసిన ఏపీ సీఎం

కోల్‌కతా : బీజేపీ అన్ని విపక్ష పార్టీలను నాశనం చేయాలని చూస్తోందని ఏపీ సీఎం, టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు నాయుడు విమర్శించారు. కేంద్ర ప్రభుత్వాన్ని కలిసికట్టుగా ఎదుర్కొంటామన్నారు. పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి, టీఎంసీ అధినేత్రి మమతా బెనర్జీ చేపట్టిన 'రాజ్యాంగ పరిరక్షణ' దీక్షలో చంద్రబాబు మంగళవారం పాల్గొని ఆమెకు సంఘీభావం తెలిపారు. మధ్యాహ్నం 4.20 గంటల సమయంలో చంద్రబాబు కోల్‌కతా చేరుకుని దీక్షలో



పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 'ప్రతిపక్ష పార్టీల రాష్ట్రాల్లో అభివృద్ధిని అడ్డుకోవాలని కేంద్రం చూస్తోంది. ఏపీ, పశ్చిమ బెంగాల్, ఢిల్లీ రాష్ట్రాల అభివృద్ధిని మోడీ సర్కారు అడ్డుకుంటోంది. రాష్ట్రాలు అభివృద్ధి చెందినప్పుడే దేశ అభివృద్ధి

- మిగతా 2 లో



చర్చలు సఫలం..

ఆర్టీసీ సమ్మె విరమణ

- 25 శాతం ఫిట్‌మెంట్ ఇచ్చేందుకు ప్రభుత్వం అంగీకారం
- ఏకీభవించిన ఆర్టీసీ కార్మిక సంఘాలు

విశాలాంధ్ర బ్యూరో – అమరావతి : విజయవాడలో ఆర్టీసీ కార్మిక సంఘాల నాయకులతో రాష్ట్ర రవాణా శాఖ మంత్రి అచ్చెన్నాయుడు జరిపిన చర్చలు సఫలం అయ్యాయి. బుధవారం నుంచి తలపెట్టిన సమ్మె నిర్ణయాన్ని ఏపీఎస్ ఆర్టీసీ కార్మిక సంఘాలు విరమించుకున్నట్లు ప్రకటించాయి. విజయవాడలో మంగళవారం రాత్రి సుదీర్ఘంగా కార్మిక సంఘాల నాయకులతో మంత్రి అచ్చెన్నాయుడు చర్చించారు. ఈ నేపథ్యంలో ఆర్టీసీ కార్మికులకు 25 శాతం ఫిట్‌మెంట్ ఇస్తామని మంత్రి ప్రకటించారు. ఇతర డిమాండ్ల పరిష్కారానికి సానుకూలంగా స్పందించారు. దీంతో ఆర్టీసీ కార్మిక సంఘాల నేతలు ఏకీభవించారు. ఏపీఎస్ ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ చేసిన విశేష కృషి ఫలించింది. చర్చల్లో ఎంప్లాయిస్

- మిగతా 2 లో



హజారే దీక్ష విరమణ

9లో

టీఎంసీ, బీజేపీ రెండూ అవినీతి పార్టీలే

సీతారాం ఏచూరి

9లో

హోదాపై నోరు విప్పాకే..

అడుగుపెట్టండి

- మోడీ బెదిరింపులకు భయపడం..
- అమిత్‌షా సభలకు జనం వెలవెల
- కేంద్రంలో అవినీతి రాజ్యం
- అసెంబ్లీలో సీఎం చంద్రబాబు



విశాలాంధ్ర బ్యూరో – అమరావతి : రాష్ట్రానికి ప్రత్యేక హోదా, విభజన హామీలను అమలు చేయకుండా ప్రధాని మోడీ దగా చేశారని, వాటిపై ప్రజలకు వివరణ ఇచ్చాకే ఏపీలో బీజేపీ నేతలు అడుగుపెట్టాలని సీఎం చంద్రబాబు డిమాండు చేశారు. శుక్రవారం ఏపీ అసెంబ్లీ సమావేశాల్లో భాగంగా స్పీకర్ కోడెల శివప్రసాద్ అధ్యక్షతన వ్యవసాయం అనుబంధిత రంగాలపై లఘు చర్చను నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారపక్ష ఎమ్మెల్యేలు ప్రసంగించారు. ప్రభుత్వం వ్యవసాయానికి పెద్దపీట వేస్తోందని కొనియాడారు. చంద్రబాబు మాట్లాడుతూ మోడీ, అమిత్‌షా వైఖరిపై మండి పడ్డారు. కేంద్రంలోని ఎన్‌డీఏ ప్రభుత్వం రాష్ట్రంపై అడుగడుగునా వివక్షత చూపుతోందన్నారు. కేంద్ర ప్రభుత్వం

- మిగతా 2 లో



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న రావుల, కె.వి.వి.ప్రసాద్, యలమందరావు

కేంద్ర బడ్జెట్‌కు వ్యతిరేకంగా

13న దేశవ్యాప్త నిరసనలు

- నిరసనల్లో బడ్జెట్ ప్రతుల దహనం
- దేశంలో 65 శాతం ప్రజలు వ్యవసాయంలోనే..
- బడ్జెట్‌లో కేవలం రూ.1.50 లక్షల కోట్లే
- రైతులకు రోజుకు ఇచ్చే పెట్టుబడి రాయితీ రూ.17
- అది రైతు కుటుంబానికి ఎలా సరిపోతుంది..?
- రావుల వెంకయ్య, కె.వి.వి.ప్రసాద్

విశాలాంధ్ర బ్యూరో – అమరావతి : కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ రైతాంగాన్ని మోసం చేసే ఎన్నికల జిమ్మిక్కులతో కూడుకున్నదని, ఈ మోసపూరిత బడ్జెట్‌కు వ్యతిరేకంగా ఈనెల 13న దేశవ్యాప్తంగా బడ్జెట్ ప్రతులను దహనం చేసి నిరసన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు అఖిల భారత కిసాన్ సభ జాతీయ ఉపాధ్యక్షుడు రావుల వెంకయ్య, ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.వి.వి.ప్రసాద్‌లు తెలిపారు. విజయవాడ దాసరి

- మిగతా 2 లో

ఇదీ లోకం!



బ్లాక్‌మెయిల్‌కు తలొగ్గం : సిరియా



డమాస్కస్ : బ్లాక్‌మెయిల్‌కు తలొగ్గే సమస్యేలేదని సిరియా విదేశాంగ శాఖ డిప్యూటీ మంత్రి ఫైజల్‌మెక్‌డాడ్ ఒక ప్రకటనలో తెలియజేశారు. అరబ్‌లీగ్‌లో తిరిగి చేరడానికి షరతులను విధించాలని భావిస్తున్న దేశాలకు ఆయన ఈ హెచ్చరిక చేశారు. అరబ్‌లీగ్‌లో చేరడానికి ఆంక్షలు విధించాలన్న వారి ప్రయత్నాలు ఫలించబోవని, అలాగే సిరియాను నిర్లక్ష్యం చేయాలన్న ప్రయత్నం కూడా ఫలించబోదని ఆయన తన ప్రకటనలో పేర్కొన్నారు. డమాస్కస్‌లో బ్రిటీష్ సిరియా సొసైటీ సమావేశంలో పాల్గొని ఆయన మాట్లాడారు. సిరియాను దెబ్బతీయాలని ప్రయత్నించే దేశాలు ప్రత్యేకించి అరబ్ దేశాలు ఇతర దేశాలనుంచి వచ్చే ఆదేశ్యాలను పాటిస్తున్నాయని మెక్‌డాడ్ అన్నారు. అయితే తాము తిరిగి అరబ్‌లీగ్‌లో చేరటమనేది తమ అభీష్టం మేరకే ఉంటుందని ఆయన చెప్పారు. అంతక్రితం అరబ్‌లీగ్ ప్రధాన కార్యదర్శి అహమ్మద్‌అబుల్‌గెయిట్ మాట్లాడుతూ సిరియా అరబ్‌లీగ్‌లో చేరాలంటే లీగ్ దేశాలన్నిటి ఆమోదం కావలసివుంటుందని అన్నారు.

ఆస్ట్రేలియా వీధుల్లోకి మొసళ్లు, పాములు

కాన్‌బెర్రా : ఆస్ట్రేలియాలో భారీ వరదలు అత్యంత విధ్వంసాన్ని సృష్టించాయి. అనేకవేల మంది తమ ఇళ్లను విడిచిపెట్టి సురక్షిత ప్రాంతాలకు తరలివెళ్లారు. వరదల కారణంగా మొసళ్లు, పాములు వీధుల్లోకి వచ్చాయి. చల్లటి పెనుగాలులు వీస్తుండటంతో ప్రజలు వణికిపోయారు. క్వీన్స్‌లాండ్ రాష్ట్రంలోని టౌన్స్‌విల్లే నగరమంతా వరదనీరు ముంచెత్తింది. పౌరులు విద్యుత్తు సరఫరాలేక తీవ్రమైన ఇబ్బందులకు గురయ్యారు. అనేకమంది ఇళ్లపైకి ఎక్కి తమనుతాము రక్షించుకున్నారని సిఎన్ఎన్ తెలిపింది. ఆది, సోమ వారాలలో భారీ వర్షాలు కురవడంతో రాస్‌రివర్‌డామ్ గేట్లను తెరచి సెకనుకు 1900 క్యూబిక్ మీటర్ల నీటిని వదిలివేశారు. నగరంలో పోలీసు బృందాలు ఇంటింటికీ తిరిగి ఇళ్లను ఖాళీ చేయవలసిందిగా హెచ్చరించారు.

క్రైస్తవులను సోదరులుగా చూడాలి

ముస్లింలకు ఇమామ్ పిలుపు

సామూహిక ప్రార్థనలలో పోప్



అబుదాబి : స్థానికంగావున్న క్రైస్తవులను ముస్లింలు తమ సోదరులుగా పరిగణించి అక్కున చేర్చుకోవాలని ఈజిప్టు అల్‌అజహర్ మసీదు, యూనివర్సిటీ గ్రాండ్ ఇమామ్ షేక్‌అహమద్‌అల్-తయబ్ పిలుపునిచ్చారు. ముస్లింలనుద్దేశించి ఆయన మాట్లాడుతూ ఎక్కడవున్నా క్రైస్తవులంతా తమ సోదరులేనని స్థానికంగావున్న వారు ఈ దేశంలో తమతోపాటు భాగస్వాములేనన్న అభిప్రాయాన్ని ముస్లింలు కలిగివుండాలని కోరారు. యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ రాజధాని అబుదాబిలో జరిగిన ఒక కార్యక్రమంలో పాల్గొన్నవారి నుద్దేశించి టెలివిజన్‌లో ఆయన మాట్లాడారు. క్రైస్తవులంతా ఈ దేశ పౌరులే. మైనారిటీగా భావించవద్దు. నీకు పూర్తి హక్కులు, బాధ్యతలు ఉన్నాయి అని అన్నారు. ఆయా దేశాలలోని ముస్లింలంతా ఐక్యంగా నిలిచి స్థానిక చట్టాలను గౌరవించాలని కోరారు. అబుదాబి స్టేడియంలో జరిగిన ఈ కార్యక్రమంలో పోప్‌ఫ్రాన్సిస్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా చరిత్రాత్మకమైన సామూహిక ప్రార్థనలు జరిగాయి. 1,70,000 మంది క్యాథలిక్స్ ఈ ప్రార్థనల్లో పాల్గొనివుంటారని అంచనా. అత్యంత ఉత్సాహంతో పాల్గొన్న క్రైస్తవులను చూసి పోప్ చేతులూపి అందరినీ పలుకరించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్నవారు వాటికన్ పతాకాలను, బ్యానర్లను ధరించి అత్యంత గౌరవంగా చూసుకునే పోప్‌కి ఘనస్వాగతం పలికారు.

సాధారణంగా చర్చలలో మాత్రమే ప్రార్థనలు జరుగుతాయి. అయితే పోప్‌రాక సందర్భంగా స్టేడియంలో ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు.

పోప్ తన పర్యటనకు ముందే ముస్లింలు, క్రైస్తవులు కలిసిమెలిసి సోదరభావంతో మెలగాలని పిలుపునిచ్చారు. యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్‌ను ఇస్లాం మతం పుట్టిన దేశంగా పరిగణిస్తారు. పోప్ ఈ దేశంలో 3 రోజులు పర్యటిస్తారు. స్టేడియం లోపల 50వేల మంది క్యాథలిక్స్ ప్రార్థనల్లో పాల్గొనగా మరో 1,20,000 మంది స్టేడియం వెలుపల పాల్గొన్నారని అంచనా.

వివిధ దేశాలనుంచి ఇక్కడికి వచ్చిన మత ప్రవక్తలు ప్రార్థనల్లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమాన్ని టెలివిజన్‌లో ప్రసారం చేయగా అనేక దేశాలలో వీక్షించారు. 2019ని 'సహన సంవత్సరంగా' పరిగణిస్తున్నందున తమ దేశంలో పర్యటించవలసిందిగా యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ పోప్‌ను ఆహ్వానించింది.

మరో వియత్నాంను కానివ్వకండి

డొనాల్డ్ ట్రంప్‌కి మదురో హెచ్చరిక



కారకాస్ : అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌కి వెనిజుల అధ్యక్షుడు నికొలస్ మదురో తీవ్రమైన హెచ్చరిక చేశారు. దుస్సాహసంతో సైనిక చర్యను తీసుకున్నట్లయితే ఆయన చేతులు రక్తంతో తడిసిపోతాయని మదురో హెచ్చరించారు. ట్రంప్ తన ఎదుట నిలిస్తేకనుక మీ చేతులు రక్తంతో తడిసిపోతాయి, అందువల్ల మీరు ముందడుగు వేయవద్దు, మీ అధ్యక్ష పీఠం రక్తమయమౌతుందని చెప్తాను అంటూ మదురో హెచ్చరించారు. స్పెయిన్ టెలివిజన్ ఛానల్ లాసెక్స్టాను ఉటంకిస్తూ సిఎన్ఎన్ ఈ వార్తను అందించింది. గతవారం ట్రంప్ మాట్లాడుతూ వెనిజులలో భయంకరమైన పరిస్థితులు ఏర్పడుతున్నాయని, ఈ నేపథ్యంలో ఆదేశంపై సైనిక చర్య అవకాశం కూడా ఉన్నదంటూ మాట్లాడారు. ట్రంప్ బెదిరింపులను దృష్టిలో ఉంచుకుని మదురో మాట్లాడుతూ లాటిన్ అమెరికాలో మరో వియత్నాం అనుభవాన్ని మళ్లీ పొందకండి అని హెచ్చరించారు.

పరస్పర గౌరవం ఉండాలని మదురో కోరారు. మన మధ్య సంబంధాలను, ఒకరినొకరు గౌరవించుకోవడం యుద్ధం ద్వారా జరగాలని కోరుకుంటున్నారా? అని ప్రశ్నించారు. తనని పదవినుండి వైదొలగాలని, తిరిగి ఎన్నికలు జరపాలని కోరుతున్న దేశాలను ఆయన తిరస్కరించారు. తాత్కాలిక అధ్యక్షుడుగా ప్రకటించుకున్న ప్రతిపక్షనేత జాన్‌గుయ్‌డొను 16 ఈయూ దేశాలు గుర్తిస్తున్నట్టుగా ప్రకటించాయి. ఈయూలో బ్రిటన్‌తో సహా 28 దేశాలున్నాయి. ఇవన్నీ ట్రంప్ అడుగుజాడల్లో నడవాలని కోరుకుంటున్నాయి. చమురుసంపద కలిగిన వెనిజులలో అమెరికా ఆంక్షలమూలంగా ఆర్థిక వ్యవస్థ తీవ్ర ఒడిదుడుకులకు లోనయ్యింది. గుయ్‌డొ నాయకత్వంలో అమెరికా అండతో తిరుగుబాటుకు విఫలయత్నం జరిగింది.

పారిస్ అగ్నిప్రమాదంలో 10 మంది మృతి



పారిస్ : మంగళవారం తెల్లవారుఝామున పారిస్ నగరంలో జరిగిన అగ్నిప్రమాదంలో10 మంది మృతిచెందారు. మృతులలో ఒక చిన్న పాప కూడా ఉన్నట్టు తెలిసింది. ఈ ప్రమాదానికి బహుశ ఎవరోఒకరు మంటలను రగిల్చివుంటారని పోలీసులు భావిస్తున్నారు. దాదాపు 200 అగ్నిమాపక దళాలు వచ్చి మంగళవారం ఉదయానికి మంటలను అదుపులోకి తీసుకువచ్చాయి. 8 అంతస్తుల భవనంలో ఈ ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదం వెనుక ఉన్న నేరాన్ని దర్యాప్తు చేసేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. భీకరమైన మంటలు చెలరేగాయని అగ్నిమాపక దళాలు తెలియజేశాయి. అగ్నిప్రమాదం జరిగిన తరువాత అనేకమంది మహిళలు వీధుల్లోకి వచ్చి సహాయం కోసం ఏడుస్తూ పెద్దపెద్దగా అరిచారని ఎ.పి. వార్తాసంస్థ విలేకరి తెలియజేశారు. ప్రమాదం జరిగిన వీధిలోనే విలేకరి జాక్విలిన్‌రేవియర్ నివసిస్తున్నారు. భయకంపితులైన మహిళలు ఆ పక్కనేవున్న తన నివాసంలోకి వచ్చారని ఆమె తెలిపారు. ఒక యువకుడు అండర్‌వేర్‌తో శరీరమంతా పొగరేణువులతో కప్పబడి పరిగెత్తుకుంటూ వచ్చినట్లు ఆమె వెల్లడించారు. ఈ ప్రమాదానికి సంబంధించి ఒక మహిళను కస్టడీలోకి తీసుకుని విచారణ జరుపుతున్నారు. ప్రమాదం జరిగిన ప్రాంతంలో ఎక్కువగా యాత్రికులు ఉంటారు. ఈ ప్రాంతంలోనే పారిస్‌సెయింట్-జర్మాయిన్ హోంస్టేడియం, ఈఫిల్ టవర్ ఉన్నాయి. నగరంలోని ఈ ప్రాంతం చాలా అందంగా ఉంటుంది. అనేక షాపులు, రెస్టారెంట్లు ఉన్నాయి. ప్రమాదం జరిగినపుడు కొంతమంది అపార్టమెంట్ల పైకి వెళ్లి అగ్నికీలలనుంచి తప్పించుకున్నారు. నిచ్చెనల ద్వారా 30 మందికిపైగా కిందకి దిగారని అగ్నిమాపకదళ ప్రతినిధి తెలిపారు. అగ్ని ప్రమాదం సమయంలో చుట్టుపక్కల వీధుల్లోని ప్రజలెవరినీ ఇటువైపు రాకుండా పోలీసులు నిలువరించారు.

ఎదుర్కొంటాం

(మొదటిపేజీ తరువాయి)

సాధ్యమవుతుంది. కేంద్రంలో ఇలాంటి ప్రభుత్వాన్ని ఎప్పుడూ చూడలేదు. ఎన్‌డీఏ ప్రభుత్వ చర్యల వల్ల దేశ సమగ్రతకు భంగం వాటిల్లుతోంది' అని ఆయన మండిపడ్డారు. 'దేశ భవిష్యత్ కోసమే 23 పార్టీలు ఏకతాటిపైకి వచ్చాయి. నిన్న కేంద్ర ఎన్నికల సంఘం అధికారులను విపక్ష నేతలు కలిశారు. పోలైన ఓట్లలో వీవీ ప్యాట్ చిట్టీలు 50 శాతం లెక్కించాలని కోరాం. ఇకపై ఏ నిర్ణయమైనా ఐక్యంగా తీసుకుంటాం' అని చంద్రబాబు అన్నారు. కాగా విపక్షాలకు మమత మూలస్తంభమని, ఆమె పార్టీ (టీఎంసీ) పశ్చిమ బెంగాల్ లోక్‌సభ ఎన్నికల్లో మొత్తం 42 స్థానాలనూ గెలుచుకుంటుందని చంద్రబాబు పేర్కొన్నారు. అనంతరం మమతా బెనర్జీకి నిమ్మరసం ఇచ్చి దీక్ష విరమింపజేశారు.

13న దేశవ్యాప్త నిరసనలు

(మొదటిపేజీ తరువాయి)

భవన్‌లో మంగళవారం జరిగిన విలేకర్ల సమావేశంలో రావుల వెంకయ్య మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా జరిగే ఈ నిరసన కార్యక్రమాల్లో రైతులు, గ్రామీణ పేదలు పెద్దఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. గత నెల 31న, ఈనెల ఒకటో తేదీన ముంబైలో ఏఐకేఎస్ జాతీయ సమితి సమావేశాలు జరిగాయని, కేంద్ర బడ్జెట్‌పై విస్తృతంగా చర్చించామన్నారు. కేంద్ర బడ్జెట్ దాదాపు రూ.28 లక్షల కోట్లతో రూపొందించగా దీనిలో వ్యవసాయ, అనుబంధ శాఖలకు కేవలం రూ.1.50 లక్షల కోట్లు మాత్రమే కేటాయించారన్నారు. దేశంలో 65 శాతం జనాభా వ్యవసాయంపైనే ఆధారపడి జీవిస్తున్నారని, అంత కీలకమైన వ్యవసాయ శాఖకు నామమాత్రంగానే కేటాయింపులు జరిగాయని విమర్శించారు. రైతాంగం సమస్యలపై ప్రధాన మంత్రి మోడీకి చిత్తశుద్ధి లేదని ధ్వజమెత్తారు. 2019 ఎన్నికల్లో అధికార పీఠాన్ని దక్కించుకోవడానికి ప్రస్తుత బడ్జెట్‌లో రైతులు, గ్రామీణ ప్రజలపై సవతి తల్లి ప్రేమను కురిపించి కొత్త నాటకానికి తెర తీశారని ఎద్దేవా చేశారు.

ఎన్నికల తాయిలంగా ఐదు ఎకరాలలోపు ఉన్న రైతులకు మూడు దఫాలుగా రూ.6 వేలు పెట్టుబడి రాయితీ ఇస్తున్నట్లు కేంద్రం ప్రకటించిందన్నారు. దీని ప్రకారం నెలకు రూ.500 పడితే రోజుకి రూ.17 మాత్రమే దక్కుతుందన్నారు. రైతు కుటుంబంలో ఐదుగురు సభ్యులుంటే ఒక్కొక్కరికి రూ.3.50 చొప్పున పడిందన్నారు. బిక్షగాడు కూడా రూ.10 కంటే తక్కువగా తీసుకోవడం లేదనీ, రైతులను బిక్షగాళ్ల కంటే హీనంగా ప్రభుత్వం చూస్తోందని ధ్వజమెత్తారు. ఒక్క ఖరీఫ్ సీజన్‌లో దుక్కు దున్నితే రూ.2 వేలు ఖర్చు అవుతోందని అలాంటి తరుణంలో ఈ మాత్రం పెట్టుబడి రాయితీ దేనికి సరిపోతుందని ప్రశ్నించారు. 2022 నాటికి రైతు ఆదాయం రెట్టింపు చేస్తామని ప్రభుత్వం చెబుతోంది. అయితే ఇలాంటి అస్తవ్యస్త విధానాల వలన ఎలా సాధ్యమవుతుందని ప్రశ్నించారు. దేశంలో వ్యవసాయ వృద్ధి కేవలం 2.5 శాతంగా ఉందన్నారు. రైతుల ఆదాయం రెట్టింపు చేయాలంటే 12 శాతం వృద్ధి నమోదు కావాలన్నారు. బడ్జెట్‌లో ఎం.ఎస్.స్వామినాథన్ కమిషన్ సిఫార్సులను అమలు చేస్తామనే మాటే రాలేదన్నారు. స్వామినాథన్ కమిషన్ సిఫార్సులు అమలు చేయకపోతే రైతులకు న్యాయం ఎలా జరుగుతుందని ప్రశ్నించారు. పంటలకు గిట్టుబాటు ధరలు లేక రైతాంగం తీవ్రంగా నష్టపోతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వాలు చేస్తోన్న రుణమాఫీ వలన రైతాంగానికి ఉపయోగం లేదని విమర్శించారు. కేవలం వాణిజ్య, ప్రభుత్వ బ్యాంకుల్లో రుణాలు తీసుకున్న రైతులకే ప్రయోజనం చేకూరుతోందని, ప్రైవేటుగా వడ్డీ వ్యాపారుల నుంచి అప్పులు తీసుకున్న రైతులకు ఎలాంటి ఉపయోగం లేదని తెలిపారు. కేరళ ప్రభుత్వ తరహాలో రుణమాఫీ చేస్తే బాగుంటుందని అభిప్రాయపడ్డారు. దేశంలో ధరల స్థిరీకరణకు రూ.లక్ష కోట్లు కేటాయించాలని, పంటలను ప్రభుత్వ సంస్థలే గిట్టుబాటు ధరలకు కొనుగోలు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని డిమాండు చేశారు. గిట్టుబాటు ధరలు, రుణ విముక్తి కోసం పార్లమెంటులో ప్రైవేట్ బిల్లు పెడితే దానికోసం అసలు ప్రస్తావించలేదని ఆయన విమర్శించారు.

కె.వి.వి.ప్రసాద్ మాట్లాడుతూ కేంద్ర బడ్జెట్‌లో ప్రభుత్వం ఎన్నికల సినిమా చూపించిందని ధ్వజమెత్తారు. ఎన్నికల వాగ్దానాలను నాలుగున్నరేళ్లుగా అమలు చేయని మోడీ ప్రభుత్వం మరో మూడు నెలల్లో పార్లమెంటు ఎన్నికలు ఉన్నందున ఎన్నికల తాయిలాలు విదిలించిందని విమర్శించారు. రైతులకు అవసరమైన ఎరువులు, విత్తనాలు, పురుగు మందులు, డీజిల్ ధరలు నియంత్రించకుండా వారిని వ్యాపారుల దయాదాక్షిణ్యాలకు వదిలేసిందని తెలిపారు. ఈనెల 13న దేశవ్యాప్తంగా జరిగే బడ్జెట్ ప్రతులను దహనం చేసే నిరసన కార్యక్రమాల్లో రైతులు పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం కృష్ణాజిల్లా ప్రధాన కార్యదర్శి మల్నీడు యలమందరావు తదితరులు పాల్గొన్నారు.

రంగం సిద్ధం

(మొదటిపేజీ తరువాయి)

రాష్ట్రంలో పర్యటించనుంది. ముఖ్యమంత్రి కేసీఆర్, ఇతర ఆర్థిక శాఖ అధికారులతో సమావేశం కానుంది. కేంద్ర ఆర్థిక సంఘం పర్యటన తర్వాతే బడ్జెట్ సమావేశాలు ఉండవచ్చు. ఈనెలాఖరు లేదా వచ్చే మొదటి వారంలో లోక్‌సభ ఎన్నికల షెడ్యూల్ విడుదలయ్యే అవకాశాలున్నాయి. అంతకంటే ముందే బడ్జెట్ సమావేశాలను నిర్వహించాలని కేసీఆర్ ప్రభుత్వం యోచిస్తోంది.

ఎవరినీ నొప్పించక...

(మొదటిపేజీ తరువాయి)

ఆదేశించింది. తదుపరి కోర్టు విచారణకు ముగ్గురు అధికారులు హాజరుకావాలని సూచించింది. మంగళవారం దాదాపు 15 నిమిషాల పాటు కోర్టు విచారణ వాడీవేడిక సాగింది. సీబీఐ తరపున అటార్నీ జనరల్ (ఏజీ) కేకే వేణుగోపాల్, సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా వాదనలు వినిపించారు. కుమార్ విచారణకు సహకరించడం లేదని, కేసును తప్పుదారి పట్టించేందుకు ప్రయత్నిస్తున్నారని వారు ఆరోపించారు. పశ్చిమ బెంగాల్ పోలీస్ ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్)కు కుమార్ నేతృత్వం వహిస్తున్నారని, ఆయన ఆధ్వర్యంలో పూర్తి సమాచారం సీబీఐకు చేరలేదని, సిట్ ఇచ్చిన పలు పత్రాలు మార్పబడినవి అని మెహతా, వేణుగోపాల్ అన్నారు. అయితే, సీబీఐ అభియోగాలను కుమార్ తరపు సీనియర్ న్యాయవాది అభిషేక్ మను సింఘ్వీ తోసిపుచ్చారు. కోల్‌కతా పోలీసు కమిషనర్‌ను వేధించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నట్లు తెలిపారు. ఈ వ్యవహారంలో సిట్ పోషించిన పాత్రకు అభినందనలు అందాయని, వేర్వేరు రాష్ట్రాలకు సంబంధించినందునే ఈ కేసును సీబీఐకి బదిలీ చేశారని చెప్పారు. ఇప్పటివరకు కుమార్‌పై ఎఫ్ఐఆర్ కూడా లేదని, చిట్‌ఫండ్ కుంభకోణం నేపథ్య కేసుల్లో ఆయనను నిందితుడిగా పేర్కొనలేదని వెల్లడించారు. కమిషనర్‌కు గతంలో మూడుసార్లు నోటీసులు జారీకాగా, కలకత్తా హైకోర్టు జోక్యం వల్ల ఆయన సీబీఐ ఎదుట హాజరుకాలేదని సింఘ్వీ తెలిపారు. ఆదివారం చోటుచేసుకున్న పరిణామాలను ప్రస్తావిస్తూ దాదాపు మూడేళ్ల తర్వాత పోలీసు చీఫ్‌పై చర్య తీసుకొన్నారన్నారు. పశ్చిమ బెంగాల్ పోలీసులు సహా కుమార్ సీబీఐ దర్యాప్తునకు పూర్తిగా సహకరిస్తున్నారని చెప్పారు. డీజీపీ ఇప్పటికే సీబీఐకి ఐదు లేఖలు రాశారన్నారు. దర్యాప్తు చేపట్టిన ఐదేళ్ల తర్వాత సీబీఐ ఇలాంటి ఆరోపణలు చేస్తోందని సింఘ్వీ వాదించారు. అయితే ఆయనను మధ్యలో ఆపేస్తూ.. సీబీఐ దర్యాప్తునకు హాజరుకావాలని కమిషనర్‌కు ఇప్పటికే సూచించామని సుప్రీం ధర్మాసనం పేర్కొంది. ఆయన కోర్టు ఆదేశాల ప్రకారం నడుచుకోవాల్సిందేనని స్పష్టంచేసింది. అదే సమయంలో సాక్షులను ధ్వంసం చేయడంపై ఆధారాలు ఇవ్వాలంటూ సీబీఐని కోర్టు ఆదేశించింది.

హైకోర్టు విచారణ వాయిదా

సీబీఐ నేరుగా కోల్‌కతా పోలీసు చీఫ్ రాజీవ్ కుమార్ ఇంటికి రావడాన్ని తప్పుపడుతూ పశ్చిమ బెంగాల్ ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణను హైకోర్టు గురువారానికి వాయిదా వేసింది. ఈ వ్యవహారంలో అత్యవసర విచారణకు అనుమతినివ్వాలని బెంగాల్ ప్రభుత్వం సోమవారం కోరగా అందుకు తిరస్కరించిన హైకోర్టు దీనిని మంగళవారం పరిశీలిస్తామని పేర్కొంది. ఈ క్రమంలోనే ఉదయం న్యాయమూర్తి జస్టిస్ శివకాంత్ ప్రసాద్ విచారణను చేపట్టరు. అయితే ఈ వ్యవహారం సుప్రీంకోర్టుకు చేరడంతో ప్రస్తుతానికి విచారణను వాయిదా వేయాలని రాష్ట్ర అడ్వకేట్ జనరల్ కిశోర్ దత్తా న్యాయస్థానాన్ని కోరారు. దీంతో జస్టిస్ ప్రసాద్ విచారణను గురువారానికి వాయిదా వేశారు. అయితే, దర్యాప్తునకు సహకరించమని రాష్ట్ర పోలీసులకు చెప్పండంటూ అడ్వకేట్ జనరల్‌కు ఆయన మౌఖికంగా సూచించారు.

అడుగుపెట్టండి

(మొదటిపేజీ తరువాయి)

సాయం చేయకపోయినా రాష్ట్రాన్ని అన్ని విధాలా అభివృద్ధి దిశగా నడిపిస్తున్నామని చెప్పారు. 'మళ్లీ చంద్రబాబు ఎన్డీయేలోకి వస్తారంటూ బీజేపీ నేతలు దుష్ప్రచారం చేస్తున్నారని, ఇవన్నీ అవాస్తవాలని' ఖండించారు. 2014లో కాంగ్రెస్ వ్యతిరేక శక్తులన్నింటినీ కూడగట్టాలని కోరుతూ స్వయంగా మోడీ హైదరాబాద్‌లో తనను ఆహ్వానించారని చెప్పారు. రాష్ట్రాభివృద్ధి, విభజన హామీల సాధన కోసం బీజేపీతో పయనించామని వివరించారు. కేంద్రంలో అధికారంలోకి వచ్చాక.. రాష్ట్రాన్ని ఆదుకోకుండా మోడీ దగా చేశారని, ఇచ్చిన వాగ్దానాలన్నీ విస్మరించారన్నారు. గుజరాత్ రాష్ట్రం పట్ల మోడీ ఇలాగే వ్యవహరిస్తున్నారా అని చంద్రబాబు ప్రశ్నించారు. కేంద్రానికి రాష్ట్రం నుంచి పన్నులు కడుతున్నామని, అభివృద్ధికి ఎందుకు సహకరించరని ప్రశ్నించారు. దేశంలో మోడీ తప్ప, మరెవరున్నా అన్ని రంగాల్లోనూ ముందంజలో ఉండేదని అభిప్రాయం వ్యక్తం చేశారు. 'నేను ఎక్కడా యూటర్న్ తీసుకోలేదు. రైట్ టర్న్‌లోనే నడుస్తున్నా. బీజేపీ నేతలదే వంకర టింకర టర్న్' అని ఎద్దేవా చేశారు. కడప స్టీల్‌ప్లాంట్, విశాఖ ప్రత్యేక రైల్వే జోన్, పోలవరం డీపీఆర్-2 తదితర అభివృద్ధి పనులపై కేంద్రం వివక్షత చూపుతోందన్నారు. ఉపాధి హామీ పథకం బకాయిల నిధులను ఇవ్వట్లేదని విమర్శించారు. రాష్ట్రానికి ఇచ్చిన వాగ్దానాల్లో మొత్తంగా14 అంశాల్లో.. 10 అంశాలను అమలు చేశామంటూ బీజేపీ నేతలు చేస్తున్న ప్రచారాన్ని ఆయన ఖండించారు. అమిత్‌షా నాపై అవినీతి ఆరోపణలు చేయడమేమిటని సీఎం చంద్రబాబు మండిపడ్డారు. అమిత్ షా కుమారుడికి ఏడాదికి రూ.16 వేల కోట్ల ఆస్తులు ఎక్కడ నుంచి పెరుగుతూ వచ్చాయని, వాటిపై ఎందుకు సమగ్ర దర్యాప్తు చేపట్టలేదని ప్రశ్నించారు. పలాసలో అమిత్ షా సభకు ఖాళీ కుర్చీలే స్వాగతించాయని, భవిష్యత్తులో బీజేపీ నేతలు ఎక్కడికెళ్లినా ఇదే పరిస్థితి నెలకొంటుందని హెచ్చరించారు. బీజేపీ ప్రభుత్వ హయాంలో పెద్దఎత్తున బ్యాంకుల్లో అవినీతి నెలకొందని విమర్శించారు. కోడి కత్తి కేసును ఎన్ఐఏకు అప్పగించి రాజకీయం చేస్తున్నారని ఎద్దేవా చేశారు.

బీజేపీ ప్రజాప్రతినిధులు రాజీనామా చేస్తే బాగుండేది..

విశాఖ రైల్వే జోన్ కోసం అక్కడి బీజేపీ ప్రజాప్రతినిధులు రాజీనామా చేస్తే సంతోషించేవాడినని చంద్రబాబు అన్నారు. కనీసం అక్కడ ఇద్దరు బీజేపీ ప్రజాప్రతినిధులు ఉన్నప్పటికీ రైల్వే జోన్‌కు కేంద్రం సహకరించ లేదన్నారు. మోడీ ఎంత వివక్షత చూపినా.. రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తామని, తెలుగువారి సత్తా చూపుతామని స్పష్టం చేశారు.

ఆర్టీసీ సమ్మె విరమణ

(మొదటిపేజీ తరువాయి)

యూనియన్, కార్మిక పరిషత్‌లతో సహా తొమ్మిది సంఘాల నేతలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి అచ్చెన్నాయుడు విలేకర్లతో మాట్లాడుతూ ప్రభుత్వానికి అదనంగా రూ.750 కోట్లు భారమైనప్పటికీ కార్మికుల సంక్షేమం దృష్ట్యా 25 శాతం ఫిట్‌మెంట్ ఇచ్చేందుకు అంగీకరించామని వెల్లడించారు. ప్రధానంగా డీజిల్ ధరలు పెరగడం వలన ఆర్టీసీ నష్టాలను తగ్గించలేకపోతున్నామని చెప్పారు. ఆక్యుపెన్సీ రేటును ఎనభై శాతం పెంచినప్పటికీ నష్టాలు వస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. యాజమాన్యం పొదుపు చర్యల వలన కొంత వరకు నష్టాలను అదుపులోకి తీసుకురాగలుగుతున్నామని పేర్కొన్నారు. ఆర్టీసీ స్వయంప్రతిపత్తి సాధించే దిశగా పలు కీలక నిర్ణయాలు తీసుకున్నామని వెల్లడించారు. చర్చల్లో ఏపీఎస్ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు వైవీ రావు, ప్రధాన కార్యదర్శి దామోదర్‌రావు, ఆర్టీసీ ఎండీ సురేంద్రబాబు తదితరులు పాల్గొన్నారు.

నూరు శాతం ప్రకృతి సేద్యం లక్ష్యం

> కేంద్రం కంటే ఏపీలో అధిక వృద్ధి రేటు
> వ్యవసాయంపై లఘు చర్చలో చంద్రబాబు

విశాలాంధ్ర బ్యూరో - అమరావతి : రాబోయే 2023 నాటికి రాష్ట్రంలో నూరుశాతం ప్రకృతి సేద్యం లక్ష్యంగా పని చేసి.. ప్రపంచానికి పెద్ద బహుమతి ఇద్దామని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు. ఏపీ అసెంబ్లీ సమావేశాల్లో మంగళ వారం వ్యవసాయం అనుబంధిత రంగాలపై నిర్వహించిన లఘు చర్చలో ఆయన ప్రసంగించారు. అగ్రికల్చర్, హార్టికల్చర్‌లో రాష్ట్రానికి ఆదర్శంగా అనంతపురం జిల్లా నిలుస్తోందన్నారు. వెనుకబాటుకు గురైన ఈ జిల్లా పంటల సాగులో మొదటి స్థానంలో ఉందన్నారు. ప్రకృతి సేద్యం విజయవంతానికి డ్వాక్రా సంఘాల కృషే ప్రధాన కారణమని స్పష్టం చేశారు. 2004-14 సమయంలో రైతులు తీవ్ర నష్టానికి గురయ్యారని, మద్దతు ధరను కోల్పోయారని గుర్తు చేశారు. సాగునీటి కొరత-కరెంటు కోత సమస్యలతో భూమి సారం పూర్తిగా తగ్గిపోయిందని, వ్యవసాయ వృద్ధి రేటు పెరగలేదని వివరించారు. టీడీపీ ప్రభుత్వం వచ్చాక వాటన్నింటినీ క్రమంగా అధిగమించామని, వ్యవసాయం కోసం ప్రత్యేకంగా బడ్జెట్‌ను ప్రవేశపెట్టామని చెప్పారు. కేంద్రంలో కంటే రాష్ట్రంలో వ్యవసాయ వృద్ధి రేటు 11 శాతం సాధించామని నొక్కి చెప్పారు. రైతుల సంక్షేమం, నిధుల విడుదలలో కేంద్రం భిక్ష వేస్తున్నట్లుగా వ్యవహరిస్తోందన్నారు. ఫసల్ బీమా అధ్వానంగా మారిందని, దీన్ని అడ్డుపెట్టుకుని పెద్దఎత్తున ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. నీరు-ప్రగతితో వర్షపు నీటిని సమర్థవంతంగా ప్రభుత్వం వినియోగించుకుని వృద్ధి రేటు పెరుగుదలకు కృషి చేస్తోందన్నారు. కృష్ణా-గోదావరి నదుల అనుసంధానంతో వెనుకబడిన రాయలసీమ ప్రాంతానికి నీరందించామని చెప్పారు. రాష్ట్రంలో వరుస తుపాన్లు వచ్చినప్పటికీ కేంద్రం తగినంతగా సహకరించ లేదన్నారు. వ్యవసాయ శాఖ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి మాట్లాడుతూ ప్రతిపక్ష ఎమ్మెల్యేలు అసెంబ్లీకి వస్తే వ్యవసాయంపై కొంత అవగాహన కలిగేదని ఎద్దేవా చేశారు. కేంద్ర బడ్జెట్‌లో రైతులకు మొండిచేయి చూపించారని విమర్శించారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో రైతుల ఆదాయం పెంచుకునేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. రాష్ట్ర మార్కెటింగ్, పశు సంవర్థక శాఖ మంత్రి ఆదినారాయణరెడ్డి మాట్లాడుతూ నదుల అనుసంధానంతో వెనుకబడిన రాయలసీమ ప్రాంతంలో పశువులకు నీటి కొరత తీరిందని చెప్పారు. పశువుల కోసం 60 సంచార వైద్యశాలలను ఏర్పాటు చేస్తున్నామన్నారు. మత్స్య సంపద ఎగుమతిలో రాష్ట్రం మొదటి స్థానంలో నిలిచిందని చెప్పారు. తొలుత ఎమ్మెల్యేలు ఎస్‌వీఎస్ఎన్ వర్మ, రామాంజనేయులు, శ్రావణ్‌కుమార్ తదితరులు ప్రసంగిస్తూ గత ప్రభుత్వాల హయాంలో రైతులకు తగిన ప్రోత్సాహం లేక ఆత్మహత్యలకు పాల్పడ్డారని వివరించారు. తొలుత అసెంబ్లీలో సింహాచలం వరహాలక్ష్మీనరసింహ స్వామి దేవస్థానం పంచగ్రామాల(గృహాల, ఇంటి స్థలాల అక్రమణల క్రమబద్ధీకరణ), అసైన్డు భూముల(బదిలీల నిషేధం), వెంకటేశ్వర వైద్య విజ్ఞాన సంస్థ విశ్వవిద్యాలయం తదితర అంశాలపై బిల్లులను ప్రవేశపెట్టారు.

ప్రశాంత ఎన్నికలే లక్ష్యం...

- డబ్బు, మద్యం అక్రమ రవాణాకు చెక్
- సమస్యాత్మక ప్రాంతాలపై నిశిత నిఘా
- ఆరు రాష్ట్రాల డీజీపీల సమావేశంలో ఏపీ డీజీపీ ఠాకూర్



విశాలాంధ్ర - తిరుపతి క్రైమ్ : సార్వత్రిక ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహిస్తామని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర డీజీపీ ఆర్పీ ఠాకూర్ తెలిపారు. ఎన్నికల నిర్వహణపై ఆయన మంగళవారం ఆరు రాష్ట్రాల డీజీపీలతో తిరుపతిలోని మానససరోవర్ హోటల్‌లో నిర్వహించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ, ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించాలానే ముందస్తుగా డీజీపీలతో సమావేశమైనట్టు తెలిపారు. గత ఎన్నికల సమయంలో కర్ణాటకలో సమావేశమైనట్టు వెల్లడించారు. నాటుసారా, ఆయుధాలు, డబ్బు అక్రమ రవాణాను అరికట్టేందుకు అనుమానిత ప్రాంతాలలో ప్రత్యేక చెక్ పోస్టులను ఏర్పాటు చేస్తామన్నారు. అన్నిచోట్ల నిశిత నిఘా ఉంచుతామని చెప్పారు. సమస్యాత్మక ప్రాంతాలపై ప్రత్యేకంగా దృష్టి పెడతామని తెలిపారు. ఆయా ప్రాంతాల సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. కార్యాచరణ ప్రణాళికలో భాగంగా ఆంధ్రప్రదేశ్, చత్తీస్‌గఢ్, తెలంగాణ, ఒడిశా సరిహద్దు ప్రాంతాల్లోని మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల్లో భద్రతా బలగాలను మోహరిస్తామని, అవాంఛనీయ ఘటనలు జరగకుండా ముందస్తు చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఈ అంశాలపై చర్చించినట్టు తెలిపారు.

'పోలీసులదీ ఖాకీ కులం, పదోన్నతులనేవి మెరిట్ ఆధారంగా లభిస్తాయి. హైకోర్టు ఆదేశాల మేరకు వస్తాయి' అని ఒక ప్రశ్నకు సమాధానంగా ఠాకూర్ తెలిపారు. కానిస్టేబుళ్లకు రోస్టర్ పద్ధతి ప్రకారమే పదోన్నతులు లభిస్తాయన్నారు.

కర్ణాటక డీజీపీ నీలమణి రాజు మాట్లాడుతూ ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించేందుకు తీసుకోవాల్సిన చర్యలపై చర్చించామన్నారు. సమావేశంలో తమిళనాడు డీజీపీ టీకే రాజేంద్రన్, తెలంగాణ హోం శాఖ కార్యదర్శి రాజీవ్ త్రివేది, ఆంధ్రప్రదేశ్ హోం శాఖ కార్యదర్శి ఏఆర్ అనురాధ, ఒడిశా ఏడీజీ ఆర్.కొచ్చి, చత్తీస్‌గఢ్ ఐజీపీఎస్ఐ సుందర్ రాజ్, ఏపీ జాయింట్ డైరెక్టర్ ఐబీఆర్ చంద్రశేఖర్, హైదరాబాద్ సీఆర్పీఎఫ్ సౌత్‌జోన్ ఐజీ మహంతి పాల్గొన్నారు.

ఎన్ని'కల' తాయిలాలు...

పింఛన్లకు రూ.12,600 కోట్లు - పసుపు - కుంకుమకు రూ.4 వేల కోట్లు



విశాలాంధ్ర సెంట్రల్ డెస్క్ - అమరావతి : ఎన్నికల నేపథ్యంలో అధికార టీడీపీ మధ్యంతర బడ్జెట్‌లో తాయిలాలను ప్రకటించింది. కేంద్రం కంటే తానేమీ తక్కువ తినలేదంటూ డ్వాక్రా గ్రూపులు, పింఛన్‌దారులకు భారీగా బడ్జెట్‌ను కేటాయించింది. కేంద్రంలోని మోడీ ప్రభుత్వంపై నిప్పులు చెరిగే సీఎం చంద్రబాబు, బడ్జెట్‌లో మాత్రం కేంద్రాన్ని అనుకరించటం గమనార్హం. ఎన్నికల్లో ఓట్లే ప్రధానంగా 2019-20 ఓట్ ఆన్ అకౌంట్‌ను ఆర్థికశాఖ మంత్రి యనమల రామకృష్ణుడు ప్రవేశపెట్టారు. సంక్షేమ రంగంలో పింఛన్లు, డ్వాక్రా గ్రూపులకే అధిక ఆర్థికశాఖ మంత్రి యనమల రామకృష్ణుడు తన బడ్జెట్‌లో ప్రాధాన్యం ఇచ్చారు. ఎన్‌టీఆర్ భరోసా కింద వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులకు సుమారు రూ.1,2600 కోట్లను కేటాయించారు. వృద్ధులు, వితంతువులకు గతంలో రూ.4,200 కోట్లను కేటాయించగా, తాజా బడ్జెట్‌లో అది రూ.10,401 కోట్లకు, దివ్యాంగులకు రూ.740 కోట్ల నుంచి రూ.2,133 కోట్లకు పెంచారు. అలాగే డ్వాక్రా గ్రూపులకు ఇచ్చే పసుపు - కుంకుమ పథకానికి ఏకంగా రూ.4 వేల కోట్లను కేటాయించారు. 2018-19 వార్షిక బడ్జెట్‌లో రూ.1,700 కోట్లను కేటాయించగా, ఎన్నికల నేపథ్యంలో దానిని ఒక్కసారిగా 2,300 కోట్లను పెంచటం గమనార్హం.



'యువత'కు మొండిచెయ్యి

గతేడాది కంటే రూ.200 కోట్లే పెంపు - యువనేస్తం అమలుపై నీలినీడలు

విశాలాంధ్ర సెంట్రల్ డెస్క్ - అమరావతి : సీఎం చంద్రబాబు ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ముఖ్యమంత్రి యువనేస్తం పథకం అమలుపై నీలి నీడలు కమ్ముకున్నాయి. రాష్ట్రంలోని నిరుద్యోగులకు ప్రతి నెలా రూ.వెయ్యి నిరుద్యోగ భృతి ఇచ్చేందుకు గతేడాది అక్టోబరు రెండున ప్రారంభించిన ఈ పథకానికి 2019-20 ఓట్ ఆన్ అకౌంట్ బడ్జెట్‌లో అత్తెసరుగానే నిధులను కేటాయించారు. రాష్ట్రంలో సుమారు 12.50 లక్షల మది నిరుద్యోగులు ఉన్నట్లు ప్రభుత్వం గుర్తించింది. నిరుద్యోగులకు భృతి చెల్లించేందుక గతేడాది ఆగస్టులో యువనేస్తం పథకాన్ని ప్రకటించి రూ.వెయ్యి కోట్లను కేటాయించారు. భృతిని రెట్టింపు చేస్తామన్న చంద్రబాబు కేటాయింపులను పెంచలేదు. తాజా బడ్జెట్‌లో రూ.1,200 కోట్లను కేటాయించటం గమనార్హం. రాష్ట్రంలో ఒకవైపున నిరుద్యోగుల సంఖ్య విపరీతంగా పెరుగుతోంది. అలాంటి పరిస్థితుల్లో కేటాయింపులను పెంచటానికి బతులు కోత పెట్టటంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. గత బడ్జెట్‌లో రూ.వెయ్యి కోట్లను కేటాయించినా, రూ.200 కోట్లకు మించి ఖర్చు చేయలేదు. నిరుద్యోగ భృతిని రెట్టింపు చేస్తామన్న ప్రభుత్వం కేటాయింపులను రెట్టింపు చేయడానికి బదులు స్వల్పంగానే పెంచటం గమనార్హం. ప్రస్తుతం ఉన్న నిరుద్యోగుల సంఖ్య ప్రకారం ఏడాదికి రూ.1,500 కోట్లపైనే నిధుల అవసరం ఉంది.

ఆరు కొత్త వరాలు...!

విశాలాంధ్ర - అమరావతి : ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌లో ఆరు కొత్త వరాలను ఆర్థికమంత్రి యనమల రామకృష్ణుడు ప్రకటించారు. శాసన సభలో మంగళవారం ఆయన బడ్జెట్ ప్రసంగంలో... నూతన పథకాలను వివరించారు. ఆయా పథకాలకు నిధులను మంజూరు చేశారు. రైతులకు మదుపు పెట్టేందుకు అన్నదాత సుఖీభవ పథకాన్ని తీసుకువచ్చారు. ప్రతి ఏటా ఖరీఫ్, రబీ సీజన్‌ల్లో ప్రతి రైతుకు5వేల కోట్లు పంపిణీ చేస్తారు. ఇక క్షత్రియ కార్పొరేషన్‌కు రూ.50కోట్లు మంజూరు చేశారు. ఇళ్ల నిర్మాణానికి స్థలాల కొరత ఏర్పడిన నేపథ్యంలో... ప్రైవేటు భూములను సేకరించేందుకు రూ.500 కోట్లు కేటాయించారు. చిన్న, మధ్య తరగతి పరిశ్రమల ప్రోత్సాహానికి రూ.400కోట్లు మంజూరు చేశారు. డ్రైవర్ల సాధికార సంస్థకు రూ.150 కోట్లు, మున్సిపాలిటీల్లో మౌలిక వసతుల కల్పనకు రూ.100కోట్లు కేటాయించారు.

ప్రచారానికి పెద్ద పీట...!

ప్రచారార్భాటంలో... రాష్ట్ర ప్రభుత్వం ఎక్కడా రాజీ పడలేదు. గడచిన మూడేళ్లల్లో సమాచారశాఖ పద్దులో భారీగా నిధులు కేటాయిస్తున్నారు. రాష్ట్రంలో ఎక్కడ చూసినా సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్ చిద్విలాస ఫోటోల హోర్డింగ్‌ల హోరుకు భారీగానే నిధులు కేటాయించారు. 2017-18లో సమాచారశాఖకు రూ.186.31 కోట్లు ఖర్చు చేస్తే... 2018-19లో 224.81 కోట్లు కేటాయించి రూ.337.12 కోట్లు ఖర్చు చేశారు. ఈ సారి బడ్జెట్‌లో ఏకంగా రూ.340.55 కోట్లు కేటాయించటం విశేషం.

పారిశుధ్యానికి కోత...!



అటు గ్రామీణ, ఇటు పట్టణ ప్రాంతాల్లో పారిశుధ్యం, తాగునీటి అవసరాలను రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విస్మరించింది. సర్వేక్షణ్ పేరిట గొప్పలు పోతున్న సర్కారు బడ్జెట్‌లో కేటాయింపుల్లో పూర్తిగా నిర్లక్ష్యం ప్రదర్శించింది. 2017-18లో తాగునీరు, పారిశుధ్యానికి రూ.3,576 కోట్లు (1.86 శాతం) ఖర్చు చేసింది. 2018-19లో రూ.2,623.22 కోట్లు (1.37 శాతం) కేటాయించి కేవలం రూ.2,175.32 కోట్లు (1.10) శాతం ఖర్చు చేసింది. ఇక ఈ బడ్జెట్‌లో రూ.2,894 కోట్లు (1.28 శాతం) కేటాయించింది. మరి ఎన్ని కోట్లు ఖర్చు చేస్తుందో..?

విద్యుత్తుకు వాత...!




ప్రజావసరాలు, మౌలిక సదుపాయాల కల్పనను ప్రభుత్వం ఏరీతిలో నిర్లక్ష్యం చేసిందో ఈ బడ్జెట్ అద్దంపడుతుంది. విద్యుత్తు శాఖకు ప్రతి ఏటా నిధుల కోత విధిస్తూనే ఉంది. భారీ బడ్జెట్‌లను ప్రవేశపెడుతూనే విద్యుత్తు శాఖకు నిధులను పెంచటం లేదు. 2017-18లో విద్యుత్తు శాఖకు రూ.3,919.65 కోట్లు (2.04 శాతం) ఖర్చు చేసింది. 2018-19లో రూ.5,052.54 కోట్లు (2.64 శాతం) కేటాయించి రూ.2.920.48 కోట్లు (1.48 శాతం) మాత్రమే ఖర్చు చేసింది. ఈ బడ్జెట్‌లో రూ.5,391 కోట్లు కేటాయించింది. గత కేటాయింపులతో పోల్చితే రూ.250 కోట్లు పెరిగినట్టు కనిపిస్తుంది. కానీ బడ్జెట్‌లో ఈ కేటాయింపు కేవలం 2.38 శాతమే.

కులానికో కార్పొరేషన్...!

ఓటు బ్యాంకు రాజకీయాల నేపథ్యంలో... ప్రతి కులానికో కార్పొరేషన్‌ను ఏర్పాటు చేసిన రాష్ట్రప్రభుత్వం ... ప్రభావిత కులాలకే నిధులు కేటాయించి... నోరులేని వర్గాలకు కార్పొరేషన్ పదవుల ఎరను సంధించింది. ఈ బడ్జెట్‌లో కాపు కార్పొరేషన్‌కు రూ.1000 కోట్లు, బ్రాహ్మణ కార్పొరేషన్‌కు రూ.100 కోట్లు, వైశ్యుల కార్పొరేషన్‌కు రూ.50కోట్లు, క్షత్రియులకు రూ.50 కోట్లు కేటాయించారు. ఐతే, యాదవ, తూర్పు కాపు, గాజుల కాపు, కొప్పుల వెలమ, పొలినాటి వెలమ, కురుబ, కురుమ, వణ్యకుల క్షత్రియ, వడ్డెరెడ్డి, వన్నికాపు, పల్లికాపు, పల్లిరెడ్డి, కళింగ, గవర, పద్మశాలి, దేవాంగుల, తొగట, శాలి, తొగట, వీర క్షత్రియ, పేనాపతుల, శాలివన్, అగ్నికుల క్షత్రియ, పల్లి, వడబలిజ, బెస్త, జాలరి, గంగ్వార్, గంగపుత్ర, గూండ్ల, నయల, పట్టపు, గండ్ల, తెలికుల, దేవటి కుల.. కార్పొరేషన్‌లకు కనీసం మూలధనమూ విదల్చకపోవటం విశేషం.

రుణమాఫీకి నిధులేవీ...

రూ.8,300 కోట్ల అవసరం



విశాలాంధ్ర సెంట్రల్ డెస్క్ - అమరావతి : రుణమాఫీ హామీతో అధికారంలోకి వచ్చిన సీఎం చంద్రబాబు ఆ పథకానికి చివరి రెండు విడతల చెల్లింపునకు బడ్జెట్‌లో పైసా కేటాయించలేదు. 2014 ఎన్నికల్లో టీడీపీ అధికారంలోకి వస్తే రైతుల రుణాలను ఒకేసారి మాఫీ చేస్తానని ఆయన హామీ ఇచ్చారు. తీరా అధికారంలోకి వచ్చిన తర్వాత ఐదు విడతలలో రుణమాఫీని అమలు చేస్తామని ప్రకటించారు. రూ.50 వేల లోపు రుణాలున్న వారికి ఒకేసారి మాఫీ చేయగా, ఆపైనా రూ.1.50 లక్షల వరకు రుణం ఉన్న వారికి ప్రతి సంవత్సరం 20 శాతం బ్యాంకు ఖాతాలో జమ చేస్తామన్నారు. ఇప్పటికి మూడు విడతల రుణమాఫీని అమలు చేయగా, చివరి రెండు విడతలను ఈ ఏడాది సంక్రాంతినాటికే బ్యాంకు ఖాతాలో వేస్తామన్నారు. తాజాగా అసెంబ్లీలో ప్రవేశపెట్టన మధ్యంతర బడ్జెట్‌లో అసలు ఆ ప్రస్తావనే లేకపోవటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. చివరి రెండు విడతల రుణమాఫీకి రూ.8,300 కోట్లపైనే నిధుల అవసరం ఉంది. గత బడ్జెట్‌లో రూ.4,100 కోట్లను ప్రతిపాదించగా, ఈ ఏడాది దానిని రూ.8,300 కోట్లుగా ప్రతిపాదించాల్సి ఉంది. తొలి విడతలో రూ.7,500 కోట్లను, రెండో విడతలో రూ.3,600 కోట్లను, మూడో విడతలో రూ.4,100 కోట్ల చొప్పున రైతు రుణమాఫీకి ప్రభుత్వం నిధులు కేటాయించింది. నాలుగు, ఐదు విడతలకు రూ.8,300 కోట్లు అవసరమని వ్యవసాయశాఖ అంచనా వేసింది. ఈ పథకాన్ని అమలు చేసేందుకు ప్రత్యేకంగా రైతు సాధికారసంస్థను కూడా ప్రభుత్వం ఏర్పాటు చేసింది. కానీ, బడ్జెట్‌లో ఎక్కడా ఈ సంస్థ ప్రస్తావనే లేదు. ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని సీఎం చంద్రబాబు 'అన్నదాత సుఖీభవ' అనే పథకాన్ని పెట్టి రూ.5 వేల కోట్లను కేటాయించారు. అదే మొత్తాన్ని రుణమాఫీకి కేటాయిస్తే బాగుండేదని, కేవలం ఓట్ల కోసమే పథకాన్ని ప్రకటించారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

ప్రాజెక్టులు ప్రశ్నార్థకమే..!

- సాగునీటికి రూ.16,852.27 కోట్లు
- రెండంకెల వృద్ధిపై తీవ్ర ప్రభావం
- జూన్‌కు పోలవరం పూర్తి అనుమానమే
- గోదావరి – పెన్నా లింకేజీకే రూ.6,020 కోట్లు అవసరం
- ఓట్ ఆన్ అకౌంట్‌లో నామమాత్రంగానే నిధుల కేటాయింపు



విశాలాంధ్ర సెంట్రల్ డెస్క్ - అమరావతి : రాష్ట్రంలో రెండంకెల వృద్ధి రేటును సాధించాలంటే వ్యవసాయ రంగం కీలకం. వ్యవసాయానికి పుష్కలంగా సాగునీటిని సరఫరా చేస్తే పంటలు బాగా పండి వృద్ధి రేటు పెరుగుతుంది. అలాంటి కీలకమైన జలవనరులశాఖకు ఆర్థికశాఖ మంత్రి యనమల రామకృష్ణుడు అసెంబ్లీలో ప్రవేశపెట్టిన ఓట్ ఆన్ అకౌంట్ బడ్జెట్‌లో తగిన ప్రాధాన్యం లభించలేదు. దీంతో వృద్ధిపైతాజా బడ్జెట్ ప్రభావం చూపించే అవకాశం ఉంది. ఓట్ ఆన్ అకౌంట్ బడ్జెట్‌లో జలవనరులశాఖకు రూ.16,852.27 కోట్లను కేటాయించారు. వాస్తవానికి గత బడ్జెట్‌తో పోల్చితే 0.01 శాతం తక్కువ. మొత్తం కేటాయింపుల్లో రూ.1,263.08 కోట్లు రెవెన్యూ వ్యయంగా, రూ.15,589.19 కోట్లు మూలధన వ్యయంగా చూపించారు. మూలధన వ్యయాన్ని 2018-19 బడ్జెట్‌తో పోల్చితే స్వల్పంగా తగ్గించారు. 2015-16 వార్షిక బడ్జెట్‌తో పోల్చితే కేటాయింపులు నాలుగు రెట్లు పెరిగినా, పెండింగ్ బకాయిలకే ఈ మొత్తం సరిపోదనే వ్యాఖ్యలు ఉన్నాయి. అంకెల పరంగా చూస్తే, నాలుగేళ్లగా జల వనరులశాఖ బడ్జెట్ పెరుగుతూ వస్తుండగా, ఈ ఏడాది మాత్రం కేటాయింపులు పెరగక పోవటం గమనార్హం. దీంతో రాష్ట్రంలో పోలవరం బహుళార్థక సాధక ప్రాజెక్టు, గోదావరి - పెన్నా నదుల అనుసంధానం, అమరావతిలో వైకుంఠ పురం వద్ద రిజర్వాయర్ నిర్మాణం తదితర ప్రధాన ప్రాజెక్టు నిర్మాణాల పురోగతిపై అనిశ్చితి నెలకొంది. గోదావరి - పెన్నా నదుల అనుసంధానానికే రూ.83,796 కోట్లు అవసరమని ప్రభుత్వం అంచనా వేసింది. మొదటి దశలో పనులు చేపట్టేందుకే రూ.6,020 కోట్ల అవసరం ఉంది. అలాగే పోలవరం ప్రాజెక్టును ఈ ఏడాది జూన్‌నాటికి పూర్తి చేసి గ్రావిటీ ద్వారా సాగునీటిని సరఫరా చేసేందుకు కనీసం రూ.10 వేల కోట్ల రూపాయల అవసరం ఉంది. కానీ, బడ్జెట్‌లో కేటాయింపులు చూస్తే పోలవరం ప్రాజెక్టు ఈ ఏడాది కూడా పూర్తయ్యే సూచనలు కనిపించటంలేదు. మరోవైపు కేంద్ర ప్రభుత్వం కూడా పోలవరం ప్రాజెక్టుకు నిధులు కేటాయించలేదు. రాష్ట్రానికి జీవనాడిగా భావిస్తున్న పోలవరం ప్రాజెక్టు డ్యామ్ నిర్మాణాన్ని ఏప్రిల్‌నాటికి పూర్తి చేయాలని నిర్దేశించారు. అయితే, కేంద్రం నుంచి నిధులు రాకపోవటంతో పనులు నత్తనడకన సాగుతున్నాయి. పునరావాసం కల్పనకు కేంద్రం నుంచి నిధులు రావటంలేదు. ఎన్నికల బడ్జెట్‌లో పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖకు అత్యధికంగా రూ.35,182 కోట్లను కేటాయించారు. ఒకవైపున రైతుల కోసం అన్నదాత సుఖీభవ పథకాన్ని పెట్టి రూ.5 వేల కోట్లను కేటాయించారు. ఈ నేపథ్యంలో సాగునీటి రంగాన్ని సీఎం చంద్రబాబు నిర్లక్ష్యం చేశారనే వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి. గత ఏడాది రూ.16,978.23 కోట్లను కేటాయించగా, రూ.14,862 కోట్లను ఖర్చు చేసినట్లు లెక్కలు చూపించారు. తాజా బడ్జెట్‌లో గతంలో మాదిరిగానే నిధులు కేటాయించారు. రాష్ట్రంలో ఈ ఏడాది 12 ప్రధాన ప్రాజెక్టుల నిర్మాణాలను పూర్తి చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. అలాగే అమరావతిలో 10 టీఎంసీల నీటిని నిల్వ చేసేందుకు వైకుంఠపురం వద్ద కృష్ణానదిపై కొత్త బ్యారేజ్‌ని నిర్మించాలని ప్రతిపాదించింది. వీటన్నింటినీ పూర్తి చేసేందుకు ప్రస్తుతం కేటాయించిన నిధులేమీ సరిపోవని సాగునీటి రంగ నిపుణులు వ్యాఖ్యానిస్తున్నారు. మొత్తం 62 ప్రాజెక్టులను ప్రాధాన్యక్రమంలో పూర్తి చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. అందులో ఇప్పటి వరకు 19 ప్రారంభించగా, త్వరలో మరో నాలుగు ప్రాజెక్టులను ప్రారంభించనున్నట్లు రెండు రోజుల క్రితమే సీఎం చంద్రబాబే వెల్లడించారు. వీటికి ఇంకా రూ.400 కోట్లు అవసరమన్నారు. అత్తెసరు బడ్జెట్‌తో కీలక ప్రాజెక్టుల నిర్మాణం, సాగునీటి వనరులను మెరుగుపరచటం ప్రశ్నార్థ కంగా మారుతుందని పలువురు అభిప్రాయపడుతున్నారు. రాయలసీమలో హంద్రీ - నీవా సుజల స్రవంతి, గాలేరు - నగరి ప్రాజెక్టులతోపాటు వంశధార ప్రాజెక్టులను ఈ ఏడాది పూర్తి చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. ఇందుకు తగ్గట్టుగా నిధుల కేటాయింపు లేకపోవటంతో ప్రభుత్వ లక్ష్యం ఎప్పటికి నెరవేరుతుందో అర్థంకాని పరిస్థితి నెలకొంది.

జలవనరులశాఖ కేటాయింపులు

వార్షిక బడ్జెట్	కేటాయింపులు (రూ.కోట్లలో)
2014-15	3,210.49
2015-16	4,678.13
2016-17	7,978.80
2017-18	12,770.26
2018-19	16,978.23
2019-20	16,852.27

వ్యవ'సాయ'మిదేనా...!

రూ.12,732 కోట్లు కేటాయింపు - మొత్తం బడ్జెట్‌లో 6 శాతమే

విశాలాంధ్రబ్యూరో - అమరావతి: శాసన సభలో ఆర్థికశాఖ మంత్రి యనమల రామకృష్ణుడు మంగళవారం ప్రవేశపెట్టిన ఓట్ ఆన్ అకౌంట్ బడ్జెట్ 2019-20లో వ్యవసాయరంగానికి అరకొర నిధులే కేటాయించారు. ఈ ఏడాది వ్యవసాయ రంగానికి రూ.12,732 కోట్లను బడ్జెట్‌లో ప్రతిపాదించారు. మొత్తం బడ్జెట్ రూ.2.26 లక్షల కోట్లలో ఇది కేవలం ఆరు శాతమే. గతేడాది వ్యవసాయ రంగానికి 10.097 కోట్లను కేటాయించగా, రూ.14,585 కోట్లను ప్రభుత్వం ఖర్చు చేసింది. ఈ ఏడాది రూ.2,200 కోట్లనే పెంచడం వల్ల వ్యవసాయ రంగంపై ప్రభుత్వం శీతకన్ను వేసిందనే వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి. 25 శాతంపైగానే వృద్ధి రేటును సాధిస్తున్న వ్యవసాయ రంగానికి అత్యల్ప ప్రాధాన్యం ఇవ్వడంపై నిపుణులు పెదవి విరుస్తున్నారు. రాష్ట్రంలో 60 శాతం మంది ఈ రంగంపై ఆధారపడి జీవిస్తుండటంతో, వృద్ధి రేటులో ఈ రంగానిదే అగ్రభాగంగా ఉంటోంది. ఒకవైపున కోటి ఎకరాల్లో ఉద్యాన పంటలు వేయాలని ప్రభుత్వం లక్ష్యాన్ని నిర్దేశించినా, అందుకు తగ్గట్టుగా కూడా నిధుల కేటాయింపు లేకపోవటం గమనార్హం. అత్యంత కీలకమైన ధరల స్థిరీకరణనిధి కింద రూ.వెయ్యి కోట్లు కేటాయించింది. గతంలో ఐదువేల కోట్లరూపాయిలు కేటాయిస్తామని హామీ ఇచ్చి వెయ్యి కోట్లు కేటాయించడంపై రైతులు, రైతు సంఘాలు ఆగ్రహం వ్యక్తం చేస్తోన్నాయి. పంటలకు కనీస మద్దతు ధరలు లభించని తరుణంలో రైతులు దిక్కులేని పరిస్థితిలో తక్కువ ధరలకే ప్రైవేటు వ్యాపారులకు విక్రయిస్తున్నారు. దీనివలన పెద్దఎత్తున రైతాంగం నష్టపోతుంది. ధరలస్థిరీకరణ కింద నిధులు కేటాయించి, ప్రభుత్వ సంస్థల ద్వారా పంటలను కొనుగోలు చేస్తే రైతన్నకు మేలు జరుగుతోందని స్వామినాథన్ కమిషన్ సైతం సిఫార్సు చేసింది. అత్యంత కీలకమైన ధరల స్థిరీకరణకు కేవలం వెయ్యికోట్లరూపాయిలు కేటాయించడంతో రైతన్న డీలాపడ్డాడు. యాంత్రీకరణ పథకానికి ప్రభుత్వం రూ.300 కోట్లు కేటాయించింది. ఇది ఏ మాత్రం సరిపోదనే అభిప్రాయం వ్యక్తం అవుతోంది. రాష్ట్రంలో రైతులు అత్యాధునిక యంత్రాలను వినియోగించి తక్కువ పెట్టుబడి వ్యయంతో అధిక దిగుబడులు సాధించాలని ప్రభుత్వం ప్రకటిస్తూనే స్వల్పంగా నిధులు కేటాయించడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. వ్యవసాయ అనుబంధ రంగాల్లో కీలకమైన దానిలో ఒకటైన మత్స్యశాఖ అభివృద్ధికి కేవలం రూ.100 కోట్లు కేటాయించారు. ఈ నిధులతో మత్స్యశాఖ అభివృద్ధి ఎలా సాధ్యపడుతుందని మత్స్యకార సంఘాలు ప్రశ్నిస్తోన్నాయి. పశుగ్రాస అభివృద్ధికి రూ.200కోట్లు, పశువుల బీమాకు రూ.200 చొప్పున బడ్జెట్ కేటాయించారు. పశువులను సబ్సిడీపై రైతులకు పంపిణీ చేసేందుకు ఎలాంటి నిధులు కేటాయించలేదు. ఇలా అడుగడుగునా రైతన్న సంక్షేమానికి తూట్లు పొడిచారు. రాష్ట్రవిభజన తర్వాత కీలకమైన వ్యవసాయ విశ్వవిద్యాలయంహైదరాబాద్‌లోనే ఉండి పోయింది. రాష్ట్రంలోని వ్యవసాయ పరిశోధన విశ్వవిద్యాలయ అభివృద్ధికి ఆశించిన స్థాయిలో నిధులు కేటాయించలేదు. వ్యవసాయ నూతన పరిశోధనల ప్రక్రియ మరుగున పడే ఆస్కారం ఉందని శాస్త్రవేత్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

అడ్వాన్స్ అంచనా

రూ.65,869.23 కోట్లు

పీఆర్ అండ్ ఆర్‌డీకి రూ.11,750 కోట్లు

వ్యవసాయానికి రూ.4,179 కోట్లు - పాఠశాల విద్యకు రూ.7,579 కోట్లు



విశాలాంధ్ర సెంట్రల్ డెస్క్ - అమరావతి : ఈ ఏడాది మొదటి మూడు నెలలకు రూ.65,869.23 కోట్ల అవసరం ఉంటుందని ప్రభు త్వం అంచనా వేసింది. ఈ మేరకు ఆర్థికశాఖ మంత్రి యనమల రామ కృష్ణుడు మంగళవారం ప్రవేశ పెట్టిన ఓట్ ఆన్ అకౌంట్ (మధ్యంతర) బడ్జెట్‌లో ప్రతిపాదనలు చేశారు. 2019-20 వార్షిక బడ్జెట్ ఈ ఏడాది ఏప్రిల్ నుంచి ప్రారంభంకానుంది. 2018-19 ఆర్థిక సంవత్సరంలో పలు అభివృద్ధి, సంక్షేమ పథకాలను అమలు చేసేందుకు రూ.65,869.23 కోట్లను అడ్వాన్స్‌గా మంజూరు చేయాలని మంత్రి ప్రతిపాదించారు. పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధిశాఖకు 11.750 కోట్లను, వ్యవసాయశాఖకు రూ.4,179 కోట్లను, జలవనరుల శాఖకు రూ.5,600 కోట్లను అడ్వాన్స్‌గా విడుదల చేయాలని మంత్రి కోరారు. అలాగే ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ సంక్షేమంతోపాటు పౌర సరఫరాలు, ఇంధన, మౌలిక సదుపాయాల కల్పన, పెట్టుబడులకు కూడా ప్రత్యేకంగా నిధులను అడ్వాన్స్‌గా కేటాయించాలన్నారు. ఆర్థిక, ప్రణాళిక శాఖకు రూ.7,579 కోట్ల అవసరం ఉంటుందని బడ్జెట్‌లో అంచనా వేశారు. పాఠశాల విద్యకు 7,594.45 కోట్లు, ఉన్నత విద్యకు 919.98 కోట్లను, సాంకేతిక విద్యకు 290.10 కోట్లను, క్రీడలు, యువజన సర్వీసులశాఖకు రూ.505 కోట్ల అవసరం ఉంటుందని ఆర్థికశాఖ మంత్రి అంచనా వేశారు.

2019లో మొదటి మూడు నెలలకు కావాల్సిన బడ్జెట్

శాఖపేరు	కోరిన మొత్తం (రూ.కోట్లలో)
శాసనసభ, శాసనమండలి	48.23
గవర్నర్, మంత్రి మండలి	9.73
న్యాయపాలన	306.27
సాధారణ పరిపాలన, ఎన్నికలు	539.42
రెవెన్యూ, రిజిస్ట్రేషన్, సహాయం	1,693.77
ఎక్సైజ్	161.46
వాణిజ్య పన్నులు	138.41
రవాణా	73.54
ఆర్థిక, ప్రణాళిక, సర్వే, గణాంకశాఖ	7,579.86
హోంశాఖ	2,132.64
రోడ్లు, భవనాలు	1,891.21
పాఠశాల విద్య	7,594.45
ఉన్నత విద్య	919.98
సాంకేతిక విద్య	290.10
యువజన సర్వీసులు, క్రీడలు	505.01
వైద్య, ఆరోగ్యం	3,343.95
మున్సిపల్, పట్టణాభివృద్ధి	2,659.78
గృహనిర్మాణం	1,359.70
సమాచార, పౌరసంబంధాలు	111.99
కార్మిక, ఉపాధి కల్పన	408.58
సాంఘిక సంక్షేమం	1,517.28
గిరిజన సంక్షేమం	769.91
బీసీ సంక్షేమం	2,747.54
మైనార్టీ సంక్షేమం	436.24
మహిళ, శిశు, వికలాంగుల సంక్షేమం	1,136.21
మత ధర్మదాయ సంస్థలు	65.47
వ్యవసాయం	4,179.18
పశుసంవర్థక, మత్స్య పరిశ్రమ	677.19
అడవులు, సైన్స్, టెక్నాలజీ, నైపుణ్య, పరిసరాలు	163.97
సహకారం	77.64
పంచాయతీరాజ్	3,353.50
గ్రామీణాభివృద్ధి	8,397.11
భారీ, మధ్యతరహా నీటిపారుదల	5,049.52
చిన్నతరహా నీటిపారుదల	572.28
ఇంధనం, మౌలికసదుపాయాలు, పెట్టుబడులు	1,826.95
పరిశ్రమలు, వాణిజ్యం	1,371.64
పర్యాటక, కళలు, సంస్కృతి	155.90
పౌరసరఫరాలు	1,266.98
ఐటీ, ఎలక్ట్రానిక్స్, కమ్యూనికేషన్స్	335.60
ప్రభుత్వరంగ సంస్థలు	0.85
మొత్తం	**65,869.23**

గృహనిర్మాణానికి అరకొరే

కేటాయించింది రూ.4,079.11 కోట్లే

విశాలాంధ్ర సెంట్రల్ డెస్క్ - అమరావతి : రాష్ట్రంలో 2022 నాటికి అందరికీ ఇళ్లు నినాదం ఇస్తున్న ప్రభుత్వం పేదల ఇళ్ల నిర్మానానికి బడ్జెట్ కేటాయింపుల్లో ఆ దిశగా చర్యలు చేపట్టడం లేదు. ఈ ఏడాది నాలుగు లక్షల ఇళ్లు మంజూరు చేసిన ఇళ్లకు బడ్జెట్ కేటాయింపును అరకొరగానే పెంచింది. ఈ ఏడాది బడ్జెట్‌లో గృహనిర్మాణానికి ప్రభుత్వం రూ.4, 079.11 కోట్లు కేటాయించింది. ఓటాన్ అకౌంట్ ప్రకారం జూన్ వరకూ కేటాయించిన మొత్తం రూ.1,359.70 కోట్లు. గతేడాది ఈ మొత్తం రూ.3,679.53గా ఉంది. సవరించిన అంచనా రూ.3,810.87 కోట్లు, పెంపు కేవలం రూ.399,58 కోట్లు మాత్రమే. ఇప్పటి వరకూ 20.18 లక్షల ఇళ్లు మంజూరు చేయగా పూర్తి చేసింది. ఇందుకు రూ.34,632.48 కోట్లు ఖర్చవుతుందని గృహనిర్మాణ శాఖ అంచనా వేసింది. ఇప్పటి వరకూ 7,63,585 ఇళ్లను పూర్తి చేసిన లబ్ధిదారులకు రూ.11,236.72 కోట్లు చెల్లించింది. ఈ మొత్తంలో గృహనిర్మాణ శాఖ రూ.9,348.68 కోట్లు, ఉపాధి పథకం నుంచి రూ.1,888.64 కోట్లు ఉన్నాయి. ఇప్పటికీ పూర్తి చేయాల్సిన ఇళ్లు 12,54,805 ఉండగా వీటి నిర్మాణానికి రూ.23,395. 76 కోట్లు వ్యయం అవుతోందని అంచనా. ప్రభుత్వం కేటాయించిన బడ్జెట్ వ్యయం అవుతున్న మొత్తంలో కేవలం 17 శాతం మాత్రమే ఉంది.

అంకెలకే పరిమితం.. ఆచరణలో శూన్యం

- వైద్యరంగానికి మొక్కుబడిగా 18.53 శాతం పెంపు..
- విశాఖ కిడ్నీ రీసెర్చ్ సెంటర్ ప్రస్తావనే లేదు
- ఆరోగ్యశ్రీ బకాయిల చెల్లింపులో జాప్యం

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి :వైద్య ఆరోగ్యశాఖకు బడ్జెట్‌లో రూ.10,032.15 కోట్లు కేటాయించారు. 2018-19లో ఈ రంగానికి 8463.51కోట్లు వెచ్చించారు. గతం కంటే ఈ బడ్జెట్‌లో 18.53 శాతమే మొక్కుబడిగా పెంచి చేతులు దులుపుకుంది. ప్రజలకు ప్రధాన అవసరంగా ఉన్న వైద్యంపై ప్రభుత్వం ఆశించినంతగా పెంపుదల చేయలేదనే విమర్శలున్నాయి. మూత్రపిండాల వ్యాధులతో బాధపడుతున్న రోగులకు నాణ్యమైన సేవలు అందించాలనే లక్ష్యంతో 2016లో ప్రభుత్వం డయాలసిస్ కార్యక్రమంలో భాగంగా పీపీపీ పద్ధతిని ఏర్పాటు చేసింది. గతంలోని 14 డయాలసిస్ కేంద్రాలను 48కు పెంచారు. వీరి కోసం ఎన్టీఆర్ భరోసా పథకం కింద రూ.2,500 పింఛన్లు ఇవ్వాలని నిర్ణయించింది. విశాఖపట్నంలో కిడ్నీ రీసెర్చ్ సెంటర్‌పై ప్రస్తావనే లేదు. కేంద్ర ప్రభుత్వ సహకారంతో దాదాపు రూ.10 కోట్ల అంచనాలతో కిడ్నీ సెంటర్‌కు ప్రభుత్వం హామీ ఇచ్చింది. ఈ బడ్జెట్టులో దానిపై ప్రస్తావనే లేదు. అసలు కిడ్నీ వ్యాధులు ఎందుకు వస్తున్నాయనే దానిపై పరిశోధనలు పెట్టకుండా..డయాలసిస్ సెంటర్ల వల్ల ప్రయోజనమేమిటనే వాదనలు విన్పిస్తున్నాయి. ఎన్టీఆర్ వైద్యసేవ పథకం ద్వారా రూ.5,330 ఖర్చుతో 12లక్షల రోగులకు లబ్ధిచేకూర్చినట్లు ప్రభుత్వం వెల్లడించింది. ఈ పథకంలో ప్రతి కుటుంబానికి ఉన్న పరిధిని రూ.2.5 లక్షల నుంచి రూ.5 లక్షలకు పెంచింది. దీనికి ప్రస్తుతం రూ.వేయి కోట్ల కేటాయింపులున్నాయి. ఎన్టీఆర్ వైద్యసేవలు గత ఏడాది అక్టోబరు నుంచి రాష్ట్రంలో నిలిచిపోయాయి. దాదాపు రూ.500 కోట్ల బకాయిలను నెట్‌వర్కింగ్ ఆస్పత్రుల యాజమాన్యానికి చెల్లించాలి. ఈ బకాయిల చెల్లింపుపై ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించిందనే విమర్శలున్నాయి. ఆరోగ్యసంస్థల్లో సదుపాయాల అభివృద్ధి కోసం రూ.329 కోట్లను మందుల కొనుగోలుకు ప్రస్తుతమున్న రూ.300కోట్ల పద్దును రూ.402కోట్లకు పెంచారు. ఎన్టీఆర్ బేబీ కిట్ల కొనుగోళ్లలో పెద్దఎత్తున అవినీతి ఆరోపణలుండగా, రాబోయే రోజుల్లో ఎన్టీఆర్ బేబీ కిట్లను ఎలా నిర్వహిస్తారనేదీ ప్రశ్నార్థకంగా మారింది. వైద్యరంగంలో అడుగడుగునా అవినీతి నెలకొంది. ప్రభుత్వం ఆర్భాటంగా అంకెల గారడితో బడ్జెట్టులు కేటాయించి నప్పటికీ..వైద్యరంగాన్ని గాడిలో పెట్టలేదనే విమర్శలున్నాయి

సంపాదకీయం

ఎన్నికల బడ్జెట్

కాకిలెక్కలు, సర్కస్‌ఫీట్లు, తమ గొప్పలు చెప్పుకొనే గిమ్మిక్కులతో ఓటాన్ అకౌంట్ (మధ్యంతర) బడ్జెట్‌ను చంద్రబాబు ప్రభుత్వం ప్రవేశపెట్టింది. తమకు షరా మామూలుగా అలవాటైన జనాకర్షక క్రీడను నదురూ బెదురూ లేకుండా మరోసారి ప్రదర్శించింది. మూడు నాలుగు నెలల్లో ఎటూ కొత్త ప్రభుత్వం వస్తుంది.. దానికి మార్గనిర్దేశనం చేయడానికి ప్రయత్నిద్దామని కూడా ఈ ప్రభుత్వం అనుకోలేదు. మంగళవారం ఉదయం ఆర్థికమంత్రి యనమల రామకృష్ణుడు శాసన సభలో, పట్టణాభివృద్ధిశాఖ మంత్రి పి.నారాయణ మండలిలో బడ్జెట్ ప్రవేశపెట్టారు. ఆర్థిక మంత్రి ఈ బడ్జెట్ ప్రసంగంలో ముఖ్యమంత్రిని పొగడ్తలతో ముంచెత్తడం ద్వారా కొత్త సంప్రదాయానికి తెరదీశారు. అప్పులతోపాటు రాని ఆదాయ వనరులను చూపిస్తూ కాగితాలపై భారీగా కేటాయింపులు చేశారు. రెండు లక్షల 26వేల 177కోట్ల రూపాయలతో రాజ్యాంగ విరుద్ధంగా పూర్తిస్థాయి బడ్జెట్‌ను ప్రవేశపెడుతూ కీలక రంగాలకు కేటాయింపులను తగ్గించేశారు. నిరుటి బడ్జెట్‌తో పోలిస్తే రూ. 35వేల కోట్లకు పైగా ఎక్కువన్న మాటేగానీ అన్నిటికీ తిరుక్షవరం చేశారు. ఇది ఎన్నికల ప్రచారం కోసం ఉద్దేశించిందే తప్ప. ప్రజా సంక్షేమం, రాష్ట్రాభివృద్ధిని పట్టించుకున్నట్లు కనిపించలేదు. ఆదాయ వనరులు లేకపోయినా.. ఊహాజనిత గణాంకాలతో భారీగా బడ్జెట్ కేటాయింపులు చేసేద్దామనే రీతిలో సర్కారు వ్యవహరించింది. వాస్తవ ద్రవ్యోల్బణాన్ని పరిగణనలోకి తీసుకోకుండా.. విద్య, ఆరోగ్యం, సామాజిక రంగాలకు, మహిళా సంక్షేమానికి, స్కిల్ డెవలప్‌మెంట్‌కూ కోతలు పెట్టారు. గత ఏడాది బడ్జెట్‌తో పోల్చితే 18.38శాతం పెరిగినా విద్యకు నిరుడు కేటాయింపులు 12.79శాతం ఉంటే ఈసారి 11.48 శాతానికి తగ్గించారు. ఉన్నత విద్యకు కేటాయించిన మూడు వేలకోట్లు సిబ్బంది జీతభత్యాలకే సరిపోదు. సీపీఎస్‌పై గత శాసనసభ సమావేశాల్లో కమిటీ వేస్తామన్నారు. ఈ బడ్జెట్‌లో దాని ఊసే లేదు. ఉద్యోగులు డిమాండు చేస్తున్న ఐఆర్, పీఆర్‌సీల ప్రస్తావనలేదు. ప్రజారోగ్యంపైనా తీవ్ర నిర్లక్ష్యం ప్రదర్శించారు. రోజూ లక్షలాది మందికి లబ్ధి చేకూర్చే వైద్యఆరోగ్య పథకాలకు సర్కారు మొండిచెయ్యి చూపింది. వైద్యఆరోగ్య శాఖకు కేటాయించిన పదివేల కోట్లలో 70శాతం మొత్తం సిబ్బంది జీతాలకే పోతే, మిగిలిన 30శాతంతోనే పథకాల నిర్వహణ ఆధారపడి ఉంటుంది.

గ్రామీణాభివృద్ధికి గత బడ్జెట్‌లో 14.74శాతం కేటాయిస్తే, ఈసారి 14.28శాతంతో సరిపెట్టారు. జలవనరుల శాఖకు నిరుటి కంటే 0.74శాతం కేటాయింపులు తగ్గించారు. ఎన్నికల ముందు రైతులను మభ్య పెట్టేందుకు చంద్రబాబు మరో కొత్త పథకం 'అన్నదాత సుఖీభవ' తెరపైకి తెచ్చారు. దీనికోసం బడ్జెట్‌లో రూ. ఐదువేల కోట్లు కేటాయించారు. ఈ నిధులు ఎందుకు ఉపయోగిస్తారు, ఎలా ఖర్చు చేస్తారు, దేనికి అందజేస్తారనే స్పష్టత లేకుండా పోయింది. గత ఐదేళ్లుగా రుణమాఫీ అమలు చేయని చంద్రబాబు.. ఎన్నికల నేపథ్యంలో కొత్త హామీని ప్రకటించి మరోసారి మోసం చేసేందుకు సిద్ధమయ్యారు. ఎన్నికల ముందు అమలు చేసే అవకాశం లేకపోయినా రైతులను మభ్య పెట్టేందుకే బడ్జెట్‌లో కొత్త పథకాన్ని ప్రభుత్వం ప్రకటించింది. 2014లో టీడీపీ ప్రభుత్వం ఏర్పడ్డాక రైతుల రుణమాఫీని రూ. 87,612కోట్ల నుంచి రూ.24వేల కోట్లకు కుదించిన చంద్రబాబు సర్కారు.. అందులో ఇంకా రూ.8,300 కోట్లు ఇంకా చెల్లించాల్సి ఉంది. ఈ బడ్జెట్‌లో ఆ ఊసే లేకపోగా ఈ కొత్త పథకం పేరుతో అన్నదాతలను వంచించేందుకు సర్కారు పూనుకుంది. డ్వాక్రా సంఘాలకు రుణమాఫీ చేస్తానంటూ అధికారంలోకి వచ్చిన చంద్రబాబు ఈ బడ్జెట్‌లో కూడా వారి అన్యాయమే చేశారు. వడ్డీలేని రుణాల బకాయిలు రూ.2,350కోట్లు ఉండగా, బడ్జెట్‌లో కేవలం రూ.1100కోట్లు మాత్రమే కేటాయించి మమ అనిపించారు. ఎస్టీ, ఎస్సీ సబ్‌ప్లాన్‌ల కేటాయింపులోనూ సర్కారు అంకెల గారడీ చూపింది. ఈ బడ్జెట్‌లో ఎస్సీ సబ్ ప్లాన్‌కు 27.96శాతం పెంచి రూ.14,367కోట్లు, ఎస్టీ సబ్‌ప్లాన్‌కు 28.94శాతం పెంచి 5,385కోట్లు, బీసీ సబ్‌ప్లాన్‌కు 33శాతం రూ.16,226కోట్లు, మైనార్టీ సంక్షేమానికి 18.57 శాతం పెంచి రూ.1304కోట్లు కేటాయించారు. అయితే గడచిన నాలుగేళ్లలో ఎస్టీ, ఎస్సీ, బీసీ సబ్ ప్లాన్లకు కేటాయించిన నిధులు ఖర్చు చేసింది చాలా తక్కువేనని ఆర్థిక మంత్రే సభకు వెల్లడించారు. కాబట్టి ఈ కేటాయింపులు పెంపు ఆయా వర్గాలను మభ్యపెట్టేందుకే తప్ప, వారి సంక్షేమానికి కాదనేది స్పష్టమవుతోంది.. ప్రతీ కులానికి కార్పొరేషన్ అంటూ ప్రకటించారే తప్ప ఆయా కార్పొరేషన్ల మూలనిధికి బడ్జెట్‌లో కేటాయింపులు లేవు. ఇంటికో ఉద్యోగం– ఉపాధి కల్పిస్తామనీ, ఇవ్వలేకపోతే నెలకు రూ.2000 చొప్పున నిరుద్యోగ భృతి ఇస్తామని ఎన్నికల్లో వాగ్దానం చేసిన బాబు నాలుగేళ్లుగా వంచిస్తూనే ఉన్నారు. రెండేళ్లపాటు బడ్జెట్‌లో నిధులే కేటాయించలేదు. మూడో బడ్జెట్‌లో రూ.500 కోట్లు కేటాయించి ఒక్క రూపాయి ఇవ్వలేదు. నాలుగో బడ్జెట్‌లో రూ.వెయ్యి కోట్లు కేటాయించి కేవలం రూ.116కోట్లు మాత్రమే ఖర్చుచేశారు. ఈ బడ్జెట్‌లో కొత్తగా ప్రవేశపెట్టిన ఆరు పథకాల్లో నిరుద్యోగభృతి పథకం ఒకటి. దీనికి రూ.1200కోట్లు ప్రకటించారు. 2016లో ప్రభుత్వం నిర్వహించిన పల్స్‌సర్వేలో పదో తరగతి నుంచి పీజీ వరకు చదివిన ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాలకు చెందిన నిరుద్యోగులు దాదాపు 34లక్షల మంది ఉన్నట్లు లెక్క వేశారు. కాబట్టి ఈ మొత్తం ఏ మూలకు వస్తుంది. దీన్ని ఎలా కేటాయిస్తారు? చంద్రబాబు అధికారం లోకి రాగానే పేదలందరికీ 12 లక్షల ఇళ్లు కట్టిస్తామని హామీ ఇచ్చారు. ఇంతవరకూ అరకొరగానే నిర్మాణాలు జరిగాయి. 2014–15నుంచి 2018– 19వరకూ కేవలం ఎనిమిది వేల కోట్లు మాత్రమే కేటాయించింది. ఆ మొత్తాన్ని పూర్తిగా ఖర్చుచేయలేదు. ఈసారి రూ.4,099కోట్లు కేటాయించడం ద్వారా ఆ లక్ష్యాన్ని ఎలా చేరుకోగలుతుంది. ప్రస్తుతం నిర్మాణంలో ఉన్న ఇళ్లలో కొన్నయినా పూర్తికావాలంటే కనీసం రూ.15వేల కోట్లు కావాల్సి ఉంటుందని ఆ శాఖకు చెందిన వారే చెబుతున్నారు. ఒకపక్క పేదలకు లక్షల సంఖ్యలో ఇళ్లు మంజూరు చేస్తూ.. క్రియకొచ్చేసరికి ఇంత తక్కువ మొత్తం కేటాయించడమంటే ఆ వర్గాలను మోసగించడం తప్ప మరేమీ కాదు. వివిధ వర్గాలను ఆకట్టుకునేందుకు, వారి ఓట్లను రాబట్టేందుకు చక్కగా తీర్చిదిద్దిన ఈ బడ్జెట్‌లో కేటాయింపులైతే చేశారే గానీ వాటిని ఈ రెండుమూడు నెలల్లో ఖర్చుపెట్టడం అసాధ్యం. ఈ విషయం తెలిసే, ఎటూ ఖర్చుపెట్టని కేటాయింపులు ఎంత మేరకు చేసినా ఇబ్బంది లేదంటూ భారీ అంకెల విన్యాసంగా ఈ బడ్జెట్‌ను రూపొందించి చంద్రబాబు తన లౌక్యాన్ని ప్రదర్శించారు. కానీ ప్రజలు ఎప్పుడూ మోసపోరనే వాస్తవాన్ని ఆయన విస్మరించారు. ప్రజలు తెలివైన వారు. వంచనను ఇట్టే పసిగడతారు. తగిన బుద్ధి చెబుతారు.

చురక

రాజ్యాంగ సంస్థల్లో
రాజకీయ నీడలు
కేంద్రానికి వెన్నుదన్ను
కట్టుతున్న గోడలు

కమలదళం సర్కారు
కక్షపూరిత దాడులు
విపక్షాల్లో రగిలెను
ప్రజాస్వామ్య జ్వాలలు

- వేల్పుల నారాయణ

వెనిజులాలో యుద్ధ వాతావరణం

అంతర్జాతీయం



బుడ్డిగ జమిందార్

వెనిజులా దేశ పరిస్థితులు తీవ్ర ఉత్కంఠంగా మారుతున్నాయి. సామ్రాజ్యవాద విషసర్పానికి వెనిజులా దేశంలోని ముడి చమురుపై కళ్లు పడ్డాయి. దేశ సార్వభౌమాధికారాన్ని, స్వావలంబనసూ కాపాడుకొంటున్న మదురో ప్రభుత్వాన్ని కాటువేయటానికి అమెరికా విషసర్పం సిద్ధంగా ఉంది. ఫిబ్రవరి 3న ప్రభుత్వ అనుకూల ప్రదర్శన ఒకవైపు, వ్యతిరేక అమెరికా దన్నుతో తనుకుతానే అధ్యక్షునిగా చెప్పుకొన్న గుయ్‌డొ అనుకూలుర ప్రదర్శన మరొకవైపు జరిగాయి. ఎవరికివారు తగ్గటం లేదు. ఇరుపక్షాల మధ్య చర్చలు జరగటం లేదు. తాము విధించిన గడువు (ఫిబ్రవరి 2)లోపు నూతన ఎన్నికలు జరపలేదు గనుక 'మిలిటరీ చొరబాటు ప్రయత్నాలను తోసివేయలేమని' ట్రంప్ పేర్కొన్నారు. ఉపాధ్యక్షుడు మైక్‌పెన్స్, జాతీయ భద్రతా సలహాదారుడు జాన్ బోల్టన్‌లు చెరొకవైపు నుండి వెనిజులా ప్రభుత్వంపై మాటలదాడిని ముమ్మ రం చేశారు. మియామీలో పెన్స్ మాట్లాడుతూ 'ప్రస్తు తం ఇక చర్చలకు తావేలేదు; కార్యాచరణకు సమ యం ఆసన్నమైనది, మదురొను అంతం చేయటానికి అన్ని రంగాలు సిద్ధమైనాయి' అంటూ అవసరమైతే ఆయనను హత్య చేస్తామని, రొమేనియాలో నికోలాయ్ చౌచెస్కీకి పట్టిన గతే పడుతుందని' అన్నాడు. ఇరాక్‌లో యుద్ధానికి, సద్దాం హుస్సేన్ హత్యకు పన్నాగం చేసిన బోల్టన్‌ను అదే తరహాలో మదురొ ఎప్పుడు అంతమొందించుదామా అని తహతహ లాడుతున్నాడు. కానీ ఇప్పటికీ, వీరిద్దరికీ అర్థంకానిది 'ఒకనాడు సకల సదుపాయాలతో జీవించిన ఇరాక్, లిబియా ప్రజలు నేడు యుద్ధానంతరం అంతర్యు ద్ధాలలో చిక్కుకొని శరణార్థులుగా మారారనే విషయం'. ఇవేమీ వారికి పట్టవు. సామ్రాజ్యవాదానికి నేడు తక్షణం కావాల్సింది ప్రపంచంలోని ముడి చమురు నిల్వలలో 24శాతం పైబడి ఒక్క వెనిజులా దేశంలో ఉన్న సంపద మాత్రమే. రాజీనామా చేస్తే చక్కగా బీచ్‌ల దగ్గర విలాసవంతంగా తన శేష జీవితాన్ని మదురొ గడుపుకోవచ్చును లేకుంటే గ్వాటెనామో దీవిలోని బీచ్ ఒడ్డున ఉన్న ప్రత్యేక జైల్లో తను ఊసలను లెక్కపెట్టుకొంటాడు' అని పెన్స్ పొగరుమోతుగా మాట్లాడాడు.

తాత్కాలిక అధ్యక్షునిగా తనుకుతాను ప్రకటించుకొంటున్న గుయ్‌డొ మాత్రం అమెరికాతోనూ, ఈయూ దేశాలతోనూ సంబంధాలను కల్గి ఉండి, అమెరికా నుండి మూడు ప్రాంతాలకు సహాయం (ఎయిడ్) రానున్నదని చెప్పాడు. దేశంలో 3 సరిహద్దు ప్రాంతాలలో ఒకటి కొలంబియా సరిహద్దు, రెండవది బ్రెజిల్ సరిహద్దు, మూడవది కరేబియన్. ఈ ప్రాంతాల్లో సహాయ కేంద్రాలు ఏర్పడనున్నాయి. వాస్తవానికి పైకి ఆహారం, దుస్తులు, మందులు సరఫరాకు నిర్దేశించినట్లుగా చెప్పి వీటితోపాటు ఆయుధాల్ని, డాలర్లను



పంపనున్నట్లు సమాచార పత్రికల ద్వారా తెలుస్తున్నది. బోల్టన్ ఇప్పటికే 5వేలమంది అమెరికా సైనికుల్ని కొలంబో సరిహద్దుకు వెళ్ళవల్సినదిగా ఆదేశించాడు. ఇప్పటికే జెనరల్ ఫ్రాన్సిస్కో యానిజ్ ఎయిర్‌ఫోర్సును వదిలి తనతో కల్సివచ్చి తనకు మిలిటరీ అండదండలిస్తే మదురొను పదవీచ్యుతుణ్ణి చేస్తానని జనవరి 23న ప్రకటించాడు. నవంబరు 2018 సంవత్సరంలో క్యూబా, నికరా గువా, వెనిజులా దేశాల్ని క్రూరమైన దుష్టత్రయ దేశాలుగా బోల్టన్ వర్ణించటం ద్వారా లాటిన్ అమెరికాలో తనకు వ్యతిరేకంగా ఎవరూ ఉండ కూడదని పరోక్షంగా చెప్పకనే చెప్పాడు. ముఖ్యంగా చైనా, రష్యాల వాణిజ్యం ఈ ప్రాంతంలో దినదినా భివృద్ధి చెందుతుంది. కనుక ఈ ఇరుదేశాల వాణిజ్య సంబంధాలను బలహీనపర్చటం ద్వారా దక్షిణ అమెరికా ఖండంలో అమెరికా ఆధిపత్యానికి తిరుగుం దదనే వ్యూహాన్ని అనుసరిస్తున్నట్లు సోషలిస్టు వెబ్‌సైట్ ఆన్‌లైన్ పత్రిక రాసింది. "2018 సంవత్సరంలో అమెరికా యుద్ధ కాలేజి' లాటిన్ అమెరికాలో యు.ఎస్. రక్షణ' అనే పుస్తకం విడుదల చేసింది. దీనిలో 1970/80 దశకాల్లో లాటిన్ అమెరికాలో నియంతల రాజ్యాలు కూలిపోయాయని, వామపక్ష ప్రజాస్వామ్య ప్రభుత్వాలు అధికారంలోకి వచ్చిన తర్వాత అమెరికా బాధ్యత అనేది ప్రశ్నార్థకంగా మారింది. బాహ్యశక్తులు (రష్యా, చైనా) అమెరికా విధానాలను లాటిన్ అమెరికాలో ఎదురిస్తున్నాయి. ఇది మన భద్రతకే ముప్పు" అని అమెరికా పేర్కొన్నట్లు సోషలిస్టు వెబ్‌సైట్ తెలియపరుస్తున్నది. జనసాంద్రత కల్గి ఉన్న పట్టణాలలో అమెరికా ఆయుధాలను ప్రయోగించటానికి వెనిజులా దేశం ఒక ప్రయోగ శాలగా ఉంటుంది, గనుక సైనికదాడికి అమెరికా సిద్ధమౌతున్నట్లు ఈ ఆన్‌లైన్ పత్రిక రాసింది.

ఫ్రాన్సిస్కో టోరో అనే వాషింగ్టన్ పోస్టు కాలమిస్టు ఒక వ్యాసం రాస్తూ, "వెనిజులాలో అమెరికా మిలిటరీ ప్రవేశం జరిగితే ఆగ్నేయం నుండి బ్రెజిల్, నైరుతి నుండి కొలంబియాలు రంగ ప్రవేశం చేస్తాయని మనం సులభంగా ఊహించుకోవచ్చును. రష్యా తన చమురు వాణిజ్యాన్ని కాపాడుకోటానికి ప్రయ త్నిస్తుంది. చైనాకూడా తనవంతుపని తను చేయొచ్చు. క్యూబా ఇప్పటికే మిలిటరీ ఎత్తుగడలు చేస్తున్నది'' అని రాసాడు. మదురొ ఇప్పుడు 3 అంచనాల ప్రణాళికలున్నాయని సోషలిస్టు వెబ్‌సైట్ రాస్తూ, మితవాద ప్రతిపక్షాలతో చర్చలు జరుపుతూ అమెరికా సామ్రాజ్యవాదాన్ని ఎదురించటం, రెండవది వియత్నాం తరహాగా అమెరికాను దేశ ప్రజలతోనూ, సాయుధ పోరాటంతోనూ, మిలిటరీపరంగా ఎదుర్కొనటం, మూడవది ప్రతిపక్షాల్ని అణచివేయటం'' అని రాసింది.

ఫిబ్రవరి 5 నుండి 10 వరకూ దేశంలో 5రోజుల పాటు పెద్దఎత్తున మిలిటరీ కవాతులకు మదురొ ప్రణాళికలను రచించారు. సివిల్ రిజర్వు ఆర్మీని కూడా వెనుజులా ప్రభుత్వం తయారు చేసుకొంటూ యుద్ధ రంగానికి సన్నద్ధమవుతుంది. ఏది ఏమైనప్ప టికీ వెనుజులా పరిస్థితులను విశ్లేషించుకొంటే సంక్లిష్టంగానే ఉన్నది. అమెరికాకు కేక్‌వాక్ కాకపోవచ్చును. గట్టి మిలిటరీ ప్రతిఘటనకు, మదురొ అనుకూలురుల్లో అంతర్యుద్ధానికి దారితీసే పరిస్థితులే ఎక్కువగా కనబడుతున్నాయి.

వ్యాస రచయిత : ఆల్ ఇండియా ప్రోగ్రెసివ్ ఫోరం జాతీయ కార్యవర్గ సభ్యులు.
సెల్ : 9849491969

సూడు పిన్నమ్మా!?



బాబుగారు మారిపోయారు.. ఒకప్పు డెప్పుడో, అంగన్‌వాడీ అమ్మల గుండెల మీద గుర్రాలతో తన్నించిన బాబు కాదు.. బాగా మారిపోయారు! ఆశా వర్కర్లని పోలీస్ వాన్‌ల మీదకి విసిరేయించి, మగ పోలీసులతో గిచ్చి, ఈడ్చి పారేయించిన బాబు కాదు! మారిపోయారు.. ఎక్కడ స్త్రీలు పూజింపబడతారో, అక్కడ దేవతలు ఆనందనాట్యం చేస్తారని గ్రహించి, గతంలో మాదిరిగా స్త్రీలకు బడితె పూజలు మానుకున్నారు. 'మానూ, మాకును కాను.. మామూలు మనిషినే నేను" అని పశ్చాత్తాప పడినట్టున్నారు. డ్వాక్రా మహిళను గౌరవిస్తే, సర్వరంగాల స్త్రీ రత్నాలని గౌరవించి నట్టుగానే భావిస్తున్నారు. అగ్రిగోల్డ్ బాధిత స్త్రీ ఏజెంట్లూ, కస్టమర్లూ ఉరేసుకునో.. పురుముందు తాగో.. గుండె పోటుతోనో... చనిపోతే, బాబుగారు పట్టించుకోలేదనుకున్నాం! కనికరం లేని మనిషనుకున్నాం! చైతన్యలోనో.. నారాయణ లోనో.. ఏపీ హాస్టల్లలోనో.. ఏవో కారణాల వలనో.. ఆడపిల్లలు చనిపోతే, బాబుగారు ఒక ముఖ్యమంత్రిగా పట్టించుకోలేదనుకున్నాం! కౌలు రైతుల్లో మహిళా రైతులు చనిపోయి నప్పుడూ, అలాగే అనుకున్నాం! గోదావరి పుష్క రాల్లో ఆయన మునిగీ, తేలిపోతే, చాలామంది భక్తురాళ్లు.. మునిగిపోయినప్పుడూ, భక్తి పారవశ్యంతో తొక్కిసలాడుకొని, కన్నుమూసినప్పుడూ, బాబు పబ్లిసిటీ పుణ్యమేనని నిష్టూరమాడాం! లేదు.. లేదు.. బాబుగారు మారిపోయారు. స్త్రీలపట్ల అపారమైన ప్రేమాభిమానాలు కురిపించడం, ఆయనలోని మహిళా పక్షపాతానికి నిదర్శనం. ఆ పక్షపాతం, అనేక సభల్లో జలపాతమై పొంగి, పొరలుతోంది. నిజానికి, చింతమనేని వంటి దుష్టులవల్ల ఆయనకి చెడ్డపేరొచ్చింది. అసెంబ్లీలో రోజాను 'ఆంటీ' అన్న 'బోండా'లాంటి వాళ్లవల్ల ప్రతిష్ట మసకబారింది. అత్తకాని అత్త లక్ష్మీపార్వతమ్మ మెలకువగా ఉన్నప్పుడల్లా, అల్లుడు కాని అల్లుడి మీద నిందవేస్తూ, రాగాలు తీస్తుందిగానీ, బాబు మంచి బాలుడు! జగనన్న పాదాల దగ్గర కూర్చొని, కళ్లు తుడుచుకొంటున్న అమ్మలక్కలంతా గమనించాలి. డ్వాక్రా మహిళలను ఆయన గౌరవిస్తున్న తీరు, తెన్నులు!

గతమెవరికైనా గుర్తుంటే, ఒక్కసారి గుర్తు చేసుకోవాలి. డ్వాక్రా మహిళలకి సెల్‌ఫోన్లు ఇస్తామన్నాడు. తీగలు లేని ఫోన్లు, మహిళల చేతుల్లో వీణల్లా పనిచేయాలని, వీనుల విందులు చేయాలని, ఒక పదిహేనేళ్ల క్రితమే కలలుగన్నాడు. కలలు కనడం, కలలు కనగనేలా జనాన్ని ఉత్సాహపర్చడం ఆయనకెంతో ఇష్టం. కునుకుతీస్తూ, కలలుగనే దేవగౌడని ప్రధాని చేసిందీ, కలలు కనాలని పిలుపునిచ్చిన 'కలాం'ను రాష్ట్రపతిని చేసిందీ, ఆయనే గదా! అసలు మన 'ఓల్డ్' ఆంధ్ర ప్రదేశ్ శాసన సభా'పతి'గా, ఒక దళిత మహిళని నియమించెందవరు!? బాబుగారే గదా! అవునా.. కాదా.. ఆయనా.. కాదా.. ప్రధాన ప్రతిపక్ష నేత దశలవారీ పాదయాత్రలో గమ్మత్తుగా అడగడం కాదు! అసలు, ఆయన మహిళల అభిమానాన్ని చూరగొన్నారా! దారి పొడవునా చెంపలు నిమరడం.. నుదుళ్లపై ముద్దుల ముద్రవేయడం కాదు! మహిళలంటే నిజంగా, బాబుకెంత మమకారం? ఏమంటే, రేణుకమ్మని ఫిరాయింపుల 'బుట్ట'లో వేశాడం టారా! రంపచోడవరం ఈశ్వరమ్మనీ, పాడేరు ఈశ్వరమ్మనీ 'ఆకర్షి'ంచాడంటారు! తల నరుకుతానన్న ఈశ్వరమ్మ, తలవంచి ఆయనతో పసుపూ, కుంకుమ అందుకుందంటే.. ఆయనలోగల మహిళా మమకారానికి గల శక్తి ఎటువంటిదో.. ఎవరైనా గ్రహించాలి! ఏ మాత్రం కష్టపడనీయకుండా, అతడో గొప్ప భర్త.. గొప్ప తండ్రి..అంతే కాదు గొప్ప తాతకూడా! లేకపోతే, బుడి, బుడి అడుగుల మనవడి పేరుతో అన్ని ఆస్తులెలా వస్తాయి? పిల్లగాడి పేరుతో ఓ కాలనీ కట్టారంటే, ఆ వెనక.. ఆ 'తాత' బాబు కృషి ఎంత? ఇవన్నీ ఎవరూ ఆలోచించరు! విమర్శించడమే ప్రధాన వ్యాపకం, చాలామందికి!

ఇప్పుడు, బాబుగారి పసిహృదయం, శిశుహృదయం గురించి ప్రధానంగా చెప్పవలసింది.. స్త్రీలపట్ల భక్తి! డ్వాక్రా మహిళలకి స్మార్ట్ ఫోన్‌లు, పోస్ట్ డేటెడ్ చెక్కుల పంపిణీ ద్వారా ప్రదర్శిస్తున్న అపారమైన ప్రేమాభిమానాల గురించి! రుణాల మాఫీ అని నమ్మించి, అధికారానికి వచ్చి ఆ తరువాత తెప్ప తగలేశాడంటారు కొంతమంది అప్పులు! మీటిం గులకి తీసుకొచ్చి, భోజనం పొట్లాలు ఇచ్చి, చప్పట్లు కొట్టించుకున్నాడంటారు! మీటింగులకి రాకపోతే, బాబు మాటా, మనసూ ఎవరికి తెలుస్తాది? ఇవాళ, చెక్కులిస్తామంటే, వచ్చి, చప్పట్లు కొట్టేస్తున్నారు! కానీ, బాబు మారాడూ.. మనసు మారిందీ.. అనీ ఎవరైనా గుర్తిస్తున్నారా? ఏమంటే, .. ఎలక్షన్లు ముందు బాబు మారిపోయానంటాడూ.. అంటారు! మనిషి అన్న వాళ్లెవరైనా, ఎప్పుడో ఒకప్పుడు మారాలి గదా! 'నమ్మరే! మారానంటే!" అని పాతపాటలు పాడాలా! ఆయన మారినట్టు కన్పి స్తుంటే, మన స్త్రీ, మహిళా, బాలిక తరగతులకు ఎందుకు అర్థం కాదో! పోనీ, ఓట్లు లేని వాళ్లు అమాయకపక్షులు! వాళ్లని వదిలేద్దాం.. డ్వాక్రా మహిళా శక్తులూ, ఫించన్లు పుచ్చుకుంటున్న ముసలీ, ముతకమ్మలైనా.. అర్థం చేసుకోవాలి గదా! చిల్లరకొట్టు చిట్టెమ్మలా.. ఎందుకమ్మా! నిందలేస్తారూ! అసలు, డ్వాక్రా గ్రూపుల పేరుతో ఎంతమంది వ్యాపారాలు చేస్తున్నారమ్మా! బాబుగారు ఎన్నో అవకాశాలిచ్చారు.. బెల్టు షాపులు కూడా.. ఏర్పాటు చేసుకోవడానికి సీక్రేట్‌గా ఏర్పాట్లు చేశారు. ఇసుకా.. అమ్ముకో మన్నారు.. అందుకు తగిన 'శక్తి' లేక, ఉపయోగించుకోలేకపోయాం.. ఆ తర్వాత.. ఈ మగజాతి.. చేతికి తాళాలు ఇవ్వక తప్పలేదు! బాబుగారైతే.. మంచి మనసున్నోడు... ఆడవాళ్ల పట్ల చాలా గౌరవం.. అప్పుడెప్పుడో.. అంగన్ వాడీలను తన్నించాడూ.. ఆశావాళ్లని జైల్లో పెట్టించాడు.. అని.. పాత దెబ్బలని తల్చు కోవడం ఎందుకు? ఇప్పుడెలా ఉన్నాడు! ఎలా మారాడు? ఇది.. ఇదే .. కావాల.. ఇంకా, 'పొదుపిల్లాడు' అంటే ఎలాగా!?

వి-మెయిల్

నుమాయిష్ ఘటనకు బాధ్యులెవరు?

చారిత్రక రాజధాని హైదరాబాద్ అనగానే ప్రతి ఒక్కరి మదిలో కదలాడే నుమాయిష్. వివిధ రాష్ట్రాల నుండి, జిల్లాల నుండి, విదేశాల నుండి రాజధాని కేంద్రానికి వచ్చేవారు తప్పకుండా నుమాయిష్‌ను సందర్శిస్తుంటారు. అలాంటి నుమాయిష్ బుధవారం రాత్రిలో మంటలలో చిక్కుకుని సుమారు 500 పైగా దుకాణాలు దగ్ధంకావడం, సుమారు రూ.700 కోట్లకు పైగా ఆస్తినష్టం జరగడం అందరినీ విషాదంలో నింపింది. గురువారం సాయంత్రం వరకు కూడా మంటలు అదుపులోకి రాలేదంటే ప్రమాద తీవ్రత ఎంతగా వుందో అర్థమవుతుంది. సంఘటన జరిగే సమయంలో సుమారు 50,000 కు పైగా సందర్శకులున్నా ప్రాణనష్టం జరగకపోవడం అదృష్టంగా భావించవచ్చు. ముఖ్యంగా పోలీసు సిబ్బంది, అగ్నిమాపక శాఖ విపత్తు నివారణ బృందం అప్రమత్తమై సందర్శకులను కాపాడి తమ మానవత్వాన్ని నిరూపించుకున్నారు. చిరు వ్యాపారులను ఆదుకోవడం కోసం నిజాం పాలకుడు 79 సంవత్సరాల క్రితం నుమాయిష్‌ను ప్రారంభించారు. ప్రతి సంవత్సరం నలభై ఐదు రోజులపాటు నుమాయిష్‌ను నిర్వహించడం, లక్షలాది మంది ఈశాన్య రాష్ట్రాల నుండి కాక దేశం నలుమూలల నుండి చిరువ్యాపారులు రావడం, వారి-వారి సంస్కృతి సంప్రదాయాలకు అనుగుణంగా స్టాల్స్ ఏర్పాటు చేయడం ఆనవాయితీగా వస్తున్నది. ఎగ్జిబిషన్ నిర్వహణకు ప్రత్యేకంగా ఒక సొసైటీ ఏర్పాటు చేసుకున్నారు. ప్రమాదాలు జరిగే సందర్భంలో ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో అనే విషయంలో విఫలమైనారు. గతంలో అనేక రాష్ట్రాలలో ఇలాంటి సంఘటనలు జరిగి వందలాది మంది అగ్నికి ఆహుతులైన సంఘటనలు వున్నాయి. ముఖ్యంగా విద్యుత్ వైర్ల వల్లనే ప్రమాదం జరిగినట్టు ప్రాథమికంగా తెలుస్తోంది. వేలాది మంది కుటుంబాలు నుమాయిష్‌పై ఆధారపడి జీవిస్తున్నారు. ప్రమాదం జరగడంతో వారు తీవ్రంగా నష్టపోయారు. సుమారు మూడు వేల స్టాళ్లకే అనుమతి వున్నా, అక్రమంగా మరో రెండు వేల స్టాళ్లు నడుస్తున్నాయని తెలుస్తోంది. నిబంధనలకు విరుద్ధంగా బినామీలకు సొసైటీ సభ్యులే ఇచ్చేశారని ఆరోపణలు వస్తున్నాయి. అగ్ని ప్రమాదంలో నష్టపోయిన చిరు వ్యాపారుల కుటుంబాలను ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకోవాలి. భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు జరగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలి.

– కామిడి సతీష్ రెడ్డి, జయశంకర్ భూపాలపల్లి జిల్లా

వెనుకబడిన ప్రాంతాలకు మోడీ మొండిచెయ్యి

కొణతాల రామకృష్ణ

రాష్ట్ర విభజన సమయంలో ప్రత్యేక ఆందోళన కలిగించిన అంశం దశాబ్దాలుగా ఉమ్మడి రాష్ట్ర పాలకుల నిర్లక్ష్యానికి గురవుతున్న వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి. ఈ విషయమై నాటి యూపీఏ ప్రభుత్వం విభజన బిల్లులో వెనుకబడిన ప్రాం తాల అభివృద్ధికి సంబంధించి నిర్దుష్టమైన అంశాలను చేర్చింది. ఆ తర్వాత ప్రధానమంత్రి మన్మోహన్ సింగ్ 2014 ఫిబ్రవరి 14న పార్లమెంట్‌లో చేసిన ప్రకటనలో సహితం ఈ అంశంపై స్పష్టమైన హామీ ఇచ్చారు.

ప్రధాని ప్రకటనలోని మూడవ అంశం "ఆంధ్రప్రదేశ్‌లోని వెనుకబడిన ప్రాంతాలు ముఖ్యంగా రాయలసీమ, ఉత్తర కోస్తా ఆంధ్ర ప్రదేశ్ జిల్లాలకు బిల్లులో ఇప్పటికే ప్రత్యేక అభివ ృద్ధి ప్యాకేజి ఉంది. ఈ అభివ ృద్ధి ప్యాకేజి ఓడిశాలోని కె-బి-కె (కోరాపుట్-బలంగీర్-కలహండి) స్పెషల్ ప్యాకేజి, మధ్యప్రదేశ్, ఉత్తర ప్రదేశ్ లలోని బందెలఖండ్ స్పెషల్ ప్యాకేజి తరహాలో ఉంటుంది" అని తెలిపారు. ఎన్నికల ప్రచారం సందర్భంగా రాష్ట్రానికి వచ్చిన నేటి ప్రధాని నరేంద్ర మోడీ సహితం బందేలఖండ్ తరహా ప్యాకేజి ఇస్తామని వాగ్దానం చేసారు. పదేళ్ల కాలంలో మిగిలిన జిల్లాల స్థాయికి ఈ జిల్లాలను అభివృద్ధి చేయడం ప్రధాన లక్ష్యం. ఈ విషయంలో తన చట్టబద్ధ బాధ్యతను, ప్రధానమంత్రి స్వయంగా పార్లమెంట్‌లో ఇచ్చిన హామీని నరేంద్ర మోడీ ప్రభుత్వం గాలికి వదిలివేసి చాలా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నట్లు స్పష్టం అవుతుంది.

ఏపీలో మూడు భిన్నమైన ప్రాంతాలున్నాయి. ఉత్తర కోస్తా, దక్షిణ కోస్తా, రాయలసీమ. వీటి ఆర్థిక వ ృద్ధిలో తీవ్రమైన అంత రాలున్నాయి. ఏడు జిల్లాలు కలిగిన ఉత్తర కోస్తా, రాయలసీమ లను రాష్ట్రంలో వెనుకబడిన ప్రాంతాలుగా పరిగణిస్తున్నారు. మొత్తం 13 జిల్లాల్లో ఏడు జిల్లాలు అంటే రాష్ట్రంలో సగంకన్నా ఎక్కువ ప్రాంతమని గమనించాలి.

గత నాలుగున్నరేళ్లలో ఈ ప్రాంతాల అభివృద్ధికి కేంద్రంలోని మోదీ ప్రభుత్వం చేసింది శూన్యమనే చెప్పాలి. జిల్లాకు సంవత్సరానికి రూ 50 కోట్లు చొప్పున మూడు సంవత్సరాలు మొత్తం రూ.1,050 కోట్లను ఇచ్చారు. నాలుగో సంవత్సరం ఇవ్వనే లేదు. మిగిలిన రెండేళ్ళకు రూ 700 కోట్లు ఇవ్వవలసి ఉంది. గత ఏడాది రూ 350 కోట్లు విడుదల చేసి, తిరిగి బ్యాంకు నుండి వెనుకకు తీసేసుకున్నారు. బహుశా భారత దేశంలో గతంలో ఏనాడూ ఒక రాష్ట్ర ప్రభుత్వ బ్యాంకు ఖాతాలో జమచేసి మొత్తాన్ని ఆ ప్రభుత్వ అనుమతి లేకుండా వెనుకకు తీసేసు కోవడం జరిగి ఉండదు. అందుకు ఎటువంటి కారణం కూడా ఇప్పటివరకు చెప్పనే లేదు.

వెనుకబడిన ఏడు జిల్లాల తలసరి జీఎస్డీపీ దక్షిణ కోస్తాప్రాంతం కంటే 15 శాతం, ఏపీ సరాసరి కంటే 8 శాతం తక్కువగా ఉంది. ఈ అగాధం గత నాలుగేళ్లలో మరింతగా పెరుగుతున్నది. 2017-18 నాటికి ఈ ప్రాంతాల జీఎస్డీపీ దక్షిణ కోస్తాప్రాంతం కంటే 20శాతం, ఏపీ సరాసరి కంటే 10 శాతం తక్కువగా ఉంది. ఈ ప్రాంతాల అభివృద్ధికి ఇప్పటి వరకు కేంద్రం ఒక నిర్దిష్టమైన ప్రణాళికను కూడా ప్రకటించ లేదు. ఈ దిశలో కేంద్రంలోని పెద్దలు ఎటువంటి ఆలోచనలు చేసినట్లు లేదు. జయప్రకాశ్ నారాయణ్ నేతృత్వంలోని నిపుణుల కమిటీ అంచనాల ప్రకారం వెనుకబడిన ప్రాంతాల అభివ ృద్ధికి పదేళ్ల కాలంలో రూ 26 లక్షల కోట్ల మూలధనం అవసరం కాగలదు. అందులో రూ 22 లక్షల కోట్లు అంతర్గత పొదుపు ద్వారా పెంపొందుతాయి. మిగిలిన రూ 4 కోట్లను ఇతర మార్గాల ద్వారా సేకరించాలి. అంటే ఏపీ బయటనుండి అవసరమైన పెట్టుబడులలో 85 శాతం కేవలం వెనుకబడిన ప్రాంతాలకే మళ్లవలసి ఉంది. వెనుకబడిక ప్రాంతాల జీఎస్డీపీ తక్కువగా ఉండటం, తక్కువ ఆదాయాల కారణంగా అంతర్గత పొదుపు కూడా తక్కువగా ఉండడంతో పెట్టుబడుల మొత్తం పెరగాలి. మొదటి ఐదేళ్లకు ఏపీకి పెట్టుబడుల అవసరాలు రూ 72,200 కోట్లు కాగా, అందులో బయట నుంచి ప్రైవేట్ పెట్టుబడులు సుమారు రూ 36,100 కోట్లు రాగా, మిగిలిన సగం ప్రభుత్వం నుండి మాత్రమే రావలసి ఉంది. అంటే, ఏపీ వచ్చే ఐదేళ్లలో రూ 1.03 లక్షల కోట్ల భర్తీని లక్ష్యంగా చేసుకొంది. ప్రాంతీయ అసమానతల్ని తొలగించాలని లక్ష్యంగా పెట్టుకొంటే మొత్తం పెట్టుబడులతో మూడోవంతును వెనుకబడిన ప్రాంతాలలో పెట్టవలసి ఉంటుంది.

వెనుకబడిన ఈ ఏడు జిల్లాల సామాజిక, ఆర్థిక సూచికలు ఆయా ప్రాంతాల వెనుకకు నిలువెత్తు నిదర్శనంగా ఉన్నాయి. ఆంధ్రప్రదేశ్ వెనుకబాటుకు మూల కారణం ఈ ప్రాంతాల సూచికలు ప్రత్యేక క్యాటగిరీ రాష్ట్రాల సూచికలతో సమానంగా లేదా అంతకన్నా తక్కువగా ఉండటమే. తక్కువ అక్షరాస్యత స్థాయి, అక్షరాస్యతలో ఎక్కువగా లింగ వివక్ష, అద్వాన్న నీటి సరఫరా, పేదరికం వంటి కారణాలు ఈ ప్రాంతాల వెనుక బాటుకు దారితీస్తున్నాయి. అందుచేత ఈ ప్రాంతాల అభివృద్ధికి ప్రత్యేక వ్యూహం, ప్రణాళిక అవసరం ఉంది. బందెలఖండ్ అభివృద్ధి ప్యాకేజీకి సంబంధించి కేంద్రప్రభుత్వం 2009-12 వరకు మూడేళ్ళ కాలానికి రూ 7,266 కోట్లు కేటాయించింది. ఆ తర్వాత 2012-17 వరకు వెనుకబడిన ప్రాంతాల గ్రాంట్ కింద రూ 4,400 కోట్లు మంజూరు చేసింది. అంటే మొత్తంమీద రూ 11,668 కోట్లు ప్రత్యేక గ్రాంట్‌గా ఇచ్చింది. అంటే, ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్‌లలోని 1.83 కోట్ల జనాభాతో 13 జిల్లాల మేర ఉన్న బందెలఖండ్‌కు తలసరి రూ 6,374 ఇచ్చినట్లు అయింది.

ఆంధ్రప్రదేశ్‌లోని వెనుకబడిన జిల్లాల్లో మొత్తం జనాభా 2.52 కోట్ల మంది. 2009 ధరల ప్రకారం బందెలఖండ్ ప్యాకేజి తరహాలో ఉత్తరకోస్తా, రాయలసీమలో భాగంగా భావించదగిన ప్రకాశం జిల్లా మార్కాపురం డివిజన్‌తో కలిపి రాయలసీమకు తలసరి కేటాయింపు చేస్తే జనాభా, 5 శాతం ద్రవ్యోల్బణం ప్రకారం లెక్కిస్తే బందెలఖండ్ ప్యాకేజీకి అనుగుణంగా ఏపీలో వెనుకబడిన ప్రాంతాలకు గ్రాంట్‌గా రూ 25,000 కోట్లు ఇవ్వవలసి ఉంటుంది. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అక్టోబర్ 16, 2014న రాసిన లేఖలో వెనుకబడిన ప్రాంతాలకు, ముఖ్యంగా రాయలసీమ, కోస్తా ప్రాంతాలకు 2014-15 నుంచి ఐదేళ్ల కాలానికి రూ 24,350 కోట్ల ప్రత్యేక అభివృద్ధి సాయాన్ని అందించాలని కేంద్రాన్ని కోరింది. ద్రవ్యోల్బణం, జనాభా పరంగా సర్దుబాటు చేస్తే రాష్ట్ర అడిగిన సాయం దాదాపుగా బందెలఖండ్ ప్యాకేజీతో సమానంగా ఉంది.

ఈ లేఖకు స్పందిస్తూ డిసెంబర్ 2, 2014న అప్పటి ప్రణాళిక సంఘం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ అధికారులతో ఒక సమావేశాన్ని ఏర్పాటు చేసింది. అప్పటికే కొనసాగుతున్న కేంద్ర ప్రాయోజిత పథకాలతో కలిసిపోయే అంశాన్ని దృష్టిలో పెట్టుకొని ప్యాకేజీ కింద అదనపు నిధుల్ని ఇచ్చే అంశాన్ని పరిశీలించడానికి ప్రత్యేక అభివృద్ధి ప్యాకేజీని నిశితంగా అధ్యయనం చేయాల్సి ఉన్నదని ఆ సమావేశంలో ప్రణాళిక సంఘం స్పష్టం చేసింది.

దీంతో, తిరిగి జనవరి 16, 2015న రాష్ట్ర ప్రభుత్వం పునస్సమీక్షించిన మరో లేఖను పంపింది. వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధికి ప్రత్యేక అభివృద్ధి సాయం ఇవ్వడానికి రంగాలవారీగా అవసరమైన కేటాయింపులను కోరుతూ ప్రాథమిక అంచనాలను పంపింది. తర్వాత ప్రత్యేక అభివృద్ధి ప్యాకేజి ప్రతిపాదనను కేంద్ర మంత్రిత్వ శాఖలు/విభాగాల పరిశీలనకు పంపారు. అయితే, 2014-15 నుంచి 2016-17 వరకు మూడు బడ్జెట్ సంవత్సరాలలో కేవలం రూ 1,050 కోట్లు, అంటే జిల్లాకు, సంవత్సరానికి రూ 50 కోట్లు చొప్పున మాత్రమే వెనుకబడిన ప్రాంతాలకు ప్రత్యేక ప్యాకేజి కింద అందింది. బందెలఖండ్ ప్యాకేజి కింద ఆ రాష్ట్రానికి 2009 నుండి 2017 వరకు రూ 6,374 తలసరి గ్రాంట్‌గా ఇవ్వగా, ఆంధ్రప్రదేశ్‌కు మూడేళ్ళలో వెనుకబడిన ప్రాంతాలకు విడుదల చేసిన మొత్తం తలసరి రూ.417 మాత్రమే కావడం గమనార్హం. కేంద్రం నిర్లక్ష్యపూర్వక ధోరణిని ఈ కేటాయింపు వెల్లడి చేస్తుంది.

వెనుకబడిన ప్రత్యేక ప్రాంతాల అభివృద్ధి ప్యాకేజి కింద ఏపీకి కేంద్రం రూ.1,050 కోట్లు మంజూరు చేయగా, రాష్ట్ర ప్రభుత్వం రూ.1,641.50 కోట్ల అంచనా వ్యయంతో 25,007 పనులను అక్కడ మంజూరు చేసింది. వీటిల్లో 14,512 పనులు పూర్తయ్యాయి. 5,364 పనులు పెండింగ్‌లో ఉన్నాయి. రాష్ట్ర ప్రభుత్వం రూ.1,049.34 కోట్లకు ఇప్పటికే వినియోగ పత్రాలను ఇచ్చేసింది. రాష్ట్రానికి రూ.666 కోట్ల తదుపరి నిధులను తర్వాతి రెండేళ్లకు మంజూరు చేయాలని నీతి ఆయోగ్ నవంబర్ 8, 2018న ఆర్థిక మంత్రిత్వ శాఖకు సూచించింది. కానీ కేంద్ర ప్రభుత్వం నుండి ఎటువంటి స్పందన లేదు.

ఏపీలోని వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి విషయంలో కేంద్ర ప్రభుత్వ వైఖరికి, విభజన చట్టంలో పేర్కొన్న మేరకు తనకున్న బాధ్యతకు పొంతనలేనట్లు ఉన్నదని నిపుణుల కమిటీ ధ్వజమెత్తింది. రూ. 24,350 కోట్ల ప్రత్యేక ప్యాకేజీని నిర్ణీత కాలవ్యవధి పద్ధతిలో ఐదేళ్లలోపు అమలు చేసేందుకు కేంద్ర ప్రభుత్వం తక్షణం ప్రాధాన్య చర్యలను తీసుకోవాలని సూచిందింది. ఇప్పటికైనా కేంద్రం ఈ విషయంలో తన వివక్షకు స్వస్తి పలికి ఏపీలోని వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి పట్ల దృష్టి సారించాలి.

వ్యాస రచయిత : మాజీ ఎంపీ, మాజీ మంత్రి
కన్వీనర్, ఉత్తరాంధ్ర చర్చా వేదిక

విశాలాంధ్ర
బతుకు
The Life
బుధవారం
06 ఫిబ్రవరి 2019



శాకాహారంతో.. మేలు జరుగుతుందా?



మీరు మాంసం తింటారా? లేదా? ఏదైనా ఫంక్షన్స్ లేదా పార్టీలకు వెళ్ళినప్పుడు సాధారణంగా చాలామంది అడిగే ప్రశ్నే ఇది. దీని కారణం కొంత మందికి మాంసాహారంపై ప్రతికూల భావనలుండటం. మాంసాన్ని తీసుకోని వాళ్ళు రోజు వారి డైట్‌ను జాగ్రత్తగా తీసుకోవాలి. మాంసాహారంలోని పోషకాలను శాకాహారంతో సమకూర్చుకోవాలి. శాకాహారులంతా ఒకేలా ఉండరు. వీరికి రకరకాల పేర్లు ఉన్నాయి.

- **లాక్టో వెజిటేరియన్ :** పాల ఉత్పత్తులను మాత్రమే తింటారు. మాంసం, చేపలు, పౌల్ట్రీ, సముద్ర ఆహారం, గుడ్లు తీసుకోరు.
- **ఓవో వెజిటేరియన్స్ :** గుడ్లు తీసుకుంటారు. మాంసం, డైరీ ఉత్పత్తులు ఏమీ తీసుకోరు.
- **లాక్టో-ఓవో వెజిటేరియన్స్ :** డైరీ ఉత్పత్తులు, గుడ్లు రెండింటిని తీసుకుంటారు. కానీ చేపలు, సముద్ర ఆహారం, మాంసం తీసుకోరు.
- **వేగన్స్ :** వీరు కనీసం తేనెను కూడా తీసుకోరు.

శాకాహారం తీసుకోవడం వల్ల చాలా లాభాలున్నాయి. దీనితో పాటుగానే నష్టాలు కూడా ఉన్నాయి. శాకాహారం వల్ల వచ్చే నష్టాలను అధిగమించడానికి మీ డైట్‌ను కొంచెం మార్చు కోవాలి. కొన్ని ఫుడ్ కాంబినేషన్స్ తీసుకోవడం వల్ల శాకాహారం వల్ల కూడా ఎటువంటి ఇబ్బంది ఉండదు.



లాభాలు

మాంసాహారం తీసుకునే వారితో పోలిస్తే శాకాహారం తీసుకునే వారిలో ఊబకాయం వచ్చే అవకాశాలు చాలా తక్కువ. ఎందుకంటే శాకాహారంలో కొవ్వు చాలా తక్కువగా ఉంటుంది. పండ్లు, కూరగాయలు, తృణధాన్యాలు, ఆకుకూరల్లో ప్రోటీన్స్ ఎక్కువ, క్యాలరీలు తక్కువ. అందుకనే శాకాహారులు ఎంత ఎక్కువ ఆహారం తీసుకున్నప్పటికీ తక్కువ కొవ్వును కలిగి ఉంటారు. శాకాహరులకు గుండె సంబంధిత వ్యాధులు రావడం అరుదు. కొలెస్ట్రాల్, రక్తపోటు వంటివి దరిచేరవు. వారి జీవన కాలం కూడా పెరుగుతుంది.

క్రమం తప్పకుండా శాకాహారం తీసుకోవడం వల్ల శరీరానికి యాంటీ ఆక్సిడెంట్స్ ఎక్కువగా అందుతాయి. పండ్లు, కూరగాయలు, బీన్స్‌లో యాంటీ ఆక్సిడెంట్స్ అధిక మొత్తంలో లభిస్తాయి. యాంటీ ఆక్సిడెంట్స్ సహజంగా లభించే శాకాహారాన్ని తీసుకోవడం వల్ల కణాలు దెబ్బతినకుండా కాపాడుకోవచ్చు. మాంసం, పౌల్ట్రీ, చేప, ఇతర సముద్ర ఆహారం వల్ల తరచు అనారోగ్యానికి గురవుతారు. కానీ శాకాహారం వల్ల అనారోగ్యపాలయ్యే అవకాశాలు చాలా తక్కువ. రోగ నిరోధక శక్తి తక్కువగా ఉన్న పిల్లలకి కృత్రిమంగా హార్మోన్స్ ఇచ్చి పెంచిన జంతు వుల మాంసం ఇస్తే వారు వెంటనే జబ్బు పడతారు.

నష్టాలు

శాకాహరులకు వచ్చే సమస్యల్లో మొదటిది విటమిన్స్ లోపం. అందుకని శాకాహారులు విటమిన్స్ ఎక్కువగా ఉన్న ఆహారంపై దృష్టి పెట్టాలి. ప్రోటీన్స్, ఐరన్, కాల్షియమ్, జింక్ ప్రత్యేకించి బి12 విటమిన్స్‌ను వారి డైట్‌లో భాగంగా చేసుకుంటే వచ్చే సమస్యలను కొంత వరకూ తగ్గించవచ్చు. ఆకుకూరల్ని ఎక్కువగా తీసుకోవాలి. ఆకుకూరల్లో ఐరన్‌తో పాటు విటమిన్ సి పుష్కలంగా లభిస్తుంది. ఓమేగా 3 ఫ్యాటీ యాసిడ్స్ కూడా లభిస్తాయి. సి విటమిన్స్ ఉన్న ప్రతి దానిలో ఓమేగా 6 సహజంగా దొరుకుతుంది. వెజిటేబుల్స్ నుంచి లభించే ప్రతి నూనె కూడా ఓమేగా 3, 6లను కలిగి ఉంటుంది. దీని వల్ల తీవ్రమైన వ్యాధులు రాకుండా నివారిస్తుంది. వాల్‌నట్స్, అవిసె గింజల్లో ఓమేగా 3 ఎక్కువగా ఉంటుంది.



శాకాహారులు తీసుకునే ఆహారంలో ఎక్కువ శాతం ప్రోటీన్లు ఉండేలా చూసుకోవాలి.



మొక్కల నుంచి వచ్చే ఆహారంలో అమినో యాసిడ్స్ చాలా తక్కువ. దీంతో పోషకాహారలేమి సమస్య మొదలవుతుంది. అమినో యాసిడ్స్ మాంసాహారంలో ఎక్కువగా ఉంటాయి.

కానీ బీన్స్, బఠానీ, సోయా, గోధుమ, ఓట్స్, బార్లీ, బాదం, వాల్‌నట్స్, బ్రెజిల్ నట్స్‌లోనూ కొంత మేరకు అమినో యాసిడ్స్ ఉన్నాయి. వీటిని తగు మోతాదులో తీసుకోవడం ద్వారా పోహకాహార లేమిని తగ్గించుకోవచ్చు.

మానవ శరీరంలో జీర్ణాశయం శాకాహారాన్ని, మాంసాహారాన్ని రెండిటిని కూడా జీర్ణం చేసుకోగలదు. రోజూ శాకాహారం తీసుకొని ఎప్పడో ఒకసారి మాంసాహారం తీసుకంటే రకరకాల అనారరోగ్య సమస్యలు వస్తాయి. వారానికి రెండు సార్లు చేపలు తీసుకోవడం వల్ల మీకు ఎటువంటి హాని కలగదు. మీరు నిత్యం ఫిట్‌గా ఉండాలని కోరుకుంటే తీసుకునే ఆహారం కన్నా వ్యాయామాలపై ఎక్కువ దృష్టి పెట్టండి. దీని వల్ల మీ శరీరం సమతుల్యంగా ఉంటుంది. పండ్లు, కూరగాయలు, తృణధాన్యాలు, పప్పులు తగు మోతాదులో తీసుకోవడం వల్ల అనారోగ్యంబారిన పడకుండా జాగ్రత్తపడవచ్చు.



కురుల కంపు

తొలగిపోయేలా....

జుట్టు సమస్యల్లో వాసన ఒకటి. అది కూడా భరించలేని స్థాయిలో ఉంటే నలుగురిలోకి వెళ్ళేందుకూ ఇబ్బందే. ఈ పరిస్థితిని అధిగమించేందుకు బయట ఉత్పత్తులను నమ్ముకుంటే జరిగేది నష్టమే. మార్కెట్‌లో లభించే క్రీములు, షాంపూల వల్ల జరిగే మేలు కంటే హానే ఎక్కువ. అది జుట్టుకీ వర్తిస్తుంది. జుట్టు వాసన రావడానికి చాలా కారణాలే ఉన్నాయి. జుట్టు మీద పేరుకుపోయే జిడ్డు, చుండ్రు, శుభ్రత లేకపోవడం, దుమ్ముధూళి, ఇతర పర్యావరణ కారకాలు. రసాయనాలతో కూడిన ఉత్పత్తులను ఉపయోగించడం, చర్మం పరిస్థితులు, మాడు పొడిబారిపోవడం, తలలో ఉండే పేలు కూడా ఇందుకు కారణమవుతాయి. కారణాలు ఏవైనా జుట్టు వాసన రాకుండా చూసుకోవాల్సిందే. ఇందుకు సహజమైన పదార్థాలను ఉపయోగించడం అత్యుత్తమం. మరి అందుకు ఉపయోగపడే పదార్థాలు ఏమున్నాయో? వాటిని ఎలా ఉపయోగించాలో తెలుసుకుందాం.

- ఒక టేబుల్ స్పూన్ వేప నూనె, ఒక టేబుల్ స్పూన్ జోజోబా ఆయిల్ ఒక గిన్నెలో వేసి బాగా కలిపి అందులో దూదిని ముంచి తలకు రాయండి. అరగంట తర్వాత కడిగేయండి. రోజుకి ఒకటి, రెండుసార్లు ఇలా చేస్తే మంచి ఫలితం ఉంటుంది.
- ఒక టేబుల్ స్పూన్ టీ ట్రీ ఆయిల్, ఒక టేబుల్ స్పూన్ బాదం నూనె తీసుకుని తలకు బాగా పట్టించండి. అరగంట తర్వాత తల కడిగేసి బాగా పొడిగా ఆరనివ్వాలి.
- రెండు టేబుల్ స్పూన్‌ల ఆముదం తీసుకుని అందులో దూదిని ముంచి తలకు రాయండి. పావుగంట, 20 నిముషాలు ఉంచి మామూలు షాంపూ లేదా కండిషనర్‌తో కడిగేయండి. ఆముదం చిక్కగా ఉంటుంది కాబట్టి గాఢత తక్కువగా ఉండే షాంపూని ఉపయోగించడం మంచిది. తలను డ్రయ్యర్లతో కాకుండా సహజంగా ఆరనివ్వండి. వారంలో రెండుసార్లు ఈ ఆయిల్‌ని ఉపయోగించుకోవచ్చు.
- కప్పు గోరువెచ్చని నీళ్ళల్లో రెండు టేబుల్ స్పూన్‌ల నిమ్మరసం కలిపి ఈ నీటితో తలను బాగా కడగండి. కొన్ని నిముషాలాగి మరోసారి మామూలు నీళ్ళతో కడిగేయండి. వారానికోసారి ఇలా చేయవచ్చు.
- రెండు కప్పుల నీళ్ళల్లో అరకప్పు యాపిల్ సిడర్ వెనిగర్ వేసి ఉంచండి. గాఢత తక్కువ ఉన్న షాంపూతో తలస్నానం చేసిన తర్వాత చివరన ఈ వెనిగర్ నీటితో కడిగేయండి. మామూలు నీళ్ళతో మరోసారి కడిగి అప్పుడు జుట్టుని ఆరబెట్టుకోండి. వారానికి రెండుసార్లు ఇలా చేస్తే మంచి ఫలితం ఉంటుంది.



దంత సిరికి...వేప!

దంతాల ఆరోగ్యానికి కాపాడుకోవడానికి వేపను మించినది లేదంటే అతిశయోక్తి కాదు. ఈ కారణంగానే దంతాల ఆరోగ్యానికి సంబంధించిన అత్యధిక ఉత్పత్తుల్లో వేపను ఉపయోగిస్తారు. వేపలో ఉండే యాంటీ బాక్టీరియల్ గుణాలు నోటిలో ఉండే చెడు బాక్టీరియాను తరిమేస్తాయి. నోటి దుర్వాసనను కలిగించే, చిగుళ్ళు, దంతాలను లోపలి నుంచి దెబ్బతీసే వ్యాధులకు కారణమయ్యే తీవ్ర హానికరమైన బాక్టీరియాను నిర్మూలిస్తాయి. వేపాకులు మరిగించిన నీళ్ళను మౌత్ వాష్‌గానూ ఉపయోగించుకోవచ్చు. వేప పుల్లలను టూత్ బ్రష్‌లుగా ఉపయోగించడం మన భారతదేశంలో అనాదిగా వస్తున్న ఆచారమే. ఈ కాలంలో మర్చిపోయిన, దాదాపుగా కనుమరుగైపోయిన ఇలాంటి పూర్వ పద్ధతులను తిరిగి మొదలు పెట్టడం ద్వారా దంతసిరిని నిక్షేపంగా ఉంచుకోవచ్చు.



గర్భంతో ఉన్నప్పుడు హార్మోన్స్‌లో చాలా మార్పులు వస్తాయి. ఫలితంగా ఏది పడితే అది తినే వీలు ఉండదు. ముఖ్యంగా తొలి మూడు నెలల్లో మార్నింగ్ సిక్‌నెస్, వాంతుల బెడద ఎక్కువగా ఉంటుంది. ఈ సమయంలో సహజంగానే పులుపు తినాలనిపిస్తుంది. ఇందుకు మంచి మార్గం ఉసిరి. తియ్యతియ్యగా, పుల్లపుల్లగా ఉండే దీని రుచి నోటికి బాగుండడమే కాదు వాంతులను కొంతవరకూ అరికడుతుంది. పైగా ఇందులో యాంటీ ఆక్సిడెంట్లు, విటమిన్ సీ పుష్కలంగా ఉంటాయి. ఐరన్, కాల్షియం, పాస్ఫరస్ లాంటి ఆరోగ్యకరమైన పోషకాలూ చాలానే ఉన్నాయి. అందుకే గర్భంతో ఉన్నప్పుడూ నిస్సంకోచంగా దీనిని తీసుకోవచ్చు. దీనివల్ల తల్లులకు కలిగే ప్రయోజనాలూ చాలానే ఉన్నాయి.



- గర్భం కారణంగా జీర్ణ వ్యవస్థలో వచ్చే మార్పుల వల్ల ఏర్పడే మలబద్ధకాన్ని ఉసిరి పోగొడుతుంది.
- అజీర్ణం, వాంతులు, ఎసిడిటీ సమస్యలను తగ్గించేస్తుంది.
- బిడ్డకు ఆహారాన్ని అందించేందుకు నిరంతరం పనిచేసే అమ్మ శరీరం ఎప్పుడూ ఉత్తేజంగా, ఉత్సాహంగా ఉండేలా చేసే శక్తి ఉసిరికి ఉంది.
- అదనపు రక్తాన్ని ఉత్పత్తి చేయడం వల్ల త్వరగా అలసిపోయే తల్లి శరీరానికి కావలసినంత శక్తిని ఇవ్వడమే కాదు రోగ నిరోధక శక్తినీ ఉసిరి పెంచుతుంది.
- ఉసిరిలో ఉండే నీరు శరీరంలోని విష పదార్థాలనూ బయటకు పంపించేస్తుంది. తరచుగా మూత్రానికి వెళ్ళేలా చేయడం ద్వారా తన పని తాను చేసుకుపోతుంది.
- రోజూ ఉసిరి తింటే కడుపులో ఉన్న బిడ్డకు కావలసినంత ఆక్సిజన్ అందడంతో పాటు స్వచ్ఛమైన రక్తమూ సరఫరా అవుతుంది.
- గర్భిణుల్లో సాధారణంగా వచ్చే ఫ్లూ, జలుబు, దగ్గు, యూరినరీ ట్రాక్ట్ ఇన్ఫెక్షన్ తదితరాలను ఉసిరి అరికడుతుంది.
- ప్రసవం తర్వాత పాలు పడేందుకూ ఉసిరి దోహదపడుతుంది. ఆ పాలు కూడా బిడ్డలో రోగనిరోధక శక్తిని పెంచే మంచి పాలు వచ్చేలా చేస్తుంది.
- హార్మోన్లలో మార్పు కారణంగా గర్భంతో ఉన్నప్పుడు వచ్చే డయాబెటీస్‌నూ అడ్డుకుంటుంది.
- ఎదిగే బిడ్డలో పిండ దశ నుంచే జ్ఞాపకశక్తి, కంటిచూపు మెరుగుపడేందుకు తోడ్పడుతుంది.
- గర్భంతో ఉన్నప్పుడు సహజంగా కనిపించే కాళ్ళు, చేతుల వాపులను రాకుండా చేస్తుంది.
- కడుపుతో ఉన్నప్పుడు బీపీ ఉంటే చాలా రకాల సమస్యలు వస్తాయి. ఒక్కోసారి అబార్షన్ అయ్యే ప్రమాదాలూ ఉంటాయి. ఇలాంటి పరిస్థితి రాకుండా బీపీని ఉసిరి అదుపు చేస్తుంది.
- బిడ్డలో ఎముకలు, దంతాలు పూర్తిగా ఏర్పడేందుకు అవసరమైన కాల్షియంను అందజేస్తుంది.

ఉసిరి వల్ల ఎన్ని లాభాలో కదా! సో, కాబోయే తల్లులూ రోజూ కప్పు ఉసిరి రసం తీసుకోండి. లేదా పచ్చి ఉసిరి అయినా తినండి. దీనివల్ల మీకూ, మీ బిడ్డకు కూడా ఊహించనంత మేలు జరుగుతుంది.



చర్మం తాజాగా...

- వెన్నపూసను తీసుకోని పావుగంట పాటు మసాజ్ చేయండి.
- రాత్రిపూట స్నానం చేసిన వెంటనే ముఖానికి కాటన్ బాల్స్ సహాయంతో అప్లై చేయండి. రాత్రంతా అలా ఉంచితే మీ చర్మం ఆరోగ్యంగా ఉంటుంది.
- చర్మానికి పెట్రోలియం జెల్లిని అప్లై చేయడం వల్ల చర్మం పొడిబారే సమస్య సాధ్యమైనంత మేర తగ్గుతుంది.
- ఒక టేబుల్ స్పూన్ తేనెలో రెండు టేబుల్ స్పూన్స్ పచ్చిపాలను కలిపి ముఖంపై మర్ధనా చేయండి. దీంతో చర్మం తాజాగా ఉంటుంది.
- స్ట్రాబెర్రీలకు కొంచెం రోజ్ వాటర్‌ను జోడించి మిక్సీ పట్టండి. ఈ మిశ్రమాన్ని ముఖానికి పట్టించి అరగంట తర్వాత చల్లని నీటితో కడిగేయండి. ఇలా చేయడం వల్ల చర్మం తేమను ఎక్కువ సమయం నిలిపి ఉంచుకుంటుంది.

గిన్నీస్ రికార్డు

రహదారి భద్రతపై అవగాహనను విస్తృతం చేసేందుకు నిర్వహించిన ఓ కార్యక్రమంలో పాఠశాల విద్యార్థులంతా హెల్మెట్లు ధరించిన దృశ్యం ఇది. రైడ్ టు సేఫ్టీ పేరుతో ఐసిఐసిఐ ముంబయిలో నిర్వహించిన ఈ కార్యక్రమం గిన్నీస్ రికార్డులకెక్కింది.



నేను - సుడిగుండం (నవల) 37

పి.చంద్రశేఖర అజాద్
సెల్: 92465 73575



నిన్నటి సంచిక తరువాయి

ఇంట్లో నిదా లేకపోవటం యిబ్బంది అనిపించింది. వెన్నెల నా మీద తనకు ఏం చెబుతుందో అనుకున్నాను. అప్పుడు డోర్ బెల్ మోగింది. తలుపు తీస్తే మావయ్య వున్నాడు. ఎందుకో కాస్త జంకు కలిగింది. లోపలకు రమ్మన్నాను. ఆయన మాట్లాడిన మొదటి మాట...

"నువ్వు కూడానా అల్లుడూ"

"యూ టూ బ్రూటస్" అన్నట్లనిపించింది.

"అర్చన పెళ్లి చేసుకుంటాను అన్నప్పుడు దాన్ని బయటకు చదువుకి పంపించి తప్పు చేసాను అన్నాను. నువ్వు చదువు మీద ద్వేషం పెంచుకోవద్దు అన్నావు. ఇలాంటి పనులు చేయటానికా చదువుకునేది..."

"మావయ్యా..."

"నీతో తగాదా పడటానికి నేను రాలేదు. కొన్ని ప్రశ్నలు మాత్రం అడుగుతాను. వెన్నెలని పెళ్లి చేసుకో అని నేనుగాని, మీ అత్తగాని మిమ్మల్ని అడిగామా? నా చెల్లి అడిగింది. అప్పటికీ నీకు మంచి సంబంధం రావాలి అని నేను అన్నాను. నువ్వు డబ్బుతో ఏపనయినా చేయగలను అనుకుంటున్నావు. ఎదిగిపోయావు కదా! ఇల్లు - భార్య- పిల్ల - లోకం ఏదీ నీకు అవసరం లేదు. మీ అమ్మ చనిపోయినప్పుడు నేను పసిపిల్లాడిలా ఏడ్చానురా. ఇవన్నీ చూడకుండా వెళ్లిపోయినందుకు సంతోషపడుతున్నా, లేకపోతే బుల్లమ్మాయ్ గుండె పగిలిపోయేది" అని...

****

"మీ నాన్న చనిపోయి మీ అమ్మని విధవరాలిని చేసాడు. నువ్వు బతికి వుండగానే నా కూతుర్ని...." అని మాట్లాడలేక పోయాడు ఉద్వేగంతో

"వెన్నెల విధవరాలిగా ఎందుకు వుండాలి. విడాకులు తీసుకుంటాం... తనకు నచ్చిన వారిని..." అంటుండగా

"అలాగా... మనుషులంతా నీలాగా వుంటారా! అది నా కూతురు. మీ నాన్న చనిపోయినప్పుడు మీ అమ్మని మళ్లీ పెళ్లి చేసుకో అల్లుడు మా దగ్గర వుంటాడు అన్నాను. అమ్మ ఒప్పుకోలేదు. వెన్నెలకి కావల్సింది ముఖాన ఇంత బొట్టు, గాజులు కాదు. నా పిల్ల అమాయ కురాలు కావచ్చు. కానీ నా మనవరాలితో ఆడుకునే హక్కు నీకు లేదు"

నిట్టూర్చాను.

"నీలాంటి వాడి కోసమా నేను నా బతుకుని తాకట్టు పెట్టాను" అని లేచి వెళ్లిపోతున్నాడు. నేను వెనక్కి పిలవలేదు.

****

అమిత

ఇప్పటివరకు నేను అమితతో మాట్లాడలేదు. మావయ్య తర్వాత నాకు అత్యంత ఆప్తురాలు అమిత. నాకు రెండుసార్లు ఉద్యోగం ఇప్పించింది. మూడోసారీ కూడా ఢిల్లీ వస్తావా అని అడిగింది.

దానికి ముందు నేను వెన్నెలనీ అర్జెంట్‌గా పెళ్లి చేసుకోవాల్సి వచ్చినప్పుడు తన దగ్గరకు వెళ్లి నా మనసులో వున్న విషయాలను చెప్పుకున్నాను. ఇప్పుడు కనీసం ఫోన్లో అయినా నేను మాట్లాడలేదు. ఓసారి వీలు చూసుకుని ఢిల్లీ వెళ్లాలి అనుకుంటున్నాను.

అప్పుడు అమిత నుండి లెటర్ వచ్చింది.

దీర్ఘమైన లేఖ.

ప్రభాత్....

నీకు ఇలాంటి ఉత్తరం రాయవలసి వస్తుందని నేను అనుకోలేదు. నేనే నీ దగ్గరకు వద్దామనుకున్నాను. కానీ ఇలా రాయటమే సరయింది అనుకున్నాను.

ఎక్కడి రాము.... ఎక్కడి ప్రభాత్!

నువ్వు ఒక్కో మెట్టు ఎక్కుతున్నావనుకున్నాను. ఇలా ఆకాశం నుండి తోక చుక్కలా రాలిపోతావు అనుకున్నానా? నెత్తురు కక్కుకుంటూ నేలకు నే రాలిపోతే నిర్దాక్షిణ్యంగా వీరే అన్న శ్రీశ్రీ గుర్తొస్తున్నాడు..

నువ్వు నెత్తురు కక్కుకుంటూ నేల మీదకు రాలేదు. విమానం లాండ్ అయినట్లు చిన్న కుదుపుతో దిగావు. అసలు నాతో మాట్లాడకుండా, ఏం జరిగిందో తెలియకుండా నువ్వు మాట్లాడటం న్యాయమా అని నువ్వు అనొచ్చు.



మనల్ని ఉద్యమాల్లోకి, రాజకీయాల్లోకి రమ్మని ఎవరూ అడగరు. మనమే రకరకాల అనుభవాలతో బయలుదేరతాం. దానికి ముందు మనం ఓ పెద్ద ప్రపంచంతో పోరాడాలి అనే స్పృహ వుంటుంది. నువ్వు వెన్నెలని వివాహం చేసుకోబోయే ముందు నా దగ్గరికి వచ్చావు. అసలు నేను పెళ్లి చేసుకోను అన్నావు. వెన్నెల మీద ప్రత్యేకమైన ప్రేమలేదు అన్నావు. అలాగే ఏదో ఒక ఉద్యమంలో పని చేయాలని వుంది అన్నావు.

నేను అప్పుడే చెప్పాను. ఏం చేయాలో ముందు నిర్ణయించుకో అని. నీ మనసులో వున్న మాటనీ, మీ అమ్మకూ, మావయ్యకు చెప్పు అని. అంతగా అయితే ఓసారి బాధ పడతారు. మీ అమ్మ చనిపోతానని బెదిరించింది అన్నావు.

నిజంగా అలా చేసిందనుకో ఇన్ని వందల కోట్ల మంది ప్రజల్లో మీ అమ్మ ఒకటి మాత్రమే. అందరూ అమ్మల గురించి, ఇతర బంధాల గురించి ఆలోచిస్తే ఏ పనీ చేయలేరు. నేను నాకు నచ్చిన ఉద్యమాల్లో పని చేస్తాను. అది మనలాంటి పేదవారి కోసం అని నువ్వు నచ్చ చెప్పి వుంటే తను కాదని వుండేదా... నీ వ్యక్తిగతం కోసం నువ్వు అలాంటి పని చేయటం లేదు కదా!

అయినా నీకు మీ అమ్మా, మావయ్య కుటుంబం గుర్తుకు వచ్చింది. చిన్నప్పటి నుండి వారు మీకు అందించిన సహ కారం గుర్తు వచ్చింది. దాన్ని బంధం అంటారని నీకు తెలుసు. అంతకు మిం చి ఆ రోజు నువ్వు ఏదొక పని చేయాలి. అందుకే నువ్వు ముందు నాకు ఉద్యోగం కావాలి అన్నావు. నీ చదువుతో సంబంధం లేకుండా ఎలాంటి పనికయినా ముందుకు వచ్చావు.

ఇవన్నీ ఇప్పుడు నీకు గుర్తు చేయాల్సిన అవసరం వచ్చింది. వెన్నెలనీ నువ్వు పెళ్లి చేసుకున్నావు. పెళ్లి అంటే నూరేళ్ల బంధం. దీన్ని వెక్కిరించాల్సింది లేదు. అదో వ్యవస్థగా రూపుదిద్దుకుంది. పూర్తిగా అరాచకత్వం సమాజాన్ని కలుషితంగా మార్చకుండా వుండటానికి పని చేసే శక్తి, ఆయుధం- పెళ్లి.

నువ్వు అంటావు ఒకప్పుడు కుటుంబం వుందా అని. నేను అడుగుతున్నాను. ఒకప్పుడు దోపిడి వుందా? పీడించటం వుందా? ఆస్తులన్నీ కొంతమంది దగ్గర పోగుపడటం వుందా? టెక్నాలజి వుందా?

అన్నీ వస్తున్నాయి. మారుతున్నాయి. అదే క్రమం. అందులో కుట్రలున్నాయి. ముందుగా తమ తరాల గురించి ఆలోచించి ఏర్పాటు చేసినవి వున్నాయి.

ఓ పక్కన కొన్ని దేశాలు ప్రపంచీకరణ పేరు మీద సకల విలువల్ని ధ్వంసం చేస్తుంటే దాన్ని ఎదుర్కోవాల్సింది పోయి మన భాష ఏమిటి? మన భావాలు ఏమిటి?

ఒకప్పుడు జననం అనుభూతి ఇప్పుడు పునరుత్పత్తి అంటున్నాం.

ఈ భాష ఎవరిది? వ్యాపారస్థులది. ఇండస్ట్రియలిస్టులది. నువ్వు పదే పదే నన్ను అడిగిందేమిటి? పిల్లలు పుట్టారా? ఆసుపత్రిలో పరీక్షలు చేయించుకో అనేకదా!

నేను పునరుత్పత్తిలో భాగం కావాలని ఎందుకు అనుకున్నావు? నాకు పుట్టేవారు ఈ దోపిడి వర్గాలకు సేవ చేయటానికా? మనం ఆహారం కోసం ఎన్నో జీవుల్ని కృత్రిమ పద్ధతిలో ఉత్పత్తి చేసుకుంటున్నాం. మనుషుల్ని కూడా అలా తయారు చేస్తున్నారు. అది రోబోలతో ఆగదు. ప్రస్తుతానికి చట్టాలు ఒప్పుకోవటం లేదు కాబట్టి రహస్యంగా వుంది.

సైంటిస్టుల్లో కొందరు వికృత ప్రయోగాలు చేస్తున్నట్లు సాహిత్య, కళా రంగాల నుండి అన్ని వ్యవస్థల్లో వికృత ప్రయోగాలు చేస్తున్న వారున్నారు.

అసలు ఇన్ని లక్షల కోట్లు సంపాదిస్తున్న వారు ఎవరి కోసం ఆ పనులు చేస్తున్నారు? తను 'స్వంత' మనుషుల కోసం కాదా? వస్తు ప్రపంచం క్షణక్షణం విస్తృతం అవుతున్నాక. అర్ధరాత్రి కీర్తి, డబ్బూ, ఇంకా చాలా చాలా రావాలని అనుకుంటున్నాక ఏ విలువలూ వుండవు.

ఇవన్నీ పక్కన పెడదాం.

మనకు పెళ్లితోపాటు విడాకుల వ్యవస్థ వుంది. అది ఎన్నో పోరాటాల తర్వాత వచ్చింది. మనుషులు ఇంక కలసి బతకలేని స్థితి వచ్చినప్పుడు ఇద్దరిలో ఎవరో ఒకరు తీవ్రంగా హింసిస్తున్నప్పుడు అది అనివార్యం. దాన్ని ఆలోచనాపరులు తప్పు పట్టరు.

ఇప్పుడు వెన్నెలతో నీకున్న సమస్య ఏంటి? నిన్ను ఒక్కమాట అందా? నిన్ను ఆ రోజు నుండి ఈ రోజు వరకు నాకు ఇది కావాలని అడిగిందా? కనీసం సమయం. నేను ఇంటికి సమయం కేటాయించలేకపోతు న్నాను అని నువ్వు ఎన్నిసార్లు నాతో అనలేదు.

నువ్వు ప్రేమ ఎప్పుడు పుడుతుందో ఎవరికి తెలుసు అంటావు. వెన్నెలని ప్రేమించకుండానే ఇప్పటి దాకా కాపురం చేసావా? నిదాని కన్నావా? అదంతా యాంత్రికంగా జరిగింది అంటావా?

నీలాంటి వాళ్లు మామూలు మనుషుల్లో చాలామంది కనిపిస్తారు. వాళ్లు వాటికి గంభీరమైన పేర్లు పెట్టరు. ప్రపంచ సాహిత్యాల నుండి ఉదాహరణలు ఇవ్వరు. నా ఇష్టం. నేను మగవాడిని అంటారు.

నువ్వు అలా అనగలవా! రేపు అంటావేమో!

వ్యక్తిగత విషయాల గురించి మాట్లాడటానికి మనమెవరం? మీరెవరు? అంటే వ్యక్తిగతం వుంటుందని మీరు ఒప్పుకుంటారు. మీకు అవసరం అయినప్పుడు అది రాజకీయం. మీరు దానికి గురయినప్పుడు వ్యక్తిగతం.

ఇప్పుడు అడుగుతున్నాను. ఈ మధ్యంతర ప్రేమ ఏమిటి? ఈ అలౌకిక పారవశ్యం ఏమిటి? ఈ పరమ ప్రేమకు గమ్యం ఏమిటి? ఇవన్నీ నువ్వు నిన్న వేసుకున్న ప్రశ్నలు..

ఇదేంటి మిత్రమా....

అసలు విలువలు ఓ కుట్ర అంటారు. అవి మారుతుంటాయి అన్నారు. ఎందుకు మారుతున్నాయి. ఎవరి కోసం మారుతున్నాయి. రేపు మీరు కోరుకున్న ప్రపంచంలో ఏ విలువలూ వుండవా? తీర్పులు చెప్పటాన్ని మీరు ప్రశ్నిస్తారు. మీరు తీర్పులు చెప్పుతున్నారేంటి? కష్టాలూ, కన్నీళ్లు, హింస అనుభవించేవారు, ముందుగా చిన్న వయసులో భాగస్వామిని కోల్పోయినవారు ఇంకొకరి తో జీవితం పంచుకోవాలి! ఇలానా!

(ఇంకా ఉంది)

భూకంపాలను అధ్యయనం చేసే శాస్త్రాన్ని ఏమంటారు ?

విపత్తు నిర్వహణ ఆబ్జెక్టివ్ బిట్స్



1. కింది వాటిలో భూకంపాలు సంభవించడానికి కారణం ఏది?
ఎ) అణు ప్రయోగాలు
బి) అగ్ని పర్వతాలు
సి) భూ అంతర్భాగంలో సంభవించే రసాయనిక మార్పులు
డి) పైవన్నీ

2. కింది వాటిలో భూకంప తరంగాలు ఏవి?
ఎ) భూతల తరంగాలు బి) ద్వితీయ తరంగాలు
సి) ప్రాథమిక తరంగాలు డి) పైవన్నీ

3.ప్రాథమిక తరంగాలకు సంబంధించి కింది వాటిలో సరైంది ఏది?
ఎ) వీటిని తోసే తరంగాలు అంటారు
బి) ఇవి ద్రవ, ఘన పదార్థాల్లో మాత్రమే ప్రయాణిస్తాయి
సి) ఇవి అధిక పౌన:పున్యం కలిగి ఉంటాయి
డి) పైవన్నీ సరైనవే

4. కింది వాటిలో లోతు ఆధారంగా సంభవించే భూకంపాలు ఏవి?
ఎ) అగాధ భూకంపాలు బి) మాధ్యమిక భూకంపాలు
సి) గాధ భూకంపాలు డి) పైవన్నీ

5. ద్వితీయ తరంగాలకు సంబంధించి కింది వాటిలో సరైంది ఏది?
ఎ) ఈ తరంగాల వేగం సెకనుకు 3.2 కి.మీ. నుంచి 7.2 కి.మీ. ఉంటుంది
బి) ఇవి ఘన పదార్థాల్లో మాత్రమే ప్రయాణిస్తాయి
సి) వీటిని కదిలించే తరంగాలు అంటారు
డి) పైవన్నీ సరైనవే

6. 'ఛాయా మండలం' అంటే?
1) P తరంగాలు ప్రయాణించని కేంద్ర మండల ప్రాంతం
2) S తరంగాలు ప్రయాణించని కేంద్ర మండల ప్రాంతం
ఎ) 1 మాత్రమే బి) 2 మాత్రమే
సి) 1, 2 రెండూ కావు డి) 1, 2 రెండూ సరైనవే

7. భూకంపాలను అధ్యయనం చేసే శాస్త్రాన్ని ఏమంటారు?
ఎ) సిస్మాలజీ బి) కాస్మాలజీ
సి) ఓసాలజీ డి) జియో మార్ఫాలజీ

8. మనదేశంలో తొలి భూకంప నమోదు కేంద్రాన్ని ఎక్కడ ఏర్పాటు చేశారు?
ఎ) న్యూఢిల్లీ బి) కోల్‌కతా
సి) హైదరాబాద్ డి) ముంబై

9. భూకంప తీవ్రతను కొలవడానికి ఉపయోగించే స్కేలు ఏది?
ఎ) రిక్టర్ స్కేల్ బి) మెర్కలీ స్కేల్
సి) రైన్ గేజ్ డి) 1, 2

10. కింది వాటిలో ఏ ప్రాంతంలో భూకంపాలు ఎక్కువగా సంభవిస్తాయి?
ఎ) అట్లాంటిక్ మహా సముద్రం బి) పసిఫిక్ మహా సముద్రం
సి) హిందూ మహా సముద్రం డి) అరేబియన్ సముద్రం

11. రిక్టర్ స్కేల్‌పై కొలవగలిగే భూకంప తీవ్రత ఎంత?
ఎ) 0 - 9 బి) 2 - 4 సి) 3 - 16 డి) 0 - 5

12. అల్లాబండ్ సరస్సు ఏ విధంగా ఏర్పడింది?
ఎ) భూకంపాల వల్ల బి) అగ్ని పర్వతాల వల్ల
సి) నదీ ప్రవాహం వల్ల
డి) మానవ ప్రమేయం వల్ల

13. అల్లాబండ్ సరస్సు ఏ విధంగా ఏర్పడింది?
ఎ) భూకంపాల వల్ల
బి) అగ్నిపర్వతాల వల్ల
సి) నదీ ప్రవాహం వల్ల
డి) మానవ ప్రమేయం వల్ల



14. 'సైక్లోన్' అనే పదం ఏ భాష నుంచి ఉద్భవించింది?
ఎ) ఫ్రెంచ్ బి) గ్రీకు
సి) అరబ్ డి) డచ్

15. 'సైక్లోన్' అనే పదాన్ని తొలిసారి ఉపయోగించిన వారెవరు?
ఎ) హెన్రీ పెడింగ్టన్ బి) రాబర్ట్
సి) సి.వి. రామన్ డి) లూథర్ గల్నల్

16. ఆంధ్రప్రదేశ్‌లో లైలా తుఫాన్ ఎప్పుడు సంభవించింది?
ఎ) 2009 బి) 2010 సి) 2014 డి) 2012

17. ఆంధ్రప్రదేశ్‌లో హుద్‌హుద్ తుఫాన్ ఎప్పుడు సంభవించింది?
ఎ) 2014 బి) 2013 సి) 2015 డి) 2016

18. హుద్‌హుద్ తుఫాన్ వల్ల ఆంధ్రప్రదేశ్‌లో తీవ్ర ప్రభావానికి గురైన జిల్లా ఏది?
ఎ) విజయనగరం బి) శ్రీకాకుళం
సి) విశాఖపట్టణం డి) పైవన్నీ

19. హుద్‌హుద్ అంటే?
ఎ) ఇజ్రాయెల్ జాతీయ పక్షి బి) అఫ్గానిస్తాన్ జాతీయ జంతువు
సి) బంగ్లాదేశ్‌లోని ఒక గ్రామం డి) శ్రీలంకలో నివసించే ఒక తెగ

20. ఏ ప్రాంతంలో సంభవించే తుఫాన్‌లను 'హరికేన్'లు అని పిలుస్తారు?
ఎ) ఇటలీ బి) కరేబియన్ దీవులు
సి) ఇండోనేషియా డి) జపాన్

21. ఆస్ట్రేలియాలో తుఫాన్‌లను ఏమని పిలుస్తారు?
ఎ) టోర్నడోలు బి) విల్లీవిల్లీలు
సి) నర్గీస్‌లు డి) టైఫూన్‌లు

22. ఇటీవల సంభవించిన 'తిత్లీ తుఫాన్' వల్ల తీవ్రంగా నష్టపోయిన రాష్ట్రం ఏది?
ఎ) ఆంధ్రప్రదేశ్ బి) ఒడిషా
సి) చత్తీస్‌గఢ్ డి) 1, 2

23. ఆంధ్రపదేశ్‌లో తిత్లీ తుఫాన్ ప్రభావానికి గురైన జిల్లా ఏది?
ఎ) శ్రీకాకుళం బి) విజయనగరం సి) కృష్ణా డి) 1, 2

24. ఒడిశాలో తిత్లీ వల్ల తీవ్రంగా నష్టపోయిన జిల్లాలు ఎన్ని?
ఎ) 16 బి) 12 సి) 10 డి) 6

25. కింది వాటిలో వరదలు సంభవించడానికి ప్రధాన కారణం ఏది?
ఎ) కాలువలను తగిన సామర్థ్యంతో నిర్మించకపోవడం
బి) భారీ వర్షాలు కురవడం
సి) సరైన మురుగు నీటి వ్యవస్థ లేకపోవడం
డి) పైవన్నీ

26. వరదల రకాలకు సంబంధించి కింది వాటిలో సరైంది ఏది?
ఎ) ఆకస్మిక వరదలు
బి) పట్టణ వరదలు
సి) నదీ వరదలు
డి) పైవన్నీ సరైనవే

27. వరద విపత్తు నిర్వహణను ఏ మంత్రిత్వశాఖ పర్యవేక్షిస్తుంది?
ఎ) హోం శాఖ బి) రెవెన్యూ శాఖ సి) విత్త శాఖ డి) రైల్వే శాఖ

28. కింది వాటిలో ఏ రాష్ట్రంలో అత్యధికంగా వరదలు సంభవిస్తున్నాయి?
ఎ) ఉత్తరప్రదేశ్ బి) ఒడిశా సి) అసోం డి) పైవన్నీ

29. మనదేశంలో ఎంత శాతం భూమి వరదలకు గురవుతోంది?
ఎ) 12% బి) 19% సి) 40% డి) 42%

30. జాతీయ విపత్తు తగ్గింపు దినోత్సవం ఎప్పుడు నిర్వహిస్తారు?
ఎ) నవంబర్ 26 బి) అక్టోబర్ 29 సి) డిసెంబర్ 21 డి) జూలై 6

31. జాతీయ వరద నిర్వహణ కార్యక్రమాన్ని ఏ సంవత్సరంలో ప్రారంభించారు?
ఎ) 1950 బి) 1954 సి) 1959 డి) 1964

32. కింది వాటిలో వరదల వల్ల కలిగే లాభం ఏది?
ఎ) భూగర్భ జలాల నీటి మట్టం పెరుగుతుంది
బి) పంటల వృద్ధి పెరిగి అధిక దిగుబడి వస్తుంది
సి) వరదలు సంభవించిన ప్రాంతాల్లో నేలలు సారవంతమవుతాయి
డి) పైవన్నీ

33. సునామీ అనే పదం ఏ భాషకు చెందింది?
ఎ) ఫ్రెంచ్ బి) జపనీస్
సి) పోర్చుగీసు డి) రష్యన్

34. భారత భూభాగంలో ఎంత శాతం భూకంపాలు సంభవిస్తున్నాయి?
ఎ) 10% బి) 59% సి) 40% డి) 42%

35. విపత్తు నిర్వహణ చట్టాన్ని ఎప్పుడు రూపొందించారు?
ఎ) 2004 బి) 2005 సి) 2008 డి) 2012

36. మనదేశంలో తక్కువ భూకంప తీవ్రత కలిగిన ప్రాంతం ఏది?
ఎ) దక్షిణ భారత్ బి) ఈశాన్య భారత్ సి) గంగా మైదాన్ డి) ఏదీకాదు

37. నేషనల్ ఇండస్ట్రియల్ సెక్యూరిటీ అకాడమీ ఎక్కడ ఉంది?
ఎ) బెంగళూర్ బి) హైదరాబాద్ సి) ముంబై డి) కోల్‌కతా

38. కింది వాటిలో సునామీ సంభవించడానికి కారణం ఏది?
ఎ) సముద్ర అంతర్భాగంలో సంభవించే అగ్ని పర్వత విస్ఫోటనం
బి) సముద్రంలో ఏర్పడే భూకంపం
సి) సముద్రం బయట ఏర్పడి, నీటిలోకి చేరే భూపాతం
డి) పైవన్నీ

39.అంతర్జాతీయ సునామీ హెచ్చరిక కేంద్రం ఎక్కడ ఉంది?
ఎ) హోనలూలు బి) కాలిఫోర్నియా సి) న్యూజెర్సీ డి) టోక్యో

40. జాతీయ సునామీ ముందస్తు హెచ్చరిక కేంద్రం ఏ నగరంలో ఉంది?
ఎ) బెంగళూరు బి) హైదరాబాద్ సి) గోవా డి) కోల్‌కతా

41. భూకంప తీవ్రత దృష్ట్యా భారత్‌ను ఎన్ని జోన్లుగా విభజించారు?
ఎ) 1-10 జోన్లు బి) 2 - 5 జోన్లు
సి) 1 - 15 జోన్లు డి) 1 - 20 జోన్లు

42. BI ను విస్తరించండి.
ఎ) Bureau of Indian Sciences
బి) Bureau of Indian Standards
సి) Bureau of Indian Services
డి) ఏదీకాదు

సమాధానాలు

1. డి	2. డి	3. డి	4. డి	5. డి	6. డి
7. ఎ	8. బి	9. డి	10. బి	11. ఎ	12. ఎ
13. బి	14. బి	15. ఎ	16. బి	17. ఎ	18. డి
19. ఎ	20. బి	21. బి	22. డి	23. డి	24. ఎ
25. డి	26. డి	27. ఎ	28. డి	29. ఎ	30. బి
31. బి	32. డి	33. బి	34. బి	35. బి	36. ఎ
37. బి	38. డి	39. ఎ	40. బి	41. బి	42. బి

ఓఎన్‌జీసీ- సదరన్ సెక్టార్‌లో 86 పోస్టులు



ఆయిల్ అండ్ నేచురల్ గ్యాస్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఓఎన్‌జీసీ).. సదరన్ సెక్టార్‌లో వివిధ విభాగాల్లో ఖాళీగా ఉన్న 86 పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

విభాగాలు : అసిస్టెంట్ టెక్నీషియన్, అసిస్టెంట్ గ్రేడ్-3, జూనియర్ టెక్నికల్ అసిస్టెంట్, జూనియర్ అసిస్టెంట్ టెక్నీషియన్, జూనియర్ అసిస్టెంట్, జూనియర్ ఫైర్ సూపర్‌వైజర్, జూనియర్ మోటార్ వెహికల్ డ్రైవర్, జూనియర్ ఫైర్‌మ్యాన్.

అర్హత : పోస్టులను బట్టి మెట్రిక్యులేషన్, సంబంధిత విభాగాల్లో గ్రాడ్యుయేషన్, ఇంజనీరింగ్ గ్రాడ్యుయేషన్, డిప్లొమా ఉత్తీర్ణతతో పాటు హెవీ వెహికల్ డ్రైవింగ్ లెసైన్స్, నిర్దేశ శారీరక ప్రమాణాలుండాలి.

వయసు : 2019, ఫిబ్రవరి 20 నాటికి 18-30 ఏళ్ల మధ్య ఉండాలి. రిజర్వేషన్ అభ్యర్థులకు సడలింపు ఉంటుంది.

ఎంపిక : కంప్యూటర్ బేస్డ్ టెస్ట్, ఫిజికల్ స్టాండర్డ్ టెస్ట్/ఫిజికల్ ఎఫిషియన్సీ టెస్ట్, టైపింగ్ టెస్ట్, డ్రైవింగ్ టెస్ట్ ఆధారంగా.

దరఖాస్తు విధానం : ఆన్‌లైన్‌లో.

దరఖాస్తు ఫీజు : జనరల్/ ఓబీసీలకు రూ.370. (రిజర్వేషన్ అభ్యర్థులకు ఉచితం).

దరఖాస్తుకు చివరితేదీ : ఫిబ్రవరి 20, 2019.

వెబ్‌సైట్ : www.ongcindia.com

ఎన్‌ఎల్‌సీ ఇండియాలో 35 పోస్టులు

నైవేలీ (తమిళనాడు)లోని భారత ప్రభుత్వ రంగ సంస్థ ఎన్‌ఎల్‌సీ ఇండియా లిమిటెడ్ వివిధ విభాగాల్లో ఖాళీగా ఉన్న 35 పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

విభాగాల వారీ ఖాళీలు : డిప్యూటీ మెడికల్ ఆఫీసర్-9, బయోకెమిస్ట్-1, ఫార్మసిస్ట్ గ్రేడ్-బి (ఆయుర్వేద)-2, డిప్యూటీ చీఫ్ ఇంజనీర్ (మెకానికల్-6, ఎలక్ట్రికల్-3, సీ అండ్ ఐ-2, ఎన్విరాన్‌మెంటల్ ఇంజనీరింగ్-4)- 15, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (ఎన్విరాన్‌మెంటల్ ఇంజనీరింగ్)-8.

దరఖాస్తు విధానం : ఆన్‌లైన్/ఆఫ్‌లైన్. ముందుగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి. ఆ దరఖాస్తు హార్డ్‌కాపీని ప్రింట్ తీసుకుని, దానికి ఇతర ధ్రువీకరణ పత్రాలు జతచేసి పోస్టులో పంపాలి.

దరఖాస్తు ప్రక్రియ ప్రారంభం : ఫిబ్రవరి 4, 2019.

దరఖాస్తుకు చివరితేదీ : ఫిబ్రవరి 25, 2019.

హార్డ్‌కాపీలను పంపడానికి చివరితేదీ : మార్చి 4, 2019.

పూర్తి వివరాలకు వెబ్‌సైట్ : www.nlcindia.com

ఢిల్లీ సబార్డినేట్ సర్వీసెస్‌లో 264 ఖాళీలు

ఢిల్లీ సబార్డినేట్ సర్వీసెస్‌లో సెలక్షన్ బోర్డ్.. జీఎన్‌సీటీ ఆఫ్ ఢిల్లీ, గవర్నమెంట్ ఆఫ్ ఢిల్లీలో వివిధ విభాగాల్లో ఖాళీగా ఉన్న 264 పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.



విభాగాల వారీ ఖాళీలు :
అసిస్టెంట్ ఇంజనీర్ (ఎలక్ట్రికల్)-7, సివిల్-13. జూనియర్ ఇంజనీర్-సివిల్-103, ఎలక్ట్రికల్-20, సివిల్ (ఎన్‌డీఎంసీ)-33, సివిల్ (డీయూఎస్‌ఐబీ)-61, ఎలక్ట్రికల్ (డీయూఎస్‌ఐబీ)-27.

అర్హత : సంబంధిత ఇంజనీరింగ్ విభాగంలో డిగ్రీ/డిప్లొమా ఉత్తీర్ణత.

ఎంపిక : రాత పరీక్ష, స్కిల్ టెస్ట్ ఆధారంగా.

దరఖాస్తు విధానం : ఆన్‌లైన్‌లో.

దరఖాస్తు ఫీజు : రూ.100.

దరఖాస్తు ప్రక్రియ ప్రారంభం : జనవరి 30, 2019.

దరఖాస్తుకు చివరితేదీ : మార్చి 1, 2019.

వెబ్‌సైట్ : https://dsssbonline.nic.in

భోపాల్-ఎయిమ్స్‌లో 119 ఉద్యోగాలు

భోపాల్‌లోని ఆలిండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సెన్సైస్ (ఎయిమ్స్).. 119 ఫ్యాకల్టీ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

విభాగాల వారీ ఖాళీలు :
ప్రొఫెసర్- 41
అడిషనల్ ప్రొఫెసర్ - 28
అసోసియేట్ ప్రొఫెసర్- 50

అర్హత : పోస్టును బట్టి సంబంధిత విభాగంలో ఎండీ/ఎంఎస్/ఎంసీహెచ్/డీఎం ఉత్తీర్ణతతో పాటు టీచింగ్ లేదా రీసెర్చ్ విభాగంలో అనుభవం ఉండాలి.

వయసు : అసోసియేట్ ప్రొఫెసర్ పోస్టులకు గరిష్టంగా 50 ఏళ్లు, అడిషనల్ ప్రొఫెసర్, ప్రొఫెసర్ పోస్టులకు గరిష్టంగా 58 ఏళ్లు ఉండాలి. రిజర్వేషన్ అభ్యర్థులకు మినహాయింపు లేదు.

ఎంపిక : ఇంటర్వ్యూ ఆధారంగా.

దరఖాస్తు విధానం : ఆన్‌లైన్‌లో.

దరఖాస్తు ఫీజు : జనరల్, ఓబీసీ అభ్యర్థులకు రూ.2000; ఎస్సీ, ఎస్టీలకు రూ.500.

దరఖాస్తుకు చివరితేదీ : మార్చి 6, 2019.

వెబ్‌సైట్ : www.aiimsbhopal.edu.in

విశాలాంధ్ర బిజినెస్

సెన్సెక్స్	నిఫ్టీ	బంగారం (విజయవాడ)	బంగారం (విశాఖపట్నం)	వెండి (విజయవాడ)	వెండి (విశాఖపట్నం)	డాలరు Vs రూపాయి
34.07 ▲	22.10 ▲	50 ▲	31,870	200 ▲	41,400	
36,616.81	10,934.35	31,500 (22 క్యారెట్లు, 10 గ్రాములు)	ప్రొద్దుటూరు 31,870 (22 క్యారెట్లు, 10 గ్రాములు)	41,500 కిలో (రూపాయల్లో)	ప్రొద్దుటూరు 43,848 కిలో (రూపాయల్లో)	71.56

టాప్ గెయినర్స్ (సెన్సెక్స్)

కంపెనీ	ప్రస్తుత ధర	లాభం (శాతాల్లో)
జీ ఎంటర్‌టైన్	365.35	5.06
టైటన్ కంపెనీ	1,066.70	3.99
యూపీఎల్	795.95	3.25
రెడ్డీ ల్యాబ్స్	2,859.85	3.15
హీరో మోటార్‌కార్ప్	2,873.35	2.68

టాప్ లూజర్స్ (సెన్సెక్స్)

కంపెనీ	ప్రస్తుత ధర	నష్టం (శాతాల్లో)
కోల్ ఇండియా	216.40	-2.57
టాటా మోటార్స్	175.80	-2.47
టాటాస్టీల్	464.70	-2.38
ఓఎన్‌జీసీ	148.20	-2.26
భారతీ ఇన్‌ఫ్రాటెల్	295.00	-2.08

విదేశీమారకం విలువ (ఫారెక్స్)

కరెన్సీ	రూ.విలువ క్రి.ముగింపు	రూ.విలువ ప్ర.ముగింపు
డాలర్	71.80	71.56
యూరో	82.15	81.82
పౌండ్	93.74	93.17
ఆస్ట్రేలియా డాలర్	51.82	51.84
సింగపూర్ డాలర్	53.06	52.92

బులియన్

బంగారం (10 గ్రాములు)	22 క్యారెట్లు రూ.	24 క్యారెట్లు రూ.
హైదరాబాద్	31,870	34,085
చెన్నై	31,870	34.085
బెంగళూరు	31,250	33,422
ముంబై	32,490	34,748
విజయవాడ	--	34,400
విశాఖపట్నం	--	33,930
ప్రొద్దుటూరు	--	33,460
ముడి చమురు		61.51

పిచాయ్ మాకొద్దు

- గూగుల్ ఉద్యోగుల్లో సడలుతున్న విశ్వాసం
- తాజా అధ్యయనంలో వెల్లడి



కాలిఫోర్నియా: ప్రతిభకు పట్టం కట్టడంలో ఇంటర్నెట్ దిగ్గజం గూగుల్ ఎప్పుడూ ముందుంటుంది. ప్రపంచం నలుమూలల ఉన్న ప్రతిభావంతులను వెలికి తీయడం, వారికి అవకాశాలను ఇవ్వడంలోనూ గూగుల్‌దే అగ్రస్థానం. అందుకే అత్యంత లాభదాయక ఇంటర్నెట్ సంస్థగా ఈ సెర్చింజన్ వెలుగొందుతున్నది. అలాంటిది నైపుణ్యం, సామర్థ్యం, తెలివితో తొణికిసలాడే గూగుల్ నాయకత్వంపై ఇప్పుడు సంస్థ ఉద్యోగుల్లో అపనమ్మకం ఏర్పడుతున్నదా? అంటే అవుననే సమాధానమే వినిపిస్తున్నది. గూగుల్ సీఈవో, భారత సంతతికి చెందిన సుందర్ పిచాయ్ విజన్‌పై ఉద్యోగుల్లో విశ్వాసం సన్నగిల్లుతున్నదని ఇటీవలి ఓ అధ్యయనంలో తేలింది. గూగులెగిస్ట్ పేరిట జరిగిన వార్షిక అంతర్గత అభిప్రాయ సేకరణలో సంస్థ అభివృద్ధికి పిచాయ్ అనుసరిస్తున్న విధానాలు ప్రభావవంతంగా ఉంటున్నాయా? అన్నదానిపై 78 శాతం మంది ఉంటున్నాయి అని సమాధానమిచ్చారు. ఇంకేం మెజారిటీ ఉద్యోగులు మన పిచాయ్‌కే మద్దతు పలికారుగా.. అనుకోకండి. గతేదాదితో పోల్చితే ఇది తక్కువ. నిరుడు 88 శాతం మంది పిచాయ్ విజన్‌ను విశ్వసించారు. ఈసారి 10 శాతం తగ్గింది. 22 శాతం మంది పిచాయ్‌కి వ్యతిరేకంగా ఓటేశారు.

భవిష్యత్తుపై లేని భరోసా

ఇక భవిష్యత్తులో గూగుల్‌ను సమర్థవంతంగా పిచాయ్, ఆయన నేతృత్వంలోని బృందం నడిపిస్తుందా? అన్న ప్రశ్నకు బదులుగా 74 శాతం మంది అనుకూలంగా స్పందించారు. గతంతో పోల్చితే ఇది కూడా 18 శాతం తగ్గిపోయింది. అలాగే పిచాయ్ నిర్ణయాలు, వ్యూహాలు, వైవిధ్యం తదితర అంశాలపై అడిగిన ప్రశ్నలకూ పోయినసారితో చూస్తే మద్దతు పడిపోవడం గమనార్హం. పిచాయ్ నిర్ణయాలు, వ్యూహాలతో గూగుల్ ప్రదర్శన గొప్పగా ఉంటుందా? అంటే 75 శాతం మంది అవునని చెప్పారు. క్రిందటిసారితో పోల్చితే 13 శాతం తక్కువ. అలాగే పిచాయ్ ఆలోచనలు, దృక్పథం సంస్థ సర్వతోముఖాభివృద్ధికి దోహదం చేస్తాయా? అన్నదానికి 79 శాతం అంగీకరించారు. నిరుడుతో చూస్తే 12 శాతం తగ్గిపోయింది. గూగుల్‌కు సరైన ప్రాధాన్యాలున్నాయా? అన్నదానికి 66 శాతం ఊ కొట్టగా, గతంలో కంటే ఇది 13 తక్కువ. గూగుల్ భవిష్యత్తుపై ఆత్రుతతో ఎదురుచూస్తున్నారా? అన్నదానికి 78 శాతం అవునని చెప్పారు. ఇది కూడా పోయినసారితో చూస్తే 11 శాతం మంది తగ్గిపోయారు. ఇతర సంస్థల ఉద్యోగులతో పోల్చితే గూగుల్‌లో తమ జీతాలు పోటీకరంగానే ఉన్నాయా? అన్నదానికీ 54 శాతం మందే అవునన్నారు. గతంతో చూస్తే 11 శాతం తక్కువ. ప్రస్తుతం గూగుల్‌ను వీడాలన్న ఆలోచనేదీ తమకు లేదు అన్న ప్రశ్నకు బదులుగా 74 శాతం మంది అవును అని సమాధానమిచ్చారు. పోయినసారి కంటే ఇది 2 శాతం తక్కువ. కాగా, ఉద్యోగుల అభిప్రాయాలు, ఆందోళనలు నిజమేనా? అని తెలుసుకోవడానికి.. ఈ ఫలితాలను గూగుల్ తమ ఉద్యోగులందరితోనూ పంచుకున్నది. ఈసారి సర్వేలో 89 శాతం ఉద్యోగులు పాల్గొన్నారు.

గతేడాది నుంచే లుకలుకలు

ఇదిలావుంటే గూగుల్ అధికారప్రతినిధి తాజా సర్వే ఫలితాలపై స్పందించేందుకు నిరాకరించారు. గతేడాది గూగుల్‌లో తీవ్ర సంఘర్షణకర పరిస్థితులు చోటుచేసుకున్న విషయం తెలిసిందే. ఉద్యోగులు, యాజమాన్యం మధ్య బాహాటంగానే ఉద్రిక్తతలు చెలరేగాయి. కాంట్రాక్టు సిబ్బంది ప్రయోజనాల అంశం, కృత్రిమ మేధస్సు వినియోగంలో నీతి వంటి ఎన్నో అంశాలపై పెద్ద ఎత్తునే వర్కర్లు, మేనేజ్‌మెంట్ మధ్య గొడవలు జరిగాయి. లైంగిక వేధింపుల ఆరోపణలు ఎదుర్కొంటున్న ఉద్యోగులను పెద్ద ఎత్తున చెల్లింపులు జరిపి సంస్థ వదిలించుకుందన్న వార్తలూ ఉద్యోగుల్లో అలజడిని రేపాయి. దీనివల్ల ఇతర సంస్థలకు ప్రతిభావంతులు వెళ్లిపోవడం మొదలవగా, ప్రకటనలు తదితర ఇతర వ్యాపారాలే లాభదాయకంగా ఉన్న దుస్థితి తయారైంది. తాజా సర్వే నేపథ్యంలో గూగుల్ అంచనాలు అన్ని అంశాల్లో పేలవంగా ఉంటున్నాయా? అన్న సందేహాలు వ్యక్తమవుతున్నాయి. దుష్ప్రవర్తన నిరూపితమైతే వేగంగా చర్యలు ఉంటున్నాయా? అన్నదానికి 53 శాతం మంది అనుకూలంగా ఓటేశారు. దీంతో దాదాపు సగం మందిలో ఈ విషయంలో అసంతృప్తి, అభద్రతాభావం నిండిపోయిందని తేటతెల్లమవుతున్నది. వేతనాల విషయంలోనూ 44 శాతం మంది పెదవి విరుస్తున్నట్లు బహిర్గతమైంది. అయినప్పటికీ ఇంకా 86 శాతం మంది గూగుల్‌లో పనిచేసేందుకే ఇష్టపడుతున్నట్లు సర్వే స్పష్టం చేసింది.

ఆన్‌లైన్‌లో జాగ్రత్త

తమ స్మార్ట్‌ఫోన్ వినియోగదారులను సోమవారం గూగుల్ అప్రమత్తం చేసింది. మీ విలువైన సమాచారం అపహరణకు గురికాకుండా ఆన్‌లైన్‌లో జాగ్రత్తగా ఉండాలంటూ హెచ్చరించింది. ఫోన్ స్క్రీన్‌కు యూనిక్ పాస్‌వర్డ్‌ను పెట్టుకోవాలని సూచించిన గూగుల్.. అప్లికేషన్ల విషయంలో ఏమరుపాటు తగదని హితవు పలికింది. సెక్యూరిటీచెక్‌కియా అనే ప్రచారంలో భాగంగా గూగుల్ ఈ మేరకు తమ కస్టమర్లకు సలహాలిచ్చింది. మంగళవారం ఇంటర్నెట్ భద్రతా దినం అవగా, దీన్ని పురస్కరించుకుని గూగుల్ ఈ ప్రచారాన్ని చేపట్టింది. టెక్నాలజీ నేడు మన జీవనంలో ఓ భాగమైపోయిన నేపథ్యంలో మోసగాళ్లకు బలికాకూడదనే సదుద్దేశ్యంతో ఆన్‌లైన్ జాగ్రత్తలను సూచిస్తున్నాం అని గూగుల్ ఇండియా ట్రస్ట్ అండ్ సేఫ్టీ విభాగం డైరెక్టర్ సునితా మహంతి అన్నారు. వినియోగదారుల డేటా సురక్షితంగా ఉండేలా తమ ఉత్పత్తుల్లో అన్ని రకాల రక్షణ చర్యలను తీసుకుంటామని, అయినప్పటికీ కస్టమర్లు అప్రమత్తంగా ఉండకపోతే ప్రమాదమని చెప్పారు. తెలిసో.. తెలియకో కొన్ని అప్లికేషన్లను క్లిక్ చేస్తే నష్టం వాటిల్లవచ్చని, కాబట్టి అనవసరమైన వాటి జోలికి వెళ్లకపోవడం ఉత్తమమని ఓ బ్లాగ్‌లో పిలుపునిచ్చారు.

విజ్ఞానం

స్త్రీల మెదడే చురుకు...



పురుషుల మెదళ్లు స్త్రీల మెదళ్లతో పోల్చిచూసుకుంటే త్వరగా కుచించుకుపోతాయని తెలుస్తోంది. వయసుతోపాటు వచ్చే మార్పులకు పురుషుల మెదడు త్వరగా మార్పుకు లోనవుతుంది. వయసు పెరిగేకొలదీ మెటబాలిజం తగ్గుముఖం పడుతుంది. ఇది స్త్రీ, పురుషులకు వ్యత్యాసంఉంటుందని వాషింగ్టన్‌యూనివర్సిటీ స్కూల్ ఆఫ్ మెడిసిన్ అధ్యయనకారులు వెల్లడించారు. స్త్రీ మెదడు పురుషుల మెదడుతో పోల్చి చూసుకుంటే ఒకే వయసు అయినప్పటికీ మెటబాలికల్లీ యంగ్‌గానే ఉంటుందని తెలుస్తోంది.కాగ్నిటివ్ డిక్లయిన్ (జ్ఞాపకశక్తి క్షీణించడం) కూడా స్త్రీలలో పురుషులకన్నా తక్కువగానే ఉంటుందని యూనివర్సిటీ మెలిన్‌క్రాడిట్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ రేడియోలజీలో అసిస్టెంట్ ప్రొఫెసర్ మను గోయల్ వెల్లడించారు. మెమరీ, ప్రాబ్లమ్ సాల్వింగ్, టెస్ట్ ఆఫ్ రీజన్ వంటి వాటిలో స్త్రీలు పురుషులకన్నా బెటర్ అని తేలింది. 20 నుండి 82 ఏళ్ల వయసున్న 121 మంది స్త్రీలు, 84మంది పురుషులపై చేపట్టిన అధ్యయనంలో మెదడుపై షుగర్ పనితీరును అధ్యయనం చేసారు. పెట్‌స్కాన్‌లో స్త్రీలలో ఆక్సిజన్, గ్లుకోజ్ పనితీరును పరిశీలించారు. పురుషుల్లో మెషీన్ లెర్నింగ్ అల్గరిథమ్, బ్రెయిన్ మెటబాలిజంను పరిశీలించగా, అసలు వయసు కన్నా 3.8ఏళ్లు స్త్రీల మెదళ్లు చురుగ్గా ఉన్నట్లు తెలిసింది. అదే పురుషుల్లో 2.4ఏళ్లు మెదళ్ల పనితీరుతక్కువగాఉన్నట్లు తేలింది.

హెచ్‌ఐవీ నియంత్రణకు కొత్త ఆధారాలు..!

హెచ్‌ఐవీని నిరోధించి, వ్యాధి నిరోధకశక్తిని పెంచే టీకాను అభివృద్ధి చేసే కొత్త పద్ధతులను పరిశోధకులు కనుగొన్నారు. ఇన్‌ఫెక్షన్ల నియంత్రణ, హెచ్‌ఐవీ కణాలపై వ్యాధి నిరోధక టీ- కణాలను ప్రతిస్పందించడం మధ్య గల సంబంధాన్ని కెనడాకు చెందిన సిమోన్ ఫ్రేజర్ యూనివర్సిటీ, దక్షిణాఫ్రికాలోని క్వాజులు-నాటల్ యూనివర్సిటీ పరిశోధకులు గుర్తించారు. సాధారణంగా హెచ్‌ఐవీ కణాలు తన రూపును మార్చుకుని టీ-కణాల నుంచి తప్పించుకుంటాయని ప్రొఫెసర్ మార్క్ బ్రోక్‌మన్ తెలిపారు. ఆ కణాలు తప్పించుకోలేని విధంగా వ్యాధి నిరోధక శక్తిని పెంచి హెచ్‌ఐవీని నియంత్రించవచ్చని పేర్కొన్నారు.

లక్ష్మీ విలాస్ బ్యాంకు నష్టం రూ.373 కోట్లు

చెన్నయ్: డిసెంబరు త్రైమాసికంలో లక్ష్మీ విలాస్ బ్యాంకు రూ.373.48 కోట్ల నికర నష్టాన్ని చవిచూసింది. ఏడాది క్రితం ఇదే కాలం నష్టం రూ.39.23 కోట్లతో పోలిస్తే బ్యాంకు నష్టం బాగా పెరిగింది. ఏడాది క్రితంతో పోలిస్తే 2018-19 మొదటి తొమ్మిది నెలలకు నష్టం రూ.37.38 కోట్ల నుంచి రూ.629.66 కోట్లకు చేరింది. మూడో త్రైమాసిక ఆదాయం రూ.817.57 కోట్ల నుంచి రూ. 762.47 కోట్లకు తగ్గగా.. తొమ్మిది నెలలకు రూ.2,647.51 కోట్ల నుంచి రూ.2,350.48 కోట్లకు తగ్గింది.

లాభాల్లో పీఎన్‌బీ

న్యూఢిల్లీ: వేల కోట్ల రూపాయల కుంభకోణంలో చిక్కుకున్న పంజాబ్ నేషనల్ బ్యాంక్(పీఎన్‌బీ) నష్టాల నుంచి బయటపడింది. నీరవ్ మోదీ రూ.13వేల కోట్ల కుంభకోణం వెలుగులోకి వచ్చిన తర్వాత పీఎన్‌బీకి తొలిసారి లాభాలు వచ్చాయి. మూడో త్రైమాసికంలో పీఎన్‌బీ స్వల్ప లాభాలతో గట్టెక్కింది. మంగళవారం ప్రకటించిన త్రైమాసిక ఫలితాల్లో పీఎన్‌బీ 7.12శాతం లాభాలను ఆర్జించింది. డిసెంబరు 31, 2018తో ముగిసిన త్రైమాసికంలో పీఎన్‌బీ రూ.246.51 కోట్ల నికర లాభాన్ని నమోదు చేసుకుంది. అంతకుముందు ఏడాది ఇదే సమయంలో పీఎన్‌బీ రూ.230.11కోట్ల లాభాలను ఆర్జించింది. అయితే.. బ్యాంకు మొత్తం ఆదాయం మాత్రం 2.64శాతం తగ్గి రూ.14,854.24కోట్లు చేరింది. బ్యాంకు ఆదాయం రూ.15,257.5కోట్లుగా ఉంది. స్థూల నిరర్థక ఆస్తులు(ఎన్‌పీఏ) మాత్రం పెరిగాయి. గత ఆర్థిక సంవత్సరం ఇదే త్రైమాసికంలో 12.11శాతం ఉండగా.. మూడో త్రైమాసికంలో అది 16.33శాతానికి చేరింది. మొండిబకాయిల కోసం కేటాయించిన ప్రొవిజన్లు రూ. 2,996.42 కోట్లు ఉండగా.. అవి ఇప్పుడు రూ. 2,565.77కోట్లకు తగ్గాయి.

మార్కెట్లోకి నోకియా 8.1



విశాలాంధ్ర బ్యూరో- **హైదరాబాద్:** నోకియా ఫోన్ల తయారీ కేంద్రమైన హెచ్‌ఎండీ గ్లోబల్ నోకియా 8.1 నూతన వేరియంట్‌ను 6 జీబీ ర్యామ్, 128 జీబీ రామ్‌లతో సహా నూతన కాన్ఫిగరేషన్‌తో విడుదల చేసింది. ప్యూర్ డిస్‌ప్లేతో కూడిన ఫ్లాగ్‌షిప్ కాలిబర్ ఇమేజింగ్ స్మార్ట్‌ఫోన్ అదనపు పనితీరు, స్టోరేజ్‌లతో లభిస్తుందని సంస్థ కంట్రీ హెడ్ అజేయ్ మెహతా తెలిపారు. బుధవారం నుంచి నోకియా.కామ్/ఫోన్స్, అమెజాన్.ఇన్, దేశవ్యాప్తంగా ప్రముఖ మొబైల్ రిటైల్ స్టోర్స్‌లో లభిస్తుందన్నారు. దీని ధర రూ.29,999 అని చెప్పారు. గేమ్స్, వీడియోలు, పిక్చర్స్‌ను స్టోర్ చేసుకోవడం లేదా బ్యాక్‌గ్రౌండ్‌లో నడిచే హెవీ డ్యూటీ యాప్స్ మధ్య అటూ ఇటూ మారడంగానీ, ఏదైనా సరే మరింత వేగంగా చేసుకోవచ్చన్నారు. 12 ఎంపీ మెయిన్ కెమెరా ప్రిసైస్ లైట్ కాప్చర్, లార్జ్ 1.4 మైక్రాన్ పిక్సెల్స్‌ను, సెకండరీ 13 ఎంపీ డెప్త్ సెన్సర్, దీర్ఘకాలం ఉండే పవర్, స్నాప్ డ్రాగన్ 710 మొబైల్ ప్లాట్‌ఫామ్‌లతో లభిస్తుందన్నారు. నోకియా.కామ్ / ఫోన్స్ పై కొనుగోలు చేసే వారు రూ.3,000 విలువ చేసే గిఫ్ట్ కార్డు పొందుతారని చెప్పారు.

స్వల్ప లాభాల్లో మార్కెట్

పెరిగిన ఆటోమొబైల్ సూచీ

ముంబై: లాభనష్టాల మధ్య ఊగిసలాడిన స్టాక్‌మార్కెట్లు మంగళవారం లాభాల్లోకి ప్రవేశిం చాయి. సెన్సెక్స్ 34.07యింట్లుతో 0.09 శాతంతో 36,616వద్ద, నిఫ్టీ22 పాయింట్లు బలపడి 10,934 వద్ద ముగిసింది. ముఖ్యంగా రిలయన్స్ ఇండస్ట్రీస్ ఆల్ టైంని హైని తాకింది. ఇది మార్కెట్లకు ఊతమిస్తోంది. అలాగే బ్యాంక్ నిఫ్టీ లాభాలతో నిఫ్టీ 11వేల స్థాయిని అధిగమిం చేందుకు ఉరకలు వేస్తోంది. మరోవైపు రిజర్వ్ బ్యాంక్ అధ్యక్షతన రెండు రోజుల మానిటరీ కమిటీ పాలసీ సమావేశాలు మంగళవారం నుంచి ప్రారంభమై మూడురోజులపాటు జరగనున్న నేపథ్యంలో ఇన్వెస్టర్లు అప్రమత్తత కొనసాగనుందని విశ్లేషకుల అంచనా. ఆర్‌బీఐ గవర్నర్ శక్తికాంతదాస్ నేతృత్వంలోని ఆరుగురు సభ్యులు ద్రవ్య విధాన కమిటీ (ఎంపీసీ) కీలక వడ్డీ రేటును 25 బేసిస్ పాయింట్ల మేర కోత విధించే అవకాశాలు ఉన్నాయని ఎస్‌బీఐ నివేదిక అంచనా వేసింది. సెన్సెక్స్ ప్యాక్‌లో హీరో మోటాకార్ప్, ఇండస్‌ఇండ్ బ్యాంకు, బజాజ్ ఆటో, మారుతి, ఎమ్ అండ్ ఎమ్ టాప్ గెయినర్స్‌కాగా, 2.66శాతం లాభాన్నిఆర్జించాయి. టాటామోటార్స్, కోల్ ఇండియా, ఓఎన్‌జీసి, టాటాస్టీల్, యస్ బ్యాంకు, సన్‌ఫార్మా, ఐటిసి, ఐసిఐసిఐ బ్యాంకు 2.63శాతం దిగజారాయి. బీఎస్‌ఇ మిడ్‌కాప్, స్మాల్‌కాప్ సూచీలు 0.91శాతం దిగజారాయి. రియాల్టీ, మెటల్స్, ఎఫ్‌ఎమ్‌సిజి సూచీలు రెడ్‌లో నమదుకాగా ఆటో, ఫైనాన్షియల్ రంగాలు అత్యధికంగా నమోదయ్యాయి. విదేశీ మదుపరులు సుమారు రూ.112.13కోట్ల విలువగల షేర్లను కొనుగోలుచేయగా, దేశీయ మదుపరులు రూ.65.22కోట్ల షేర్లను అమ్మినట్లు తెలుస్తోంది. మెటల్, ఎఫ్‌ఎంసీజీ,రియల్టీ బలహీనంగా ఉండగా, మీడియా, ఆటో, ప్రయివేట్ బ్యాంక్స్ లాభపడుతున్నాయి. నిఫ్టీ దిగ్గజాలలో హెచ్‌డీఎఫ్‌సీ, టైటన్, ఇండస్‌ఇండ్, డాక్టర్ రెడ్డీస్, జీ, బజాజ్ ఆటో, హీరో మోటో, ఎంఅండ్ఎం, యూపీఎల్, ఐషర్, యాక్సిస్ టాప్ విన్నర్స్‌గా ఉండగా, టాటా మోటార్స్, ఇన్ఫ్రాటెల్, కోల్ ఇండియా, ఐటీసీ, సన్ ఫార్మా, ఓఎన్‌జీసీ, సిప్లా, ఐఓసీ, ఎయిర్‌టెల్, టాటా స్టీల్ నష్టపోతున్నాయి. ప్రధానంగా రియల్టీ సెక్టార్‌కు సంబంధించి ఇండియాబుల్స్ డీఎల్‌ఎఫ్, ఫీనిక్స్, యూనిటెక్, బ్రిగేడ్, ఒబెరాయ్, గోద్రెజ్ ప్రాపర్టీస్ నష్టపోతున్నాయి.

ఐడీబీఐ బ్యాంక్‌కు మొండి బకాయిల దెబ్బ

క్యూ3లో రూ.4,185 కోట్లకు చేరిన నష్టాలు

న్యూఢిల్లీ: ఎల్‌ఐసీ హస్తగతమైన ఐడీబీఐ బ్యాంక్‌కు డిసెంబరుతో ముగిసిన మూడో త్రైమాసికంలోనూ భారీ నష్టాలు తప్పలేదు. గత ఏడాది ఇదేకాలంలో రూ.1,524.31 కోట్లున్న నష్టాలు, ఈ ఆర్థిక సంవత్సరం (2018-19) మూడో త్రైమాసికంలో మూడింతలు పెరిగి రూ.4,185.48 కోట్లకు చేరాయి. ఇదే కాలంలో బ్యాంక్ ఆదాయం, రూ.7,125.20 కోట్ల నుంచి రూ.6,190.94 కోట్లకు తగ్గిపోయింది. స్థూల మొండి బకాయిల(ఎన్‌పీఏ) భారం 24.72 శాతం నుంచి 29.67 శాతానికి పెరగడం, బ్యాంక్ లాభాలను బాగా దెబ్బతీసింది. దీంతో ఎన్‌పీఏల కేటాయింపుల భారం రూ.3,649.82 కోట్ల నుంచి రూ.5,074.80 కోట్లకు చేరింది. అయితే ఇదే కాలంలో బ్యాంక్ మొత్తం రుణాల్లో, నికర ఎన్‌పీఏలు 16.02 శాతం నుంచి 14.01 శాతానికి తగ్గాయి. కొత్తగా చేరే ఎన్‌పీఏల భారం, ఏడు త్రైమాసికాల కనిష్ఠ స్థాయికి తగ్గడం ఇందుకు బాగా దోహదం చేసిందని బ్యాంక్ పేర్కొంది. బ్యాంక్ ఈక్విటీలో ఎల్‌ఐసీ 51 శాతం వాటా తీసుకోవడం ఇటీవలే పూర్తయింది. దీంతో గత నెల 21న ఎల్‌ఐసీ నుంచి బ్యాంక్‌కు రూ.21,624 కోట్ల మూలధన నిధులు లభించాయి.

మూడు ప్రభుత్వ బీమా సంస్థల విలీనం

న్యూఢిల్లీ: మూడు ప్రభుత్వరంగ బీమా సంస్థల విలీనం వచ్చే ఏడాది పూర్తికానున్నట్లు ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి. నేషనల్ ఇన్సూరెన్స్ కంపెనీ, యునైటెడ్ ఇండియా ఇన్సూరెన్స్ కంపెనీ, ఓరియంటల్ ఇండియా ఇన్సూరెన్స్ కంపెనీలను విలీనం చేయనున్నట్లు 2018-19 ఆర్థిక సంవత్సరానికిగాను ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో కేంద్రం ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ విలీనాన్ని వచ్చే ఆర్థిక సంవత్సరంలోనే పూర్తిచేయాలనే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం అడుగులు వేస్తున్నది. గత శుక్రవారం ప్రకటించిన మధ్యంతర బడ్జెట్‌లో ఈ విలీన ప్రక్రియ కొనసాగుతున్నదని, వచ్చే ఆర్థిక సంవత్సరం చివరినాటికి పూర్తికానున్నదని తెలిపింది. మార్చి 31, 2017 నాటికి ఈ మూడు కంపెనీలు 200 బీమా ఉత్పత్తులను విక్రయిస్తుండగా, మొత్తం ప్రీమియం వసూళ్లు రూ.41, 461 కోట్లుగా ఉన్నాయి. 44 వేల మంది సిబ్బంది కలిగిన ఈ మూడు సంస్థల నికర విలువ రూ.9.243 కోట్లుగా నమోదైంది. విలీనం తర్వాత ఏర్పడనున్న ఈ సంస్థ.. నాన్-లైఫ్ ఇన్సూరెన్స్ విభాగంలో రూ.1.2 -1.5 లక్షల కోట్ల నికర విలువతో అతిపెద్ద సంస్థగా అవతరించనున్నది. ఇందుకు సంబంధించి త్వరలో కన్సల్టెంట్‌ను నియమించబోతున్నది కేంద్ర ప్రభుత్వం.

పన్ను కడితే 24 గంటల్లోనే ఐటీ రిఫండ్!

న్యూఢిల్లీ: ఆదాయపన్ను చెల్లిస్తున్న వాళ్లకు ఓ శుభవార్త. ఐటీ రిటర్న్స్ ప్రక్రియను 24 గంటల్లోనే ముగించి, ఆ వెంటనే రీఫండ్ చేసేలా రెవెన్యూ శాఖ కసరత్తు ప్రారంభించింది. రెండేళ్లలోపే దీనిని అమలు చేయడానికి ప్రయత్నాలు మొదలుపెట్టారు. ఇప్పటికే సెంట్రల్ బోర్డ్ ఆఫ్ డైరెక్ట్ ట్యాక్సెస్ (సీబీడీటీ)లోని ఐటీ విభాగాన్ని మెరుగుపరిచేందుకు కేంద్ర ప్రభుత్వం రూ.4200 కోట్లు మంజూరు చేసింది. దీనివల్ల రిటర్న్స్, రీఫండ్స్, స్క్రూటినీ, వెరిఫికేషన్ వేగంగా పూర్తి చేసే అవకాశం కలుగుతుంది. ప్రస్తుతం రీఫండ్స్ ప్రక్రియను ఆన్‌లైన్‌లోనే పూర్తి చేస్తున్నట్లు రెవెన్యూ కార్యదర్శి అజయ్ భూషణ్ పాండే చెప్పారు. ఈ ఏడాది ఇలా రూ.1.5 లక్షల కోట్ల రీఫండ్స్‌ను నేరుగా బ్యాంకు అకౌంట్లలో వేసినట్లు తెలిపారు. ఇప్పుడీ వ్యవస్థను మరింత మెరుగుపరచి 24 గంటల్లోనే రీఫండ్స్ ఇచ్చేలా చేస్తున్నామని ఆయన వెల్లడించారు. సాధ్యమైనంత త్వరలో ఈ ప్రక్రియను పూర్తి చేస్తామని పాండే తెలిపారు. మొన్న బడ్జెట్ సందర్భంగానే ఇన్‌కమ్ ట్యాక్స్ డిపార్ట్‌మెంట్ ఆన్‌లైన్‌లో పని చేస్తున్నదని ఆర్థిక మంత్రి పియూష్ గోయల్ చెప్పిన విషయం తెలిసిందే.

19 శాతం తగ్గిన అపోలో టైర్స్ లాభం

న్యూఢిల్లీ : అపోలో టైర్స్ 3వ క్వార్టర్ నికర లాభంలో 19 శాతం తగ్గుదల నమోదు చేసింది. దీంతో అక్టోబర్ నుంచి డిసెంబర్ చివరి నాటికి రూ. 198 కోట్ల నికర లాభం ఆర్జించినట్లు తెలిపింది. గత ఆర్థిక సంవత్సరంలో ఇదే సమయానికి రూ. 245 కోట్ల లాభం ప్రకటించింది. అయితే అమ్మకాలు 16 శాతం పెరిగినట్లు, రూ. 4,655 కోట్ల అమ్మకాలు జరిగినట్లు తెలిపింది. ముడి పదార్థాల రేట్లు పెరగడంతో కర్చులు కూడా రూ.4,440.59 కోట్లకు పెరిగాయని తెలిపింది. 'కర్చులు పెరగడంతో క్యూ3లో లాభాలు తగ్గినా.. ప్రస్తుతం డిమాండ్ ఎక్కువగా ఉన్న కారణంగా నాలుగో క్వార్టర్ సమయానికి మరింత వృద్ధిని సాధించగలమని' సంస్థ చైర్మన్ ఓన్‌కర్ ఎస్ కన్వర్ తెలపిపారు. స్టాక్ ఎక్స్ఛేంజ్‌లో అపోలో టైర్స్ 0.17 శాతం లాభంతో రూ.200.70 వద్ద ట్రేడవుతోంది.

పెరిగిన వెండి, బంగారం ధరలు

న్యూఢిల్లీ: దేశీయ మార్కెట్‌లో బంగారం,వెండి ధరలు పెరిగాయి. బంగారం ధరలు రూ.25లు పెరిగి 10గ్రాములు రూ.34,475లు పలికింది. వెండి రూ.170లు పెరిగి కేజీ వెండి ధర రూ.41,700లకు చేరింది. అంతర్జాతీయంగా బంగారం ధర ఔన్స్ 1315.33 డాలర్లు పలికింది. సోమవారం ఒక్కరోజే బంగారం రూ.340లు పెరిగింది. సవరు బంగారం ధర రూ.26,100లు పలికింది.

నెలకు రూ.20 నుంచి జీ తెలుగు ప్యాకేజీ

విజయవాడ : ట్రాయ్ నిబంధనల ప్రకారం ఫిబ్రవరి 1 నుంచి వినియోగదారులు తమకు నచ్చిన చూసిన ఛానల్‌కే డబ్బులు చెల్లించాలి. దీంతో జీ తెలుగు.. ఆకర్షణీయమైన ప్యాకేజీలను అందుబాటులోకి తీసుకువచ్చింది. జీ తెలుగు ప్రైమ్ ప్యాక్ నెలకు రూ.20 నుంచి మొదలు కాబోతుంది. ఈ స్పెషల్ ఆఫర్ ఆంధ్ర, తెలంగాణలో అమలు జరుగుతుంది. ఇందులో 9 ఛానెల్స్ వస్తాయి. ఇక జీ సూపర్ ప్యాక్ తెలుగు ఎస్డీ ధరని రూ.26 గా నిర్ణయించారు. ఇందులో 10 చానెల్స్ వస్తాయి. జీ ఫ్యామిలీ ప్యాక్ తెలుగు -ఎస్డీ ధరని రూ. 45గా నిర్ణయించారు. ఇందులో 17 చానెల్స్ వస్తాయి. జీ తెలుగు అల్ ఇన్ వన్ ప్యాక్-ఎస్డీ ధరని రూ. 66గా నిర్ణయించారు. ఎంటర్‌టైన్‌మెంట్, మూవీస్, న్యూస్, మ్యూజిక్, లైఫ్‌స్టైల్, .. ఇలా 23 ఛానల్స్ వస్తాయి. ప్రపంచం నలుమూలలా ఉండే తెలుగు ప్రేక్షకుల్ని ఆకట్టుకుంటున్నాయి. అందుకోసమే ఇప్పుడు ప్రేక్షకుల కోసం వివిధ రకాలు ప్యాక్లను అందుబాటులోకి తీసుకువచ్చాం" అని చెప్పారు.

గెయిల్ ఇండియా లాభం రూ.1,681 కోట్లు

33 శాతం పెరిగిన లాభాలు

న్యూఢిల్లీ : జాతీయంగా అతి పెద్ద గ్యాస్ కంపెనీ గెయిల్ ఇండియా లిమిటెడ్ క్యూ3లో 33 శాతం లాభాలు ప్రెకటించింది. డిసెంబర్ చివరి నాటికి రూ. 1,681.23 కోట్లు నికర లాభం సంపాదించినట్లు, అత్యధిక మొత్తంలో సహజ గ్యాస్ అమ్మకాలు అలాగే మార్కెటింగ్ ఇందుకు కారణమి తెలపింది. 9 శాతం అధికంగా సహజ గ్యాస్‌ను అమ్మగా, 11 శాతం మేర అధికంగా ఎల్‌పీజీని తరలించామని, ఏప్రిల్-డిసెంబర్ మధ్యలో రూ.4,903 కోట్లు నికర లాభం ఆర్జించినట్లు ఇది గత ఏడాది కంటే 36 శాతం అధికమని గెయిల్ తెలిపింది.

మిలియన్ క్లబ్‌లో ఫోన్‌పే...!

విజయవాడ : భారత దేశంలో పది లక్షల ఆఫ్‌లైన్ దుకాణాల్లో తాము ఆర్థిక లావాదేవీలు నిర్వహిస్తున్నట్టు ఫోన్‌పే ప్రకటించింది. ఏడాది కన్నా తక్కువ కాలవ్యవధిలోనే తాము ఈ మైలు రాయిని దాటామని ఫోన్‌పే హర్షం వ్యక్తం చేసింది. భారీ స్థాయి చిల్లర దుకాణాలతో పాటు చిన్న, మధ్య తరహా చిల్లర దుకాణాల్లో ఫోన్‌పేకు అనూహ్య ఆదరణ లభిస్తోంది. యూపీఐ ద్వారా లావాదేవీలు ప్రారంభించిన ఫోన్‌పే భీమ్, క్రెడిట్ కార్డులు, డెబిట్ కార్డులు, ఇతర వాలెట్లు ద్వారానూ వినియోగదారుల నుంచి చెల్లింపులు స్వీకరించేందుకు వీలు కల్పిస్తోంది. ఈ సందర్భంగా ఫోన్‌పే వ్యాపార విభాగం అధిపతి యువరాజ్ సింగ్ షెకావత్ మాట్లాడుతూ, గత ఏడాదిగా తమ ఆఫ్‌లైన్ వ్యాపారం అతివేగంగా సాగుతోందని, మిలియన్ ఖాతాదారులను సొంతం చేసుకోవటం ఆనందంగా ఉందన్నారు. సంస్థాగతయేతర విభాగం అధిపతి వివేక్ లోచెట్ మాట్లాడుతూ, ఫోన్‌పే సమర్పిస్తున్న క్యూఆర్ ఇతర భీమ్ యూపీఐ యాప్‌ల నుంచి కూడా చెల్లింపులకు అవకాశం కల్పిస్తోందన్నారు.



ఫేస్‌బుక్‌లో మూడింతలైన నకిలీ ఖాతాలు

తాజా సంస్థాగత నివేదికలో వెల్లడి

హైదరాబాద్: గడిచిన మూడేండ్లలో ఫేస్‌బుక్‌లో నకిలీ ఖాతాలు మూడింతలకుపైగా పెరిగినట్లు ఓ తాజా నివేదిక ద్వారా స్పష్టమైంది. 250 మిలియన్లకుపైగా డూప్లికేట్ అకౌంట్లు ఉన్నట్లు ఈ ఫేస్‌బుక్ వార్షిక రిపోర్టులో వెల్లడైంది. దీంతో రిజిస్టర్డ్ ఫేస్‌బుక్ యూజర్లైన నెలసరి యాక్టివ్ యూజర్లు (ఎంఏయూలు) ఆందోళనకు గురవుతున్నారు. ప్రపంచవ్యాప్తంగా గతేడాది చివరి త్రైమాసికం (అక్టోబర్-డిసెంబర్)లోని ఎంఏయూల్లో దాదాపు 11 శాతం నకిలీ ఖాతాదారులే కావచ్చని ఫేస్‌బుక్ అంచనా వేస్తున్నది. 2015లో ఇది 5 శాతంగానే ఉండగా, నాడు డిసెంబర్ 31నాటికి ఎంఏయూలు 1.59 బిలియన్లుగా ఉన్నారని, 2018 డిసెంబర్ ఆఖరుకు 2.32 బిలియన్లకు పెరిగారని పేర్కొన్నది. కాగా, అభివృద్ధి చెందిన దేశాల కంటే ఫిలిప్పీన్స్, వియత్నాం వంటి అభివృద్ధి చెందుతున్న మార్కెట్లలో డూప్లికేట్ల జోరు ఎక్కువగా ఉందని ఫేస్‌బుక్ భావిస్తున్నది. నకిలీ ఖాతాలతో పాటు తప్పుడు ఖాతాలూ 2018 ఆఖరు త్రైమాసికంలో సుమారు 5 శాతం ఉండొచ్చని అంటున్నది. ఇదిలావుంటే రోజువారి యాక్టివ్ యూజర్లు నిరుడు డిసెంబర్‌లో 9 శాతం పెరిగి 1.52 బిలియన్లకు పెరిగారని, 2017 డిసెంబర్‌లో 1.40 బిలియన్లుగా ఉన్నారని ఈ సందర్భంగా ఫేస్‌బుక్ తెలియజేసింది.

యాజమాన్య పద్ధతులతో

అధిక దిగుబడులు

యాజనాన్య పద్దతులు తగురీతిలో చేపట్టినట్లయితే పంటలు అధికదిగుబడులు సాధించవచ్చని కృష్ణాజిల్లా గరికపాడు కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ రాజ్యశ్రీ రైతులకు సూచించారు. వివిధ పంటలకు సంబంధించి ప్రస్తుతం రైతులు ఆచరించాల్సిన అంశాలపై పలు సూచనలు చేశారు.



పత్తి..

పత్తి తీసేటప్పుడు పూర్తిగా పొడిగా ఉండాలి, మంచు పడినప్పుడు అది పూర్తిగా ఆవిరి అయ్యేంత వరకు ఆగి, ఆ తరువాత పత్తిని తీసుకోవాలి. వర్షం పడినట్లయితే, ఆరిన తరువాత మాత్రమే పత్తి తీత మొదలెట్టాలి. పత్తి తీసేటప్పుడు పూర్తిగా విచ్చుకున్న, ఆరోగ్యంగా ఉన్న కాయల నుంచి తీసిన పత్తిని, పురుగు, తెగుళ్లు ఆశించిన కాయల నుంచి, పక్వానికి రాని కాయల నుంచి తీసిన పత్తిని వేర్వేరు సంచులలో సేకరించుకోవాలి. ఏది ఏమైనా మనం పత్తిని అమ్మేటప్పుడు, జిన్నింగ్ చేసుకునేటప్పుడుగానీ, గుడ్డి పత్తి మంచి పత్తిలో కలిసినట్లయితే నాణ్యత పోవడమే కాకుండా రావలసిన ధర రాదు. సాధారణంగా చివరలో తేసే పత్తి కొంచెం నాసిరకంగా ఉంటుంది. కాబట్టి దానిని ప్రత్యేకంగా ఉంచి అమ్ముకోవాలి. తేమగా ఉన్న పత్తిని ఎట్టి పరిస్థితుల్లోను తీయకూడదు. ఒకవేళ తీసినా నిల్వ చేయకూడదు, పత్తిలో తేమశాతం 1.2 కంటే ఎక్కువగా ఉన్నట్లయితే వేడిపెరిగి విత్తనాన్ని, దూదిని కూడా పాడుచేస్తుంది.

మెట్ట మినుము, పెసర...

మెట్టలో వేసిన మినుము, పెసర పైర్లు పూత, కాయ దశలలో ఉన్నాయి. వీటికి మారుక గూడు పురుగు ఆశించే అవకాశం ఉంది. పంటలో 35 రోజుల దశలో వేప సంబంధిత మందులు (వేపనూనె/వేపగింజల కషాయం 5 శాతం) పిచికారీ చేసినట్లయితే రెక్కల పురుగులు గుడ్లు పెట్టకుండా నివారించవచ్చు. పూత సమయంలో క్లోరిపైరిఫాస్ 2.5 మి. లీ లేక క్వినాల్ ఫాస్ 2.0 మి.లీ. లేక ఎసిఫేట్ 1.0 గ్రా, లీటరు నీటికి కలిపి పిచికారీ చేసుకోవాలి. పైరులో గూళ్లు ఎక్కువగా ఉన్నట్లయితే క్లోరిఫైరిపాస్ 2.5 మి.లీ లేదా నొవాల్యురాన్ 1.0 మి.లీ లేదా స్పైనోసాడ్ 0.3 మి.లీ. లేదా యోడికార్బ్ 1.0 గ్రా,లలో ఏదైనా ఒక మందుతో పాటు డైక్లోరివాస్ 1.0 మి.లీ / చ ఒక లీటరు నీటికి కలిపి పిచికారీ చేసి నివారించవచ్చు. పురుగు ఎక్కువగా ఉన్నట్లయితే ఫ్లువెంటఎమైడ్ 0.2 మి.లీ లేక క్లోరాంట్ర నిలిప్రోల్ 0.3 మి.లీ లేక ఎమామెక్టివ్ బెంజోయేట్ 0.4 గ్రాములు ఏదైనా ఒక దానిని పిచికారీ చేసుకోవచ్చు. పురుగుల ఉధృతిని బట్టి 7 నుంచి 10 రోజుల వ్యవధిలో మందులను మార్చిమార్చి పిచికారీ చేయాలి.పెసర, మినుము పంటలలో తామరపురుగు, తెల్లదోమ ఆశించి నష్టం కలుగచేసే అవకాశం ఉంది. తామరపురుగు నివారణకు 1.0 గ్రాములు ఎసిఫేట్ లేదా 1.0 మి.లీ ఫిప్రోనిల్‌ను ఒక లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి. తెల్లదోమ నివారణకు 1.0 గ్రా ఎసిఫేట్ లేదా ట్రైజోఫాస్ 1.5 మి.లీ లేదా 2 మి.లీ మెటాసిస్టాక్స్ లేక ఎసిటామిప్రిడ్ 0.2 గ్రా ఒక లీటరు నీటిలో కలుపి పిచికారీ చేయాలి. పల్లాకు తెగులు, ఆకుముడ తెగుళ్లు ఆశించిన మొక్కలను తొలిదశలోనే గమనించి మొక్కలను పీకివేసి తెగులు వ్యాప్తికి కారకాలైన రసం పీల్చు పురుగులను నివారించాలి. మినుము పైరు తొలి దశలో కొరినోస్పోరా ఆకుమచ్చ తెలుగు ఆశిస్తుంది. దీనిని అరికట్టటానికి పైరు 30– 35 రోజుల దశలో లీటరు నీటికి 3 గ్రా కాపర్ ఆక్సీక్లోరైడ్ లేదా 2.5 గ్రా మాంకోజెబ్ లీటరు కలిపి పిచికారీ చేయాలి.

మెట్టమీద సాగుచేసే మొక్కజొన్న..

అక్టోబరు – నవంబరు నెలలో విత్తిన మొక్కజొన్న ప్రస్తుతం దాసరి ఈనె దశ నుంచి గింజపాలు పోసుకునే దశలో ఉంది. దాసరి ఈనె దశలో ఉన్న పైరుకు (విత్తిన 60 – 65 రోజులకు) చివరి మోతాదుగా ఎకరానికి 55 కిలోలు యూరియా, 25 కిలోలు మ్యూరేట్ ఆఫ్ పోటాష్ వేయాలి. పునరుత్పత్తి దశలో మొక్కజొన్న నీటి ఎద్దడికి గురైతే దిగుబడులు బాగా తగ్గుతాయి. కాబట్టి తగినంత తేమ పైరుకు అందేలా పూత దశలో, పూత వచ్చిన 15 రోజులకు, గింజ పాలుపోసుకునే దశలో నీటి తడులు ఇవ్వాలి.

– తోట ప్రసాద్,
నందిగామ, కృష్ణాజిల్లా



చెరకు..

జనవరిలో చెరకు నరికిన తరువాత కార్శి తోట సాగుకు... చెరకు మోళ్లు బుజాలు నరకడం ద్వారా కార్శి పిలకలు దృఢంగా వస్తాయి. నాగలి నడిపిన కార్శికి సిఫారసు చేసిన భాస్వరం, పొటాష్, మొదటి దఫా నత్రజని ఎరువులు వాడుకోవాలి. తరువాత ఎకరానికి 1.3 టన్నుల చెరకు చాళ్లలో 40 నుంచి 50 సెం.మీ.కు చెరకు దుబ్బులు లేనప్పుడు ఖాళీలను గుర్తించి, తయారు చేసుకున్న చెరకు పిలకలు లేదా చెరకుముచ్చలతో తప్పక భర్తీ చేసుకోవాలి. నవంబరు-డిసెంబరు మాసాల్లో నరికి కాల్చివేసిన చెరకుతోటల్లో రెండవదఫా నత్రజని మోతాదును వాడి దగ్గరదగ్గరగా తడులు ఇచ్చుకోవాలి.

పాలు పితకడంలో

మెలకువలు పాటించాలి

పాడి పశువులకు కావాల్సిన వాటిని సమయానుగుణంగా అందించడంలో నేర్పు అవసరం. అలాగే పశువుల పాలు పితకడంలో కూడా వడుపుగా వ్యవహరించి, మెలకువలను పాటించాలి. ఈ ప్రక్రియలో సమయపాలన పాటించకుండా సరైన పద్ధతులను అనుసరించకపోతే పాడి రైతులకు నష్టంతోపాటు పశువులకుపొదుగు వ్యాధి సంక్రమించే అవకాశాలు ఉన్నాయి. పాలు తీయడం ప్రారంభించాక పది నిముషాల్లో ప్రక్రియను పూర్తిచేయాల్సి ఉంటుంది. పాలు పితికే పద్ధతులు, తీఈఉవలసని జాగ్రత్తలపై పశు సంవర్ధకశాఖ అధికారులు ఇస్తున్న సలహాలు ఇవి.



పిడికిలితో పాలు తీసే విధానం

- పిడికిలితో పాలు పితికే పద్ధతిలో రొమ్ము మొత్తాన్ని పిడికిలిలో బిగించి, మొదట రొమ్ము పైభాగంలో బొటనవేలు, చూపుడువేలు ఒక వలయవంగా ఏర్పరచి, ఒత్తిడి పెంచాలి.
- అనంతరం మిగతా వేళ్లతో రొమ్మును ఒత్తినట్లయితే పాలు ధారలుగా వస్తాయి.
- ఈ విధంగా రెండు చేతులతో రెండురొమ్ముల్ని మళ్లీమళ్లీ నొక్కుతూ పాలు పితకవచ్చు.
- ఈ పద్ధతిలో పాలు పితకడంవల్ల పాడి పశువులు అసౌకర్యానికి గురికావు.
- ఈ పద్ధతి తల్లినుంచి దూడ పాలు తాగే విధానానికి దగ్గరగా ఉంటుంది.



రెండు వేళ్లతో పితికే పద్ధతి

- ఈ పద్ధతిలో రెండు రొమ్ముల్ని రెండు చేతులతో పొదుగు దగ్గర బొటనవేలు, చూపుడువేలు మధ్యన ఉంచి వేళ్లను కిదకు నొక్కుతూ పాలు పిండవచ్చు.
- సన్నని రొమ్ములు ఉన్న పాడి పశువుల్లో ఈ విధానాన్ని పాటిస్తారు.
- ఈ ప్రక్రియ వల్ల రొమ్ములుసాగే అవకాశం ఉంటుంది.


బొటనవేలుతో పితికే పద్ధతి

- ఎక్కువమంది రైతులు ఈ పద్ధతిలో పాలు తీస్తుంటారు. ఈ విధానంలో రొమ్మును పిడికిలితో బిగించి, బొటనవేలితో ఒత్తుతూనే వదులుతున్నట్లు చేస్తే పాలధారలు వస్తాయి.
- ఈ పద్ధతిలో బొటనవేలితో రొమ్మును నొక్కడంవల్ల రొమ్ములోని సున్నితమైన కణజాలం దెబ్బతిని రొమ్ములు వాచే, పొదుగు వాపు వచ్చే అవకాశం ఎక్కువగా ఉంటుంది.

పాలు పితికేముందు తీసుకోవలసిన జాగ్రత్తలు

- రైతులు పాడి పశువుల నుంచి పాలను అనేక విధాలుగా చేతితో పితితే విధానాలను అనుసరిస్తున్నారు. అయితే పశువు ఎడమవైపునుంచి పాలు పితకడం పరిపాటి.
- పాలు పితితే వ్యక్తి సౌలభ్యాన్ని బట్టి ఏ రొమ్ము నుంచి పాలు పిండాలనే అంశాన్ని ఎన్నుకోవాలి.
- ముందుగా పశువు పొదుగును శుభ్రమైన నీటితోనే కడిగి తుడవాలి.
- ప్రతి రొమ్ము నుంచి కొన్ని పాలధారలను పరీక్ష కప్పుల్లో వేర్వేరుగా తీయాలి.
- పితికి పాలలో ఏవైనా కుదుపులు లేదా రక్తపు గడ్డలు లేవని నిర్ధారించుకోవాలి.
- పాలను పితికేముందు ఇలా జాగ్రత్తలు తీసుకుంటే పొదుపు వాపు లక్షణాలను ముందుగానే గమనించి తగు చికిత్సను సంబంధిత పశువుకు అందించవచ్చు.
- ప్రాథమిక స్థాయిలోనే జబ్బును గుర్తించటం వల్ల పాల దిగుబడి తగ్గుముఖం పట్టకుండా పశువుకు వచ్చిన వ్యాధికి అధిక మందుల ఖర్చు లేకుండా రైతు ఆర్థికంగా నష్టపోకుండా బయటపడవచ్చు.





వినయ విధేయ వసూళ్లు ప్చ్..!

రామ్‌చరణ్ – బోయపాటి శ్రీను కాంబినేషన్లో తెరకెక్కిన 'వినయ విధేయ రామ' భారీ అంచనాలతో ప్రేక్షకుల ముందుకు వచ్చిన సంగతి తెలిసిందే. ఈ సినిమా థియేట్రికల్ రన్ పూర్తయింది. ఈ సినిమా థియేట్రికల్ రైట్స్ విలువ రూ. 92 కోట్లు కాగా ఫుల్ రన్‌లో రూ.62.64 కోట్ల రూపాయల డిస్ట్రిబ్యూటర్ షేర్ మాత్రమే రాబట్టగలిగింది. ముప్ఫై కోట్ల నష్టాలతో డిజాస్టర్‌గా నిలిచింది. ఈ సినిమా ఉత్తరాంధ్ర, ఉభయ గోదావరిలు, నెల్లూరు ఏరియాలలో మెరుగైన కలెక్షన్స్ వసూలు చేసింది. నైజామ్ వసూళ్లు మాత్రం మిగతా ఏరియాలతో పోల్చి చూస్తే చాలా తక్కువగా ఉన్నాయి. ఈ సినిమా నైజాం, ఉత్తరాంధ్ర డిస్ట్రిబ్యూషన్ రైట్స్ రూ.32 కోట్లకు దిల్‌రాజు తీసుకున్నారు. ఆయనకు ఈ సినిమాతో దాదాపు రూ.11 కోట్ల రూపాయల నష్టం వాటిల్లింది. ఇదిలా ఉంటే ఓవర్సీస్‌లో ఈ సినిమా ఏ మాత్రం ప్రభావం చూపించలేకపోయింది.

ఎంతైనా సూపర్‌స్టార్ కదా !



సూపర్‌స్టార్ రజినీకాంత్ హీరోగా తెరకెక్కిన 'పేట' చిత్రం మంచి విజయాన్ని సొంతం చేసుకుని భారీగా వసూళ్లను కూడా రాబట్టింది. అయితే సినిమాకు భారీగా ఖర్చు చేయడం డిస్ట్రిబ్యూటర్లకు ఎక్కువ రేటుకు అమ్మడం వల్ల ఈ చిత్రం మంచి వసూళ్లు దక్కించుకున్నా..నిర్మాత, డిస్ట్రిబ్యూటర్లు మాత్రం లాభాలను దక్కించుకోలేక పోయారు. అందుకే రజనీ తన తదుపరి మురుగదాస్ దర్శకత్వంలోని సినిమాకు పారితోషికాన్ని భారీగా తగ్గించుకున్నారని తమిళ మీడియాలో వార్తలు వస్తున్నాయి. అలాగే ఈ చిత్రం బడ్జెట్ పరిమితి విధించినట్లు తెలుస్తోంది. రజినీకాంత్ గత చిత్రాలన్నీ కూడా మంచి వసూళ్లను రాబట్టినా కూడా డిస్ట్రిబ్యూటర్లను మరియు ఎగ్జిబ్యూటర్లను భారీ నష్టాల్లో ముంచాయి. దాంతో రజినీకాంత్ ఈ మేరకు ఈ నిర్ణయం తీసుకున్నారని సమాచారం.గతంలో డిస్ట్రిబ్యూటర్లను ఆదుకునేందుకు తన పారితోషికంను త్యాగం చేసిన రజనీ మరోసారి అదే విధంగా చేయడంపై తమిళ సినీ వర్గాల్లో చర్చ జరుగుతోంది.

కొరటాలకు రూ.2 కోట్లు అడ్వాన్స్



టాలీవుడ్‌లో సక్సెస్‌లతో దూసుకుపోతున్న దర్శకుడు కొరటాల సినిమా తీస్తే దానిపై భారీ అంచనాలే ఉంటాయి.ప్రస్తుతం మెగాస్టార్ చిరంజీవి నటించే 152వ సినిమాకి స్క్రిప్టు రెడీ చేస్తున్న సంగతి తెలిసిందే. ప్రీప్రొడక్షన్ పనులు పూర్తవుతున్నాయి. ఈ నేపథ్యంలో చిరంజీవి సైరా నరసింహారెడ్డి చిత్రం పూర్తిచేసి వెంటనే కొరటాల దర్శకత్వంలో నటించేందుకు రెడీ అవుతున్నారు. చిరు సరసన పలువురు కథానాయికల పేర్లను పరిశీలించారని సమాచారం. ఈ సందర్భంలోనే కొరటాల గురించిన ఓ ఆసక్తికర విషయం తెలిసింది. చిరంజీవి 152 కోసం పారితోషికంగా కొరటాల ఏం తీసుకుంటున్నాడన్న దానికి సన్నిహితులు ఇచ్చిన సమాచారం ఆసక్తి రేకెత్తిస్తోంది. రూ.2కోట్ల అడ్వాన్స్‌ను ఇప్పటికే కొరటాలకు ఇచ్చారట. అలాగే కొన్ని ఏరియాల హక్కుల్ని పారితోషికంగా ముట్టజెబుతామని నిర్మాత రామ్‌చరణ్ మాటిచ్చారట. వాస్తవానికి ఒక్కో సినిమాకి కొరటాల రూ.10–15 కోట్ల మేర పారితోషికం అందుకుంటున్నాడని బయట ప్రచారం ఉంది. అంటే రూ.2కోట్లు అడ్వాన్స్ రూపంలో తీసుకున్నా మిగతా మొత్తం ఏరియా హక్కుల రూపంలో అతడికి దక్కుతాయి. కోస్తా ఆంధ్రాలో కొన్ని ఏరియాలను కొరటాలకు అప్పజెప్పేందుకు డీల్ కుదిర్చారన్న మాటా వినిపిస్తోంది. ఏరియాను బట్టి హీరోలకు డిమాండు ఉంటుంది. అక్కడ బిజినెస్ కలెక్షన్స్ స్పీడ్ ఉంటుంది. కనీసం ఈ ప్రాజెక్టుతో కొరిటాలకు 10–15 కోట్లు గిట్టుబాటు అయ్యే ఛాన్సుందని అంచనా వేస్తున్నారు.



నాడు..నేడు అదే చిరునవ్వు

క్యాన్సర్ అంటే ఒకప్పుడు జనం భయపడేవారు. కానీ ఇప్పుడు మెరుగైన వైద్యం అందుబాటులోకి రావడంతో దాన్ని ధైర్యంగా ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా యువరాజ్ సింగ్ లాంటి స్టార్ క్రికెటర్లతో పాటుగా మనిషా కొయిరాలా.. సోనాలి బెంద్రే లాంటివారు ఆ సమస్యను ధైర్యంగా ఎదుర్కొని క్యాన్సర్‌ను జయించారు. సోనాలి బెంద్రే అయితే ట్రీట్మెంట్ పూర్తయ్యే వరకూ తన ఎమోషన్స్‌ను సోషల్ మీడియా ద్వారా పంచుకుంటూ ప్రేరణగా నిలిచింది. వరల్డ్ క్యాన్సర్ డే సందర్భంగా హీరోయిన్ మమతా మోహన్ దాస్ ఇన్స్టాగ్రామ్‌లో ఓ ఫోటోను పోస్ట్ చేసింది. పదేళ్ళ క్రితం క్యాన్సర్ ట్రీట్‌మెంట్లో భాగంగా గుండు చేయించుకున్నప్పటి ఫోటోతో పాటుగా లేటెస్ట్ ఫోటో ఒకదానిని పోస్ట్ చేసి "గుండు అందరి కళ్ళను మీవైపు తిప్పేలా చేస్తుంది" అంటూ క్యాప్షన్ ఇచ్చింది. పదేళ్ళ క్రితం గుండులో ఉన్న మమతా ఇప్పుడు మళ్ళీ లాంగ్ హెయిర్‌తో నార్మల్‌గా ఉంది. కానీ రెండు ఫోటోలలో కొట్టొచ్చినట్టు కన్పించే అంశం ఏమిటంటే ఆమె చిరునవ్వు.. దాని వెనకున్న ఆత్మవిశ్వాసం. ఎన్టీఆర్ 'యమదొంగ'.. నాగార్జున 'కేడి' లాంటి సినిమాలలో మమత హీరోయిన్‌గా నటించింది. 'కేడీ' షూటింగ్ జరుగుతున్న సమయంలోనే క్యాన్సర్ అని తెలియడంతో ట్రీట్‌మెంట్ మొదలుపెట్టాల్సి వచ్చింది. అప్పుడు మమత కొన్ని షెడ్యూల్స్ విగ్‌తో నటించిందని సమాచారం.

విశాలాంధ్ర సినిమా

డబుల్ ఖబడ్దార్ ! : వర్మ



రామ్‌గోపాల్ వర్మ తాజాగా ట్విట్టర్ ఖాతా ద్వారా ఓ ఫోటోను పోస్ట్ చేసి ట్వీట్లవర్షం కురిపించాడు. తెల్ల చొక్కా.. ఎగ్గట్టిన తెల్లపంచె.. చేతిలో ఓ పొడవాటి కత్తిని పట్టుకున్న మనిషి ఫోటో అది. మార్ఫింగ్ చేసిన ఆ ఫోటోలో ఫేస్ మాత్రం వర్మదే. ఫోటోతో పాటు అయన చేసిన కొన్ని ట్వీట్లు ఇలా ఉన్నాయి. "ఏయ్ లక్ష్మీస్ ఎన్టీఆర్ విడుదలకు ఎవరైనా అడ్డొస్తే ఖబడ్దార్." "రేరేయ్ ఎన్టీఆర్ కథానాయకుడు కాదు .. మహానాయకుడు కాదురా.. ఆయన అసలు నాయకుడు.. ఆ నిజం రెండు తెలుగు రాష్ట్రాల ప్రజలకీ నా చిత్రంలోని అసలు కథతో తెలుస్తుందిరా.. డబుల్ ఖబడ్దార్." ఈ ట్వీట్లకు అర్థం తన సినిమాకు అడ్డంకులు సృష్టించడానికి ఎవరో ప్రయత్నిస్తున్నారని..ఒకవేళా అలా చేస్తే వారిని వదలనని హెచ్చరిస్తున్నట్టుగా అన్పిస్తోంది. అలాగే దీని వెంటనే మరో ట్వీట్‌లో అదే ఫోటోకు నారా లోకేష్ ముఖాన్ని తగిలించి "ఈ అద్భుతమైన వ్యక్తిని చూసి నేను భయపడ్డాను. ఇతనెవరో నాకు తెలీదు కానీ దావూద్ ఇబ్రహీం, ఒసామా బిన్ లాడెన్, పరిటాల రవి కన్నా తీవ్రంగా ఉన్నాడు.అరవిందసమేత సినిమాలో తారక్ బదులు ఈ వ్యక్తి ఉంటే కలెక్షన్లు మూడురెట్లు ఎక్కువవుతాయి" అని ట్వీట్ చేశాడు.

బాలయ్యదే నిర్ణయం

ఎన్టీఆర్ బయోపిక్ రెండవ భాగం 'ఎన్టీఆర్ మహానాయకుడు' విడుదల తేదీపై మొదటి నుంచి ఎంతో అయోమయం నెలకొని ఉంది. మొదట ఈ సినిమాను రిపబ్లిక్ డే వీకెండ్లో విడుదల చేస్తారని మొదట్లో వార్తలు వచ్చాయి. అయితే ఫిబ్రవరి 7వ తేదీన రిలీజ్ చేస్తామని ప్రకటించారు. కానీ ఈ చిత్రం ఆశించిన ఫలితం సాధించకపోవడంతో రెండు భాగంలో కొన్ని మార్పుచేర్పులు చేయడంతో రిలీజ్ డేట్ మారింది. బాలయ్యకు ముహూర్తాల విషయంలో చాలా పట్టింపు ఉన్న సంగతి తెలిసిందే. మంచి ముహూర్తం లేకుండా ఆయన ఎలాంటి పని ప్రారంభించరు. అందుకే ఈ సినిమాను శివరాత్రి పండుగకు మూడు నాలుగు రోజుల ముందుగా రిలీజ్ చేసేందుకు ప్లాన్ చేస్తున్నారని సమాచారం.



సంస్కృత ప్రార్థనలు లౌకికత్వం కాదా ?

న్యూఢిల్లీ : సంస్కృత ప్రార్థనలు చేయడం లౌకికత్వం కాదా అని బీజేడీ నాయకుడు మెహతాబ్ లోక్‌సభ జీరో అవర్‌లో ప్రశ్నించారు. కేంద్రీయ విద్యాలయ విద్యార్థులకు సంస్కృత ప్రార్థనలు తప్పనిసరి చేయడంపై సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు కావడంపై ఆయన పై విధంగా స్పందించారు. సుప్రీంకోర్టు, లోక్‌సభల్లో ఈ విషయంపై చర్చ జరగాలన్నారు. ఉపనిషత్తుల నుంచి ఈ సాధారణ ప్రార్థనలు వెలువడ్డాయన్నారు. సంస్కృత ప్రార్థనలు లౌకికత్వం కాకపోవడం ఏమిటని, దీనిపై సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేయాల్సిన అవసరం ఏమొచ్చిందని సభలో ప్రశ్నించారు. పశ్చిమ బెంగాల్ ప్రభుత్వం అవినీతికి పాల్పడిన వ్యక్తులను బంగ్లాదేశ్ అక్రమ వలసదారులను ఓటుబ్యాంకు రాజకీయాల కోసం వాడుకుంటోందని బీజేపీ సభ్యుడు నిషికాంత్ దూబే విమర్శించగా, వర్సిటీలు, కాలేజీల్లో టీచర్ల నియామకాల కోసం రూస్టర్ సిస్టంను మార్చాలని ఎస్పీకి చెందిన ధర్మేంద్ర యాదవ్ లోక్‌సభను కోరారు.

పక్కపక్కనే రాహుల్, ప్రియాంక ఆఫీసులు



న్యూఢిల్లీ : కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ప్రియాంక వాద్రా, సోదరుడు రాహుల్‌గాంధీ ఆఫీసులను పక్కపక్కనే ఏర్పాటు చేశారు. సోమవారం ఆమె అమెరికా నుంచి రాగానే న్యూఢిల్లీలోని పార్టీ ప్రధాన కార్యాలయంలో మంగళవారం ఆఫీసు కేటాయించారు. రాహుల్ కాంగ్రెస్ చీఫ్ కాకముందు 2016లో ఈ గదిలోనే కూర్చునేవారు. ఆఫీసు బయట ప్రియాంక గాంధీ వాద్రా నేమ్‌బోర్డును హిందీ, ఇంగ్లీషుల్లో ఏర్పాటు చేశారు. కుంభమేళా సంగమంలో ఆమె పుణ్యస్నానం అయిన తర్వాత బాధ్యతలు స్వీకరిస్తారని భావిస్తున్నారు. ఇకపై ఫేస్‌బుక్, ట్విటర్లలో కూడా ఆమె చురుగ్గా ఉండబోతున్నారు. ప్రియాంక గాంధీ పర్యటనల కోసం లక్నోలోని నెహ్రూ భవన్‌ను కూడా సిద్ధం చేస్తున్నారు. అక్కడి నుంచే ఆమె ఉత్తరప్రదేశ్ లోక్‌సభ ఎన్నికలను పర్యవేక్షిస్తారు. మాజీ ప్రధాని, ఆమె నాయనమ్మ ఇందిరాగాంధీ ఇక్కడి నుంచే పార్టీ కార్యకలాపాలను నిర్వహించేవారు. వాస్తు శాస్త్రం ప్రకారం మార్పులు చేపట్టి, అంతర్గతంగా మెరుగులు దిద్దుతున్నారు. రాహుల్ గాంధీ, ప్రియాంక, పశ్చిమ ఉత్తరప్రదేశ్ ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి జ్యోతిరాదిత్య సింధియాలు కలసి సార్వత్రిక ఎన్నికల కోసం గురువారం కార్యాచరణను తయారు చేస్తారు.



రైతుల దురవస్థపై సర్వే

న్యూఢిల్లీ : రైతుల దురవస్థను అంచనా వేసేందుకు ఈ ఏడాది కేంద్రం పాన్ ఇండియా సర్వేను నిర్వహించనుంది. జూలై-జూన్ వరకు వారి ఆదాయం-అప్పుల గణన ఉంటుందని వ్యవసాయ శాఖ సహాయ మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్ లోక్‌సభకు రాతపూర్వక సమాధానం చెప్పారు. వ్యవసాయ కుటుంబాల పరిస్థితులను అంచనా వేసేందుకు 77వ రౌండ్‌లో నేషనల్ శాంపుల్ సర్వే (ఎన్‌ఎస్‌ఎస్)ను ఈ ఏడాది నిర్వహిస్తామన్నారు. దీంతో దేశంలోని రైతుల ఆదాయం- వ్యయం-అప్పులతో సహా ఆర్థిక స్థితిపై సమగ్ర సమాచారం అందుబాటులోకి వస్తుందన్నారు. ఇంతవరకు ఎన్‌ఎస్‌ఎస్ రైతులపై ఇలాంటి సర్వేను నిర్వహించలేదని,రైతులకు సంబంధించి 2014 నుంచి 2017 వరకు సమగ్ర సమాచారం లేనందువల్లే ఈ సర్వే చేపట్టామని మంత్రి తెలిపారు. సంపూర్ణ సమాచారం కలిగి ఉంటే రైతులను ఎలా ఆదుకోవాలన్న విషయంలో స్పష్టతతో పాటు వనరుల లభ్యత, మానవశక్తి, ప్రాంతాల వారీగా ప్రాధాన్యతాంశాలు తెలుస్తాయన్నారు. దీంతో ప్రతి ఐదేళ్లకు ఒకసారి ఉద్యోగాల కల్పన- నిరుద్యోగ సమస్యలపై కూడా స్పష్టత వస్తుందన్నారు. 2022 నాటికి కేంద్రం రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేయడానికి అంతర్గత మంత్రిత్వశాఖ కమిటీ కృషి చేస్తుందని షెకావత్ లోక్‌సభకు వెల్లడించారు.

మళ్లీ అనుమతివ్వండి

- శబరిమల ఆలయ దర్శనం కోసం బిందు, కనకదుర్గ
- సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు

న్యూఢిల్లీ : శబరిమల ఆలయాన్ని మరోసారి దర్శించుకునేందుకు అనుమతి ఇవ్వాలని కేరళకు చెందిన మహిళలు బిందు, కనకదుర్గ సుప్రీం కోర్టును అభ్యర్థించారు. శబరిమల తీర్పు విషయంలో వేసిన రివ్యూ పిటిషన్లలో తమను వ్యాజ్యదారులుగా చేర్చుకోమని కోరారు. అలాగే శబరిమల ఆలయ తలుపులు మళ్లీ తెరిచినప్పుడు వెళ్లేందుకు అనుమతి ఇవ్వాలని కోరుతూ వాళ్లిద్దరూ ఈ పిటిషన్ వేశారు. దీనికి సంబంధించి సుప్రీంకోర్టు ధర్మాసనం బుధవారం విచారణ చేపట్ట నుంది. శబరిమల ఆలయంలోకి ప్రవేశించి నందుకు తమకు బెదిరింపులు వస్తున్నాయని, ప్రాణహాని ఉందని, రక్షణ కల్పించాలని కోరుతూ ఇటీవల ఆ ఇద్దరు మహిళలు గత నెల సుప్రీం కోర్టును ఆశ్రయించిన విషయం తెలిసిందే. ఈ అంశంపై విచారణ జరిపిన న్యాయస్థానం బిందు, కనకదుర్గలకు 24/7 రక్షణ కల్పించాలంటూ కేరళ ప్రభుత్వాన్ని ఆదేశించింది. శబరిమల అయ్యప్ప ఆలయం లోకి అన్ని వయసుల మహిళలు ప్రవేశించ వచ్చని గత ఏడాది సుప్రీంకోర్టు తీర్పు వెలు వరించింది. ఈ నేపథ్యంలోనే జనవరి 2న బిందు, కనకదుర్గలు ఆలయంలోకి వెళ్లారు. దీంతో పెద్ద ఎత్తున నిరసనలు చెలరేగాయి. ఆలయంలోకి వెళ్లిన అనంతరం వారిద్దరూ కొన్ని రోజుల పాటు అజ్ఞాత ప్రదేశంలో తల దాచుకున్నారు. జనవరి 15న కనకదుర్గ తన ఇంటికి వెళ్లగా.. ఆమె అత్త కనకదుర్గపై దాడి చేసి తీవ్రంగా గాయపరిచింది. ఈ పరిణామాల నేపథ్యంలోనే బిందు, కనకదుర్గలు తమకు రక్షణ కల్పించాలని సుప్రీంను ఆశ్రయించారు.

మాదే నైతిక విజయం..

సుప్రీం తీర్పు హర్షణీయం : మమత



కోల్‌కతా : శారదా చిట్‌ఫండ్ కుంభకోణం నేపథ్యంలో కోల్‌కతా పోలీసు కమిషనర్ రాజీవ్ కుమార్‌ను అరెస్టు చేయొద్దన్న సుప్రీంకోర్టు తీర్పును పశ్చిమ బెంగాల్ సీఎం మమతా బెనర్జీ స్వాగతించారు. అధికారులలో నైతిక బలాన్ని నింపేలా తీర్పు ఉందని, ఇది హర్షణీయమని ఆమె అన్నారు. 'ఇది మన ప్రజాస్వామ్యం, రాజ్యాంగం, దేశం విజయం. న్యాయ వ్యవస్థపై మాకు పూర్తి విశ్వాసం ఉంది. కుమార్‌ను అరెస్టు చేయొద్దని సుప్రీంకోర్టు ఆదేశించింది. సర్వోన్నత న్యాయస్థానం ఆదేశాలకు కట్టుబడి ఉంటాం. మాపై సీబీఐ చేసిన ధిక్కరణ ఫిర్యాదునూ కోర్టు కొట్టివేసింది. సీజేఐ, సుప్రీం కోర్టు, హైకోర్టు న్యాయమూర్తులంటే మాకు అపార గౌరవం. ఈ మేరకు తీర్పును వెలువరించిన వారికి కృతజ్ఞతలు' అని మమత అన్నారు. ఆందోళనను విరమిస్తారా అన్న ప్రశ్నకు 'ఇప్పుడే కాదు .. పార్టీ నేతలతో చర్చించిన తర్వాతే దీనిపై నిర్ణయిస్తాం' అని ఆమె బదులిచ్చారు. నిందితులను అరెస్టు చేసి వారిని ఒడిశాలోని భువనేశ్వర్‌కు సీబీఐ తరలిస్తోందని, ఇప్పుడు ఈ కొత్త ట్రెండ్ ప్రారంభమైందని, ప్రశ్నించేందుకు షిల్లాంగ్ తటస్థ స్థలంగా ఉందని మమత అన్నారు. అయితే అది చాలా అందమైన ప్రాంతమని ఆమె ప్రశంసించారు.

మమతకు సుప్రీం షాక్ : బీజేపీ



న్యూఢిల్లీ : సీబీఐ విచారణకు హాజరుకావాలని కోల్‌కతా పోలీసు కమిషనర్ రాజీవ్‌కుమార్‌ను సుప్రీంకోర్టు ఆదేశించడాన్ని బీజేపీ స్వాగతించింది. ఇది మమతకు గట్టి షాక్ అని.. సీబీఐ నైతిక విజయమని అభివర్ణించింది. క్రమంగా ఆయన అరెస్టుకూ రంగం సిద్ధమవుతుంది అని వ్యాఖ్యానించింది. బీజేపీ సీనియర్ నేత, కేంద్రమంత్రి రవిశంకర్ ప్రసాద్ మాట్లాడుతూ, సుప్రీంకోర్టు తీర్పును స్వాగతిస్తున్నాం, మమత సర్కార్‌కు ఇది గట్టి ఎదురుదెబ్బ అని అన్నారు. చట్టానికి ఎవరు అతీతులు కాదని మరోసారి రుజువైందని చెప్పారు. బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి కైలాష్ విజయవర్గీయ సుప్రీంకోర్టుకు ధన్యవాదాలు తెలిపారు. సుప్రీం తాజా ఉత్తర్వులతో ప్రజాస్వామ్యం గెలిచిందని అన్నారు. పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రిగా మమతా బెనర్జీ రాజీనామా చేయాలని ఆయన డిమాండు చేశారు. 'ఓ పోలీసు అధికారిని ప్రశ్నించకుండా సీబీఐని ఆపేందుకు మమతా బెనర్జీ దీక్షను చేపట్టారు. చిట్‌ఫండ్ పెట్టుబడిదారులకు డబ్బును తిరిగిప్పించేందుకు మమత దీక్ష చేపట్టి ఉంటే దేశప్రజలు హర్షించేవారు' అని విజయవర్గీయ వ్యాఖ్యానించారు.

ఎన్నికల్లో లబ్ధి పొందేందుకే..

కేంద్రంపై శివసేన విమర్శ



ముంబై (మహారాష్ట్ర) : కోల్‌కతాలో నెలకొన్న రాజకీయ పరిణామాలను ప్రస్తావిస్తూ కేంద్ర ప్రభుత్వంపై శివసేన విమర్శలు గుప్పించింది. రానున్న లోక్‌సభ ఎన్నికల్లో లబ్ధి పొందాలనే ఉద్దేశంతోనే ఎన్‌డీఏ ఇటువంటి చర్యలకు పాల్పడుతోందని ఆరోపించింది. రోజ్ వ్యాలీ, శారదా పోంజీ కుంభకోణాల కేసుల్లో విచారణ జరుపుతున్న కేంద్ర దర్యాప్తు బృందం (సీబీఐ).. కోల్‌కతా పోలీస్ కమిషనర్ రాజీవ్ కుమార్‌ను విచారించడానికి ఆయన నివాసానికి వెళ్లగా.. పశ్చిమ బెంగాల్ పోలీసులు అడ్డుకున్న విషయం తెలిసిందే. ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి మమతా బెనర్జీ ధర్నా కూడా చేపట్టారు. ఈ నేపథ్యంలో శివసేన తమ పార్టీ పత్రిక సామ్నాలో 'ప్రజాస్వామ్యానికి ముప్పు' అంటూ ఒక కథనాన్ని ప్రచురించింది. 'కోల్‌కతా పోలీస్ కమిషనర్‌పై కేంద్ర ప్రభుత్వం రెండు నెలల క్రితమే విచారణ జరిపించాల్సింది. లేదంటే విచారణ నిమిత్తం ఆయన నివాసానికి వెళ్లేముందు సమన్లు జారీ చేయాల్సింది. శారదా చిట్ ఫండ్ కుంభకోణంలో భాగస్వామిగా ఉన్నవారెవరినీ వదలడానికి వీల్లేదు. కానీ, నాలుగున్నరేళ్లుగా సీబీఐ వ్యవహరిస్తున్న తీరు బాగోలేదు. పశ్చిమ బెంగాల్‌లో నెలకొన్న పరిస్థితులను ప్రధాని నరేంద్ర మోడీ.. దేశ ప్రధానిగా పట్టించుకోవాలి. బీజేపీ నేతగా కాదు. మహారాష్ట్ర, ఉత్తర భారత్‌లో బీజేపీకి లోక్‌సభ ఎన్నికల్లో ఈ సారి 100 కంటే తక్కువ సీట్లు వస్తాయి. ఈ పరిస్థితుల్లో పశ్చిమ బెంగాల్‌లో కనీసం 10-15 సీట్లను గెలుచుకోవాలని భావిస్తోంది. ఎన్నికల నేపథ్యంలోనే ఆ రాష్ట్రంలో ఇటువంటి పరిస్థితులు నెలకొన్నాయి. బీజేపీ జాతీయాధ్యక్షుడు అమిత్ షా.. ఆ రాష్ట్రంలో రథయాత్రలు నిర్వహించాలని నిర్ణయించుకున్నప్పటికీ 'బీజేపీ వర్సెస్ మమతా' పోరాటం కొనసాగుతోంది. ఇటీవల ఉత్తర ప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ హెలికాప్టర్ దిగేందుకు కూడా పశ్చిమ బెంగాల్ అధికారులు అనుమతి ఇవ్వలేదు. మమతా బెనర్జీ-ఆమె నేతృత్వంలోని టీఎంసీకి. మా పార్టీకి మధ్య విభేదాలు ఉండొచ్చు.. కానీ, నిజానికి ఆమె.. సమర్థంగా కేంద్రాన్ని ఎదిరిస్తున్నారు' అని పేర్కొంది.

12 వరకు తెల్తుంబ్డేను అరెస్టు చేయం

బీమా -కోరేగావ్ కేసులో హైకోర్టులో పూనే పోలీసులు

ముంబై : బీమా-కోరేగావ్ కేసులో నిందితుడిగా ఉన్న దళిత మేధావి ఆనంద్ తెల్తుంబ్డేను ఈనెల 12వ తేదీ అర్థరాత్రి వరకు అరెస్టు చేయమని పూనే పోలీసులు మంగళవారం బాంబే హైకోర్టుకు తెలిపారు. పూనే పోలీసుల తరపు న్యాయవాది అరుణా పాయ్ ఈ మేరకు జస్టిస్ ఎస్‌డబ్ల్యు సాంబ్రే ధర్మాసనానికి వెల్లడించారు. ఎల్గర్ పరిషత్-బీమా కోరేగావ్ కేసులో అరెస్టు నుంచి రక్షణ కల్పించాలని కోరుతూ తెల్తుంబ్డే చేసిన పిటిషన్‌ను హైకోర్టు విచారించింది. 2018, జనవరి 1న పూనే దగ్గరలోని కోరేగావ్-బీమా గ్రామంలో చెలరేగిన ఘర్షణల కేసులో తెల్తుంబ్డే నిందితుడిగా ఉన్నారు. అక్రమ కార్యకలాపాల నివారణ చట్టం (యూఏపీఏ)లోని పలు సెక్షన్ల కింద ఆయనపై అనేక ఆరోపణలు నమోదయ్యాయి. గతవారంలో అరెస్టు అయి కోర్టు ఆదేశాలతో విడుదలైన తెల్తుంబ్డే అరెస్టు నుంచి రక్షణ కోసం హైకోర్టును ఆశ్రయించారు.

కాంగ్రెస్ గూటికి శిల్పా షిండే



ముంబై 'భాబీ జీ ఘర్ పర్ హై' ఫేమ్, బిగ్‌బాస్ 11 సీజన్ విన్నర్ శిల్పా షిండే మంగళవారం కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. మహారాష్ట్ర ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు సంజయ్ నిరుపమ్ కండువా కప్పి ఆమెను పార్టీలోకి ఆహ్వానించారు. కొంతకాలంగా శిల్పా షిండే రాజకీయాల్లోకి రాబోతున్నారనే వార్తలు వినిపిస్తున్నా, వాటిపై ఆమె స్పందించలేదు. 1999లో ప్రాచుర్యం పొందిన టీవీ సీరియల్ 'భాబీ జీ ఘర్ పర్ హై' సీరియల్‌లో అంగూరీ భాబీ పాత్ర ద్వారా ఆమె బుల్లితెరపై కనిపించారు. బిగ్‌బాస్ సీజన్ 11 విజేతగా నిలిచారు.

రుణమాఫీ కోసం కూతుళ్ల ఆందోళన

ముంబై : మహారాష్ట్రలోని పుంతంబ గ్రామ రైతుల కుమార్తెలు రుణమాఫీ కోసం మంగళవారం ఆందోళన చేపట్టారు. రెండేళ్ల క్రితం రైతులు రుణమాఫీ చేయాలని ఆందోళన చేపట్టిన విషయం తెలిసిందే. ప్రభుత్వం ఎంతకీ దీనిపై స్పందించక పోవడంతో వారి తండ్రులకు మద్దతుగా 20పైబడిన ఆడకూతర్లు సంపూర్ణ రుణమాఫీ, పంటకు గిట్టుబాటుధర కల్పించాలని వారు డిమాండు చేస్తున్నారు. అహ్మదాబాద్ జిల్లాకు చెందిన ఈ గ్రామంలో రైతులు నిర్వహించిన ఆందోళనకు స్పందించిన ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నావిస్ 2017లో రూ. 34 వేల కోట్ల రుణాలను అదే ఏడాది జూన్ నాటికి మాఫీ చేస్తామని ప్రకటించారు. కిసాన్ క్రాంతి మోర్చా ఆధ్వర్యంలో చేపట్టిన ఆ ఆందోళనలో 15 మంది రైతుల కుమార్తెలు పాల్గొన్నారు. వీరికి రైతు సంఘం కన్వీనర్ ధనుంజయ్ జాదవ్ కుమార్తె నేతృత్వం వహించారు. పాల రేట్లు లీటరుకు రూ. 50కి పెంచాలని, పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలన్న డిమాండుపై మహిళలు పట్టుబడుతున్నారని కిసాన్ క్రాంతి మోర్చా సభ్యుడు ఒకరు తెలిపారు. 2017 మార్చిలో గిట్టుబాటు ధర కల్పించకపోవడంతో గ్రామసభ నిర్ణయం మేరకు జూన్ 1 నుంచి పట్టణాలకు తమ ఉత్పత్తులను నిలిపి వేసి ఆందోళన నిర్వహించారు. రైతులు రోడ్లపై తమ కూరగాయలు, పండ్లు, పాలు పారబోసి హైవేలను నిర్బంధించారు. దీంతో అత్యవసర సమావేశం జరిపిన కేబినెట్ సబ్ కమిటీ రైతు రుణమాఫీ, గిట్టుబాటు ధరలు కల్పించాలని నిర్ణయించినప్పటికీ అమలుకు నోచుకోలేదు.

దేశద్రోహ చట్టాన్ని రద్దుచేయం : కేంద్రం

న్యూఢిల్లీ : దేశద్రోహ చట్టాన్ని రద్దు చేసే ప్రతిపాదన ఏదీ లేదని కేంద్ర ప్రభుత్వం లోక్‌సభకు వెల్లడించింది. నేర చట్టాలకు నిరంతరం సవరణలు జరుగుతాయని ఇందుకోసం వివిధ వర్గాల వారిని, రాష్ట్ర ప్రభుత్వాలను సంప్రదిస్తామని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి హన్స్‌రాజ్ అహిర్ లోక్‌సభకు రాతపూర్వక సమాధానం తెలిపారు. దేశద్రోహ చట్టం ప్రకారం దోషులకు జీవితకాల శిక్ష విధిస్తారు.

యూపీ అసెంబ్లీలో గందరగోళం

- బడ్జెట్ సమావేశంలో ఎస్పీ, బీఎస్పీ సభ్యుల నిరసన
- గవర్నర్ ప్రసంగిస్తుండగా నినాదాలు
- బెంచ్‌ల పైకెక్కి కాగితాలు విసిరిన వైనం



లక్నో : ఉత్తరప్రదేశ్ రాష్ట్ర శాసనసభ బడ్జెట్ సమావేశాలు మంగళవారం గందరగోళం నడుమ ప్రారంభమయ్యాయి. సంయుక్త సమావేశంలో గవర్నర్ రామ్‌నాయక్ ప్రసంగిస్తుండగా సమాజ్ వాది పార్టీ(ఎస్పీ), బహుజన్ సమాజ్ పార్టీ(బీఎస్పీ) సభ్యులు నిరసనకు దిగారు. రానున్న లోక్‌సభ ఎన్నికలకు ఈ రెండు పార్టీలు ఇప్పటికే పొత్తు దిశగా అవగాహనకు వచ్చిన విషయం తెలిసిందే. ఇదిలా ఉండగా యోగి ఆదిత్యనాథ్ నేతృత్వంలోని ఉత్తర ప్రదేశ్ ప్రభుత్వ పథకాలు, లక్ష్యాలను గవర్నర్ తన బడ్జెట్ ప్రసంగంలో వివరిస్తుండగా సభలో బలమైన ప్రతిపక్షంగా ఎస్పీ, బీఎస్పీ సభ్యులు బెంచ్‌ల పైకెక్కి నినాదాలు చేస్తూ కాగితపు బంతులను విసిరారు. 'రాజ్యపాల్ వాపస్ జావో'(గవర్నర్ తిరిగి వెళ్లాలి) అంటూ పెద్ద పెట్టున నినాదాలు చేశారు. 'గవర్నర్ ప్రసంగిస్తుండగా ఎస్పీ, బీఎస్పీ సభ్యులు నినాదాలు చేస్తూ అడ్డుకోవడం, కాగితపు బంతులు విసరడాన్ని ఖండిస్తున్నా. ఇటువంటి వారు ఏ రకమైన వ్యవస్థ కావాలని కోరుకుంటున్నారో ఊహించవచ్చు' అని ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ వ్యాఖ్యానించారు. అయితే ప్రతిపక్ష సభ్యులు కాగితపు బంతులను విసరడంతో గవర్నర్ భద్రతా సిబ్బంది అట్ట ఫైళ్లను అడ్డుగా పెట్టి రక్షణగా నిల్చొన్నారు. రాష్ట్రంలో వ్యవసాయ సంక్షోభం, మహిళా భద్రత, శాంతి, భద్రతలు క్షీణిస్తున్న పరిస్థితి వంటి విస్తృత అంశాలపై ఎస్పీ, బీఎస్పీ సభ్యులు తమ నిరసన వ్యక్తం చేశారు. ఇక యూపీ అసెంబ్లీలో పశ్చిమ బెంగాల్‌లో సీబీఐ వివాదం అంశం కూడా చోటుచేసుకుంటుంది. సీబీఐని పంజరంలో చిలుకతో పోల్చుతూ ప్రతిపక్ష సభ్యులు ప్లకార్డులు ప్రదర్శించారు. కేంద్ర దర్యాప్తు సంస్థకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. పశ్చిమ బెంగాల్‌లో ఒక ర్యాలీకి హాజరయ్యేందుకు యోగికి రెండోసారి కూడా మమత ప్రభుత్వం అనుమతి నిరాకరించింది. ఈ నేపథ్యంలో తృణమూల్ ప్రభుత్వం ప్రజా వ్యతిరేకంగా పని చేస్తుందంటూ యోగి విమర్శించారు. అయితే దీనిపై మమతా బెనర్జీ స్పందిస్తూ, 'తొలుత ఉత్తరప్రదేశ్‌ను చక్కదిద్దుకోండి. ఇప్పుడు ఎన్నికల్లో పోటీ చేస్తే ఓడిపోతారు' అని ధ్వజమెత్తారు. సీబీఐ వివాదంలో మమతా బెనర్జీకి ఎస్పీ, బీఎస్పీలు గట్టి మద్దతు ఇచ్చాయి.

టీఎంసీ, బీజేపీలు

రెండూ అవినీతి పార్టీలే



న్యూఢిల్లీ : తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ), బీజేపీలు రెండూ అవినీతి పార్టీలేనని సుప్రీంకోర్టు మంగళవారం జారీ చేసిన ఆదేశాలు స్పష్టం చేస్తున్నాయని సీపీఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి అన్నారు. చిట్‌ఫండ్ కుంభకోణంలో 'దోపిడీని పంచుకునేందుకు' ఆ రెండు పార్టీలు చేతికి గ్లౌజులు ధరించాయని ఆయన విమర్శించారు. ఏచూరి ఇక్కడ విలేకరులతో మాట్లాడుతూ కోల్‌కతాలో చిట్‌ఫండ్ కుంభకోణంలో దర్యాప్తుపై సీబీఐ వ్యవహరించిన తీరులో ఎటువంటి తప్పు కనిపించడం లేదన్నారు. సీబీఐ తనకు తానుగా దర్యాప్తు చేసినట్లయితే దానిని అభ్యంతరకరంగా భావించవచ్చని పేర్కొన్నారు. 'ఈ కేసు విషయంలో దర్యాప్తునకు సీబీఐని న్యాయ వ్యవస్థ ఆదేశించిన సందర్భంలో, ఏదైనా రాష్ట్రం లేదా ప్రాంతంలో సీబీఐ దర్యాప్తునకు వెళ్లినప్పుడు ఆ రాష్ట్ర ప్రభుత్వ అధికారాలు లేదా అధికారంపై దాడికి భావించలేం' అని ఏచూరి వ్యాఖ్యానించారు. 'రాష్ట్ర ప్రభుత్వ అనుమతి లేకుండా సీబీఐ తనకు తానుగా దర్యాప్తు చేపట్టినట్లయితే అభ్యంతరకరం. అది ఉల్లంఘనగా భావించాలి. కానీ ఇక్కడా పరిస్థితి లేదు. ఇది కేంద్ర-రాష్ట్ర సంబంధాలకు సంబంధించిన అంశం కాదు' అని తెలిపారు. కాగా శారదా చిట్‌ఫండ్ కుంభకోణంలో దర్యాప్తు సంస్థతో సహకరించాల్సిందిగా కోల్‌కతా పోలీసు కమిషనర్‌ను సుప్రీంకోర్టు మంగళవారం ఆదేశించింది. 'టీఎంసీ, బీజేపీలు రెండూ అవినీతి పార్టీలేనని, టీఎంసీ అధినాయకత్వాన్ని తప్పనిసరిగా విచారించాలి, ఈ కుంభకోణంలో ఇప్పటికే టీఎంసీ ఎంపీలు అనేక మందిపై ఛార్జిషీట్‌లు నమోదయ్యాయి, అరెస్టులయ్యారు. ఈ కేసులో దర్యాప్తునకు బీజేపీ ఐదేళ్ల కాలం ఎందుకు ఆగాల్సి వచ్చింది. ఈ ఐదేళ్లలో ఆ కుంభకోణంలో ఉన్న పలువురు వ్యక్తులు బీజేపీ వైపు మళ్లారని' అని ఏచూరి పేర్కొన్నారు.

హజారే దీక్ష విరమణ



రాలేగావ్ సిద్ధి : లోక్‌పాల్ నియా మకం కోసం చేపట్టిన నిరాహారదీక్షను విరమిస్తున్నట్లు అవినీతి వ్యతిరేక ఉద్యమకారుడు, ప్రముఖ గాంధేయవాది అన్నా హజారే ప్రకటించారు. మంగళవారం ఆయనను మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్, కేంద్ర మంత్రులు రాధామోహన్, సుభాష్ భమ్రే కలుసుకున్నారు. వారితో సుదీర్ఘంగా చర్చలు జరిపిన హజారే దీక్షను విరమిస్తున్నట్లు తెలిపారు. రాలేగావ్ సిద్ధిలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో హజారే మాట్లాడారు.

'ఫడ్నవీస్, ఇతర మంత్రులతో జరిపిన చర్చలు ఫలప్రదం అయ్యాయి. నా డిమాండ్లను పరిష్కరించేందుకు వాళ్లు అంగీకారం తెలిపారు. అందువల్ల నా నిరాహార దీక్షను విరమిస్తున్నాను' అని హజారే ప్రకటించారు. అనంతరం సీఎం ఫడ్నవీస్ మాట్లాడుతూ లోక్‌పాల్ నియామకాన్ని వీలైనంత త్వరగా చేపడతామని హామీ ఇచ్చారు. ఫిబ్రవరి 13న లోక్‌పాల్ సెర్చ్ కమిటీ సమావేశమవుతోందని ఆయన తెలిపారు. లోక్‌పాల్ చట్టం అమల్లోకి వచ్చి ఐదేళ్లు గడిచినా మోదీ ప్రభుత్వం లోక్‌పాల్‌ను నియమించకపోవడంపై తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తూ హజారే జనవరి 30న నిరాహార దీక్ష చేపట్టిన విషయం తెలిసిందే. రైతుల సంక్షేమం కోసం స్వామినాథన్ కమిషన్ చేసిన సిఫార్సులను, కొన్ని ఎన్నికల సంస్కరణలను అమలు చేయాలని, లోకాయుక్త చట్టాన్ని మహారాష్ట్ర ఆమోదించాలని కూడా హజారే డిమాండు చేశారు. ఈ డిమాండ్లకు సీఎం ఫడ్నవీస్ అంగీకారం తెలపడంతో గత ఏడు రోజులు చేస్తున్న దీక్షను ఆయన విరమించారు. లోక్‌పాల్ నియామకాన్ని డిమాండు చేస్తూ హజారే గతంలోను నిరాహార దీక్ష చేశారు.

ఇది స్వయం సేవ బడ్జెట్ : కమల్ హాసన్



చెన్నై : కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన తాత్కాలిక బడ్జెట్‌ను స్వయం సేవ బడ్జెట్‌గా మక్కల్ నీధి మయమ్ (ఎంఎన్‌ఎం) అధ్యక్షుడు కమల్ హాసన్ అభివర్ణించారు. ఓటర్లకు డబ్బును పంపిణీ చేయడం కోసం ప్రవేశపెట్టినట్లు పలు సందర్భాల్లో తోస్తోందన్నారు. రైతులకు ఇచ్చిన హామీలు ఆకర్షణీయంగా కనిపించినప్పటికీ ఆచరణలో ఏమంత ప్రయోజనాలు కనిపించవని ఆయన అన్నారు. బడ్జెట్‌లోని లొసుగులను ఆర్థిక నిపుణులు సులువుగా కనిపెట్టగలరన్న ఆయన ఈ బడ్జెట్‌లోని కొన్ని భాగాలు ఓటర్లకు డబ్బును పంచడానికి చట్టబద్ధతను కల్పించేవిగా ఉన్నాయని సామాన్యులు సైతం గుర్తించగలరంటూ ట్వీట్ చేశారు. తమిళనాడు ప్రజల కీలక సమస్యలను బడ్జెట్‌లో ప్రస్తావించలేదని కమల్‌హాసన్ ట్విట్టర్‌లో పేర్కొన్నారు.

ఎన్‌ఆర్‌సీని ధ్వంసం చేసే యత్నం

కేంద్ర హోం శాఖను తప్పుబట్టిన సుప్రీంకోర్టు



న్యూఢిల్లీ : అసోంలో జాతీయ పౌర నమోదు(ఎన్‌ఆర్‌సీ)పై కేంద్ర హోం మంత్రిత్వ శాఖ వ్యవహరిస్తున్న తీరును సుప్రీంకోర్టు మంగళవారం తప్పుబట్టింది. ప్రక్రియను ధ్వంసం చేసేందుకు హోం శాఖ వివిధ కథలు అల్లుతోందని పేర్కొంది. ఎన్నికల విధుల్లో కేంద్ర సాయుధ పోలీసు దళాలు(సీఏపీఎఫ్) పాత్రను దృష్టిలో ఉంచుకుని రెండు వారాల పాటు ఎన్ఆర్‌సీ ప్రక్రియను నిలిపివేయాలంటూ హోం మంత్రిత్వ శాఖ దాఖలు చేసిన పిటిషన్‌ను సుప్రీంకోర్టు తోసిపుచ్చింది.

ఎన్ఆర్‌సీ ప్రక్రియ పరిపూర్తికి జూలై 31 గడువును పొడిగించేది లేదని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రంజన్ గొగోయ్ నేతృత్వంలోని బెంచ్ పునరుద్ఘాటించింది. 'అసోంలో ఎన్ఆర్‌సీ (జాతీయ పౌరసత్వ నమోదు) ప్రక్రియను జాప్యం చేసేందుకు కేంద్ర హోం మంత్రిత్వ శాఖ అనేక సాకులతో వస్తోంది. ఎన్ఆర్‌సీ ప్రక్రియను ధ్వంసం చేయడమే హోం మంత్రిత్వ శాఖ మొత్తం ప్రయత్నంగా ఉంది. దీనిపై మేము హోం కార్యదర్శిని పిలిపించాలా..? ఎందుకంటే ఏజీ, ఎస్‌జీలు సరిగా వివరించలేదు' అని ప్రధాన న్యాయమూర్తి రంజన్ గొగోయ్ వ్యాఖ్యానించారు. అసోం ఎన్ఆర్‌సీ తుది ఖరారుకు 2019, జూలై 31 తుది గడువు, దానిని పొడిగించేది లేదని అత్యున్నత న్యాయస్థానం స్పష్టం చేసింది. సాయుధ బలగాలకు చెందిన 167 కంపెనీల ఉపసంహరణకు సంబంధించిన పిటిషన్ కోర్టు పరిశీలనకు రాగా దానిని కొట్టివేసింది. అసోం నుంచి కేంద్ర సాయుధ బలగాలను ఉపసంహరించరాదని న్యాయస్థానం పేర్కొంది. ఎన్ఆర్‌సీ ప్రక్రియను నిలిపివేయాలని ప్రభుత్వం కోరగా ఎన్నికలు, ఎన్ఆర్‌సీ రెండూ ఏకకాలంలో జరగాలని స్పష్టం చేస్తూ, పౌరసత్వ నమోదు ప్రక్రియను ప్రభుత్వం కోరుకుంటే, దానికి 'వెయ్యినొక్క మార్గాలు' ఉన్నాయని కోర్టు తెలిపింది. కాగా కేంద్ర ప్రభుత్వం అసోం జాతీయ పౌరసత్వ నమోదు ముసాయిదాను 2018, జూలై 30న ప్రచురించింది. ఇందులో 40.70 లక్షల మందికి పైగా పేర్లు కనిపించకుండా పోయాయి.



మార్చిలోపు టీటీడీ బ్యాక్‌లాగ్ పోస్టులు భర్తీ

కారెం శివాజీ

విశాలాంధ్ర - తిరుపతి : రాష్ట్ర ప్రభుత్వ ఉత్తర్వులు 65, 66 మేరకు మార్చి లోపు టీటీడీలో బ్యాక్ లాగ్ పోస్టుల భర్తీకి చర్యలు చేపట్టాలని రాష్ట్ర ఎస్సీ ఎస్టీ కమిషన్ ఛైర్మన్ కారెం శివాజీ అన్నారు. స్థానిక శ్రీ పద్మావతి అతిథి గృహంలో మంగళవారం తిరుపతి తిరుమల దేవస్థానంలో అమలవుతున్న ఆర్ఓఆర్, ఇతర ఫిర్యాదులపై ఎస్సీ ఎస్టీ కమిషన్ దాదాపు 2 గంటల పాటు ఈఓ అనిల్ కుమార్ సింఘాల్, అధికారులతో సమీక్షించింది. ఈ సందర్భంగా ఛైర్మన్ మాట్లాడుతూ ఇప్పటికే రాష్ట్రంలో 65, 66 ఉత్తర్వుల మేరకు బ్యాక్ లాగ్ పోస్టులు భర్తీ అయ్యాయని, టీటీడీలో కూడా ఈ మార్చి నాటికి పూర్తి చేసేందుకు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. టీటీడీలో 2010 నుండి ఉద్యోగాలు భర్తీ కానందున రిజర్వేషన్ కోటాలో 549 పోస్టులు ఖాళీగా ఉన్నాయని కారణాలు తెలపాలని ఈఓను కోరారు. సంబంధిత అధికారులు సరైన రికార్డులు చూపించలేనందున ఈఓ అధికారులపై మండిపడ్డారు. 2010లో ఉద్యోగాల భర్తీ నోటిఫికేషన్‌లో జూనియర్ సహాయకుల పోస్టులు జిల్లాకే పరిమితం చేయాలని, మిగిలినవి రాష్ట్ర స్థాయికి అనుమతి ఇవ్వాలని బోర్డులో రెసొల్యూషన్ చేసి రాష్ట్ర ప్రభుత్వానికి పంపామని, హై కోర్టులో జోనల్ పరిధి వర్తించదని రావడంతో ప్రభుత్వానికి నివేదించామని తెలిపారు. ప్రధానంగా ఎస్వీబీసీ చానల్లో రూల్ ఆఫ్ రిజర్వేషన్ పాటించడం లేదని, 253 పోస్టులకు ఆర్ఓఆర్ రిజిస్టరు రెండు రోజుల్లో రూపొందించి కమిషన్ ముందు ఉంచాలని ఎస్వీబీసీ సీఈఓను ఆదేశించారు. 2004లో తిరుమల నిర్వాసితులకు రీహాబిలిటేషన్ కోసం ఇచ్చిన షాపులు మినహా, మిగిలిన షాపుల వేలంలో ఆర్ఓఆర్ పాటించాలని తెలిపారు. నిర్వాసితులకు ఇవ్వడం సమంజసం అన్నారు. ఇకపై షాపుల వేలంలో రోస్టర్ పాటించాలని సూచించారు. ఎస్సీఎస్టీ నివాసాల్లో నిర్మిస్తున్న దేవాలయాలు, భజన మందిరాలు వేగవంతం చేయాలని, 5 సెంట్ల స్థలం తప్పనిసరి అని, టీసేసి నిర్మించాలని సూచించారు. ఈ ఓ వివరిస్తూ 875 దేవాలయాలకు ఎస్సీ, ఎస్టీ ప్రాంతాల్లో అనుమతులు ఇచ్చి నిర్మిస్తున్నామని వివరించారు. ఈ సమావేశంలో కమిషన్ మెంబర్లు నరహరి వరప్రసాద్, రవీంద్ర, అబ్రహ శివేరి, టీటీడీ జేఈఓలు పోలాభాస్కర్, శ్రీనివాస రాజు, సీవీఅండ్ఎస్ఓ గోపీనాథ్ జెట్టి పాల్గొన్నారు.



విశాఖ రైల్వేజోన్ ఎందుకివ్వరు?

విశాలాంధ్ర - విజయనగరం క్రైం : విశాఖకు ప్రత్యేక రైల్వే జోన్ ఎందుకు ఇవ్వకూడదో, గిరిజన యూనివర్సిటీకి నిధులు ఎందుకు మంజూరు చేయలేదో కేంద్రమంత్రి అమిత్‌షా ఆంధ్రరాష్ట్ర ప్రజలకు సమాధానం చెప్పాలని లోక్ సత్తా రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు భీశెట్టి బాబ్జి ప్రశ్నించారు. విజయ నగరంలోని పార్టీ కార్యాలయంలో మంగళవారం విలేఖరుల సమావేశంలో భీశెట్టి మాట్లాడుతూ భారతదేశ చరిత్రలో ఎప్పుడూ ఏ పార్టీ చేయని నీతిమాలిన పనిని బీజేపీ ప్రభుత్వం చేసిందన్నారు. వెనుకబడిన ప్రాంతాలైన ఉత్తరాంధ్ర, సీమాంధ్ర జిల్లాల అభివృద్ధికి కేటాయించిన 350 కోట్ల రూపాయల నిధులను ప్రధాని మోడీ ఎందుకు వెనక్కి తీసుకున్నారో సమాధానం చెప్పాలని ప్రశ్నించారు. ఆంధ్రప్రదేశ్ అంటే కేవలం సీఎం చంద్రబాబు మాత్రమే కాదని, కోట్లాది మంది ప్రజల జీవితాలని కేంద్రం గ్రహిస్తే బాగుంటుందని హితవుపలికారు. ప్రత్యేక హోదా, విభజన చట్టంలోని హామీలను ఎందుకు అమలు చేయడంలేదని, లోక్‌సత్తా పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ జయప్రకాష్ నారాయణ, పలువురు మేధావులతో కలిసి తయారు చేసిన నివేదిక ప్రకారం కేంద్రం నుంచి 85 వేల కోట్ల రూపాయలు రాష్ట్రానికి రావాల్సి ఉందని స్పష్టం చేశారు. కేంద్రం నుంచి వచ్చిన నిధులను రాష్ట్రం దుర్వినియోగం చేస్తే కేంద్రం తగిన చర్యలు తీసుకుంటే ఎవరికీ అభ్యంతరం లేదని, అయితే చంద్రబాబును అడ్డు పెట్టుకుని తెలుగు ప్రజలకు అన్యాయం చేయడం సమంజసం కాదని, ఈ విధానాన్ని లోక్‌సత్తా పార్టీ తీవ్రంగా ఖండిస్తుందని తెలిపారు.

జిల్లా ప్రజలకు అన్యాయం చేస్తున్న బాబు : రాష్ట్రానికి కేంద్రం అన్యాయం చేస్తుంటే సీఎం చంద్రబాబు విజయనగరం జిల్లాకు తీరని అన్యాయం చేస్తున్నారని భీశెట్టి బాబ్జి ఆరోపించారు. జిల్లాలో ప్రభుత్వ వైద్య కళాశాలను ఏర్పాటు చేస్తామని అసెంబ్లీ సాక్షిగా ప్రకటించిన చంద్రబాబు ఆ తర్వాత ఆ మాట మరిచారని అన్నారు. గడిచిన 5 సంవత్సరాలుగా లోక్‌సత్తా పార్టీ వివిధ రకాలుగా వైద్య కళాశాల కోసం పోరాటం చేస్తున్నా కనీసం పట్టించుకోలేదని మండిపడ్డారు. ఇక్కడ ఉద్యమాలు చేస్తున్నా పట్టించుకోకుండా పశ్చిమగోదావరి జిల్లాకు 650 కోట్ల రూపాయలతో ప్రభుత్వ వైద్య కళాశాలను మంజూరు చేసిన చంద్రబాబుకు విజయనగరం అంటే ఎందుకింత నిర్లక్ష్యమని ప్రశ్నించారు. ఈ సమావేశంలో లోక్‌సత్తా పార్టీ నాయకులు అల్లంశెట్టి నాగభూషణం, తాత్రాజు రాజారావు, అప్పారావు, చిన్నారావు, భాస్కర్, ఎర్నిబాబు పాల్గొన్నారు.

11, 12 తేదీల్లో ప్రోటోకాల్ ప్రముఖులకే వీఐపీ దర్శనం

విశాలాంధ్ర - తిరుమల : తిరుమల శ్రీవారి ఆలయంలో ఈ నెల 12 న రథసప్తమి పర్వదినం సందర్భంగా సామాన్య భక్తుల సౌకర్యాల దృష్ట్యా 11,12 తేదీల్లో వీఐపీ బ్రేక్ దర్శనాలను ప్రోటోకాల్ ప్రముఖులకు మాత్రమే టీటీడీ పరిమితం చేసింది. 12వ తేదీన చంటిపిల్లల తల్లిదండ్రులకు, వయోవృద్ధులు, దివ్యాంగులు, దాతలకు సుపథం మార్గంలో ప్రత్యేక దర్శనాలను అధికారులు రద్దు చేశారు. రథసప్తమినాడు శ్రీవారి ఆలయంలో ఆర్జిత సేవలైన అష్టదళ పాద పద్మారాధన, కల్యాణోత్సవం, ఆర్జిత బ్రహ్మోత్సవం, ఊంజల్ సేవ, వసంతోత్సవం, సహస్ర దీపాలంకార సేవలను టీటీడీ రద్దు చేసింది.



మా భూములు తిరిగివ్వండి

విశాలాంధ్ర - కొమరాడ : పదేళ్ల క్రితం భూముల్లో పవర్ ప్లాంట్ నిర్మించకపోవడంతో ఉపాధి అవకాశాల కోసం ఎదురుచూసిన గిరిజనులు తమ భూములను తక్షణం తిరిగి ఇవ్వాలని డిమాండ్ చేశారు. విజయనగరం జిల్లా కోటిపాం నుంచి పార్వతీపురం సబ్ కలెక్టర్ కార్యాలయం వరకు మంగళవారం పది కిలోమీటర్ల పాదయాత్ర ప్రారంభించారు. సీపీఎం, సీపీఐ, గిరిజన సంఘాల నేతలు గిరిజనులకు అండగా నిలిచారు. ఈ సందర్భంగా సీపీఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కృష్ణమూర్తి మాట్లాడుతూ అతి తక్కువ ధరలకు రైతుల భూములు తీసుకొని నేటికీ ప్లాంటు నిర్మించకపోవడం, ఉపాధి అవకాశాలు కల్పించలేకపోవడంతో భూములిచ్చిన రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. భూసేకరణ చట్టంలో భూములు తీసుకున్న అయిదేళ్లలోపు పరిశ్రమ స్థాపించలేకపోతే భూములు ఇచ్చేయాలని ప్రభుత్వ ఆదేశాలు ఉన్నప్పటికీ ఇక్కడ తిరిగి ఇవ్వడం లేదన్నారు. ప్రభుత్వం స్పందించకపోతే ఈ భూములను రైతులు స్వాధీనం చేసుకునేలా ఆందోళనలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు సాంబమూర్తి, రంజిత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పదిరోజుల శిశువుకు వాతలు

విశాలాంధ్ర - సాలూరురూరల్ : ఆధునిక సాంకేతికతతో ప్రపంచం దూసుకుపోతున్న వేళ గ్రామీణులను మూఢనమ్మకాలు పట్టిపీడిస్తున్నాయనడానికి నిదర్శనంగా మంగళవారం విజయనగరం జిల్లాలో వెలుగుచూసిన ఘటన అందర్నీ నివ్వెరపర్చింది. గిరిజన గ్రామాల్లో కనీస అవగాహన లేకపోవడంతో నేటికీ మూఢ నమ్మకాలపై ఆధారపడుతున్నారు. పాచిపెంట మండలం ఊబగుంట గ్రామానికి చెందిన పదిరోజుల చిన్నారికి నాటు వైద్యుడు కాల్చిన ఇనుప చువ్వతో వాతలు పెట్టడంతో ప్రాణాపాయ స్థితికి చేరుకుంది. ఊబగుంట గ్రామానికి చెందిన నరసమ్మ గత నెల 25వ తేదీన సాలూరు ప్రభుత్వా స్పత్రిలో ఆడబిడ్డకు జన్మనిచ్చింది. మూడు రోజులకు డిశ్చార్జ్ చేయడంతో స్వగ్రామానికి చేరుకున్నారు. పచ్చకామెర్ల వంటి వ్యాధులు రాకుండా ఉండేందుకు నాటువైద్యుడిని ఆశ్రయించి శరీరంలో కొన్ని భాగాలపై కుటుంబసభ్యులే వాతలు పెట్టించారు. మంగళవారం చిన్నారి తీవ్ర అస్వస్థతకు గురికావడంతో సాలూరు సీహెచ్‌సీకి తీసుకొచ్చారు. చికిత్స చేస్తున్న వైద్యులు చిన్నారి ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉన్నట్టు తెలిపారు.

ఏపీఎస్‌పీడీసీఎల్ ఉద్యోగి ఇంట్లో ఏసీబీ సోదాలు

విశాలాంధ్ర - నెల్లూరు (సిటీ) : ఏపీఎస్‌పీడీసీఎల్‌లో విధులు నిర్వహిస్తున్న సీనియర్ అసిస్టెంట్ నెమళ్ళపూడి ప్రభాకర్‌రెడ్డి ఆదాయానికి మించి ఆస్తులు కూడబెట్టారన్న సమాచారంతో మంగళవారం ఏసీబీ అధికారులు ఆకస్మిక దాడులు చేశారు. నగరంలోని వనంతోపుసెంటర్‌లోని ఆయన నివాసంలో సోదాలు చేసిన అధికారులు ప్రభుత్వ లెక్కల ప్రకారం కోటిన్నర విలువైన ఆస్తులను గుర్తించినట్టు సమాచారం. కారు, రెండు ద్విచక్రవాహనాలు, 100 అంకణాల నివాస గృహం, మామ పేరుతో చిట్టమూరు మండలం మెట్టులో 23 ఎకరాల పొలం, అత్త పేరుమీద ఒక ప్లాటు, మామ పేరుతో మరో ప్లాటు, 500 గ్రాముల బంగారం, వెండి, 50 వేల రూపాయల నగదును గుర్తించారు. మరో రెండు లాకర్లు తెరవాల్సి ఉన్నట్టు ఏసీబీ అధికారులు తెలిపారు. తండ్రి స్థానంలో 1995లో ఉద్యోగ బాధ్యతలు స్వీకరించిన ప్రభాకర్‌రెడ్డి వివిధ హోదాల్లో పనిచేశారు. ప్రభాకర్‌రెడ్డి ఎటువంటి అవినీతికి పాల్పడలేదని, మా తాతముత్తాతలు ఇచ్చిన ఆస్తులేనని ఆయన సతీమణి గట్టిగానే వాదించినట్లు సమాచారం. ఏసీబీ దాడులతో నగరంలోని కొన్ని శాఖల ఉద్యోగులు హడలిపోయారు.

టీడీపీకి 'నంద్యాల' టెన్షన్ !

- రాబోయే ఎన్నికలపై కీలక నేతల కన్ను
- అధిష్టానానికి తలనొప్పిగా మారిన అభ్యర్థి ఎంపిక
- వేడెక్కిన నంద్యాల రాజకీయం


ఏవీ సుబ్బారెడ్డి


భూమా బ్రహ్మనందరెడ్డి


మంత్రి ఫరూక్

విశాలాంధ్రబ్యూరో - కర్నూలు : కర్నూలు జిల్లా నంద్యాల అసెంబ్లీ టికెట్ కోసం తెలుగుదేశం పార్టీలో రోజురోజుకు పోటీ పెరుగుతోంది. రాబోయే ఎన్నికల బరిలో సత్తా చాటేందుకు తెలుగుతమ్ముళ్లు పోటీపడుతున్నారు. ఈ పరిణామం ఆ పార్టీ అధిష్టానానికి పెద్ద తలనొప్పిగా మారింది. ఎన్నికల సమరంలో దేశవ్యాప్తంగా నంద్యాలకు ప్రత్యేక గుర్తింపు ఉంది. ఈ పార్లమెంటు నియోజకవర్గం నుంచి గెలుపొందిన నీలం సంజీవరెడ్డి లోక్‌సభ స్పీకర్‌గా, రాష్ట్రపతిగా, పెండేకంటి వెంకట సుబ్బయ్య కేంద్ర హోంశాఖ మంత్రిగా వివిధ కీలకశాఖల్లో సమర్థవంతంగా సేవలు అందించారు. ప్రధానిగా కొనసాగిన పీవీ నరసింహారావు అత్యధిక మెజారిటీతో గిన్నిస్ బుక్‌లోకి ఎక్కారు. దివంగత నేత భూమా నాగిరెడ్డి మూడు సార్లు ఈ పార్లమెంటు సభ్యులుగా పనిచేశారు. 2014 ఎన్నికలలో వైసీపీ తరఫున శాసనసభ్యునిగా విజయం సాధించిన భూమా నాగిరెడ్డి అనతికాలంలోనే టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. ఆయన మరణంతో ఉపఎన్నికల్లో భూమా కుటుంబీకులకు టీడీపీ టికెట్ కేటాయించడంతో అప్పటి వరకు పార్టీలో కొనసాగిన శిల్పా మోహన్‌రెడ్డి ఆకస్మికంగా వైసీపీ నుంచి బరిలో నిలిచారు. రెండు ప్రధాన రాజకీయ పార్టీలు ప్రతిష్టాత్మకంగా తీసుకోవడంతో రెండు తెలుగు రాష్ట్రాలతోపాటు దేశవ్యాప్తంగా ఉప ఎన్నిక ఫలితం తీవ్ర ఉత్కంఠను రేపింది. అధికార తెలుగుదేశం అభ్యర్థి భూమా బ్రహ్మనందరెడ్డి 27 వేల మెజారిటీతో గెలుపొందారు. ఈ క్రమంలో టీడీపీ ప్రభుత్వం కోట్ల రూపాయల నిధులు వెచ్చించి నంద్యాల అభివృద్ధికి ప్రత్యేక బాటలు వేసింది.

అయిదుగురు కీలక నేతల కన్ను

ప్రభుత్వం ప్రత్యేక అభివృద్ధి చర్యలు చేపట్టిన నేపథ్యంలో రాబోయే ఎన్నికల్లో నంద్యాల అసెంబ్లీ స్థానం నుంచి బరిలోకి దిగేందుకు టీడీపీ నేతలు కన్నేశారు. ఈ నియోజకవర్గంలో ముస్లిం మైనారిటీ ఓటర్లు అధికం కావడంతో ఆ సామాజికవర్గ ప్రతినిధులుగా రాష్ట్ర మంత్రి ఫరూక్ లేదా ఆయన తనయుడు ఫిరోజ్ పోటీకి సిద్ధపడుతున్నారు. కొద్ది కాలంలోనే ప్రజలకు చేరువైన సిట్టింగ్ ఎమ్మెల్యే భూమా బ్రహ్మనందరెడ్డి పోటీకి సై అంటున్నారు. రాష్ట్ర విత్తనోత్పత్తి సంస్థ చైర్మన్ ఏవీ సుబ్బారెడ్డి కూడా నంద్యాల లేదా ఆళ్లగడ్డ నుంచి ఎన్నికల బరిలో పోటీకి సిద్ధమని ప్రకటించారు. ఇటీవల నంద్యాల పట్టణంలో ఆయన టీడీపీ కార్యాలయాన్ని ప్రారంభించారు. నంద్యాల ఎంపీ ఎస్పీవై రెడ్డి తన అల్లుడు శ్రీధర్‌రెడ్డిని ఇక్కడ నుంచి పోటీ చేయించాలని ముమ్మరంగా ప్రయత్నిస్తున్నారు. ఇప్పటికే శ్రీధర్‌రెడ్డి సీఎం చంద్రబాబును కలిసి సీటు ఇవ్వాలని కోరినట్లు సమాచారం.

ముందుచూపుతోనే పదవుల్లో పెద్దపీట..

నంద్యాలలో ముస్లిం ఓటర్లు ఎక్కువ ఉండటంతో చంద్రబాబు ప్రభుత్వం నామినేటెడ్ పదవులకు పెద్దపీట వేసింది. రాష్ట్ర మైనారిటీ కార్పొరేషన్ చైర్మన్, టీడీపీ ముస్లిం మైనారిటీ విభాగం రాష్ట్ర అధ్యక్షులు, ఉర్దూ అకాడమీ చైర్మన్ నంద్యాల నేతలకే దక్కాయి. ఫరూక్ ప్రస్తుతం ముస్లిం మైనారిటీ, వైద్యఆరోగ్యశాఖ రాష్ట్ర మంత్రిగా కొనసాగుతున్నారు. నంద్యాల అభివృద్ధికి నిధులు పెద్దఎత్తున మంజూరు కావడంతో పోటీకి నేతలు ఉత్సాహం చూపుతున్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఈసారి నంద్యాల శాసనసభ స్థానం నుంచి పోటీ చేస్తారనే పుకార్లు ఉన్నాయి. రాయలసీమలో గత ఎన్నికల్లో కర్నూలు జిల్లా నుంచి వైసీపీ అధిక స్థానాలను సొంతం చేసుకుంది. రాబోయే ఎన్నికల్లో జిల్లావ్యాప్తంగా పసుపుజెండా ఎగురవేయాలన్న లక్ష్యంతో చంద్రబాబు ఇక్కడ నుంచి పోటీ చేసే అవకాశం లేక పోలేదనే చర్చ సాగుతోంది. నంద్యాల నుంచి చంద్రబాబు బరిలో దిగితే పక్కనున్న ప్రకాశం, అనంతపురం, కడప జిల్లాల్లో ఎక్కువ ప్రభావం చూపుతుందనే వాదనలు వినిపిస్తున్నాయి. ముందుచూపుతోనే నంద్యాల నాయకులకు నామినేటెడ్ పదవులు ఇచ్చారంటున్నారు. నంద్యాలకు చెందిన ఫరూక్‌కు మంత్రి పదవి, రాష్ట్ర ముస్లిం మైనారిటీ కమిషన్ ఛైర్మన్ పదవి విద్యాసంస్థల అధినేత ఇంతియాజ్ అహ్మద్‌కు ఇవ్వడం వెనుక రహస్యం ఇదేనంటున్నారు. ఎన్నికలు సమీపిస్తున్న వేళ నంద్యాల రాజకీయం వేడెక్కింది. నంద్యాల శాసనసభ అభ్యర్థిపై అధిష్టానం నిర్ణయం కోసం జిల్లా నేతలు ఎదురు చూస్తున్నారు.



అంతర్రాష్ట్ర బదిలీలకు అవకాశమివ్వాలి

విశాలాంధ్ర - విజయవాడ (అజిత్‌సింగ్‌నగర్) : రాష్ట్ర విభజన నేపథ్యంలో స్థానికేతరులుగా మారిన ఉపాధ్యాయులను మానవతా దృక్పథంతో తమ స్వరాష్ట్రంలోని సొంత జిల్లాలకు వెళ్లేందుకు గాను అంతర్రాష్ట్ర బదిలీలకు అవకాశం ఇవ్వాలని స్థానికేతర ఉపాధ్యాయుల అసోసియేషన్ ఆఫ్ తెలంగాణ అధ్యక్షులు ఎం.మోహన్‌రావు కోరారు. స్థానిక గాంధీనగర్‌లోని ధర్నాచౌక్‌సెంటర్‌లో మంగళవారం ఉపాధ్యాయులు రిలేనిరాహార దీక్షను నిర్వహించారు. అసోసియేషన్ సెక్రటరీ బి.రామకృష్ణ మాట్లాడుతూ స్వరాష్ట్రంలో స్థానికేతరులుగా మారి, ఆంధ్రాకి చెందిన 20 కిపైగా అధిక సంఖ్యాకులను తెలంగాణలో ఓసీలుగా పరిగణించడం ద్వారా రిజర్వేషన్‌లను కోల్పోయామని, తద్వారా తమ పిల్లలు ఉద్యోగాలు పొందే అవకాశాన్ని కోల్పోతార న్నారు. ఉద్యోగి ఆరోగ్య భద్రత నిమిత్తం ఇచ్చిన ఆరోగ్య కార్డులలో పేర్లు నమోదు కాబడిన మా తల్లిదండ్రులు మా స్వరాష్ట్రంలో ఉన్నందున వారికి ఈ పథకం ఉపయోగపడటంలేదన్నారు. కావున అంతర్రాష్ట్ర బదిలీలకు అవకాశం ఇవ్వడం ద్వారా రాష్ట్ర ఆర్థిక భారంతో పాటు, కొన్ని కుటుంబాలకు చెందిన రాబోవు తరాల జీవిత భారాల్ని సైతం తగ్గించినట్లవుతుందనే దృష్టితో ఆలోచించి తమను బదిలీలు చేయాలని కోరారు. కార్యక్రమంలో స్థానికేతర ఉపాధ్యాయ సంఘం నాయకులు, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

సాక్షరభారత్ ఉద్యోగుల ఆగ్రహజ్వాల

- ఎంపీ అశోక్‌గజపతిరాజు బంగ్లా ముట్టడి
- అండగా నిలిచిన ఏఐటీయూసీ నేతలు
- విజయనగరంలో భారీగా స్తంభించిన ట్రాఫిక్



విశాలాంధ్ర - విజయనగరం టౌన్ : ప్రభుత్వం ఏకపక్షంగా విధుల నుంచి తొలగించిన సాక్షర భారత్ ఉద్యోగుల ఆగ్రహం కట్టలు తెంచుకుంది. ముందస్తు సమాచారం లేకుండా, వేతన బకాయిలు చెల్లించకుండా తొలగిస్తూ ఉత్తర్వులు జారీ చేయడంతో వీధినపడ్డ చిరు ఉద్యోగులు విజయనగరం వేదికగా పోరుబాట పట్టారు. సోమవారం నుంచి రిలే నిరాహార దీక్ష చేపట్టిన వీరు రెండవ రోజు ఎవరూ ఊహించని విధంగా విజయనగరంలోని కేంద్ర మాజీ మంత్రి, పార్లమెంటు సభ్యులు అశోక్‌గజపతిరాజు బంగ్లా ముట్టడికి కదంతొక్కారు. బంగ్లా ప్రధాన గేటు ఎదుట బైఠాయించి నినాదాలు చేశారు. ఏఐటీయూసీ నేతలు ఆందోళనకారులకు అండగా నిలిచారు. దీంతో ప్రధాన రహదారి వెంబడి గంటపాటు వాహనాలు నిలిచిపోయాయి. ఈ సందర్భంగా వయోజన విద్యాశాఖ సాక్షరభారత్ కో ఆర్డినేటర్స్ యూనియన్ గౌరవాధ్యక్షులు బుగత అశోక్ మాట్లాడుతూ 2010 సంవత్సరం నుంచి సాక్షరభారత్ ఉద్యోగులు గ్రామీణ వయోజనులను అక్షరాస్యులుగా తీర్చి దిద్దడంతోపాటు అనేక సేవలు అందించారన్నారు. వయోజన విద్యా కేంద్రాలు, వృత్తి శిక్షణ, ఓపెన్ బేసిక్ ఎడ్యుకేషన్ కార్యక్రమాలు నిర్వహిస్తున్నా రన్నారు. రాష్ట్ర మానవ వనరుల అభివృద్ధిశాఖ ఆధ్వర్యంలోని సాక్షర భారత్ కార్యక్రమంలో విజయనగరం జిల్లాలో 2,500 మంది ఉద్యోగులు పని చేస్తున్నారన్నారు. మండల స్థాయిలో ఎన్జీవోలు నెలకు రూ. 6 వేలు, పంచాయతీ స్థాయిలో వీసీవోలు నెలకు రూ.2 వేల చొప్పున గౌరవ వేతనంతో సేవ చేస్తున్నారన్నారు. ఎటువంటి ముందస్తు సమాచారం లేకుండా, జీతాల బకాయిలు చెల్లించకుండా విధుల నుంచి తొలగించడం దారుణమన్నారు. వెంటనే సాక్షర భారత్ సమన్వయ కర్తలను విధుల్లోకి తీసుకుని ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. ప్రభుత్వం స్పందించక పోతే రానున్న కాలంలో పోరాటాలను తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ఏఐటీయూసీ విజయనగరం జిల్లా ఉపాధ్యక్షులు టి. జీవన్న, ఆంధ్రప్రదేశ్ గిరిజన సమాఖ్య ఉపాధ్యక్షుడు తుమ్మి అప్పలరాజు దొర, ఏఐఎస్ఎఫ్ నాయకులు బి.వాసు ఉద్యోగులకు అండగా ఆందోళనలో పాల్గొన్నారు.

కేసీ కెనాల్ నీటి కోసం

'ముచ్చుమర్రి' ముట్టడి

ఎమ్మెల్యేతో సహా వైసీపీ నేతల అరెస్ట్



విశాలాంధ్ర - నందికొట్కూరు అర్బన్ : ముచ్చుమర్రి ఎత్తిపోతల పథకం నుంచి కేసీ కెనాల్‌కు నీరు విడుదల చేయాలని కోరుతూ నందికొట్కూరు ఎమ్మెల్యే ఐజయ్య, వైసీపీ రైతు విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వంగాల భరత్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం రైతులు ముచ్చుమర్రి ఎత్తిపోతల ముట్టడికి యత్నించారు. పోలీసులు అడ్డుకోవడంతో స్వల్ప ఉద్రిక్తత చోటుచేసుకుంది. కర్నూలు జిల్లా పగిడ్యాల మండలంలోని ముచ్చుమర్రి గ్రామం నుంచి కేసీ ఆయకట్టు రైతులతో కలిసి ఎమ్మెల్యే ఐజయ్య, భరత్ కుమార్‌రెడ్డి పాదయాత్రగా ఎత్తిపోతల పథకం వద్దకు చేరుకున్నారు. ముట్టడిస్తున్నారన్న సమాచారంతో నందికొట్కూరు రూరల్ సీఐ వెంకటరమణ ఆధ్వర్యంలో ముచ్చుమర్రి, బ్రాహ్మణకొట్కూరు, జూపాడుబంగ్లా ఎస్సైలు సిబ్బందితో అక్కడకు చేరుకున్నారు. ఆందోళనకారులను అడ్డుకోవడంతో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఆందోళనకారులను అదుపులోకి తీసుకున్న పోలీసులు ముచ్చుమర్రి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా ఐజయ్య, భరత్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ కేసీ కెనాల్ కింద పంటలు సాగు చేసిన రైతులకు తక్షణమే నీరు విడుదల చేసి ఆదుకోవాలన్నారు. హంద్రీనీవా ద్వారా కృష్ణాజలాలను అనంతపురానికి తరలిస్తున్న ప్రభుత్వం పంట చివరి దశలో ఉన్న కేసీ కెనాల్ రైతాంగానికి ఇవ్వకపోవడం దారుణమన్నారు. కనీసం వారం రోజులపాటు 0.5 టీఎంసీల చొప్పున నీరు విడుదలచేసి ఆదుకోవాలన్నారు.

నడివీధుల్లో వాయిద్య ఘోష

- విజయవాడ వీధుల్లో వాయిద్యాలతో పాదయాత్ర
- తరలివచ్చిన నాదస్వర, డోలు వాయిద్య కళాకారులు



విశాలాంధ్ర - విజయవాడ కల్చరల్ : నాదస్వర, డోలు, మంగళవాయిద్య కళాకారులను ప్రభుత్వాలు గుర్తించాలని ఆంధ్రప్రదేశ్ వాయిద్య కళాకారుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు గోనుగుంట్ల యలమందరావు అన్నారు. ఆంధ్రప్రదేశ్ వాయిద్య కళాకారుల సంఘం ఆధ్వర్యంలో మంగళవారం విజయవాడ అయోధ్యనగర్‌లోని నాయీ బ్రాహ్మణ సేవా సంఘం భవనం నుంచి ఘంటసాల ప్రభుత్వ సంగీత నృత్య కళాశాల వరకు కళాకారులు పాదయాత్ర నిర్వహించారు. పశ్చిమ, తూర్పుగోదావరి, కృష్ణా, గుంటూరు, ప్రకాశం, నెల్లూరు, చిత్తూరు జిల్లాల నుంచి 150 మంది పాల్గొన్నారు. నాదస్వర, డోలు విద్వాంసుల వాయిద్య ఘోషతో సాగిన యాత్ర ఆకట్టుకుంది. అనంతరం జరిగిన సభలో గోనుగుంట్ల మాట్లాడుతూ శాస్త్రీయ, జానపద, రంగస్థల కళాకారులకు ఇచ్చినట్టు తమకూ పెన్షన్ మంజూరు చేయాలన్నారు. కళల పరిరక్షణ, వ్యాప్తికి నిర్వహిస్తున్న సంగీత నృత్య కళాశాలల్లో శాస్త్రీయ సంగీత కళకు సంబంధించిన నాదస్వరం, డోలు పోస్టులు ఏర్పాటు చేయాలన్నారు. కళాకారులకు ప్రభుత్వం ప్రదానం చేస్తున్న అవార్డులు, పురస్కారాలను నాదస్వర డోలు విద్వాంసులకూ ప్రకటించాలన్నారు. గుర్తింపు కార్డులు, బస్సు, రైల్వే పాసులు, ఇళ్ల స్థలాలు కేటాయించాలన్నారు.

సంఘం రాష్ట్ర గౌరవాధ్యక్షులు, మాజీ శాసనసభ్యులు కె సుబ్బరాజు మాట్లాడుతూ శాస్త్రీయ సంగీతకళలో కీలకమైన ఈ వాయిద్యాలను నమ్ముకున్న కళాకారులను ప్రభుత్వాలు ఆదుకోవాల్సిన అవసరం ఉందన్నారు. పాదయాత్రలో ఆంధ్రప్రదేశ్ వాయిద్య కళాకారుల సంఘం రాష్ట్ర కార్యదర్శి ఇంటూరి మురళీకృష్ణ, వర్కింగ్ ప్రెసిడెంట్ ఆకునూరు రామారావు, నాయీ బ్రాహ్మణ సేవా సంఘం అధ్యక్షులు పందూరి పూర్ణచంద్రరావు, కార్యదర్శి మల్లవరపు నరసింహారావు, వాయిద్య కళాకారుల సంఘం మహిళా విభాగం అధ్యక్షురాలు సీహెచ్ రాజేశ్వరి, ఉపాధ్యక్షులు కేవీ రామారావు తదితరులు పాల్గొన్నారు.

కృష్ణానదిలో బల్లకట్టు మునక

- 20 మందిని కాపాడిన స్థానికులు
- తప్పిన ఘోర ప్రమాదం



విశాలాంధ్ర - నందిగామ : కృష్ణాజిల్లా చందర్లపాడు మండలంలోని రామన్నపేట వద్ద కృష్ణానదిలో మంగళవారం బల్లకట్టు నీట మునిగింది. ఈ ప్రమాదం నది ఒడ్డున జరగడం, ఎలాంటి ప్రాణనష్టం లేకుండా ప్రయాణికులు సురక్షితంగా బయటపడటంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. గుంటూరు జిల్లా పుట్లగూడెం నుంచి లోడులారీ, నాలుగు ఆటోలు, ఒక ట్రాక్టర్, ఆరు బైకులు, 20 మంది ప్రయాణికులతో బల్లకట్టు కృష్ణాజిల్లా చందర్లపాడు మండలంలోని రామన్నపేటకు బయలు దేరింది. గుడిమెట్ల వద్ద నది ఒడ్డుకు చేరుతున్న సమయంలో బరువు ఎక్కువ కావడంతో బల్లకట్టు ఆకస్మికంగా ఒక వైపునకు ఒరిగి నీట మునిగింది. నది ఒడ్డు ప్రదేశం కావటంతో గట్టుమీదున్న ప్రజలు హుటాహుటిన 20 మంది ప్రయాణికులను రక్షించారు. వాహనాలతోపాటు బల్లకట్టు చిక్కుకుపోయింది. ఈ ప్రమాదం అయిదు నిమిషాల ముందు జరిగి ఉంటే భారీ ప్రాణనష్టం జరిగేదంటున్నారు. బల్లకట్టుపై లారీని పొక్లెయిన్లతో బయటకు తరలించారు. టాటా ఏస్ వ్యాన్, ఆటోలు, ట్రాక్టర్‌ను చాకచాక్యంగా బయటకు తరలించారు. పెనుప్రమాదం తప్పటంతో బల్లకట్టు ప్రయాణికులు ఊపిరి పీల్చుకున్నారు. అధిక బరువు వేయటంతోనే ప్రమాదం జరిగిందని ప్రయాణికులు అంటున్నారు. ప్రభుత్వాధికారులు, ప్రజాప్రతినిధులు ఘటనా స్థలికి చేరుకుని సమీక్షించారు. బల్లకట్టుపై ఓవర్ లోడు వేసిన కాంట్రాక్టరుపై చర్యలు తీసుకోవాలని చందర్లపాడు అధికారులను ఉన్నతాధికారులు ఆదేశించినట్లు సమాచారం.

కాంట్రాక్టర్ల ఇష్టారాజ్యం

కృష్ణానదిలో బల్లకట్టు ప్రయాణాలను పర్యవేక్షించాల్సిన అధికారులు మామూళ్ల మత్తులో మిన్నకుండటంతో బల్లకట్టు కాంట్రాక్టర్లు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. పరిమితికి మించిన బరువులతో నిత్యం రాకపోకలు సాగిస్తున్నారని అంటున్నారు. బల్లకట్టు రాకపోకలపై ఒక్కరోజు కూడా అధికారుల పర్యవేక్షణ లేకపోవడం నిర్లక్ష్యమేనంటున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని కోరుతున్నారు.

వ్యవసాయానికి ఆరు శాతమేనా?

- బడ్జెట్‌లో లేని రుణమాఫీ ప్రస్తావన
- అరొకర నిధులతో గొప్పలు
- బడ్జెట్ కేటాయింపుపై రావుల వెంకయ్య ఆగ్రహం

విశాలాంధ్ర-విజయవాడ : ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మంగళవారం ప్రవేశపెట్టినది ఓట్ ఆన్ అకౌంట్ బడ్జెట్ కాదు అకౌంట్ ఫర్ ఓట్ (ఓటు కోసం లెక్క) బడ్జెట్ అని అఖిల భారత రైతు సంఘం ఉపాధ్యక్షుడు రావుల వెంకయ్య విమర్శించారు. రూ.2,27,000 కోట్ల బడ్జెట్‌లో వ్యవసాయ రంగానికి రూ.12వేల కోట్లు మాత్రమే కేటాయించడం ఏమిటని ఒక ప్రకటనలో ప్రశ్నించారు. రాష్ట్రంలో 60శాతానికిపైగా ఉన్న రైతాంగానికి ఆరు శాతం మాత్రమే కేటాయించారని, ఈ అరకొర కేటాయింపులతో రైతుల సంక్షేమం సాధ్యం కాదని ఆయనన్నారు. ఈ నిధులు రైతులకు ఎలా మేలు చేస్తాయని ఆయన ముఖ్యమంత్రి చంద్రబాబును సూటిగా ప్రశ్నించారు. 'అన్నదాత సుఖీభవ' పథకానికి రూ.5వేల కోట్లు ప్రకటించారు కానీ అది దేనికి కేటాయించారు, ఏ విధంగా ఖర్చు చేస్తారు.. దాని విధివిధానాలు ఏమిటన్నది స్పష్టంచేయాలని రావుల డిమాండు చేశారు. తెలంగాణ, ఒడిశా రాష్ట్రాల్లో ఖరీఫ్, రబీ సీజన్లలో ఎకరాకు రూ.4వేలు చొప్పున ఏటా రూ.8వేలు ఇస్తున్నారని, దానిని రూ.10వేలకు పెంచుతామని తెలంగాణ ప్రభుత్వం చెబుతోందని, ఒడిశా కూడా అదే బాటలో పయనిస్తోందని గుర్తుచేశారు. ఆంధ్రప్రదేశ్‌లో రైతులను ఆదుకునే ఆలోచన కూడా టీడీపీ ప్రభుత్వానికి ఉందా లేదా అన్నది అర్థం కావడం లేదన్నారు. రైతులకు రుణమాఫీ కోసం బడ్జెట్‌లో పైసా కూడా కేటాయింకపోవడం చంద్రబాబు ప్రభుత్వ మైసపూరిత వైఖరికి నిదర్శనమని రావుల వెంకయ్య ఆగ్రహం వ్యక్తంచేశారు. రాష్ట్రంలో 16లక్షల మందికిపైగా ఉన్న కౌలు రైతుల ప్రస్తావన లేదన్నారు. రైతుల ధర నిర్ణాయక నిధికి రూ.5వేల కోట్లు కేటాయిస్తామని చెప్పిన చంద్రబాబు, వెయ్యి కోట్లు కేటాయించి చంకలు కొట్టుకుంటున్నారని ఎద్దేవా చేశారు. 'రైతురథం' పేరుతో రైతులకు ట్రాక్టర్లు, వ్యవసాయ యంత్రాల కొనుగోలుకు రూ.2.5 లక్షలు సబ్సిడీ ఇస్తామని ప్రకటించి, ఎంతమందికో వెల్లడించలేదని చెప్పారు.



విరాళాలు అందజేస్తున్న రామారావు

సీపీఐకు ఎన్‌ఆర్‌ఐల విరాళం

విశాలాంధ్ర - మచిలీపట్నం : ఆదర్శ కమ్యూనిస్టు మోదుమూడి లలితాదేవి 21వ వర్ధంతి సందర్భంగా ఆమె మనుమరాళ్లు సీపీఐకి రూ.30 వేలు విరాళంగా ఇచ్చారు. అమరజీవి మోదుమూడి శ్రీహరిరావు సతీమణి లలితాదేవి 21వ వర్ధంతి సభ మంగళవారం మచిలీపట్నంలో జరిగింది. ఈ సందర్భంగా లలితాదేవి పెద్ద కుమారుడు మోదుమూడి రామారావు కుమార్తెలు శిరీష, శ్రీలత, శ్రీదీప్తి తమ నాయనమ్మ లలితాదేవి జ్ఞాపకార్థం సీపీఐ రాష్ట్ర సమితికి రూ. 10వేలు, కృష్ణాజిల్లా సమితికి రూ. 10వేలు, మచిలీపట్నం ఏరియా సమితికి రూ. 10వేలు మొత్తం రూ. 30 వేలు విరాళంగా ఇచ్చారు. అమెరికాలో ఉంటున్న వీరి తరుపున మోదుమూడి రామారావు సభకు అధ్యక్షతవహించిన గుర్రం వెంకటేశ్వరరావుకు ఈ మొత్తాన్ని అందజేశారు. ప్రముఖ వైద్యులు డాక్టరు కుప్పా రామస్వామి శాస్త్రి, జిల్లా రైతు సంఘం నాయకులు గొరిపర్తి రామారావు, ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షులు లింగం ఫిలిప్, రిటైర్డ్ ప్రధానోపాధ్యాయులు దాలిపర్తి కృష్ణమూర్తి తదితరులు సభలో ప్రసంగించారు.

పెద్దల సభకు నేతల పోటీ

విశాలాంధ్ర బ్యూరో-హైదరాబాద్: గ్రామ పంచాయతీ ఎన్నికలు ముగియడంతో త్వరలోనే శాసనమండలికి ఎన్నికల షెడ్యూలు విడుదలయ్యే అవకాశం ఉంది. దీంతో ఉత్తర తెలంగాణ పట్టభద్రుల స్థానం అభ్యర్థిత్వం కోసం టీఆర్ఎస్ నాయకుల్లో పోటీ పెరుగుతోంది. ఈ నియోజకవర్గం నుంచి ప్రస్తుతం మండలి చైర్మన్‌గా ఉన్న స్వామిగౌడ్ ప్రాతినిధ్యం వహిస్తున్నారు. స్వామిగౌడ్ పదవీకాలం ముగియనున్న నేపథ్యంలో ఈ స్థానానికి ఎన్నికలు జరిగే అవకాశం ఉంది. స్వామిగౌడ్ ఈసారి ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీ చేయకపోవచ్చని ప్రచారం జరిగింది. ఆయన అసెంబ్లీ ఎన్నికల్లో టికెట్ ఆశించినా, అది సాధ్యంకాలేదు. దీంతో స్వామిగౌడ్ లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేస్తారని ప్రచారం జరుగుతోంది. ఉత్తర తెలంగాణ పట్టభద్రుల నియోజకవర్గం నుంచి తెలంగాణ గ్రూప్1 అధికారుల సంఘం అధ్యక్షుడు చంద్రశేఖర్‌గౌడ్ పోటీ చేసే అవకాశం ఉంది. స్వామిగౌడ్‌తోపాటు టీఎన్జీఓల సంఘం, టీఆర్ఎస్ అధిష్ఠానం మద్దతు ఆయనకు ఉందనిపిస్తోంది. మరోవైపు సీనియర్ జర్నలిస్టు, మాజీ ఎమ్మెల్సీ ఆర్.సత్యనారాయణ ఈ స్థానం నుంచి పోటీకి ఆసక్తి చూపుతున్నారని తెలుస్తోంది. సత్యనారాయణ 2007లో ఉమ్మడి కరీంనగర్, నిజామాబాద్, మెదక్, ఆదిలాబాద్ జిల్లాలు కలిసి ఉన్న ఉత్తర తెలంగాణ పట్టభద్రుల నియోజకవర్గం నుంచి ఎమ్మెల్సీగా నెగ్గారు. కేసీఆర్ పిలుపుతో ఏడాదిలోపే ఆ పదవికి రాజీనామా చేసి తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్నారు. ఆ తర్వాత ఎన్నికలకు దూరంగా ఉంటూ వచ్చారు. డిసెంబర్‌లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో టికెట్ ఆశించి భంగపడ్డారు. నాయకత్వంపై అసంతృప్తితో ఉన్న సత్యనారాయణను కేటీఆర్, హరీశ్‌రావు బుజ్జగించారు. సత్యనారాయణ రాజీనామాతో 2008లో ఉత్తర తెలంగాణ పట్టభద్రుల నియోజకవర్గానికి జరిగిన ఉప ఎన్నికలో నారదాసు లక్ష్మణ్‌రావు గెలుపొందితే, 2013లో స్వామిగౌడ్ నెగ్గారు. ఈ ముగ్గురూ బీసీలు కావడంతో ఈసారి టీఆర్ఎస్ అభ్యర్థి ఎంపికలో సామాజిక సమీకరణలనూ పరిగణనలోకి తీసుకునే అవకాశం ఉంది. తెలంగాణ ప్రైవేటు విద్యాసంస్థల సంఘం కార్యదర్శి యాదగిరిరావు, కరీంనగర్ మేయర్ రవీందర్‌సింగ్, టీఎన్జీఓల సంఘం మాజీనేత షామీద్, పేర్యాల దేవేందర్‌రావు ఆశావహుల్లో ఉన్నారు.

'ఫుడ్ ప్రాసెసింగ్' మరింత వేగవంతం

విశాలాంధ్ర బ్యూరో-హైదరాబాద్: తెలంగాణలో ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమను అభివృద్ధి చేసేందుకు వేగంగా అడుగులు ముందుకు పడుతున్నాయి. మహిళా సంఘాలను బలోపేతం చేయడంతో పాటు గ్రామాల్లో పండిన ఉత్పత్తులను విదేశాలకు మార్కెంటింగ్ చేసేలా అధికారులు బృహత్ ప్రణాళికలు రచించారు. పంటలను మహిళా సంఘాలు నేరుగా రైతుల నుంచి కొనుగోలు చేసి, ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లలో వాటిని ప్రాసెస్ చేసి దేశ, విదేశాలకు ఎగుమతి చేయనున్నారు. దీంతో తెలంగాణ ఉత్పత్తులకు మార్కెటింగ్ , మహిళలకు ఉపాధి అవకాశాలు పెరుగనున్నాయి. ఈ బృహత్ ప్రణాళికను అతిత్వరలో రాష్ట్రంలో అమలుచేసే ప్రక్రియ మొదలైంది. అధికారులు పలు అంశాలపై క్షేత్రస్థాయిలో సర్వే చేస్తున్నారు. మహిళా సంఘాలు చేపట్టిన చిరువ్యాపారాలు, ఆర్థిక ప్రగతి, ఇబ్బందులు, మార్కెటింగ్ వ్యవస్థను పరిశీలిస్తున్నారు. ఇప్పటివరకు గుర్తించిన అంశాలతో మంగళవారం ఉన్నతస్థాయి సమావేశం నిర్వహించారు. రాష్ట్రంలో మొత్తం 30 జిల్లా, 553 మండల, 17,750 గ్రామ సమాఖ్యలున్నాయి. 4,12,455 మహిళా సంఘాలుండగా, 45,09,414 మంది సభ్యులున్నారు. 2014-18 మధ్య రూ.25 వేల కోట్లను అప్పుగా తీసుకొని, తిరిగి చెల్లించారు. పేదరిక నిర్మూల సంస్థ సర్వే ప్రకారం రుణాలు తీసుకుంటున్న మహిళల్లో దాదాపు 15,618 మంది చిరు వ్యాపారాలు, కుటీర పరిశ్రమలు నిర్వహిస్తున్నారు. పాపడ్, స్నాక్స్, మక్క అటుకులు, పచ్చళ్లు, సీతాఫలాల గుజ్జు, మామిడి గుజ్జు వంటివి ఉత్పత్తి చేస్తున్నారు. చాలామంది మార్కెటింగ్‌లో ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. ఇతర ప్రాంతాలకు ఎగుమతి చేయలేక, స్థానికంగా అమ్ముకుంటున్నారు. ఈ సమస్యలు, ప్రత్యమ్నాయ మార్గాలపై సెర్ప్ అధికారులు నివేదిక సిద్ధం చేశారు. ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లకనుగుణంగా చిరుధాన్యాల పరిశ్రమలను ఏర్పాటు చేస్తారు. ఉత్పత్తులు ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లకు చేరిన తర్వాత మహిళా సంఘాల సభ్యులు ప్రాసెసింగ్, మార్కెటింగ్ చేస్తారు. ఈ ప్రక్రియకు మూడు నెలలు పట్టినా, మళ్లీ కొత్త పంట రావడానికి మరో మూడు నెలలు ఖాళీగా ఉండాల్సి వస్తుంది. ఈ సమయంలో వారికి ఉపాధి, అదనపు ఆదాయం కల్పించేందుకు చిరుధాన్యాల పరిశ్రమలను ఏర్పాటు చేయనున్నారు. చిరు ధాన్యాలు, పప్పు దినుసులను పండించేందుకు అనువైన భూములను గుర్తించి, రైతులను ఆ పంటల వైపు మళ్లిస్తారు.

సమస్యల పరిష్కారానికి కృషి

విశాలాంధ్రబ్యూరో - అమరావతి: ప్రభుత్వశాఖల్లో పనిచేస్తోన్న ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ఏపీ జేఏసీ అమరావతి అహర్నిశలు కృషి చేస్తోందని ఆలిండియా స్టేట్ పెన్షనర్ల ఫెడరేషన్ ప్రధాన కార్యదర్శి జి.పూర్ణచంద్రరావు తెలిపారు. ఏపీ జేఏసీ అమరావతి ద్వితీయ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో మంగళవారం ఏపీ జేఏసీ అమరావతి చైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు అధ్యక్షతన ద్వితీయ మహాజన సభ జరిగింది. కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న పూర్ణచంద్రరావు మాట్లాడుతూ కేవలం 22 సంఘాలతో 2017లో ఆవిర్భవించిన ఏపీ జేఏసీ అమరావతి రెండేళ్లలో 99 సంఘాలకు ఎదగడం అభినందనీయమన్నారు. రాష్ట్రంలో ఉన్న ఉద్యోగ సంఘాలు, పెన్షనర్ల సంఘాలు ఐక్యంగా ఉండి రానున్న రోజుల్లో సమష్టిగా సమస్యల పరిష్కారానికి పోరాటాలు చేయాలన్నారు. ఏపీ సచివాలయం ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు ఉప్పుటూరి మురళీకృష్ణ మాట్లాడుతూ ఏపీ జేఏసీ అమరావతి అనతి కాలంలోనే ఎన్నో దీర్ఘకాలిక సమస్యల పరిష్కరించేందుకు కృషి చేసి విజయం పొందిందన్నారు. బొప్పరాజు వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఫిబ్రవరి 5వతేదీ 2017లో తిరుపతిలో ఆవిర్భవించిన ఏపీ జేఏసీ అమరావతి భారతదేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా 99 ఉద్యోగ ఉపాధ్యాయ కార్మిక సంఘాలతో పనిచేస్తోందన్నారు. ఏపీఎస్‌ఆర్టీసీ ఎంప్లాయీస్ యూనియన్ అధ్యక్షుడు వైవీ రావు మాట్లాడుతూ బొప్పరాజు నాయకత్వంలో ఏపీ జేఏసీ అమరావతి ఎన్నో అద్భుత విజయాలను సాధించిందన్నారు. టీవీ ఫణిపేర్రాజు మాట్లాడుతూ ఉద్యోగ సంఘాల చరిత్రలోనే ఎవరూ సాధించలేని దీర్ఘకాలిక సమస్యలను పరిష్కరించడం జరిగిందన్నారు. అనంతరం పలు తీర్మానాలను మహాజన సభ ఆమోదించింది. అమరావతి జేఏసీ మహిళా విభాగం చైర్‌పర్సన్ ఎంవీ రమణ, కోశాధికారి వీవీ మురళీకృష్ణనాయుడు, రాష్ట్ర కోచైర్మన్‌లు మహేంద్రకుమార్, జీవీ నారాయణరెడ్డి, ఎస్.కృష్ణమోహన్, పోలాకి శ్రీనివాసరావు, ఎస్.కొండయ్య, కె.ఆల్ఫ్రెడ్, డీజీ ప్రసాద్‌రావు, ఏపీఎస్‌ఆర్టీసీ ఈయూ ప్రధానకార్యదర్శి పలిశెట్టి దామోదర్, అనుబంధ సంఘాల నాయకులు ఎస్‌జే హెన్రీబాబు తదితరులు పాల్గొన్నారు.

అంకెల గారడీ

- రైతుల కోసం 'అన్నదాత సుఖీభవ' పథకం
- రూ.1000 కోట్లతో ధరల స్థిరీకరణ నిధి
- రూ.650 కోట్లతో కర్నూలులో మెగా సీడ్ పార్కు
- నిరుద్యోగ భృతి రూ.2 వేలకు పెంపు
- బీసీలకు సబ్‌ప్లాన్.. కొత్తగా 11 కార్పొరేషన్లు
- రూ.2,26,177.53 కోట్లతో భారీ బడ్జెట్‌ను ప్రవేశపెట్టిన యనమల



విశాలాంధ్ర బ్యూరో- అమరావతి : ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 2019-20 సంవత్సరానికి సంబంధించిన ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌ను మంగళవారం అసెంబ్లీలో ప్రవేశపెట్టారు. త్వరలో సార్వత్రిక ఎన్నికలు జరుగనున్న నేపథ్యంలో ఓటర్లను ఆకర్షించడమే లక్ష్యంగా వివిధ వర్గాలకు ప్రయోజనం కలిగించే రీతిలో పలు సంక్షేమ పథకాలు పొందుపరుస్తూ దాదాపు రూ.2,26,177.53 కోట్లతో భారీ బడ్జెట్‌ను రూపొందించారు. ఇది గత ఏడాది కన్నా 18.38 శాతం అధికం. రెవెన్యూ వ్యయం 20.03 శాతం పెంపుతో రూ.1,80,369.33 కోట్లు, మూలధన వ్యయం రూ.29,596.33 కోట్లు, రెవెన్యూ మిగులు రూ.2099.47 కోట్లుగా, ఆర్థిక లోటు 32,390.68 కోట్లుగా అంచనా వేశారు. గత ఏడాది కన్నా వాణిజ్య పన్నులలో 14.61 వృద్ధి చూపించారు. ఆధార్ అనుసంధానం ద్వారా ఒక్క సివిల్ సప్లయిస్ రంగంలోనే రూ.2,585 కోట్ల ఆదా చేకూరినట్లు తెలిపారు. ప్రత్యేక హోదా రాష్ట్రాలలో అభివృద్ధిపై 61.5 శాతం ఖర్చు చేస్తుండగా, ఏపీలో 72.4 శాతం ఖర్చు చేస్తున్నట్లు విశ్లేషించారు. అలాగే దేశంలోనే అత్యధికంగా సంక్షేమ పథకాల కోసం 51.1శాతం వ్యయం చేస్తున్నట్లు చెప్పారు. మంగళవారం ఉదయం 11.45 గంటలకు శాసనసభలో యనమల బడ్జెట్‌ను ప్రవేశపెట్టారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్, విభజన తర్వాత యనమల బడ్జెట్ ప్రవేశపెట్టడం ఇది 11వసారి కావడం గమనార్హం. గత నాలుగున్నరేళ్ల ప్రయాణంలో ఎన్నో సవాళ్లు ఎదుర్కొన్నామని, హేతుబద్ధత లేకుండా జరిగిన రాష్ట్ర విభజన, రాజధాని నగరాన్ని కోల్పోవడం, ఆదాయ-వ్యయాలు, ఆస్తులు, అప్పులు సరిగా పంపిణీ చేయక రాష్ట్రం ఎదుర్కొన్న ఇబ్బందులను యనమల తన బడ్జెట్‌లో ప్రస్తావించారు. అయినప్పటికీ సమర్థవంతమైన సీఎం చంద్రబాబు నాయకత్వంలో దేశంలో ఎక్కడా లేనివిధంగా సంక్షేమానికి పెద్ద పీట వేస్తూ గణనీయమైన వృద్ధి సాధించినట్లు యనమల సీఎం కృషిని కొనియాడారు. రైతులకు రూ.24 వేల కోట్ల రుణభారం నుంచి విముక్తి కల్పించామని, 2.23 లక్షల ఉద్యాన రైతులకు రూ.384 కోట్ల రుణాలను రద్దు చేశామని తెలిపారు. ఈ బడ్జెట్‌లో 'అన్నదాత సుఖీభవ' పథకం పేరుతో రైతులకు మరో వినూత్న పథకం తెస్తున్నామని యనమల సభ్యుల హర్షధ్వానాల మధ్య ప్రకటించారు. దీనికోసం ఈ బడ్జెట్‌లో రూ.5,000 కోట్లు కేటాయిస్తున్నట్లు తెలిపారు. ఇన్‌పుట్ సబ్సిడీ వల్ల 39.33 లక్షల రైతులకు లబ్ధి చేకూరుతుందని, రూ.2.5 లక్షల రాయితీతో ట్రాక్టర్లు పంపిణీ చేస్తున్నామని చెప్పారు. విశ్వ విత్తన కేంద్రంగా ఆంధ్రప్రదేశ్‌ను తీర్చిదిద్దుతున్నామని, ఇందుకోసం కర్నూలు జిల్లాలో రూ.650 కోట్లతో మెగా సీడ్ పార్క్ ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఎన్టీఆర్ జలసిరి 2వ దశలో 35,508 మందికి లబ్ధి చేకూరుతుందని, దీనిద్వారా 88,780 ఎకరాలు సాగులోకి వచ్చాయన్నారు. బిందుసేద్యం ద్వారా 7.25 లక్షల రైతులకు లబ్ధి కలుగుతుండగా 7.3 లక్షల హెక్టార్లు సస్యశ్యామలమవుతుందన్నారు. బడ్జెట్‌లో ఆహార శుద్ధి పరిశ్రమలకు రూ.300 కోట్లు, ధరల స్థిరీకరణ నిధిని రూ.రూ.1,000 కోట్లకు పెంచుతూ ప్రతిపాదించారు. నాలుగేళ్లలో కౌలు రైతులకు రూ.272 కోట్ల నుంచి రూ 4,957 కోట్లకు పంట రుణాలు పెంచామన్నారు. ఊరూరా పశుగ్రాస క్షేత్రాలు 83,396 ఎకరాల్లో అభివృద్ధి చేసేందుకు రూ.200 కోట్లు, పశువులపై బీమాకు మరో రూ.200 కోట్లు బడ్జెట్‌లో కేటాయించారు. ఆక్వాపై విద్యుత్ టారిఫ్ యూనిట్ రూ.4.13 నుంచి రూ.2కు తగ్గించారు. ముఖ్యమంత్రి యువనేస్తం ద్వారా 4.3 లక్షల మంది నిరుద్యోగులకు లబ్ధి చేకూరుతుందని చెబుతూ నిరుద్యోగ భృతిని రూ.1,000 నుంచి రూ2,000కు పెంచుతున్నట్లు ప్రకటించారు. ఈ పథకం ద్వారా ఇప్పటివరకు 8.66 లక్షల మంది యువతను నైపుణ్యాభివృద్ధి చేశామన్నారు. ప్రైవేటు రంగాల ద్వారా 7.7 లక్షల ఉద్యోగాలు కల్పించామని, 42 వేల ఉద్యోగాల నియామకాలకు ప్రభుత్వ అనుమతులు ఇచ్చామని యనమల వివరించారు.

సంక్షేమానికి పెద్దపీట

నాలుగున్నరేళ్లలో సబ్ ప్లాన్ కింద అత్యధిక వ్యయం చేశామని, ఎస్సీలకు రూ.32,843 కోట్లు, ఎస్టీలకు రూ.8,950 కోట్లు, బీసీలకు రూ.28,805 కోట్లు వ్యయం చేశామని తెలిపారు. అలాగే 11 కార్పొరేషన్లు కొత్తగా ఏర్పాటు చేస్తున్నామని, 8 ఫెడరేషన్లను కార్పొరేషన్లుగా చేస్తున్నామన్నారు. బీసీ కార్పొరేషన్లకు ఈ బడ్జెట్‌లో రూ.3,000 కోట్లు ప్రతిపాదించారు. కాపుల సంక్షేమానికి రూ.1000 కోట్లు, బ్రాహ్మణుల సంక్షేమానికి రూ.100 కోట్లు, ఎంఎస్ఎంఈ రంగానికి రూ.1,000 కోట్లు, ఆర్యవైశ్యుల సంక్షేమానికి రూ.50 కోట్లు, క్షత్రియుల సంక్షేమానికి రూ.50 కోట్లు కేటాయించారు. ఇక విద్యార్థుల సంక్షేమానికి సంబంధించి వివరిస్తూ 71 లక్షల మంది ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈబీసీ, మైనార్టీ విద్యార్థులకు ఉపకార వేతనాలు ఇస్తున్నామని, ఇందుకోసం రూ.2,833 కోట్లు ఖర్చు చేస్తున్నట్లు చెప్పారు. విదేశీ విద్య కింద 4,528 విద్యార్థులకు ఇప్పటివరకు లబ్ధి చేకూర్చగా, ఎన్టీఆర్ విద్యాదరణ కింద రూ.143 కోట్లు ఖర్చు చేశామన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీల కార్పొరేషన్లు, ఫెడరేషన్ల ద్వారా రూ.4,823 కోట్లు వ్యయం చేయగా, ఈ బడ్జెట్‌లో మైనారిటీల సంక్షేమానికి రూ.1,304.43 కోట్లు కేటాయిస్తున్నట్లు ప్రకటించారు. దివ్యాంగుల సంక్షేమానికి రూ.70 కోట్లు ఎస్సీ కాంపోనెంట్‌లో కమ్యూనిటీ సౌకర్యాలకు రూ.600.56 కోట్లు, 308 కాపు భవనాల నిర్మాణానికి రూ.123 కోట్లు కేటాయించారు. ఎస్సీ సబ్ ప్లాన్‌కు 28 శాతం వృద్ధి చూపిస్తూ రూ.14,367 కోట్లు, ఎస్టీ సబ్ ప్లాన్‌కు 29 శాతం వృద్ధితో రూ.5,385 కోట్లు, బీసీ సబ్ ప్లాన్‌కు 33 శాతం వృద్ధితో రూ.16,226 కోట్లు కేటాయింపులు చేశారు. కొత్తగా డ్రైవర్ల సాధికార సంస్థ ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించి బడ్జెట్‌లో దీని కోసం రూ.150 కోట్లు కేటాయించారు. ఎన్టీఆర్ భరోసా కింద 50.11 లక్షల మందికి పింఛన్లు ఇస్తున్నామని, గత నాలుగేళ్లలో పింఛన్లపై రూ.24,618 కోట్ల వ్యయం చేశామని వివరించారు. ప్రతి ఇంటికి పెద్దకొడుకుగా ఉంటానని బాధ్యత తీసుకున్న ముఖ్యమంత్రి 5 ఏళ్లలో 10 రెట్లు పెంచుతూ రూ.2 వేలు చేశారని తెలిపారు. చంద్రన్న బీమా బడ్జెట్ రెండున్నర రెట్లు పెంచి రూ.354 కోట్లు కేటాయించామని, వైద్య ఆరోగ్య రంగానికి 18.53 శాతం వృద్ధితో రూ.10,032 కోట్లు కేటాయించామన్నారు. ఎన్టీఆర్ వైద్యసేవ బడ్జెట్‌ను వెయ్యి నుంచి రూ.1,200 కోట్లకు పెంచామని తెలిపారు. మానవ వనరుల విభాగానికి పెద్దపీట వేస్తూ మొత్తం బడ్జెట్‌లో 11.5 శాతం నిధులు రూ.29,955 కోట్లు కేటాయిస్తున్నట్లు చెప్పారు.

వృద్ధి రేటులో ఏపీయే ముందంజ

2014-15లో జీఎస్డీపీలో అప్పుల శాతం 28.33 శాతం కాగా, 2017-18లో 27.83 శాతంగా ఉందని, అప్పులు రూ.1,48,744 కోట్ల నుంచి రూ 2,23,706 కోట్లకు పెరిగాయని యనమల వివరించారు. ఇక భారత దేశం వృద్ధి రేటు 7.3 శాతం కాగా, ఏపీ వృద్ధి రేటు 10.66 శాతం, దేశంలో వ్యవసాయం వృద్ధి 2.4 శాతం, ఏపీలో 11 శాతం, దేశంలో పారిశ్రామిక రంగం వృద్ధి 7.1 శాతం, ఏపీలో పరిశ్రమల వృద్ధి 9.52 శాతంగా నమోదైందన్నారు. అలాగే దేశంలో సేవారంగం వృద్ధి రేటు 8.8 శాతం కాగా, ఏపీలో వృద్ధి రేటు 9.57 శాతం ఉందని యనమల తెలిపారు.

ఇతరుల దయాదాక్షిణ్యాలపై ఆధారపడే యాచకులం కాదు

విభజన అంశాలు, హామీల అమలు, కేంద్ర పన్నుల్లో మన పన్నుల వాటా, రాష్ట్ర హక్కుల సాధనలో వెనుకంజ వేసేది లేదని యనమల తన ముగింపు ఉపన్యాసంలో కేంద్రాన్ని హెచ్చరించారు. ఇతరుల దయా దాక్షిణ్యాలపై ఆధారపడే యాచకులం కాదని స్పష్టం చేశారు. మన హక్కుల సాధన పోరాటంలో ఎన్ని అడ్డంకులెదురైనా వాటిని ఎదుర్కొని గమ్యాన్ని చేర్చేదే సమర్థ నాయకత్వమన్నారు. భావితరాలకు దిశానిర్దేశం చేసే నాయకత్వం మా సొంతమని చంద్రబాబుని కొనియాడారు. ఓటు వేసిన వారికే కాకుండా, ఓటు వేయనివారి కోసం తమ ప్రభుత్వం పని చేస్తుందని చెప్పారు. రాష్ట్ర భవిష్యత్తు, రాష్ట్ర సమగ్రాభివృద్ధి, భావి తరాల భవిష్యత్తు కోసం పని చేయాల్సిన బృహత్తర బాధ్యత ప్రస్తుత తరంపై ఉందని పేర్కొంటూ, రాష్ట్రం ఆశించిన గమ్యం చేరేందుకు మనందరిలో నైతిక సామర్థ్యాన్ని పెంచిన సమర్థ నాయకత్వంపై రాష్ట్ర ప్రజానీకం యావత్తూ అచంచల విశ్వాసాన్ని ప్రదర్శిస్తుందని ఆశిస్తున్నానని యనమల తన ఉపన్యాసాన్ని ముగించారు.



న్యాయం చేయండి
ఎగ్జిబిషన్ బాధితుల మొర

విశాలాంధ్ర బ్యూరో-హైదరాబాద్: అగ్నిప్రమాదం వల్ల నష్టపోయిన తమకు న్యాయం చేయాలంటూ నాంపల్లి నుమాయిష్ బాధితులు ప్రభుత్వాన్ని వేడుకున్నారు. రూ.15 నుంచి రూ.20 లక్షల వరకు నష్టం జరిగినట్టు వాపోయారు. నిర్వాహకులు అక్బర్ అలీ మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వ ఖాదీ బోర్డులో 459 నుంచి 468 వరకు స్టాళ్లలో చేనేత వస్త్రాలను ఉంచాం. అవి బుగ్గి అయ్యాయి. ఆర్థికంగా చితికిపోయాం. ప్రభుత్వం ఆదుకోకపోతే ఆత్మహత్య సదృశ్యమే' అంటూ ఆవేదన వ్యక్తంచేశారు. ఎగ్జిబిషన్ తేదీని పొడిగించినంత మాత్రాన ఎలాంటి ప్రయోజనం లేదని, సరుకులేకుండా అమ్మకాలు ఎలా సాగిస్తామని, తమకు సొసైటీతో పాటు ప్రభుత్వం అండగా నిలవాలని కోరారు. స్టాలుకు చెల్లించిన రుసుము తిరిగి చెల్లించడంతో పాటు తక్షణ సహాయం కింద సొసైటీ రూ.10 వేలు చెల్లించినా అవి సరిపోదన్నారు. ఎగ్జిబిషన్ సొసైటీ, పాలకమండలి ఆర్థికంగా ఆదుకోవాలని అలీ విన్నవించారు.

చట్టసభల్లో బీసీలకు కోటా
ఆర్.కృష్ణయ్య డిమాండు

విశాలాంధ్ర బ్యూరో-హైదరాబాద్: చట్టసభల్లో బీసీలకు రాజకీయ రిజర్వేషన్లు కల్పించాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య డిమాండు చేశారు. రిజర్వేషన్ల సాధన కోసం అన్ని రాష్ట్రాల్లోని బీసీ సంఘాలను కలుపుకొని జాతీయస్థాయిలో ఉద్యమిస్తామన్నారు. 3 వేల కులాలు పార్లమెంటు మెట్లు ఎక్కలేదని తెలిపారు. 15 రాష్ట్రాల నుంచి ప్రాతినిధ్యమే లేకుండా పోయిందని చెప్పారు. బీసీ ప్రధాని అయి ఉండి కూడా బీసీలకు చట్టసభల్లో రిజర్వేషన్లు లేవంటే సిగ్గుచేటన్నారు. జనాభాలో 56 శాతం ఉన్న బీసీలకు అన్ని రంగాల్లో రిజర్వేషన్లు కల్పించాలని, లేని పక్షంలో ఉద్యమం మరింత తీవ్రరూపం దాలుస్తుందని కృష్ణయ్య హెచ్చరించారు.

బడ్జెట్‌పై భిన్నస్వరాలు

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి : రాష్ట్ర ప్రభుత్వం మంగళవారం ప్రవేశపెట్టిన భారీ బడ్జెట్‌పై వివిధ రాజకీయపార్టీలు, ప్రజాసంఘాల నేతలు భిన్నరీతిలో స్పందించారు. అధికారపార్టీ నేతలు దీనిని ప్రజా సంక్షేమ, అత్యుత్తమ బడ్జెట్‌గా పేర్కొనగా, విపక్షాలు ప్రజలను మరోసారి వంచించే బడ్జెట్‌గా విమర్శించాయి. కేవలం ఎన్నికల దృష్టిలో పెట్టుకొని ఓటర్లను ఆకర్షించేందుకు అంకెల గారడీతో భారీ బడ్జెట్‌కు రూపకల్పన చేశారని ధ్వజ మెత్తాయి. రాష్ట్ర ప్రభుత్వం తన వైఫల్యాలను కప్పిపుచ్చుకోవడానికి సంక్షేమ పథకాల పేరుతో ప్రజలను మోసగించి ఎన్నికల్లో లబ్ది పొందాలని చూస్తోందని, ఈ అంకెల గారడీ బడ్జెట్‌ను ప్రజలు విశ్వసించరని నేతలు హెచ్చరించారు.

ఇది ప్రజారంజక బడ్జెట్- సీఎం చంద్రబాబు

ఆర్థికమంత్రి యనమల రామకృష్ణుడు ప్రవేశపెట్టిన బడ్జెట్‌ను ప్రజారంజక బడ్జెట్‌గా సీఎం చంద్రబాబు అభివర్ణించారు. విభజన వల్ల రాష్ట్రం అనేక ఆర్థిక ఇక్కట్లకు గురవుతున్నా సంక్షేమం, అభివృద్ధిలో దేశంలోనే ముందంజలో వుందన్నారు. వ్యవసాయరంగానికి ప్రత్యేకంగా బడ్జెట్ ప్రవేశపెట్టడం విశేషంగా పేర్కొన్నారు. రైతు రుణమాఫీ అమలు చేసి అన్నదాతల ఆత్మహత్యలను నివారించామని, వ్యవసాయ రంగ వృద్ధిరేటు దేశం కంటే అగ్రగామిగా వున్నామన్నారు. ప్రస్తుత బడ్జెట్‌లో ప్రకటించిన అన్నదాత సుఖీభవ పథకం వారికి మరింత ఆర్థిక వెసులుబాటు కల్పిస్తుందన్నారు. ఫించన్ల పెంపు, నిరుద్యోగ భృతి రెట్టింపు, కొత్తగా 11 కార్పొరేషన్లు ఏర్పాటు, బీసీలకు సబ్‌ప్లాన్, చంద్రన్నబీమా, పెళ్ళి కానుకతోపాటు, అన్నివర్గాల సంక్షేమానికి బడ్జెట్‌లో సముచితస్థానం కల్పించినట్లు ముఖ్యమంత్రి చెప్పారు.

వంచనకు ప్రతిరూపం : రామకృష్ణ

ఇది బడ్జెట్ ప్రసంగమా? చంద్రబాబును స్తుతించే స్తోత్రమా? అన్నట్లు ఆర్థిక మంత్రి యనమల రామకృష్ణుడు ఓటాన్ అకౌంట్ (మధ్యంతర) బడ్జెట్ ప్రసంగం సాగిందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ విమర్శించారు. ఎన్నికల వేళ సంప్రదాయబద్ధంగా మధ్యంతర బడ్జెట్ ప్రవేశపెట్టాల్సింది పోయి, రాజ్యాంగ విరుద్ధంగా పూర్తిస్థాయి బడ్జెట్‌ను అసెంబ్లీ ముందుంచటమేమిటని ఆయన ప్రశ్నించారు. మళ్లీ అధికారంలోకి వచ్చే అవకాశంలేని ఈ ప్రభుత్వం పూర్తిస్థాయి బడ్జెట్ ప్రవేశపెట్టడం అర్థరహితమని ఆయన వ్యాఖ్యానించారు. ఊహాజనిత గణాంకాలతో భారీ కేటాయింపులతో వండివార్చిన ఈ బడ్జెట్‌లో ఆదాయ వనరుల వాస్తవ పరిస్థితిని విస్మరించారన్నారు. ఈ కేటాయింపులన్నీ కాగితాలకే పరిమితం కావడం తప్ప ఆచరణలో అమలయ్యే అవకాశం కనిపించడం లేదన్నారు. రూ.2,26,177.53 కోట్ల కేటాయింపులతో బడ్జెట్‌ను ప్రవేశపెడుతూ కూడా కీలక రంగాలకు కేటాయింపులను సక్రమంగా చేయలేదని, వాస్తవ ద్రవ్యోల్బణాన్ని కూడా పరిగణనలోకి తీసుకోలేదన్నారు. గత ఐదేళ్లుగా రైతుల రుణమాఫీ పూర్తిగా అమలు చేయని చంద్రబాబు, ఎన్నికల ముందు రైతులను మభ్యపెట్టేందుకు అన్నదాత సుఖీభవ అంటూ మరో కొత్త పథకాన్ని తెరపైకి తెచ్చారన్నారు. ఎన్నికల ముందు అమలు చేసే అవకాశం లేకపోయినా రైతులను మభ్య పెట్టేందుకే బడ్జెట్‌లో కొత్త పథకాన్ని ప్రభుత్వం ప్రకటించిందని విమర్శించారు. ఈ బడ్జెట్‌ను అంకెల గారడీతో తయారుచేసారని, కేవలం కాగితాలపైనే భారీ కేటాయింపులతో మరోసారి వంచనకు సిద్ధమయ్యారని రామకృష్ణ విమర్శించారు.గత ఎన్నికల్లో ప్రధాన హామీలైన వ్యవసాయ, డ్వాక్రా రుణాల మాఫీతో పాటు నిరుద్యోగ భృతికి గండికొట్టిన సర్కార్, ఇప్పుడు రెండు నెలల్లో ఎన్నికలు ఉన్నాయనగా మళ్లీ ఆయా వర్గాలను మోసం చేయడమే లక్ష్యంగా ఈ బడ్జెట్‌ను ప్రవేశపెట్టారని విమర్శించారు. ఇలాంటి వంచనలను ఇట్టే పసిగట్టి, ప్రజలు తగిన బుద్ధి చెబుతారని రామకృష్ణ హెచ్చరించారు.

అంకెల గారడీ బడ్జెట్ : మధు

రాష్ట్ర ప్రభుత్వ బడ్జెట్ అంకెల గారడీలా వుందని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి పి.మధు విమర్శించారు. ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని అనేక తాయిలాలు ప్రకటించారని, కాని గతేడాది సంక్షేమ కార్యక్రమాలకు చూపించిన నిధులను ఖర్చు చేయకుండా కోత విధించడం చూస్తుంటే ఇది ప్రజలను మోసగించే బడ్జెట్ అని తేలిపోతుందన్నారు. రాష్ట్రంలో సగానికిపైగా జిల్లాలు తీవ్రమైన కరవును ఎదుర్కొంటుంటే ఆ సమస్యను పరిష్కరించడానికి ఈ బడ్జెట్‌లో ఎటువంటి పరిష్కారాన్ని చూలేదని, ఉద్యోగుల మధ్యంతర భృతికి కేటాయింపులు లేదన్నారు. అలాగే చాలీచాలని వేతనాలతో కునారిల్లుతున్న అసంఘటిత రంగ కార్మికుల కోసం బడ్జెట్‌లో ఎటువంటి కేటాయింపుల్లేవని, ఆర్టీసీ సంస్థను కాపాడడానికి కేటాయింపులు చేయలేదని విమర్శించారు. ఉపాధి కార్మికులకు రూ.1872 కోట్లు బకాయిలుండగా ప్రభుత్వం 1000 కోట్లు మాత్రమే కేటాయించిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వ అంకెలగారడీ బడ్జెట్‌ను ప్రజలు ఎట్టిపరిస్థితుల్లో విశ్వసించరని మధు స్పష్టం చేశారు.

ఓట్ ఫర్ అకౌంట్ బడ్జెట్ : కాంగ్రెస్

ఆర్థికమంత్రి యనమల ప్రవేశపెట్టిన బడ్జెట్ ఓట్ ఫర్ అకౌంట్ బడ్జెట్ అంకెల గారడీగా ఉందని ఏపీసీసీ ముఖ్య అధికార ప్రతినిధి కొలనుకొండ శివాజీ విమర్శించారు. ఓటాన్ ఎకౌంట్ బడ్జెట్ అంటూనే పూర్తి స్థాయి బడ్జెట్‌ను తలదన్నే రీతిలో వివిధ రంగాలకు కేటాయింపులు జరపడం, కొత్త సంక్షేమ పథకాలను ప్రకటించడం మరింత విడ్డూరంగా ఉందన్నారు. ప్రభుత్వ అవినీతి, అసమర్థతను కప్పిపుచ్చుకునేందుకే సంక్షేమ జపం మొదలుపెట్టారని ఆరోపించారు. కొత్తగా బడ్జెట్‌లో ఆరు సంక్షేమ పథకాలను ప్రకటించడం ఎన్నికల గిమ్మిక్కు మాత్రమేనన్నారు. బీసీల సబ్ ప్లాన్‌కు చట్టబద్ధత కల్పించకపోవడాన్ని కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా నిరసిస్తుందన్నారు. నాలుగున్నరేళ్లకు పైబడి రాష్ట్రానికి కేంద్ర ప్రభుత్వం చేస్తున్న అన్యాయానికి తోడు టీడీపీ ప్రభుత్వ అవినీతి, అసమర్థత వల్ల రాష్ట్రం అప్పుల పాలైంది అని మండిపడ్డారు.

ప్రజల డబ్బుతో ఓట్లు కొంటారా : ఓబులేసు

ప్రజల డబ్బుతో ఓట్లను కొనుగోలు చేసే పథకాలుగా బడ్జెట్ వుందని ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధానకార్యదర్శి జి.ఓబులేసు విమర్శించారు. బడ్జెట్‌లో గొప్పగా ఇచ్చినట్లు కనిపించినా ప్రధానమైన రంగాలకు, సంఖ్యాపరంగా ఎక్కువగా వున్నవారికి ఈ బడ్జెట్‌లో అన్యాయం జరిగిందన్నారు. గతంలో చంద్రన్న బీమా నిధులు వాడుకొని ఇస్తానని చెప్పి, వాటి గురించి ప్రస్తావించకుండా మళ్ళీ నిధులు కేటాయించడం మభ్యపుచ్చడమేనన్నారు. రాజమహేంద్రవరంలో జయహో బీసీ అని చెప్పి, వారికి జనాభా ప్రాతిపదికన నిధులు కేటాయించకుండా మోసం చేశారని విమర్శించారు.

కూలీలకు కేటాయింపులేవి - వ్య.కా.సం

రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో పేదలకు ఇళ్లస్థలాలు, భూముల సేకరణ కోసం తక్కువగా కేటాయింపులు చేయడం పక్కాగృహాలు నిర్మించే యోచనలేదనట్లుగా కనపడుతోందని వ్యవసాయ కార్మికసంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు జల్లి విల్సన్, ఆవుల శేఖర్‌లు విమర్శించారు. ఉపాధి హామీకి కేవలం రూ.1000 కోట్లు కేటాయించడం పేదలకు అశనిపాతం లాంటిదని వారు అభిప్రాయపడ్డారు.

దళిత సంక్షేమం ఏది - డీహెచ్‌పీఎస్

రాష్ట్ర జనాభాలో 16.6శాతమున్న ఎస్సీ వర్గాలకు రూ.14365 కోట్లు, 6.2. శాతమున్న ఎస్టీ వర్గాలకు రూ.5,385 కోట్లు మాత్రమే కేటాయించడం సామాజిక న్యాయమా ? అని డీహెచ్‌పీఎస్ రాష్ట్ర ప్రధానకార్యదర్శి కరవది సుబ్బారావు ప్రశ్నించారు. ఎన్నికల ప్రయోజనాలను నెరవేర్చేందుకు ఎస్సీ నిధులను పసుపు-కుంకుమ పథకానికి రూ.1678.60 కోట్లు దారి మళ్ళించడం దళిత సంక్షేమమా? అని విమర్శించారు.

ఉపయోగపడని బడ్జెట్-ఏపీ రైతు సంఘం

రాష్ట్రంలో 60శాతంగా ఉన్న రైతాంగానికి బడ్జెట్‌లో కేవలం 6శాతం నిధులు కేటాయించడం దారుణమని ఏపీ రైతు సంఘం అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు పి.రామచంద్రయ్య, కేవీవీ ప్రసాద్‌లు విమర్శించారు. గత ఎన్నికల సందర్భంగా ప్రకటించిన రుణమాఫీ ఇంకా పూర్తిగా అమలు చేయకుండానే ప్రస్తుత బడ్జెట్‌లో అన్నదాత సుఖీభవ పేరుతో 5వేల కోట్లతో కొత్త పథకం ప్రవేశపెట్టడం రైతులను మోసగించడమేనన్నారు. అలాగే వ్యవసాయ రంగానికి ప్రత్యేక బడ్జెట్ కేటాయించకపోవడం ఆరంగాన్ని నిర్లక్ష్యం చేయడమేనన్నారు.సమస్యల పరిష్కారానికి ఏపీ జేఏసీ అమరావతి కృషి

వాకపల్లి కేసు మళ్లీ విచారణ

విశాలాంధ్ర- విశాఖ సిటీ బ్యూరో : విశాఖ జిల్లా వాకపల్లిలో 11 మంది గిరిజన యువతులపై జరిగిన సామూహిక అత్యాచారం కేసు పునర్విచారణ మంగళవారం ప్రారంభ మైంది. 2017 సెప్టెంబరులో సుప్రీంకోర్టు ఉత్తర్వుల తరువాత విశాఖలోని ప్రత్యేక కోర్టు జనవరి 2018లో విచారణ ప్రారంభించింది.

పాండ్యపై భజ్జీ ప్రశంసల వర్షం



ముంబై : టీమిండియా యువ ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్యపై వెటరన్ ఆఫ్ స్పిన్నర్ హర్భజన్ సింగ్ ప్రశంసల వర్షం కురిపించాడు. న్యూజిలాండ్‌తో చివరి వన్డేలో అతడి బ్యాటింగ్, బౌలింగ్ అద్భుతమని పేర్కొన్నాడు. హార్దిక్ ఫామ్ చూసి సంతోషిస్తున్నానని వెల్లడించాడు. కివీస్‌పై ఐదో వన్డేలో అతడు 22 బంతుల్లో 45 పరుగులు చేశాడు. భారీ సిక్సర్లు బాదేశాడు. అందులో హ్యాట్రిక్ సిక్సర్లు ఉన్నాయి. బంతితోనూ రాణించి రెండు కీలక వికెట్లు తీశాడు. 'హార్దిక్ పాండ్య బ్యాటు, బంతితో అద్భుతంగా రాణించాడు. అతడి ఫామ్ చూసి చాలా సంతోషిస్తున్నా. తనపైనున్న వివాదాన్ని పక్కకు నెట్టేశాడు. అతడి క్రికెట్ గురించి మరెవరూ మాట్లాడకుండా చేశాడు. పాండ్య ప్రదర్శన చాలా చాలా బాగుంది. అతడు టీమిండియాలో అత్యంత కీలక సభ్యుడు. బ్యాటు, బంతితో రాణించడం భారత జట్టుకు శుభ శకునం' అని భజ్జీ అన్నాడు. ఐదో వన్డేలో 18 పరుగులకే 4 వికెట్లు చేజార్చుకున్న స్థితిలో అంబటి రాయుడి (90) స్థిరమైన బ్యాటింగ్‌ను హర్భజన్ మెచ్చుకున్నాడు. అతడు అంతర్జాతీయ క్రికెట్‌లో పురోగతి సాధించినందుకు అభినందించాడు. కాఫీ విత్ కరణ్ షోలో పాండ్య అనుచిత వ్యాఖ్యలపై భజ్జీ ఘాటుగా స్పందించిన సంగతి తెలిసిందే.

'గల్లీబాయ్'తో సింధు సెల్ఫీ



ముంబై : ప్రముఖ బ్యాడ్మింటన్ క్రీడాకారిణి పీవీ సింధు బాలీవుడ్ నటుడు రణ్‌వీర్ సింగ్‌ను కలిసింది. ముంబైలో జరుగుతున్న లాక్మే ఫ్యాషన్ వీక్ కార్యక్రమంలో సోమవారం సింధు పాల్గొంది. తెలుపు రంగు గౌను ధరించి ర్యాంప్ వాక్ చేసింది. ఈ వేడుకకు హాజరైన రణ్‌వీర్ సింగ్‌ను ఆమె కలిసింది. ఆయనతో కలిసి దిగిన సెల్ఫీను ట్విటర్‌లో పోస్ట్ చేసింది. "గల్లీ బాయ్‌తో" సెల్ఫీ.. మిమ్మల్ని మళ్లీ కలిసినందుకు సంతోషంగా ఉంది. మీరెప్పుడూ ఇలాగే అందరినీ ఉత్సాహపరుస్తూ ఉండాలి. 'గల్లీబాయ్' సినిమాకు ఆల్ ది బెస్ట్' అని పేర్కొంది. రణ్‌వీర్ ప్రధాన పాత్రలో 'గల్లీ బాయ్' చిత్రం తెరకెక్కింది. ఫిబ్రవరి 14న ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు రాబోతోంది. అందుకే సింధు.. రణ్‌వీర్‌ను 'గల్లీబాయ్' అని సంబోధించారు. సింధుతో పాటు సైనా నెహ్వాల్, ప్రముఖ రెజ్లర్ గీతా ఫొగాట్ కూడా ర్యాంప్ వాక్ చేసి ఆకట్టుకున్నారు. వీరు ముగ్గురూ వివిధ ఫ్యాషన్ డిజైనర్లకు షో స్టాపర్స్‌గా వ్యవహరించారు. 1999 నుంచి ఏటా ఐఎంజీ రిలయన్స్ లిమిటెడ్, లాక్మే సంస్థలు సంయుక్తంగా ఈ ఫ్యాషన్ వీక్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నాయి. ఇది భారత్‌లో ప్రీమియర్ ఫ్యాషన్ ఈవెంట్. భారత్‌కు చెందిన ఫ్యాషన్ డిజైనర్లతో పాటు అంతర్జాతీయ డిజైనర్లు రూపొందించిన దుస్తులను ప్రదర్శిస్తారు. శీతకాలంలో, వేసవి కాలంలో ఈ వేడుకను నిర్వహిస్తుంటారు.

కుల్దీప్ ఫస్ట్ : శాస్త్రి

అశ్విన్ వెనుకబడ్డాడు

వెల్లింగ్టన్: మణికట్టు మాంత్రికుడు కుల్దీప్ యాదవ్ విదేశీగడ్డపై టీమిండియా ప్రధాన స్పిన్నర్‌గా మారాడని కోచ్ రవిశాస్త్రి అన్నాడు. సిడ్నీ టెస్టులో అతడు తీసిన ఐదు వికెట్ల ఘనతను ఇందుకు ఉదాహరణగా చూపిస్తున్నాడు. ఇప్పుడు మణికట్టు స్పిన్నర్లకే ప్రాధాన్యం ఉందని అశ్విన్, జడేజా కన్నా కుల్‌దీప్ ముందున్నాడని శాస్త్రి పేర్కొన్నాడు. 'ఇప్పటికే కుల్దీప్ ప్రధాన స్పిన్నర్! విదేశీగడ్డపై ఆడుతున్నాడు. ఐదు వికెట్ల ఘనత సాధించాడు. విదేశీ గడ్డపై ప్రధాన బౌలర్‌గా అవతరించాడు. మేం ఒక స్పిన్నర్‌తోనే బరిలోకి దిగాల్సి ఉంటే తొలి ప్రాధాన్యం అతడే. మిగతా వారికీ అవకాశం ఉంది. కానీ కుల్దీప్ అందరికన్నా ముందున్నాడు. టెస్టుల్లో అతడి బౌలింగ్ సంతృప్తికరంగా ఉంది' అని రవిశాస్త్రి అన్నాడు. టీమిండియా నయావాల్ ఛెతేశ్వర్ పుజారా స్టాన్స్‌ను కొద్దిగా మార్చేశామని రవిశాస్త్రి అన్నాడు. క్రీజులో నిలబడే విధానాన్ని మాత్రమే కాస్త మార్చామని తెలిపాడు. ఇప్పుడొస్తున్న ఫలితాల కోసం మళ్లీ పుజారాను ఒక మ్యాచ్‌లో తప్పించేందుకు తాను సిద్ధమని వెల్లడించాడు. ఆస్ట్రేలియా టెస్టు సిరీస్ తర్వాత అతడిని విశ్రాంతి తీసుకోవాలని సూచించామన్నాడు. టీమిండియా సారథి విరాట్ కోహ్లి తనకు సర్ వివియన్ రిచర్డ్స్, ఇమ్రాన్ ఖాన్‌ను గుర్తుచేస్తున్నాడని వెల్లడించాడు. రోజురోజుకు అతడి నాయకత్వ ప్రతిభ మెరుగవుతుందని పేర్కొన్నాడు. టెస్టు సిరీస్‌లో ఆస్ట్రేలియాను అతడు తెలివిగా బోల్తా కొట్టించాడని రవిశాస్త్రి అన్నాడు.



మాజీ జవానుకు గంభీర్ ట్వీట్ సాయం

న్యూఢిల్లీ : 'ప్రార్థించే పెదవుల కన్నా సాయం చేసే చేతులు మిన్న' అనే సూక్తిని టీమిండియా మాజీ ఓపెనర్ గౌతమ్ గంభీర్ కచ్చితంగా పాటిస్తాడు. ఆపదలో ఉన్న సైనికులు, పోలీసులు, వారి పిల్లలకు ఆపన్న హస్తం అందించేందుకు ఎప్పుడూ ముందుంటాడు. తనకు వీలైన రీతిలో సాయం చేసేందుకు వెనుకాడడు. ఈ మధ్యే ఓ మాజీ సైనికుడిని తన ట్వీట్ ద్వారా ఆదుకునే ప్రయత్నం చేశాడు. మాజీ సైనికుడు పీతాంబరన్ రెండు చిత్రాలను గంభీర్ తన ట్విటర్‌లో పోస్ట్ చేశాడు. ఢిల్లీలోని ప్రముఖ ప్రాంతం కన్నాట్ ప్లేస్‌లోని 'ఏ' బ్లాక్ వద్ద ఆ సైనికుడు ఫ్లకార్డు పట్టుకొని నిలబడ్డాడు. ఒక చేతిలో కర్ర పట్టుకొని స్తంభానికి ఆనుకున్నాడు. ఆ ఫ్లకార్డులో తనకు సాయం చేయాలని కోరాడు. తాను మాజీ సైనికుడినని, 1965, 1971 భారత్, పాక్ యుద్ధంలో పాల్గొన్నానని అందులో రాశాడు. 1967లో భారత్, చైనా యుద్ధంలో నాథులా వద్ద పోరాడినట్టు వెల్లడించాడు. ఈ మధ్యే తనకు ప్రమాదం జరిగిందని, వైద్యానికి ఆర్థిక సాయం చేయాలని పీతాంబరన్ ఫ్లకార్డులో రాశాడు. కొన్ని సాంకేతిక కారణాల వల్ల సైన్యం సహాయం పొందలేకపోతున్నానని ఆయన పేర్కొన్నాడు. అతని మెడలోని సైనిక గుర్తింపు కార్డును చూసి ధ్రువీకరించుకున్న గంభీర్ వెంటనే ఈ విషయాన్ని రక్షణ శాఖకు ట్వీట్ చేశాడు. రక్షణశాఖ అధికార ప్రతినిధి గంభీర్ ట్వీట్‌కు వెంటనే స్పందించారు. త్వరగా సదరు సైనికుడికి కావాల్సిన సాయం చేస్తామని వెల్లడించారు. దీంతో గౌతీ వారికి ధన్యవాదాలు తెలియజేశారు.

పొట్టినీ.. పట్టేయాలని..!

- భారత్ కివీస్ మధ్య నేడు తొలి టీ20
- విజయంపై రెండు జట్ల కన్ను
- టీంలో చేరిన పంత్, కృనాల్
- ఆసక్తిగా ఎంపిక






ప్రపంచకప్‌కు ముందు వరుస సిరీస్ విజయాలతో అదరగొడుతున్న టీమిండియాకు తన బలాన్ని సరిచూసుకోవడానికి టీ20ల రూపంలో మరో సిరీస్ ఎదురవుతోంది. వరుస వన్డే సిరీస్‌ల విజయం అనంతరం భిన్నమైన ఫార్మాట్‌లో భారత్ ఆడనుంది. వన్డేలో ఆద్యంతం గట్టిపోటీనిచ్చిన కివీస్ ఈసారి మరింత దూకుడు పెంచవచ్చు. ఈ 'పొట్టి' సిరీస్‌నూ పట్టేస్తే సుదీర్ఘ పర్యటనను విజయంతో ముగించినట్టవుతుంది. మరో రికార్డు భారత్ హస్తగతమవుతుంది.


విశాలాంధ్ర స్పోర్ట్స్ డెస్క్ :
న్యూజిలాండ్‌ను వారి సొంత గడ్డపై వన్డే సిరీస్ చిత్తుగా ఓడించిన భారత్‌కు కివీస్ మరో సవాల్ విసరనుంది. రెండు జట్ల మధ్య వెల్లింగ్టన్‌లో నేటి నుంచి టీ20 సిరీస్ మొదలు కానుంది. కోహ్లి విశ్రాంతి కారణంగా జట్టుకు దూరం కావడంతో రోహిత్ ఈ సిరీస్‌లో కెప్టెన్‌గా వ్యవహరించనున్నాడు. టీమిండియా బ్యాటింగ్ ఆర్డర్ సమస్యకు వన్డే సిరీస్ కొంత మేర జవాబు చూపించినా.. ప్రపంచకప్ ముందు ఇంకొన్ని సమస్యలను పరిష్కరించేందుకు, అలాగే రిజర్వ్ ఆటగాళ్లను ఎంచుకునేందుకు ఇదే సరైన వేదికగా ఉపయోగపడనుంది. వన్డేలకు దూరంగా ఉన్న రిషబ్‌పంత్ టీ20 జట్టులో వచ్చి చేరాడు. ప్రపంచ కప్ జట్టులో రెండో కీపర్ స్థానం కోసం పోటీ పడుతుండడంతో అతడికి ఈ మ్యాచులు కలిసివచ్చేవే. ధోనీ టీ20 లకు తిరిగి వచ్చాడు. ఇంత పోటీ మధ్య దినేష్ కార్తీక్‌కు అవకాశం ఉంటుందో లేదో చూడాలి. రాయుడు నాలుగో స్థానం పదిలం చేసుకున్నాడు. ఇక ప్రతిభావంతుడిగా పేరుపొందిన శుబ్‌మన్ గిల్ వన్డే అవకాశాలను వినియోగించుకోలేకపోయినా కోహ్లి స్థానంలో అతడి చోటు పదిలం. కృనాల్ పాండ్య జట్టులో చేరడంతో కేదార్‌కు విశ్రాంతినిచ్చే అవకాశం ఉంది. కృనాల్ జట్టులో ఉంటే తొలిసారి తమ్ముడు హార్దిక్‌తో కలిసి ఆడే అవకాశం అతడికి లభించనుంది. ఇక ఖలీల్, సిరాజ్, సిద్దార్థ్ కౌల్‌లో ఇద్దరు జట్టులో ఉండవచ్చు. న్యూజిలాండ్‌ను తక్కువగా అంచనా వేయడానికి లేదు. వన్డే సిరీస్ ఓటమి వారిని నిరాశ పరిచినా..టీ20లను గెలువడానికే చూస్తారు. అత్యధిక టీ20 స్పెషలిస్ట్‌లు వారి జట్టులో ఉన్నారు. గప్టిల్ గాయంతో జట్టుకు దూరమైనా మన్రో అతడి స్థానాన్ని భర్తీ చేయగలడు. ఆల్ రౌండర్లు గ్రాండ్‌హోమీ, నీషమ్, సాంత్నర్, బ్రేస్‌వెల్, డారైల్ మిట్చెల్ ఎంతటి ప్రమాదకరమైన టీ20 ఆటగాళ్లో తెలిసిందే. వెల్లింగ్టన్ పిచ్ తొలి ఓవర్లలో పేస్‌కు సహకరించడంతో బౌల్ట్ స్వింగ్‌తో ఇబ్బంది పెట్టడానికి చూస్తాడు. ఏమైనా రెండు జట్లమధ్య రసవత్తరమైన పోరు జరిగే అవకాశం ఉంది.


మధ్యాహ్నం 12:30 గంటలకు
స్టార్ స్పోర్ట్స్ 1, స్టార్ స్పోర్ట్స్ 3లో

పార్టీ విరాళాల్లో కాషాయ కుచ్చితం

బీజేపీకి అనుకూలంగా విధానాల రూపకల్పన







న్యూఢిల్లీ : ఏ దేశంలోనైనా రాజకీయ పార్టీలు మనుగడ సాగించేది విరాళాలతోనే. అయితే రాజకీయ పార్టీలకు విరాళాలు ఇచ్చే విషయంలో తేడాలున్నాయి. ఆ తేడానే పారదర్శకత. ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య దేశం మనది. కానీ ఈ ప్రజాస్వామ్య వ్యవస్థను ఎక్కువగా ప్రభావితం చేస్తున్నది ఆర్థిక శక్తే. ఎవరు ఎక్కువ డబ్బిస్తే అంటే, ఎవరు ఎక్కువ ఎన్నికల నిధులను విరాళంగా ఇస్తే వారికే మన దేశ రాజకీయ పార్టీలు ఊడిగం చేస్తాయి. అంటే, వారి ప్రయోజనాలకు అనుగుణంగానే పార్టీల విధానాలు ఉంటాయి. అధికారంలోకి వస్తే ఆ విధానాలనే అమలు చేస్తాయి. వారి కోసం ప్రజా ప్రయోజనాలను పణంగా పెడతాయి. ఇలా జరగడానికి ప్రధాన కారణం ఎన్నికల విరాళాల్లో పారదర్శకత లేకపోవడం. అదే అమెరికా, యూరప్ దేశాల్లో ఎన్నికల నిధుల్లో పారదర్శకత కొనసాగుతోంది. ఎవరు, ఏ పార్టీకి ఎక్కువ విరాళాలు ఇచ్చారో ఓటరుకు తెలిసిపోతుంది. ఏ పార్టీ విరాళాలు ఇచ్చిన వారి ప్రయోజనాలకు ప్రాముఖ్యత ఇస్తున్నదో, ఏ పార్టీ ప్రజల ప్రయోజనాలకు ప్రాముఖ్యతనిస్తుందో ఆయా దేశాల్లోని ఓటరు బేరీజు వేసుకొని ఓటు వేయగలరు. దేశ, విదేశాల్లో మూలుగుతున్న నల్లడబ్బును వెలికి తీసుకరావడమే కాకుండా పార్టీలకు విరాళాల రూపంలో వస్తున్న నల్లడబ్బును కూడా అరికడతామని అధికారంలోకి వచ్చిన కొత్తలో నరేంద్ర మోడీ ప్రభుత్వం ప్రకటించింది. ఈ విషయంలో నల్లడబ్బును ఏ మాత్రం అరికట్టలేక పోగా, కట్టలు తెంచుకొని నల్లడబ్బు పారేలాగా వెయ్యి, పదివేలు, లక్షా, పది లక్షలు, కోటి రూపాయల ఎన్నికల బాండ్లను 2017 బడ్జెట్ ప్రతిపాదనల ద్వారా ప్రవేశపెట్టింది. 2017-18కు ఏయే పార్టీకి ఏయే రూపంలో ఎన్ని విరాళాలు వచ్చాయో 'అసోసియేషన్ ఫర్ డెమోక్రటిక్ రిఫామ్స్' సంస్థ ఇటీవల ఓ జాబితాను విడుదల చేసింది.

20 వేలకు తక్కువైతే...

ఎవరైనా 20 వేల రూపాయలు, అంతకులోపు విరాళాలు ఇస్తే వారు తమ గుర్తింపును వెల్లడించాల్సి అవసరం లేదు. గతంలో అన్ని పార్టీలకు 20 వేల రూపాయలే ఎక్కువగా వచ్చేవి. లక్ష రూపాయలు ఇవ్వదల్చిన దాతలు కూడా దాన్ని ఐదు భాగాలుగా విడగొట్టి 20 వేల రూపాయల చొప్పున ఇచ్చేవాళ్లు. 2017-18కి ఆశ్చర్యంగా భారతీయ జనతా పార్టీకి 20 వేల రూపాయలకు మించిన విరాళాలు 93 శాతం, అంటే 437.04 కోట్ల రూపాయలు అందాయి. రెండో స్థానంలో ఉన్న కాంగ్రెస్ పార్టీకి 5.67 శాతం చొప్పున కేవలం 26.66 కోట్ల రూపాయలు మాత్రమే వచ్చాయి. ఇందులో గుర్తు తెలియని వ్యక్తుల నుంచి ఎన్నికల బాండుల రూపంలో వచ్చినవే ఎక్కువ. అన్ని రాజకీయ పార్టీలకు వచ్చిన విరాళాలను పరిశీలిస్తే 20 వేల రూపాయలకు మించని విరాళాలు 51 శాతం వచ్చాయి. ఆ తర్వాత 31 శాతంతో ఎన్నికల బాండ్లు ఉన్నాయి.

ఎన్నికల బాండ్లలో బీజేపీకే 95 శాతం

2016-19 ఆర్థిక సంవత్సరంలో మొదటి తొమ్మిది నెలల కాలానికే 834.7 కోట్ల రూపాయల ఎన్నికల బాండ్లు విక్రయించినట్లు బ్యాంకు వర్గాలు వెల్లడించాయి. గత ఏడాది కంటే ఇది నాలుగు రెట్లు ఎక్కువ. 2019-2020 సంవత్సరానికి ఇది మరింత పెరిగే అవకాశం ఉంది. ఒక్క సీపీఎం మినహా ఆరు జాతీయ పార్టీలకు కలిపి 2017-18లో 53 శాతం అంటే, 689.44 కోట్ల రూపాయలు గుర్తు తెలియని దాతల నుంచి వచ్చాయి. 36 శాతం అంటే 467.13 కోట్ల రూపాయలు తెలిసిన దాతల నుంచి వచ్చాయి. ఇక్కడ గుర్తుతెలియని దాతలంటే బ్యాంకులకు, రాజకీయ పార్టీలకు గుర్తు తెలియని వారు కాదు. కేవలం ప్రజలు లేదా ఓటర్లకు గుర్తుతెలియని వారే. భారతీయ స్టేట్ బ్యాంకుల నుంచి ఎవరైనా వెయ్యి రూపాయల నుంచి కోటి రూపాయల వరకు ఎన్నికల బాండ్లను కొనుక్కోవచ్చు. వారి వివరాలను బ్యాంకు లావాదేవీల అవసరార్థం బ్యాంకు బ్రాంచులు నమోదు చేసుకోవచ్చు లేదా వదిలేయవచ్చు. ఆ బాండ్‌ను ఏ పార్టీకి ఇచ్చేది ఆ దాత వెల్లడించాల్సిన అవసరం అస్సలు లేదు. దాత ఆ బాండును తీసుకెళ్లి ఏ పార్టీకి ఇస్తే ఆ పార్టీ ఆ దాత వివరాలను నమోదు చేసుకుంటుంది. అయితే ఇటు బ్యాంకులుగానీ, రాజకీయ పార్టీలుగానీ ఎన్నికల బాండ్ల దాతల వివరాలను వెల్లడించాల్సిన అవసరం లేదు. కనుక ప్రజలకు ఈ వివరాలు తెలిసే అవకాశం లేదు. ప్రజలకు తెలిసే విధంగా ఉండాలనే ఉద్దేశంతోనే మొదట బీజేపీ ప్రభుత్వం ఈ బాండ్ల దాతల వివరాలను విధిగా వెల్లడించాలనే నిబంధన తీసుకురావాలనుకుంది.

ఫెడరల్ స్ఫూర్తికి విఘాతం

సీపీఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ కె.నారాయణ



విలేకరులతో మాట్లాడుతున్న కె.నారాయణ తదితరులు

విశాలాంధ్ర బ్యూరో - తిరుపతి : లోక్‌సభ ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో రాజకీయ కక్షతో బీజేపీకి వ్యతిరేకంగా పోరాడుతున్న సెక్యులర్ పార్టీపై సీబీఐని ఉసిగొల్పడం దారుణమని, ఫెడరల్ స్ఫూర్తికి విరుద్ధమైన చర్యను తీవ్రంగా ఖండిస్తున్నామని సీపీఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ అన్నారు. మంగళవారం స్థానిక గంధమనేని శివయ్య భవన్‌లో మీడియాతో ఆయన మాట్లాడుతూ ప్రధాని మోడీ ప్రతిపక్ష సెక్యులర్ పార్టీపై జరుపుతున్న దాడులను దేశ ప్రజలు హర్షించరని తెలిపారు. 2014లో శారదా చిట్‌ఫండ్ కుంభకోణంపై కోర్టు ఉత్తర్వు ఉన్నా ఐదు సంవత్సరాలుగా చర్యలు లేవన్నారు. అయితే ఎన్నికలు సమీపిస్తున్న సమయంలో సీబీఐ అతిగా వ్యవహరించడం వాంఛనీయం కాదని పేర్కొన్నారు. కుంభకోణాన్ని సీపీఐ ఎన్నడూ సమర్థించదని, అదే సమయంలో జగన్ స్కాంలపైన, కేసీఆర్ టెలిఫోన్ ట్యాపింగ్ వంటి వాటి జోలికి ప్రధాని మోడీ ఎందుకు వెళ్లడం లేదని నారాయణ ప్రశ్నించారు. గాంధీ వర్ధంతి రోజున ఉత్తర ప్రదేశ్‌లో సీఎం ఆదిత్యనాథ్ పాలనలో ఆర్‌ఎస్‌ఎస్ ముఖ్యులు గాంధీ బొమ్మను తుపాకీతో కాల్చి మహాత్మా గాడ్సే అంటూ నినదించిన ఘటనతో బీజేపీ బండారం బయట పడిందని తెలిపారు. ఈ వికృత చర్యను ప్రధానిగానీ, బీజేపీ అధ్యక్షుడుగానీ ఖండించ కపోవడం అవమానకరమన్నారు. వీరి చర్యను మమతా బెనర్జీ ఖండించడం ఆహ్వానించదగ్గ విషయమన్నారు. సుప్రీం కోర్టు జడ్జి సైతం సీబీఐ స్పెషల్ డైరెక్టర్ ఆస్తానా కేసును వాదించేందుకు ముందుకు రావడం లేదంటే కోర్టును సైతం మోడీ గుప్పిట్లో పెట్టుకొని వారిని భయభ్రాంతులకు గురిచేస్తోన్న విషయం తేటతెల్లమైందని అన్నారు. అమెరికాలో భారత విద్యార్థులపై చర్యలు తీసుకుంటున్నా మోడీ ప్రేక్షక పాత్ర వహిస్తుండటం దారుణమన్నారు. అమెరికా సామ్రాజ్యవాదులకు తలవంచడం, భారతీయులను కాపాడలేని మోడీ విధానాలను దేశ ప్రజలందరూ తప్పుబడుతున్నారని ఆయన తెలిపారు. దేశంలో ఫెడరల్ స్ఫూర్తికి విఘాతం కలిగిస్తూ దేశ ప్రజలను, రాజ్యాంగ వ్యవస్థను భయభ్రాంతులకు గురిచేస్తున్న మోడీని సాగనంపేందుకు ప్రజాతంత్ర వాదులు ముందుకు రావాని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి ఎ.రామానాయుడు, జిల్లా కార్యవర్గ సభ్యులు జనార్ధన్, విశ్వనాథ్, పెంచయ్య పాల్గొన్నారు.

మంచుకు కాలుష్యం ముప్పు

- శతాబ్ది చివరికి అధిక మంచు కనుమరుగు
- హిమాలయాల్లో పరిస్థితిపై తాజా నివేదిక హెచ్చరిక



న్యూఢిల్లీ : వాతావరణ కాలుష్యం, పెరుగుతుతున్న భూతాపం కారణంగా ఈ శతాబ్ది చివరినాటికి హిమాలయ పర్వతాల్లో ఉన్న మంచుదిబ్బల్లో మూడింట రెండువంతులు కరిగిపోయే అవకాశాలెక్కువగా ఉన్నాయని తాజాగా వెలువడిన నివేదిక హెచ్చరించింది. ప్రపంచంలో మూడవ ధ్రువప్రాంతంగా పరిగణిస్తున్న హిమాలయాల్లో అనేకవేల మంచుదిబ్బలున్నాయి. ప్రపంచవ్యాప్తంగా వెలువడుతున్న విషవాయువులను తద్వారా పెరుగుతున్న ఉష్ణోగ్రతలను తగ్గించకపోతే అత్యధిక మంచు కరిగిపోయి అనేక దుష్పరిణామాలు కలగవనున్నాయని శాస్త్రవేత్తలు తాజా నివేదికలో హెచ్చరించారు. ఈ శతాబ్ది చివరినాటికి పారిశ్రామిక విప్లవానికి ముందున్న ఉష్ణోగ్రతలకంటె 1.5 డిగ్రీల సెల్సియస్‌కు మించి ఉష్ణోగ్రతలు పెరిగినట్లయితే మానవాళి తీవ్ర విపత్తును ఎదుర్కోవలసి ఉంటుందని పారిస్ ఒప్పందం హెచ్చరించింది. 1.5 డిగ్రీల సెల్సియస్‌లోపే ఉష్ణోగ్రతలను పరిమితం చేయాలని, ఇందుకు తగిన చర్యలను ఆయా ప్రభుత్వాలు చేపట్టాలని ఈ ఒప్పందం కోరింది. ఒకవేళ ఒప్పందంలో పేర్కొన్న అంశాలను అమలు చేసినప్పటికీ మూడింట ఒక వంతు హిమనీనదాలు అదృశ్యమవుతాయని, హిందూకుష్ హిమాలయ అసెస్‌మెంట్ నివేదిక హెచ్చరించింది. హిమాలయాల్లో మంచుదిబ్బలు హిందూకుష్-హిమాలయ ప్రాంతంలో 25 కోట్లమంది ప్రజలకు నీటి అవసరరాన్ని తీరుస్తున్నాయి. అలాగే 165 కోట్లమంది దిగువనవున్న నదీ ప్రాంతాలలో నివసించే ప్రజలకు కూడా ఇక్కడి మంచుదిబ్బలే నీటికి ప్రధాన ఆధారం. మంచుదిబ్బలు కరిగిపోతే ఈ ప్రాంత ప్రజల తాగునీరు, సాగునీటికి తీవ్ర కొరత ఏర్పడుతుందని తాజాగా విడుదలైన 650 పేజీల నివేదిక హెచ్చరించింది. ప్రపంచంలోని అత్యంత ముఖ్యమైన 10 నదులకు హిమాలయాల్లోని మంచుదిబ్బలే నీటిని సరఫరా చేస్తున్నాయి. ఈ నదులలో గంగ, సింధు, ఎల్లో, మెకాంగ్, ఇరవడి తదితరాలున్నాయి. ఇవి ప్రత్యక్షంగా, పరోక్షంగా వందల కోట్ల ప్రజలకు ఆహారాన్ని, విద్యుత్‌ను, స్వచ్ఛమైన గాలిని, అవసరమైన ఆదాయాన్ని సమకూర్చ గలుగుతున్నాయి.

మంచుదిబ్బలు కనుక కరిగిపోయినట్లయితే పరిస్థితులు దారుణంగా తయారవుతాయి. వాయి కాలుష్యం అపరిమితమవుతుంది. రుతుపవనాలకు ముందు నదులలో ప్రవాహం తీవ్రంగా దెబ్బతింటుంది. ఆహారం, విద్యుత్ ఉత్పత్తి కూడా తీవ్ర కొరత ఏర్పడుతుంది. ఈ నివేదికను శాస్త్రవేత్తలు 5 ఏళ్లు అధ్యయనం చేసి రూపొందించారు. నేపాల్‌లోని సమగ్ర పర్వతాల అభివృద్ధి అంతర్జాతీయ కేంద్రం, మరో 7 దేశాలకు చెందిన 350 మంది పరిశోధకులు, విధాన నిపుణులు, 185 సంస్థలు, 210 మంది రచయితలు, 20 మంది ఎడిటర్లు, 125 మంది సమీక్షకులు పాల్గొన్నారు. ఇది గతంలో వినని వాతావరణ సంక్షోభం. గత డిసెంబర్‌లోను ఐక్యరాజ్య సమితి వాతావరణ వేదిక పారిస్ ఒప్పందాన్ని అమలు చేయడంలో ఉమ్మడిగా ఒక ప్రణాళికను రూపొందించుకోవాలని, భూమండలంపై ఉష్ణోగ్రతలను, విషవాయువులను తగ్గించాలని అంగీకరించింది. ఇప్పుడున్నదానికంటె 3 డిగ్రీల సెన్సియస్ ఉష్ణోగత పెరిగినట్లయితే మానవాళి మనుగడకు తీవ్ర ముప్పు కలుగుతుందని శాస్త్రవేత్తలు హెచ్చరించారు. ఇతర ప్రాంతాలలో 1.5 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత పెరిగినట్లయితే అది హిమాలయ ప్రాంతంలో 2.1 డిగ్రీల సెల్సియస్‌గా పరిగణించవలసివుంటుందని నివేదిక తెలిపింది.

వాతావరణంలోకి విషవాయువుల విడుదలను ఇప్పుడున్న స్థాయిలోనే కొనసాగించినట్లయితే మనం ఊహించలేనంతగా ఉష్ణోగ్రతలు 5 డిగ్రీల సెల్సియస్‌కు పెరిగిపోయే అవకాశంవుందని నివేదిక హెచ్చరించింది. హిమాలయాలు దాదాపు 7 కోట్ల సంవత్సరాల క్రితం ఏర్పడివుంటాయని అంచనా వేస్తున్నారు. వాతావరణ మార్పులు సున్నితమైన హిమాలయాలపైన అత్యంత తీవ్రంగా ఉంటాయి. 1970ల నాటికంటే హిమాలయాలలో మంచు ప్రస్తుతం చాలా ప్రాంతాలలో తరిగిపోయింది.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : MUTYALA PRASAD. RNI No. 1138/57, Postal: Regd. No.VJA: VJ/042/2018-20, Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.